
ఆంధ్ర సచిత్ర వారపత్రిక

150 పైసలు

21-1-83





శేఖర్.. సినీతారల సంక్రాంతి సరదాలు
A. PRASAD
మన చిత్రంలో హీరోయిన్ వేసిన ముగ్గు.. హీరో తొక్కగానే చెంపదెబ్బ కొట్టేటంతలో ప్రేమ మొదలవుతుందయ్యా!!
డైరెక్టర్
నిర్మాత
మా చిత్రంలో మొదటిసారి హీరోయిన్ ముగ్గు వేస్తున్నప్పుడు హీరోని చూసి ప్రేమిస్తుంది... అందుకే మా చిత్రానికి 'ముగ్గుప్రేమ' అని పేరు పెట్టాం!
ఈ హీరోయిన్ వేసిన ముగ్గులు చూడ్డానికే ఈ పిక్చర్ కి పది సార్లొచ్చారా?
ముగ్గు వేసే సన్నివేశానికి హీరోయిన్ కి డూప్ కావాలట...!!
హీరోయిన్ కోసం దేవదాసులా మారిన మీరు చివరకు ఇలా హరిదాసు వేషంలో కట్టుకుంటారు!!!
డైరెక్టర్
శేఖర్
ఈ గొబ్బిళ్ళ సెట్టింగ్ కి పది లక్షలు ఖర్చయింది... హీరో హీరోయిన్ వాటి చుట్టూ తిరుగుతూ డ్యూయెట్లు పాడతారు!!

మనలో మాట

మా పాఠకులు, రచయిత(త్రు)లు, ఏజెంట్లు, ప్రకటన కర్తలందరికీ మా సంక్రాంతి శుభాకాంక్షలు.


1982 దీపావళి కథల పోటీలో రు. 600 లు బహుమతిపొందిన ఆరుకథలపై మేము నిర్వహించిన పాఠకుల బాలట్, వ్యాసరచన పోటీలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొని దానిని జయప్రదం చేసిన వారందరికీ మా కృతజ్ఞతలు.

బాలట్‌లో మొట్టమొదటి కథగా "నీ గుండె కార్చిన కన్నీళ్లు" ని పాఠకులు ఎన్నుకున్నారు. "మదర్పిత .... తాంబూలాది ...." కథ రెండవదిగా ఎన్నికైతే, "ఉప్పులేని కూడు" మూడవస్థానాన్ని పొందింది.


ఇక మిగిలిన 4, 5, 6 స్థానాలలో వరుసగా "దూరం", "పిసరంత గుండె", "హసీనా" కథలు నిలిచాయి.



చక్కిలం విజయలక్ష్మి



'మానస'



కలువకొలను సదానంద


బాలట్‌లో మొదటి కథగా ఎన్నికై మరో రు. 650 లు అదనపు బహుమతిని అందుకున్న ''నీ గుండె కార్చిన కన్నీళ్ళు'' కథా రచయిత్రి శ్రీమతి చక్కిలం విజయలక్ష్మి పుట్టినదీ, చదివినదీ, ప్రస్తుతం ఉంటున్నదీ, ఉద్యోగం చేస్తున్నదీ కర్నూలులోనే! కర్నూలు జనరల్ హాస్పిటల్ ఉద్యోగి శ్రీ శ్రీనివాసరావు గారితో వివాహం జరిగాక హిందీ విశారద, వీణాభిలాషి అయినామని రాశారు. శ్రీవారి ప్రోత్సాహమే తమ రచనలకి ఊపిరి అంటున్నారు. సాహిత్యం వ్యాపృత్తి అయి 'ఉజ్వల' వారపత్రికలో ఉపసంపాదకులుగా ఉద్యోగం చేస్తున్నారు. వివిధ వార, మాస పత్రికలలో అనేకానేక కథలు, ఓ డజను దాకా నవలలు ప్రచురింపబడినట్లు తెలియచేశారు. 'కాకి గూడు' 'పాలు' అన్న కథలకి రెండు వారపత్రికలు నిర్వహించిన కథల పోటీలలో బహుమతులు లభించాయి. రేడియోలో కథలు, ప్రసంగాలూ ప్రసారం అయినాయి. త్వరలో ఓ సీరియల్ నాటకం కూడా ప్రసారం కాబోతున్నట్లు రాశారు. ఓ అరడజను కథలు కన్నడంలోకి అనువదింపబడినట్లు తెలియచేశారు.

ఈ రచయిత్రి తనకు జీవితంలోని చేదు పట్ల భయంకంటే జీవనమాధుర్యం పట్ల అభిలాష మెండుగా ఉన్నాయనీ, సంగీత సాహిత్యాలు అభిమాన విషయాలైతే ప్రస్తుత రాజకీయాలు అసహ్యించుకునే విషయం అనీ పేర్కొన్నారు. ఈ కథని మరిది 'రాము'కి అంకితం యిస్తున్నట్లు రాశారు.

రెండవకథగా ఎన్నికై మరో రు. 550లు అదనపు బహుమతిని అందుకున్న ''మదర్పిత ... తాంబూలాది ...'' కథా రచయిత కలంపేరు 'మానస'. అసలు పేరు శ్రీ ఉన్నవ వెంకట హరిగోపాల్. 17-8-1949 లో మచిలీపట్నంలో జన్మించారు. సంవత్సరానికో ఊరుగా హైస్కూలు చదువు సాగినా కాకినాడ, విశాఖపట్నాలలో కాలేజి చదువు పూర్తిచేసి బి. కాం. పట్టా పుచ్చుకున్నారు. విశాఖపట్నంలో స్టేట్‌బాంక్‌లో ఆఫీసరుగా ఉద్యోగం చేస్తున్న వీరు వివాహితులు. సంతానం ఇద్దరు అమ్మాయిలు. 1970 నుంచీ రచనలు సాగిస్తున్న వీరి కలంనించి అరవైకి పైగా కథలు, ఓ నాటిక, ఓ నవల వెలువడి వివిధ వార, మాసపత్రికలలో వచ్చాయి. వాటిలో ఏడు కథలు ఆంధ్ర సచిత్ర వారపత్రికలో చోటు చేసుకున్నాయి ''నవ్వినా కన్నీళ్లే'' అన్న నవలకి ఒక ప్రముఖ వారపత్రిక

నిర్వహించిన ఉగాది నవల పోటీ (1978)లో తృతీయ బహుమతి లభించింది. నాటిక ఆకాశవాణి, దూరదర్శన్‌ల ద్వారా కూడా ప్రసారం అయింది. ఈ రచయితకి హ్యూమన్‌టచ్ ఉన్న కథలంటే యిష్టం. అవి రాసేవాళ్ళందరూ తమ అభిమాన రచయిత (త్రు) లే అయినా, శ్రీ ఆదివిష్ణు, కీ. శే. అంగర వెంకట కృష్ణారావు, శ్రీమతి డి. కామేశ్వరి గార్లంటే ప్రత్యేకాభిమానం ఉన్నట్లు తెలియచేశారు.

బాలట్‌లో నాలుగవ కథగా ఎన్నికై మరో రు. 450 లు అదనపు బహుమతిని అందుకున్న "ఉప్పులేని కూడు" రచయిత శ్రీ కలువకొలను సదానంద గత మూడేళ్ళుగా ఏ రచనా చేయకపోయినా మా పాఠకులకి చిరపరిచితులే వీరి "బంగారు నడచిన బాట" అన్న పిల్లల సీరియల్ పద్దెనిమిదేళ్ళ క్రితం ఆంధ్రసచిత్ర వారపత్రికలో ధారావాహికంగా వెలువడి, అనంతరం భారత ప్రభుత్వ విద్యాశాఖ ఉత్తమ బాలసాహిత్యానికి యిచ్చే అవార్డు అందుకున్నది. వీరి కథల సంపుటి "నవ్వే పెదవులు – ఏడ్చే కళ్ళు" 1976 లో ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డు అందుకున్నది. వీరి నవలలు కొన్ని భారతిలో




కల్లూరి భాస్కర్

ప్రచురితమైనాయి. 22-2 1939 లో జన్మించిన ఈ రచయిత స్వగ్రామమైన పాకాల (చిత్తూరు జిల్లా) లో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు.

ఇక కన్సొలేషన్ బహుమతులుగా ఒక్కొక్కటి రు. 250 లు అదనపు బహుమతులందుకున్న మిగతా మూడు కథలలో "దూరం" కథ నాలుగవదిగా నిలిచింది. రచయిత శ్రీ కల్లూరి భాస్కర్ ప్రముఖ విద్వత్ కవులు విద్వాన్ కల్లూరి వెంకట సుబ్రహ్మణ్య దీక్షితులు గారి కుమారుడు. 30 సంవత్సరాల వయస్సుగల వీరు ఎం. ఏ. చదివినా డిగ్రీ చదువులపట్ల గౌరవంలేదనీ, రిసెర్చి స్కాలర్‌గా ఉన్నా విశ్వవిద్యాలయాల వెలుపలే 'నిజ'మైన పరిశోధన జరిగిందనీ తమ నమ్మకంగా పేర్కొన్నారు. కథానిక అన్నా, సాహిత్య విమర్శ అన్నా తమకి ప్రాణం అని అన్నారు. 'మౌనం నా సందేశం' అన్న పేరుతో వచన కవితా సంపుటి ఒకటి అచ్చయినట్లుగా తెలియచేశారు. ఇటీవలికాలంలో రాజమండ్రి 'సాహితీ వేదిక' తమకి స్ఫూర్తి కేంద్రంగా పేర్కొన్నారు.

అయిదవ స్థానానికి వచ్చిన "పెసరంత గుండె" కథా రచయిత శ్రీ కొడవంటి కాశీపతిరావుగారి కథలకి ఆంధ్రసచిత్ర వారపత్రికలో గతంలో రెండు సార్లు బహుమతులు వచ్చాయి ఇంతవరకు వివిధ పత్రికలలో సుమారు 80 కథల దాకా అచ్చయినాయి పదేళ్ళ కిందటే 'ముగ్ధ' అన్న పేరుతో కథా సంకలనాన్ని వెలువరించినట్లు తెలియచేశారు.

బాలట్‌లో చివరి కథగా వచ్చిన "హసీనా" కథా రచయిత్రి శ్రీమతి ఆర్. వసుంధరాదేవి



కొడవంటి కాశీపతిరావు

ప్రముఖ సాహితీవేత్త శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం గారి సహధర్మచారిణి. గుంటూరు జిల్లా, రేపల్లె తాలూకాలోని పమిడిముక్కలలో జన్మించారు. విశాఖపట్నంలో ఎం. ఎస్‌సి. (రసాయనశాస్త్రం) చేశారు. వీరి కథలు 1967 నుంచీ భారతి లో, ఆంధ్రపత్రిక ఉగాది సంచికలలో ప్రచురింపబడ్డాయి. 'గాలిరథం' కథాసంపుటి 1978లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ వార్షిక బహుమతిని, నూతలపాటి గంగాధరం సాహితీ పురస్కారాన్ని అందుకున్నది. ఇప్పుడు రెండవ కథల సంపుటి ' నీడలు ' ప్రచురితం అయినట్లు తెలియచేశారు. 'మరో పెళ్ళి కథ' నవల ఒక మాసపత్రికకి అనుబంధంగా వచ్చిందనీ, కొన్ని రచనలు విజయవాడ ఆకాశవాణి కేంద్రం ద్వారా ప్రసారం అయినట్లు పేర్కొన్నారు.

ఈ ఆరుగురు రచయిత (త్రి) లకి మా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాము.

దీపావళి కథలపై మేము నిర్వహించిన వ్యాసరచన పోటీలో మొదటి బహుమతి రు. 250 లు పొందిన వ్యాసరచయిత శ్రీ నారెడ్డి నాగిరెడ్డి కడప జిల్లా, జమ్మలమడుగు తాలూకాలోని పెద్దముడియం గ్రామానికి చెందినవారు.

రెండవ బహుమతి రు. 150లు పొందిన వ్యాసాన్ని వారణాసి లోని కాశీ హిందూ విశ్వవిద్యాలయం విద్యార్థి శ్రీ చింతలపూడి వెంకటేశ్వర్లు రాశారు.

మూడవ బహుమతి రు. 100 లు అందుకున్న వ్యాస రచయిత విశాఖపట్నంకి చెందిన శ్రీ తుమ్మల మోహనరావు.



ఆర్. వసుంధరా దేవి

ఈ ముగ్గురు రచయితలకీ మా అభినందనలు. బహుమతి పొందిన మూడు వ్యాసాలనీ ఈ సంచికలోనే వేశాము

ఎప్పటివలెనే ఈ ఏడాది కూడా సినిమా బాలట్ నిర్వహిస్తున్నాము. పాఠకులకి సౌకర్యంగా ఉంటుందని 1982 లో విడుదలైన తెలుగు చిత్రాల జాబితా కూడా ఈ సంచికలో వేశాము పాఠకులందరూ ఉత్సాహంతో పాల్గొని దానిని జయప్రదం చేస్తారని ఆశిస్తున్నాము. ★

సకాలానికి అందని కారణంగా ఈవారం ఈ మెన్ కార్టూన్ వెయ్యలేకపోతున్నాము. సం.

ముఖచిత్రం

24—12—82 సంచిక "శ్రీరామ" ముఖ చిత్రంతో కొంగ్రొత్త అందాలను సంతరించుకొంది. ఇందులో ప్రచురితమైన 'దుశ్శాలువ' 'గురుదక్షిణ' కథలు మాకెంతో నచ్చాయి. 'ఇది సంధ్యా సమయం' 'పెద్దకథ'లో కళ్యాణి పాత్ర చాలా దయనీయంగా ఉంది.

రమ్య, వై. చంద్రశేఖరరెడ్డి (నగరి)

* * *

సుహాసిని ముఖచిత్రం చాలా అందంగా, ఆకర్షణీయంగా ఉంది.

పుష్పలత (అరసవల్లి)

నటుల ముఖచిత్రాలు

31—12—82 సుహాసిని బావుంది. ఎందరు విజ్ఞప్తి చేసినా మీరు నటీమణుల ముఖచిత్రాలే తప్ప నటుల ముఖచిత్రాలు వేయడం లేదు. ఎందుకు? నటులు లేరా ? కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు, యన్టీఆర్, ఏయన్నార్... ఇలా, ఎందరో నటులు ఉన్నారు.

బి. శ్రీనివాస్ (ముదిమాణిక్యం)

"నన్ను క్షమించు రాజ్యం"

"సుహాసిని" ముఖచిత్రం చాలా బావుంది. ఈ సంచికలో ఉమామహేశ్వరరావు గారి కథ "నన్ను క్షమించు రాజ్యం", "ఇదీ నాదేశం" కవిత



బావున్నాయి. బీదల సాధకబాధకాలమూ, ధనవంతుల విలాసాలను ఉమామహేశ్వరరావు గారు తన కథలో విపులీకరించారు. ఈ కథను నేనెప్పుడూ మరిచిపోలేను.

ఎస్. సుజనాదేవి, రాజ్యలక్ష్మి (మహబూబాబాద్)

జీవన్‌మృతులు

సుందర వదనారవింద సుహాసిని ముఖచిత్రంతో వెలువడిన 31—12—82 సంచిక అత్యంత రమణీయంగా ఉంది. బ్రామ్‌స్టోకర్ ఆంగ్ల మూలానికి కొలను వెంకటదుర్గాప్రసాద్ గారి తెలుగు అనువాదంతో 'జీవన్‌మృతులు' ఆసక్తిదాయకంగా సాగుతోంది. శ్యామలగారి నీలాకాశం, చిట్టారెడ్డి గారి రాగాగ్ని సస్పెన్స్‌తో సాగుతూ మళ్ళీ వారంకోసం ఎదురు చూసేలా చేస్తున్నాయి.

వేమూరి శ్రీదేవి, శ్రీవాణి, రమణ, చందు. (కరీంనగర్)

పడదు కదా !

24—12—82 తేది సంచికలో 51వ పేజీ కార్టూన్‌లో అర్ధరూపాయ వేసి అందరూ బరువు తూచే మిషన్‌పై మంచున్నట్లు వేశారు. పది పైసల బిళ్ల తప్ప అర్ధరూపాయ బిళ్ల అందులో పడదు కదా !

కొండపర్తి (హైదరాబాద్)

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938–1972]

శుక్రవారం : 21–1–'83
దుందుభినామ సం పుష్య-మాఘ. శు. సప్తమి
సంపుటము 75 : సంచిక 21

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

మననిగురించి మనకే బాగా తెలీదు

న్యూఢిల్లీ లేఖ

డాక్టర్ జయ్ దుబాషి

ఈ మధ్య ఏమయినా మంచి పుస్తకాలు చదివారా? చదివి ఉండరు. ఎందుకంటే, భారతీయులు రాసిన మంచి పుస్తకాలు ఏవీ కనపడంలేదు. ''రాసిన'' అంటే ఇంగ్లీషులోనే – భారతీయ భాషలలో రాస్తే ఎవరు పట్టించుకుంటారు? ఆదివారం అనుబంధాలలో పేర్కొనపడే పుస్తకాలన్నీ అమెరికా వాళ్ళూ, ఇంగ్లాండువాళ్ళూ రాసినవే. అవి విదేశాలలోని వాళ్ళకోసం రాసినవే. ''గాంధీ'' సినిమా విదేశీయులచేత విదేశాలకోసం తీసిన విదేశీ చిత్రం కాదూ?

మనదేశం ఎంతో వేగంగా మారిపోతోంది. ఈ మార్పుని గురించి రాసే వాళ్ళూ, చెప్పేవాళ్ళూ మాత్రం విదేశీయులేనా! వేద్‌మెహతా ఒక అంధ రచయిత. ఆయన న్యూయార్కులోని సుప్రసిద్ధ పత్రిక ''న్యూయార్కర్''లో ఉద్యోగం చేస్తున్నారు. రెండుమూడేళ్ళకొకసారి భారతదేశానికి వచ్చి ఒక పుస్తకంరాస్తూ ఉంటారు. అయితే ఇవి విదేశీ నిపుణులకోసం రాసినవి మాత్రమే అనిపిస్తుంది. ఇలాంటివాళ్ళు ఇంకాఉన్నారు. వాళ్ళ రాతలు చదివితే అనిపించేది ఏమిటంటే, వాళ్ళు మననిగురించి రాయటం మనని ఉద్ధరించటంకోసమే అన్నట్లు రాస్తారని! వేద్‌మెహతా కూడా ప్రస్తుతం బాతాఖానీతో తన పుస్తకాలని నింపుతున్నారు. కాని ఇంకొకమాట కూడా చెప్పాలి. ఈ రకం రచయితలు కష్టపడి తమ గ్రంథాలని తయారుచేస్తూ ఉంటారు. శ్రీమతి ఇందిరా గాంధీ నుంచి టాక్సీడ్రయివరు దాకా వందల మంది భారతీయులతో ఇంటర్‌వ్యూలు జరుపుతారు. ఇంటర్‌వ్యూలు చాలావరకు నగరాలలో వారికి పరిమితం అయిఉంటాయి. ఉంటే మాత్రం ఏమిటి? లండన్, న్యూయార్కు, మెల్‌బర్న్‌లలో చదువరులకి ఇదిచాలు.

అసలు మనం మనదేశాన్నిగురించి కొంచెం లోతుగా ఆలోచించి ఎందుకు రాయము? దీనికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి: మనకి మనదేశాన్నిగురించి తెలియవల్సినంత బాగా తెలీదు. మనచిన్న తోటలూ, కొలనులూ, కొలనులలో తిరిగే చేపలనీ గురించి కొంత తెలుసుననుకోండి. కాని, మన జ్ఞానం యొక్క పరిధి ఇంతే. ఏ ఢిల్లీనుంచో, కలకత్తానుంచో ఒక మనిషి బెంగుళూరు లేదా కొచ్చిన్ నుంచి వెలువడే పత్రికలని వేటినయినా చదివితే అతనికి వాటిలో ఎన్ని వార్తలు సుపరిచితంగా తోస్తాయి? ఈ పత్రికలు మరేదో ప్రపంచం నుంచి వచ్చినట్లు ఉండదూ ఆ మనిషికి? కలకత్తా, ఢిల్లీల మనుషుల సంగతే కాదు తక్కినచోట్ల వాళ్ళసంగతీ ఇంతేకదా?

రెండు: చాలామంది రచయితలకి అహం భావం ఎక్కువ. అంటే, వాళ్ళకి తమ ఆలోచనలు మాత్రమే ముఖ్యంగా తోస్తాయి. ఇతరులతో మాట్లాడటమే పరువుతక్కువ అనుకుంటారు వాళ్ళు. ఏదయినారాస్తే తమ ఆలోచనలని వర్ణించటంతోబాటు కొందరు పేరుపొందినవారి మాటలని ఉదాహరిస్తూ ఉంటారు. ఒక రచయిత సోషలిజాన్ని గురించి రాయవలసి వచ్చిందనుకోండి; నెహ్రూ సోషలిజాన్ని గురించి రాసినమాటలని కొన్నిటిని ఏకరువు పెడతాడు. నెహ్రూ మరణించి 20 సంవత్సరాలయింది. ఆయన అభిప్రాయాలు ముఖ్యమా లేకపోతే సజీవంగా ఉన్న ఒక సామాన్య మానవుడి అభిప్రాయాలు ముఖ్యమా? పోస్టుమాన్, హోటల్ సర్వర్, సైకిలు – కారు – స్కూటర్ మెకానిక్ – ఇటువంటివారి అభిప్రాయాలూ తెలుసుకోవాలి కదా? నెహ్రూ, ఇందిరాగాంధీ అభిప్రాయం కన్నా వీరి అభిప్రాయాలే ముఖ్యమని నా విశ్వాసం.

నాకు అప్పుడప్పుడు కొందరు రచయితలు తమ పుస్తకాలు పంపి, నా అభిప్రాయాలు కావాలంటారు. ఈ మధ్యనే న్యూఢిల్లీలోని ఒక సంస్థలో పనిచేసే ఒక టీచరుగారు – మన రాజధానిలోని పరిశోధనా సంస్థల సంఖ్య



న్యూఢిల్లీ లేఖ

పూనా, చండీగర్‌లో బార్బర్‌షాపుల సంఖ్య కన్నా ఎక్కువేనేమో — "నల్లధనం" మీద ఒక పుస్తకంరాసి వారు పంపారు. అది చాలా గొప్ప పుస్తకం. ఆడమ్ స్మిత్ నుంచి కారల్ మార్క్స్ దాకా వివరెవరివో మాటలని ఉదాహరించారు రచయిత, కాని, ఒక్క వ్యాపారితో కాని, ఏకవుంటెంటుతోకాని మాట్లాడలేదు ఆయన. నల్లధనాన్నిగురించి వీరికి తెలిసినంత ఆడమ్ స్మిత్‌లూ, కారల్ మార్క్స్‌లూ — వీరందరికీ కలిసి తెలిసి ఉండదు! ఇంత పండితులకి మామూలు అంగడి వాళ్లతో, సినిమాహాలు వాళ్లతో మాట్లాడటం పరువుతక్కువ కదా? ఈ సంగతే ఆ రచయితతో అంటే ఆయనకి కోపం వచ్చింది. ఆయన పుస్తకాలు మాత్రం అమ్ముడుపోకుండా ప్రకాశకుల గొడవునులలో పడి ఉన్నాయి.

"ఫ్రీడమ్ ఎట్ మిడ్ నయిట్" అనే పుస్తకం వెలువడింది. చదవటానికి బాగానే ఉంటుంది కాని ప్రమాణమయిన చరిత్ర గ్రంథంకాదు. 1945 లో యుద్ధం ముగిసిన తరువాత 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేదాకా జరిగినదానిని గురించి రాశారు రచయితలు. వాళ్లే ఏ లండన్‌లోనో, పారిస్‌లోనో కూర్చుని పయి చరిత్రని రాసి ఉండవచ్చు. పెద్ద పుస్తకాలే తయారయి ఉండవచ్చుకూడా. కాని, వాళ్ళు కొన్నివేల మందిని కలుసుకుని మాట్లాడారు. ఒక చోటునిగురించి రాసేముందు ఆ చోటుకెళ్ళి చూసివచ్చేవారు గాంధీగారి హత్యతో సంబంధం ఉన్న వారితో మాటాడారు. బొంబాయి — ఢిల్లీలలో జిన్నా లాయరుగా వాడిన ఛాంబర్‌లని చూశారు. పంజాబు - కలకత్తాలలో మతకలహాలు జరిగిన ప్రదేశాలని సందర్శించారు; అందుకనే పుస్తకం చదవటానికి బాగా ఉంటుంది. అందులో లోపాలు లేవనికాదు. కొన్ని చిన్న విషయాలకి పెద్ద ప్రాముఖ్యం వచ్చేసి ఉంటుంది. కొన్ని చిన్న సంఘటనలకి అనవసరమయిన ప్రాచుర్యం లభించి ఉంటుంది. కాని ఇవి చిన్నలోపాలు

అసలు భారతీయులకి భారతదేశాన్ని గురించి అంతగా తెలియకపోవటానికి కారణం ఏమిటి? మనం ఒకరితో ఒకరు కలిసిమెలిసి ఉండకపోవటమే మన సమాజంలో కట్టుబాటులు ఎక్కువ. నిజమే కాని, ఈ కట్టుబాటులని అధిగమించటమే సదా రచయితల కర్తవ్యం? వాటిని అధిగమించి చదువరులని సంఘటనల దగ్గరికి తీసుకు వెళ్ళాలి రచయితలు. ఇది సాధించగలిగిన పత్రికలలు కొన్ని ఉన్నాయి అవి బాగా అమ్ముడుపోతాయి. 25, 30 సంవత్సరాల ముందు భారతదేశానికీ, నేటి భారతదేశానికీ చాలా తేడాలు ఉన్నాయి. మన దేశాన్ని మారుస్తున్నది కేవలం రాజకీయ వాదులు కారు; మార్వారీలలో వ్యాపారులు, సాంకేతికేయులు, రైతులు, శాస్త్రవేత్తలు, ఇంజనీరులు మొదలయినవాళ్ళు ఉన్నారు వీరందరికీ రచనలలో ప్రాణం పొయ్యాలి రచయితలు.

గంజాయి మోజు !

భారత — దక్షిణ భారతదేశంల స్మగ్లింగ్ వ్యాపారాలలో యిటీవల గంజాయియిచ్చి, సింగపూరు, మలేషియా దేశాల వారినుంచి విద్యుత్ పరికరాలు, ఉపకరాలూ తీసుకోడం ప్రారంభించారుట. లక్ష రూపాయల విలువ చేసే పద్దెనిమిది కిలోల గంజాయిని మొన్న డిశంబరు 14 వ తేదీన మదరాసు ఎగ్మూరుపాండ్యన్ ఎక్స్‌ప్రెస్‌లో పట్టుకున్నారట. అదే మాదిరి కొన్ని వారాల క్రితం 51 కిలోల గంజాయిని సేలంనుంచి వచ్చిన రైలులో పట్టుకున్నారట. అనగా మూడులక్షల పైచిలుకన్నమాట. మనదేశపు గంజాయంటే విదేశీయులు పడి చస్తున్నారట !

భార్య మరణం - భర్త శపథం !

వల్లపాడి అనే గ్రామానికి చెందిన 35 ఏళ్ళ గోవిందమ్మ అనేఆవిడ నవంబరు 16వ తేదీన ప్రభుత్వ ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషను చేయించుకున్నదట. దరిమిలాను ఆమెకు భయంకరంగా రక్తస్రావం ఆరంభమయ్యేసరికి మళ్ళీ 28 వ తేదీన ఆసుపత్రిలో చేరిందట. ఈ పరిస్థితిలో ఆమె డిశంబరు 3వతేదీ చనిపోయిందట. ముగ్గురు పిల్లల తల్లయిన తన భార్య చావుకు డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమనీ, కనుక అట్టి డాక్టర్లపై చర్య తీసుకునేవరకూ తన భార్య శవానికి అంత్యక్రియలు జరిపేది లేదని ఆమె భర్త గోవిందసామి జిల్లా కలెక్టరుకు విజ్ఞప్తి చేశాడట.

అపర పరశురాముడు !

క్రిష్ణగిరి తాలూకా మెట్టహళ్లి అనేగ్రామంలో 50 ఏళ్ళ చిన్నతంబి గవుండరుకు ముగ్గురు భార్యలట. మూడో భార్య 22 ఏళ్ళఎల్లమ్మకు అంతకు ముందే వివాహమై, వో ఆడ పిల్లకూడా వుందట. ఆమె తన మొగుడుతో వేరుపడి కూతురు వెణ్ణిలాతో విడిగా వుండగా యీ గవుండరు ఆమెను పెళ్లి చేసుకున్నాడట. అనక ఆమె కూతురు వెణ్ణిలాకు తన ఖర్చుతో పెళ్లి చేశాడట. దాంతో గవుండరు మొదటి భార్య కొడుకు 29 ఏళ్ళ సెల్వరాజుకు గిట్టలేదట. దీంతో ఎల్లమ్మకు, సెల్వరాజుకూ విరోధ మేర్పడి, అది పగగా రూపొందిందట. మొన్న డిశంబరు 14 వ తేదీనపొలంలో పని చేసుకుంటున్న ఎల్లమ్మ మీాది కాతను విజృంభించి కొడవలితో మెడ నరికాడట. ఆమె ఆతన్నితప్పించుకునివూళ్లోకి పారిపోయి వచ్చిందట. ఆతను ఆమెను తరుముకుంటూ వచ్చి వూరు వూరంతా చూస్తుండగా జుట్టు పుచ్చుకుని నేలమీాద బరబరా యీడ్చి, ఆనక పొట్టమీాదో కాలువేసి తలను పరపర నరికి, ఆ తల వో చేత్తోనూ, కొడవలి వో చేత్తోనూ పుచ్చుకుని కావేరీ పట్టణం అనే మరో గ్రామంవరకూ వూరేగింపుగా వెళ్లి పోలీసు స్టేషనులో ఆ తల, కొడవలి యిచ్చి లొంగిపోయాడట.

బలవంతంగా విషప్రయోగం !

వేలాంపాలయం అనే వూరికి చెందిన 26 ఏళ్ళ కమలమ్మ అనే ఆమెయింట్లోఎవరో గుర్తుతెలీని వారు జొరపడి బలవంతాన్నామెకు పట్ట పగలు విషం యిచ్చి త్రాగించి, పారిపోయారట. విషం త్రాగక ఎదిరించి ఆమె నలిపిన పెట్లాటలో ఆమె ముంజేతి ఎముక విరిగిపోయిందట. వారు ఆమె నోరు పెకలాగి, విషాన్ని పోసి చక్కాపోయారట. ఆమె కిద్దరు పిల్లలట. ఆమె వంటిమీాద నగలు వున్నవున్నట్టే వున్నవట.

ఆడపోలీసు ఆత్మాహుతి !

మధురై పోలీసు కంట్రోలు రూముకుచెందిన పోలీసు కానిస్టబుల్ 26 ఏళ్ళ వూంగోదై అనే అమ్మాయి తోటి పోలీసు అమ్మాయిలతో వో గదిలో అద్దెకుండేదట. మొన్న డిశంబరు మూడవ తేదీ రాత్రి మీాద కిరసనాయిలు పోసుకుని ఆమె నిప్పంటించుకు ఆత్మాహుతి చేసుకున్నదట..కారణాలింకా బయటపడలేదు.

ఎవరికీ ఓటెయ్యం !


నందికొట్టూరు నియోజక వర్గానికి చెందిన దోమకట అనే గ్రామానికి చెందినపౌరులు యీసారి ఎన్నికలను తమ గ్రామంలో నిషేధించాలని తీర్మానించుకుని, ఎన్నికలలో ఒక్కరూ వోటెయ్యరాదని నిర్ణయించుకున్నారట. హరిజనులే ఎక్కువగా వున్న యీ వూరిలో వారిగోడు గత పది ఏళ్ళుగా ఏ ప్రభుత్వేశ్వరుడూ వినిపించుకోటంలేదనీ, పాఠాల విషయం, స్థలాల పంపకం వంటివన్నీ అలానే పడున్నాయనీ, అవన్నీ ముందు పూర్తిచేస్తేనే వోటనీ, అంతవరకూ యన్టీఆరొచ్చినా వోటు వెయ్యబోమనీ వారంతా ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారట.

పాయిఖానాలో శవం !

సేలం కిచ్చిపాలయంలోని మున్సిపల్ పాయఖానాలో డిశంబరు 18 వ తేదీ ఉదయం లోపలకు వెళ్లిన వో పాంథుడు ఎగిరి వెనక్కు గంతేశాడట. లోపల మెడ నరకబడి, చచ్చిపడున్న వో కుర్రాడి శవం వుందట. పోలీసులొచ్చి తీసిన ఆరాలల ఆ కుర్రాడిపేరు సెల్వరాజనీ, వో టీ షాపులో పనిచేస్తున్నాడనీ తేలిందట. ఇంతకూ అంత దారుణంగా అతన్ని ఎవరు, ఎందుకు చంపారో తేలలేదట.

అతిపొడవైన పాము !

ప్రపంచంలో కల్లా అతి పొడవైన పాము అనకొండా అనే జాతి పాముట. ఈ పాము తొమ్మిది మీాటర్ల కనీసపు పొడ వుంటుందట. *



మకర సంక్రాంతి పూర్వాపరాలు

తెలుగు వారికి అచ్చి వచ్చిన పండగల్లో అందరికీ మెచ్చు కలిగించేది మకర సంక్రాంతి. జాతికి చైతన్యాన్ని అందించే సూర్య గమనాన్నాధారం చేసుకొని ఈ పర్వ దినం నిర్ణయించ బడింది. ఇది ప్రతిసంవత్సరం జనవరి 14 వ తేదీ వస్తుంది. జ్యోతిశ్శాస్త్ర ప్రకారం సూర్యభగవానుడు మేష వృషభాది పన్నెండు రాసులలో ప్రతి మాసం ప్రవేశించటాన్ని సంక్రాంతి అంటారు. సంవత్సరానికి 12 సంక్రాంతులేర్పడితే వాటిలో సూర్యుడు ధనూరాశిని వీడి మకర రాశిని ప్రవేశించటాన్ని మకర సంక్రాంతి అని మహాపర్వదినంగా భావిస్తారు. దీనినే ఉత్తరాయణ పుణ్యకాలంగా గూడ పరిగణిస్తారు. అంపశయ్యన వున్న భీష్ముడు మోక్షాన్ని పొందినది ఈ పుణ్యకాలంలోనే అని భావిస్తారు. కనకనే "సంక్రాంతికి సంకెళ్ళలోని వారికి విముక్తి" అని నానుడి కూడ యేర్పడింది. సంక్రాంతి పుణ్యకాలాన సూర్యస్తవం చేసుకుంటూ, పితృతర్పణాలు విడిస్తే ఎంతో పుణ్య ప్రదమైన విషయంగా పెద్దలు చెబుతారు. మకర సంక్రాంతి సంక్రాంతి పురుషుని రూపంలో ప్రపంచ పర్యటనచేస్తూ సకలజనులకు శుభంకరుడుగా వుంటాడని విజ్ఞుల భావన. ఈ సంక్రాంతి పూర్వాపరాలను గూర్చి సంక్షిప్తంగా తెలుసుకుందాం.


సంక్రాంతి వ్రతాలను గురించి మత్స్య పురాణంలో చక్కగా ప్రచురించబడింది. ఈ వ్రతానుష్ఠానపరులైన పురుషులు సంక్రాంతికి ముందుదినం మాత్రమే భుజించి, మరునాడు నూవులు కలిపిన నీటితో స్నానంచేసి మూడు పాత్రలలో యమరుద్ర ధర్మదేవతల ప్రీత్యర్థం ఆహారసంభారాలను ఆవుతోపాటుగా సద్బ్రాహ్మణులకు దానం యివ్వాలని చెప్పబడింది. మకర సంక్రమణ పుణ్యకాలంలో నువ్వులకు స్నాన దాన ప్రాముఖ్యం చాలా వున్నదని శివరహస్య ఖండంలో తెల్పబడింది.

ఆరోగ్య పరంగా చూసినప్పటికీ సంక్రాంతి పండగ శీతకాలంలో వస్తుంది గనుక నువ్వుల స్నానం మనిషికి ఉష్ణవీర్య శక్తులనిస్తుంది. తిలలు, ధేనువులతోపాటు గుమ్మడికాయలను గూడ బ్రాహ్మణులకు దానమివ్వటం కొన్ని ప్రాంతాలలో ఆచారం. సంక్రాంతి నాటి సాయంత్రం నువ్వులు, బెల్లం యింటింటికీ పంచుతారు. 'తీపి తిను, తియ్యగా మాటలాడు'' అని యిరుగు పొరుగులను ప్రబోధించే చక్కని వాడుకల వేడుక యిది. నువ్వులకు తిలలనీ, ఆ నూనెకు తైలమనీ, స్నేహమనీ పేర్లు. అంటే వాటి దానం ద్వారా మధురమైన స్నేహాన్ని గృహస్థు తన యిరుగు పొరుగు వారితో ఇచ్చిపుచ్చుకొంటాడని భావం.

తెలుగుదేశంలో సంక్రాంతిని పంటల పండగ అని ఆనందంతో అభివర్ణిస్తారు. తొలకరిలో వేసిన పైరులు యిళ్ళకు వచ్చి గృహస్థు యిల్లు పాడిపంటలతో, ముంగిళ్ళు ముద్దుగుమ్మల గొబ్బెమ్మల రంగవల్లులతో అలరారుతుంటవి. సకలయాచక సముఖులకు సంక్రాంతి పండగ రోజులు కల్పవృక్షాల వంటివి. సంక్రాంతి పండగ భోగి, సంక్రాంతి, కనుము అన్న మూడు పేర్లతో ముచ్చటగా జరుపబడుతుంది. భోగి భోగిమంటలకు, సంక్రాంతి క్రీడా వినోదాలకు, కనుము పశు పూజలకూ సంకేతాలు. ఇంద్రునకు ఆసక్తి దాయకమైన పొంగలిని కొత్త బియ్యం, కొత్త బెల్లం, పాలతో చేసి నైవేద్యం పెడతారు. బొమ్మల కొలువులు తీర్చిదిద్ది వనితలు చిన్నపిల్లలకు భోగిపండ్ల పేర రేగిపళ్ళతో అభిషేకం చేస్తారు. సంక్రాంతి పండగనాడు స్త్రీలు గొబ్బి గౌరీదేవి వ్రతాన్ని చేస్తారు. రంగు రంగుల ముగ్గులతో ముంగిళ్ళను అలంకరించి ముత్తయిదువలకు వాయనాలు యిస్తారు. విందు వినోదాలతో పేరంటాలను జరుపుకుంటారు కనుము పండగ పూర్తిగా కర్షకులకు సంబంధించినది. తమ వ్యవసాయానికి తోడ్పడిన పశువులను కృతజ్ఞతా సూచకంగా పూజిస్తారు ఎడ్లపందెలు, కోడిపందేలలో గ్రామీణ జనం తమ వినోదాల వెల్లువగా సంక్రాంతి పండగలను వైభవంగా నిర్వహించుకుంటారు.

తక్కిన పండగలకన్న మిన్నగా అచ్చమైన తెలుగింటి ఆచార వ్యవహార సంప్రదాయాల కూడలి మకర సంక్రాంతి ఎల్లవారికి ఐహికానందమే కాకుండ ధార్మిక సాధనలో గూడ చక్కని శిక్షణను యిచ్చే శ్రేష్ఠమైన పండగ సంక్రాంతి సంక్రాంతి వైభవాల దర్శనం ప్రతివారిలోనూ సమతా మమతలు రేకెత్తించే మహోన్నత సాధనం. ధనుర్మాసమంతా దేవాలయాల్లో ముఖ్యంగా విష్ణ్వాలయాల్లో ధార్మిక కార్యక్రమాలు జరిపి వైష్ణవ భక్తురాలైన గోదాదేవి కల్యాణ మహోత్సవాలను సంక్రాంతి పుత్సవాల తారస్థాయిగా నిర్వహించటం తెలుగు దేశంలో అనూచానమైన ఆచారం. జాతీయ సమైక్యతను, సర్వజన కల్యాణ కాంక్షను వ్యక్తంచేసే పర్వదినాల్లో మకర సంక్రాంతికి ప్రముఖ స్థానం వున్నది. సంక్రాంతి పండగల రోజుల్లో ప్రజలు నిర్వహించే ధార్మిక కార్యకలాపాలన్నీ మనిషిని ఆ పవిత్ర లక్ష్యం వైపు సాగిపోయేటట్లు చేసే సాధనాలే. ప్రాచీనార్వాచీన ప్రగతి పరమార్థాల మేళవింపు మకర సంక్రాంతి పండగ అనటం నిస్సందేహం. ఈ ఆంగ్ల నూతన సంవత్సరంలో విచ్చేసిన నూతన సంక్రాంతి పురుషుడు జాతికి అన్ని విధాలా జాగృతి నందిస్తాడని ఆశిద్దాం.

— "సుచంద్ర"



తొలగిన మబ్బులు

భమిడి వెంకటేశ్వర్లు



పదకొండు గంటలు దాటినా, రాజేశ్వరి యింకా ఆఫీసుకు రాలేదు. ఆమె కోసం గంట నుంచీ ఎదురు చూస్తున్నాడు సూపర్నెంటు సుందరమూర్తి ఈ మధ్య తరచుగా తను ఎందుకు ఆలస్యంగా వస్తోందో ఆయనకు అంతుపట్టటంలేదు

ప్రతి నెలా మూడవ తేదీ నాటికే ''రెడ్ బుక్'' పై అధికారులకు పంపించాలి కాని ఆరో తారీఖు దాటిపోతున్నా అందులో వివరాలు వ్రాయటం పూర్తి కాలేదు. ''రెడ్ బుక్'' ద్వారా సెక్షను పనిగురించి వివరంగా ప్రతినెలా తెలుపబడుతుంది.

సుందరమూర్తి సెక్షనులో ఎనిమిది మంది స్టాఫు వున్నారు. అందులో ఇద్దరు ఎప్పుడూ ఆయన్ని యిబ్బంది పెడుతుంటారు. ఒకడు రామారావు...ఆఫీసుసహకారసొసైటీకి సెక్రటరీ. అటెండెన్సు రిజిష్టరులో సంతకం చేసి,సొసైటీవ్యవహారాల్లో బిజీ అయిపోతాడు.

రెండో వ్యక్తి సుందరం. అతను యూనియన్ ప్రెసిడెంటు... తరచుగా యూనియన్ ఆఫీసులోనో. మిగిలిన ఆఫీసుల్లోని నాయకులతోటి కాలక్షేపం చేస్తుంటాడు.

కాబట్టి సుందరమూర్తి ఆ రెండు సీట్ల పని చూడవలసిందే. అందుకు ఆయన ఆఫీసుకు ఎనిమిదింటికే వచ్చేసి, పని ప్రారంభిస్తాడు గత్యంతరంలేక!

రాజేశ్వరి సిన్సియరుగా పనిచేస్తుంది. కాని యీ మధ్య నాలుగైదు నెలలుగా ఆమెకూడా పనిలో అశ్రద్ధ చూపెడుతూ, సుందరమూర్తిని యిబ్బంది పెట్టటంతో ఆమె సీటు పనికూడా తనే చేయవలసివస్తోంది.

ఇప్పుడు రామారావు, సుందరం సీటుల్లోని పని వివరాలు ''రెడ్ బుక్''లో యిచ్చాడు. కాని రాజేశ్వరి సీటుపని ఎలా వివరించాలో అర్థం కావటంలేదు. ఆ సీటుకు చెందిన ఓ ముఖ్యమైన కేసును పరిష్కరించబడినట్లుగా

తొలగిన మబ్బులు

చూపెట్టాలని ఆయన తాపత్రయం. అయిదు నెలల్నుంచీ 'పెండింగు' అని వ్రాస్తున్నందుకు పై అధికారులు ఆయనకు అక్షింతలు వేస్తుంటే, వాటిని తిరిగి రాజేశ్వరికి బదిలీ చేస్తున్నాడు తను.

ఈ నెలలోకూడా అలాగే చూపెడితే పరిణామం ఎలా వుంటుందో?–అనుకోంటూ వుండగానే రాజేశ్వరి వచ్చింది.

ఆమె అటెండెన్సులో సంతకం చేసి వెళ్లబోతుంటే సుందరమూర్తి పిలిచాడు.

"ఏవమ్మా రాజేశ్వరి ! ఈ నెల్లో అయినా ఆ కేసుని 'రెడ్ బుక్' నుంచి తొలగించ వచ్చా ? ఇంకా ఎన్నినెలలు అలా పెండింగులో వుంచుతావ్ ? మీకేం, హాయిగా వుంటారు... ఏటొచ్చి నేనేగా అవస్థపడేది ! పోయిన ఆఫీసరు 'అందులో' ఏం చూపెట్టినా, ఫరవా లేకపోయేది... కాని రాబోయే ఆఫీసరు ఏటు వంటివాడో ! పైగా హెడింగోవరు రిపోర్టులో రాసి మరీ పోయాడు ఆ పాత ఆఫీసరు... ఆయనకూడా ఎప్పుడో దిగుతాడు... రాగానే యీ విధమైన సదభిప్రాయంతో ఆహ్వానిస్తావా ? ఇంతకీ ఆ కేసు పరిస్థితి ఏమిటి? మరోసారి కేసుని వెతికి, ఏదో "ఇంటెరిమ్ రిప్లయ్" యిస్తే, యీ నెలకు గండం గడుస్తుంది... బతికి బాగుంటే మళ్ళీ నెల చూడమ్మ !"

ఆయన మాటల్లో మందలింపు, అభ్యర్థన, సలహా గోచరించాయి రాజేశ్వరికి.

* * *

ఎనిమిది నెలల క్రితం ఓ ఉద్యోగి రిటైరయ్యాడు. అతనికి ప్రావిడెంటు ఫండు ఖాతాలో వున్న సొమ్ము కొంతవరకే చెల్లించడమైంది. ఇంకా కొంతసొమ్ము మిగిలింది.

ఆ కేసు రాజేశ్వరి పరిష్కరించింది.

దానితోపాటే పూర్తిసొమ్ము చెల్లించేందుకు కావలసిన వివరాలు, ఆ ఉద్యోగి ఖాతాలో లేవు. కాబట్టి 'రిస్కు' తీసుకోటం యిష్టంలేక రాజేశ్వరి కొంతవరకే కేసుని పరిష్కరించి, సొమ్ము చెల్లించే ఏర్పాటు చేసింది.

కాని ఏవరైనా తనకు రావలసిన సొమ్ము గురించి ఏన్నాళ్ళని ఏదురు చూస్తాడు ? అందులో రిటైరయ్యాక ! ఆ వివరాల కోసం రాజేశ్వరి ఆ ఉద్యోగి పని చేసే ఆఫీసుకు మూడు నాలుగు ఉత్తరాలు రాసింది. కాని ఆవతలి ఉద్యోగులు ఆ లెటర్లని దిండుగా వుపయోగించుకొని నిద్రపోతున్నారు.

రిటైరైన తోటి ఉద్యోగిపై జాలి, సానుభూతి ఎందుకుంటుంది ? ఒడ్డున పడ్డ చేప బతుకే అది !

ఫలితంగా ఆ ఉద్యోగి ఫైలు "రెడ్‌బుక్" లోకి ఎక్కింది. నాలుగునెలల్నుంచీ "రిపీట్" అవుతోంటే సుందరమూర్తికి రక్తప్రసరణ ఎక్కువయ్యేది

కాని ఇప్పుడా ఫైలు కనబడటం లేదు. రాజేశ్వరి అన్నిచోట్లా వెతికింది కాని ఏం లాభం ? సుందరమూర్తి అన్ని సెక్షన్లకి "సెర్చ్ నోట్" పంపించాడు. ప్రయోజనం లేక పోయింది.

ఆ ఫైలుకు ఏడు నెలలు నిండాయి.

ఈ ఏడు నెలల కాలంలోను, ఆ ఉద్యోగి ఆఫీసుకు విశాఖపట్నంనుంచి హైదరాబాదు మూడు సార్లు వచ్చాడు నాలుగు సార్లు అధికార్లకు ఉత్తరాలు రాసేడు. రెండుసార్లు టెలిగ్రాములు ఇచ్చాడు.

అన్నింటికీ సుందరమూర్తి ఉచితంగా బదులు యిస్తూ వచ్చాడు. ఆ ఉద్యోగికి ఓర్పు నశించింది. 'టెన్షన్' పెరిగింది. ఒళ్ళుమండింది. తన కేసుని చూచే ఉద్యోగుల నందరిని కాల్చి పారేయాలన్నంత కోపం కలిగింది

కాని అతను పేదవాడు. పేదవాని కోపం ఏలా వుంటుంది. మంచి రోజులకోసం ఏదురు చూస్తున్నాడు.

ఇరవై రోజుల క్రితం ఆ ఉద్యోగి ఈ వ్యవహారం అంతా సమీక్షిస్తూ ఉన్నతాధికార్లకు, ప్రధానికి, రాష్ట్రపతికి, ఉద్యోగ సంఘ ప్రతినిధులకు పేరుమీద ఉత్తరాలు రాసేసాడు– అందులో తన ఉత్తరాలు, టెలిగ్రాములు, వ్యక్తిగత విచారణల గురించి ఉదహరించాడు. పదిహేనురోజుల్లో తనకు రావలసిన సొమ్ము చెల్లించకపోతే కోర్టుద్వారా తేల్చుకోవల్సి వస్తుందని బెదిరించాడు.

తనపై అధికార్లనుంచి ఆ ఉత్తరాలు తన సెక్షన్కు చేరగానే సుందరమూర్తికి గుండె ఆగినంత పని అయింది. అప్పుడుగాని ఫైలు పోయిందన్న విషయం బయట పడ లేదు.

ఒకరోజు రాజేశ్వరి, సుందరమూర్తి



ప్రసిద్ధి చెందిన హిందుస్థాన్ పెట్రోలియం, భారత పెట్రోలియం మరియు ఇండియన్ గ్యాస్ డీలర్లవద్ద కూడ లభించును.

సెక్షనులో అంతా వెతికారు... ఫైలు యింకా వెలుగు చూడలేదు.

* * *

సీటులో కూర్చోగానే రాజేశ్వరి ఫైలు గురించి ఓ గంటసేపు వెతికింది ఆమె చీర వలిగిపోయింది... వంటికి పట్టిన చెమట జాకెట్‌ని, బ్రాని బహిర్గతం చేసాయి. అందమైన ముఖం పాలిపోయింది. జుట్టంతా చెదిరిపోయింది.

సుందరమూర్తి ఆమెను చూసి జాలి పడ్డాడు. ఆయన వెంటనే పాత లెటరుకు రిమైండరు వేసి, ఆ నెలకు ఫైలు మీద చర్య తీసుకున్నట్లుగా "రెడ్ బుక్"లో వేర్కొన్నాడు.

రాజేశ్వరి తృప్తిగా నిట్టూర్చి, ముఖం కడుక్కోనేందుకు బాత్‌రూమ్ వైపు వడిచింది.

* * *

మర్నాడు—

తొలగిన మబ్బులు

కొత్త ఆఫీసరు శివకుమార్ ఛార్జి తీస్కున్నాడు. సుందరమూర్తి ఆఫీసరుని సెక్షను స్టాఫుకు పరిచయం చేశాడు.

"ఈ సీటులో ఎవరు?" అడిగాడు శివకుమార్.

"రాజేశ్వరి అని ... వారంరోజులు సెలవు పెట్టి ఉదయమే ఊరుకెళ్లింది..." చెప్పాడు సూపర్నెంటు.

హెండింగోవరు రిపోర్టు పరిశీలిస్తుండగా 'ఫైలు' విషయం సుందరమూర్తితో చర్చించాడు శివకుమార్

రాజేశ్వరి సెలవునుంచి తిరిగి వచ్చింది.

"నువ్వు ఊరుకెళ్ళిన రోజానే కొత్త ఆఫీసరు చేరాడు. అందరి పరిచయాలు అయ్యాయి... నువ్వుకూడా వెళ్ళి కనబడిరా!" చెప్పాడు సుందరమూర్తి.

ఆఫీసరు రూములోకి ప్రవేశించి "గుడ్ మార్నింగ్‌సర్!" అంది రాజేశ్వరి

ఫైలు చూస్తున్న శివకుమార్ ఆమెను చూడకుండానే "కూర్చోండి" అన్నాడు. ఫైలు కట్టేసి తలెత్తి చూసాడతను.

చూపులు, ప్రతిచూపులు అవుతుంటే ఇద్దరూ నిశ్చేష్టులయ్యారు ...

"బాగున్నారా, రాజేశ్వరిగారూ!" ప్రశ్నించాడు.

"మీరు నన్నెక్కడైనా చూసారా? నాతో పరిచయముందా?" కలవరపడుతూనే ఎదురు ప్రశ్నలేసింది రాజేశ్వరి.

శివకుమార్‌కి ఆ ప్రశ్నకు అర్థంకాలేదు.

"... ఐ మీన్ ... స్టాఫ్ మెంబరుగానే ఆ ప్రశ్న వేసాను." అన్నాడు, మరేం బదులివ్వాలో తెలియక

"అయితే ఫరవాలేదులెండి ... ఆ దేవుడి దయవల్ల యిలా వున్నాను .... మీరు వచ్చిన రోజున నేను లేకపోవటంతో, మా సూపర్నెంటు మిమ్మల్ని కలవమని చెప్పారు..." ముక్తసరిగా సమాధానం యిచ్చి, కుర్చీలోంచి లేవబోయిందామె.

"... అప్పుడే వెళిపోతున్నారా?" శివకుమార్ అన్నాగాని, రాజేశ్వరి నిలవలేదు.

ఆమె సెక్షనుకు తిరిగి రాగానే, చెమ్మగిల్లిన కళ్లు చూసి - పోయిన ఫైలు గురించి ఆఫీసరు మందలించి వుంటాడని సుందరమూర్తి అనుకొన్నాడు

శివకుమార్ రూమునుంచి బయటకు వెడుతూ రాజేశ్వరివైపు చూసాడు. ఆమె కూడా అతన్ని చూసింది.

"సార్. అయ్యగారు పిలుస్తున్నారు" చెప్పాడు ప్యూను.

"రాజేశ్వరి మీ సెక్షన్లో ఎన్నాళ్ళ నుంచి పని చేస్తోంది?" సుందరమూర్తిని అడిగాడు శివకుమార్.

"నాలుగేళ్ల నుంచి..." చెప్పాడు.

"ఆమెకు వివాహం అయిందా?" మళ్లీ ప్రశ్నించాడు.

సుందరమూర్తి కొంచెం తటపటాయించాడు ఆఫీసరు రెండో ప్రశ్నకు సమాధానం ఎలా చెప్పాలో ఆలోచిస్తున్నాడాయన.

"...అదంతా ఓ పెద్ద కథ లెండి..."

"నేను తెలుసుకోవచ్చా?"

(65 వ పేజీ చూడండి)


సందేశం

ఇంటి ముందటి రంగవల్లులంటున్నాయి
'మీ జీవితాలలోను వీటిని తీర్చిదిద్దుకొండని'
అరవిరిసిన ముద్దబంతులు ముచ్చట చెబుతున్నాయి
'స్నేహ సౌహార్ద్రాలను మీలో విచ్చుకోనివ్వండని'
ముద్దుగుమ్మలా గుమ్మాలోని గొబ్బెమ్మలంటున్నాయి
'హీనంగా దేనినీ చూడకండి
ఎప్పుడైనా దావవసరం మీకొచ్చునని
డూడూ బసవన్న మరి ఏమంటున్నాడో
'నాలా మీరు ప్రతిమాటకు
అనాలోచితంగా తలలూపవద్దని'
సాతాని జియ్యరు ఏమంటున్నాడో
'సాటి మనిషికి సాయమందించి
మానవ జన్మను సార్థకపరచుకోండని')
నిర్మల నీలాకాశం ఏం నిర్వచిస్తున్నదో
'పసిపాపల హృదయాలకు మాత్రమే
ఓటివ్వకపోయినా నేను ప్రతినిధినని'
పిండారబోసిన పండువెన్నెల ఏమంటున్నదో)
'ఆనందాన్ని అందరికీ అందించి
సంతృప్తితో సదా సహకరించమని!'


— సూరజ్ ప్రసాద్

ఎంత బహుళ ప్రయోజనమైనదంటే, ఇది లేకుండా ఇన్నాళ్ళు ఎలా వంట చేయగలిగామని మీకే ఆశ్చర్యం కలుగుతుంది.


ప్రెస్టీజ్ వారి ప్రెషర్ పాన్




వేపుడు




హెచ్చు వేపుడు



సాట్



ప్రెషర్ కుక్



మీరు ఇందులో వేపుడు హెచ్చు వేపుడు చేసుకోవచ్చు అవసరమైన అన్నిరకాల మేరకు వేపుడు చేసుకోవచ్చు మూత ఉంచి వండాలి అంతే. ప్రెస్టీజ్ ప్రెషర్ పాన్ వెంటనే మీకు సిద్ధం చేస్తుంది బహుళ ప్రయోజనమైనది మరియు ఎంతో ముచ్చటైనది మీ కుటుంబానికి నోరూరించే రుచికరమైన వంటకాలు క్షణాలలో సిద్ధం చేయడంలో మీకు తోడ్పడేందుకు అనువుగా రూపొందించబడింది

మూత వేయకుంటే దళసరి గేజ్ కలిగిన ఈ పాన్‌పై కొద్ది నూనెతో ఉల్లిపాయలు కూరగాయలు మసాలాలు మాంసాన్ని కోడి మాంసాన్ని వేపుడు చేసుకోవచ్చు ప్రెస్టీజ్ మూతతో దీనిని మూస్తే మీ వంటకాన్ని వెంటనే సిద్ధం చేస్తుంది కోడి బుర్తా? 20 నిమిషాలు మటన్ దోపియాజీ? 25 నిమిషాలు దమ్ ఆలూ? ఇంకా తక్కువ వ్యవధిలో మంచి పనులకోసం మీ సమయాన్ని ఆదా చేసుకోండి మరియు మీ ఇంధనం చిరకాలం నిలువడానికి తోడ్పడుతుంది

ఒక్క వంటకానికి రకరకాల పాకాలు ఉపయోగించి చివరకు కుక్కర్‌లో వండే శ్రమ ఇక మీకు ఉండదు బహు పాత్రల పనికి అనుకూలమైన ఏకైక పాత్రను ప్రెస్టీజ్ ప్రెషర్ పాన్ మీకు అందిస్తున్నది

ప్రెస్టీజ్ వారే ఈ ప్రెషర్ పాన్‌ను ఉత్పత్తి చేస్తున్నారు మిక్కిలి ప్రజాదరణ కలిగిన ప్రెషర్ కుక్కర్‌ను భారతదేశంలో మొట్టమొదటగా ప్రవేశపెట్టి అద్వితీయమైన గేస్కెట్ రిలీజ్ సిస్టమ్ ద్వారా ప్రెషర్ వంటను నిరపాయకరంగా తీర్చిదిద్దినది ప్రెస్టీజ్ వారే ప్రెస్టీజ్ ప్రెషర్ పాన్ మీ వంటగదిలో మీకు ఇతోధికంగా ఉపయోగపడుతుంది

దీని ధరలో సగానికంటె తక్కువకే మీరు దీనిని పొందాలంటే ఇదిగో....

మీకు ఇప్పటికే ప్రెస్టీజ్ ప్రెషర్ కుక్కర్ ఉంటే మిమ్ము మీరు అభినందించుకోండి భారీ గేజ్ కలిగిన పాన్ ధరకే ప్రెస్టీజ్ ప్రెషర్ పాన్ మీదవుతుంది ఒక్క పెనం కొంటే చాలు మీ ప్రెస్టీజ్ కుక్కర్ మూత దీనికి సరిగ్గా సరిపోతుంది అంతే సరసమైన ధరకు ప్రెస్టీజ్ ప్రెషర్ పాన్ మీకు లభించినట్లే ఎందుకంటే మీ కష్టార్జితమైన సొమ్ముకు విలువైన, నాణ్యమైన ఉత్పత్తులను మీకు సమకూర్చడానికి ప్రెస్టీజ్ కంపెనీ కృషి చేస్తున్నది

ప్రెస్టీజ్ ప్రెషర్ కుక్కర్ ఇంకా మీవద్ద లేకుంటే

ఒకేసారి బహుళ ప్రయోజనాలు పొందడానికి నిజంగా ఇది మీకు మహదవకాశము వంటగదిలో మీకు భలేగా ఉపయోగపడగల రెండు పాత్రలు ఇప్పుడు మేము మీకు అందిస్తున్నాము—అద్వితీయమైన గేస్కెట్ రిలీజ్ సిస్టమ్ కలిగి భారతదేశంలోకెల్ల నిరపాయకరమైన ప్రెషర్ కుక్కర్ మరియు అద్భుతమైన ప్రెషర్ పాన్—ఒకే ధరకు కొంచెం ఎక్కువలో రెండు పాత్రలు లభిస్తాయి

ఒకే మూత రెండింటికి సరిపోతుంది మరియు మీకు రూ 150/-లు ఆదా

Prestige PRESSURE PAN

TTK తయారీ.

(గత సంచిక తరువాయి)



స్నానాలు — భోజనం అయింది.

తలుపు తట్టి — బేరర్ వచ్చి — ''మీకోసం ఎవ్వరో వచ్చారుసార్'' అని రవిచంద్రకి చీటీ యిచ్చాడు. కేసుపెట్టిన పబ్లిషర్ అప్పుడే వచ్చాడు. గుడ్ అనుకుంటూ బట్టలువేసుకుని— ''రెస్ట్ తీసుకో'' అనిచెప్పి తలుపు దగ్గరగా వేసి వెళ్లిపోయాడు. ఏ. సి. వేసి, తెల్లటి పడకపై దుప్పటి కప్పుకుని పడుకుని— రవిచంద్రకోసం ఎదురు చూస్తూంది.

సాహిత్యకు ఆ మధ్యాహ్నం గడవటం కష్టంగా వుంది. ఎప్పుడు రవిచంద్ర వస్తాడా అని ఎదురు చూస్తుంది. మనసా వాచా సంపూర్ణంగా తననే వాంఛించేలా చేసుకోవాలని వుంది. రవిచంద్ర ప్రణయ సామ్రాజ్యానికి తనే మహారాణి కావాలని,రవిచంద్రతో సంపర్కానికి ఎదురుచూస్తూ —దివ్యాను భూతికి లోనయి రాబోయే మధుర క్షణాల గురించి కలలు కంటూండగానే— పొద్దు సంధ్యను కలుసుకుంది.

రవిచంద్ర రానేలేదు. కప్పుకున్న దుప్పటి కాళ్లతో నెట్టేసి— గది బయటికి వచ్చింది. హోటల్ లాంజ్‌లో సుఖాసీనుడై చుట్టూ ఆడ మగ అభిమానులు— ఏజంట్లు, రచయితలు— పబ్లిషర్స్‌తో రౌండ్ టేబుల్ కాన్ఫెరెన్స్ జరుగుతూంది. సాహితీ చర్చలు— ముషాయిరాయిలా జరిపించేస్తున్నట్టున్నారు.

నవల కాపీ కొట్టిన రచయిత్రి— ఆ నవల హక్కులు కొన్న పబ్లిషర్‌కీ రాజీకుదిర్చారు. కేసు ఏమిటో మనకి అర్థమయిపోయింది. ఇక కోర్టు దాకా ఎందుకు— మా పత్రికలో ప్రచురించి నందుకు రచయిత్రికి ఇచ్చే పారితోషకము— హక్కు వారికి ఇచ్చేస్తాము— అని రవిచంద్ర చెప్పాడు.

ఆ నవల కాపీ నవలని ఒప్పుకుని క్షమాపణ చెప్పుకుంటారా లేక గుట్టు చప్పుడు కాకుండా ఐదు వేలు ఇచ్చుకుంటారా అని నవల హక్కుదారుడు బాణం వదిలాడు. మధ్యవర్తులు మూడువేలకి సరి చేశారు.

ఒకరోజులో రచయిత్రి నైపోదామన్న కీర్తి దాహంతో కాపి కొట్టిన ఆ రచయిత్రిపై జాలి కలిగింది రవిచంద్రకు.

మరి కొందరు పిల్ల రచయితలు, రచయిత్రులు వచ్చారు. వారి వారి కష్టాలు చెప్పుకున్నారు. నిష్ఠూరాలు వేశారు. ఇప్పుడు వస్తున్న కొత్తదనం లేని రచనలను విమర్శించారు. ''హీరోను హీరోయిన్‌గా— హీరోయిన్ను హీరోగా— మార్చి పాత నవలనే వ్రాసిన వుదంతాలు— వాటిని సినీమాగా తీసిన విషయాలు బయటికి లాగారు— రెకమండేషన్ వుంటే వేసుకుంటారు. ఒక ప్రముఖవార పత్రికలో వచ్చిన కథకు మరొక ప్రముఖ పత్రిక దానికి ఫస్టు ప్రయిజు యివ్వడం, ఇలాటివి చూస్తుంటే— వర్ధమాన రచయితలకు కడుపు మండి పోతున్నది. కొత్తవారికి సరైన న్యాయం జరగటల్లేదు. మీలాటి రచయితలు— చూస్తూ వూరుకుంటున్నారు.'' అంటూ ప్రశ్నలతో కొట్టినట్లు అడిగారు.

''నా పత్రిక విషయం నేను చెప్పగలను—'' అన్నాడు ప్రక్కన కూర్చున్న అమ్మాయివైపు చూచి తియ్యగా నవ్వుతూ—

''రెకమండేషనుంటే ఒక కథ— ఒక నవల వేస్తారేమోకాని, ప్రముఖులు కాని కొత్తవాళ్లుకాని— ఒక మంచి కథ వ్రాస్తే వేయకుండ వదలరు. ఏపుట్టలో ఏ పాము వుందో అన్నట్లు—వచ్చిన కథలన్నీ చదువుతారు: ఓ మంచికథ మిస్ అవుతామేమో అన్నట్లు— ఒక్కొక్కసారి మాకు నచ్చని కథలు వేయవలసి వస్తుంది పాఠకులను దృష్టిలో పెట్టుకుని. పత్రిక సర్క్యులేషన్ దృష్టిలో వుంచుకుని కథలు వేస్తుంటాము.''

ఎదుటి అమ్మాయి ఆరాధనగా కన్నార్పకుండా రవిచంద్రను చూస్తోంది.

ఆ చూడటం సాహిత్య గమనించింది. ప్రక్కన మ్మాయి— ఆయనమీద పడ్డట్టు కూర్చుంది.

కనుసైగ చేస్తేచాలు వచ్చివళ్లో వాలేలా వుంది— అని కసిగా అనుకుంది.

శ్రీకృష్ణుడు గోపికలతో సభతీర్చినట్లు ఆనందంగా— తియ్యగా నవ్వుతున్నాడు. సమ్మోహనాస్త్రం వేసినట్లుండే ఆ నవ్వుకే తను లొంగిపోయింది. అలా ప్రతి ఆడదాని వైపుచూసి— నవ్వుతుంటే వంటికి కారం పూసినట్లుంది.

సినిమా హీరోలకున్నత గ్లామర్ రవిచంద్ర కున్నది. కథల వ్యామోహం మరీ పెరిగిపోయింది. ఏవిధంగా అయినా సరే— తమ కథలు పత్రికలో పడాలి— అన్నపిచ్చి మరీ ఎక్కువైంది పిచ్చి ఆడవాళ్లతో వోపిగ్గా కూర్చున్నాడు. రవిచంద్రపై కోపం ముంచుకు వచ్చింది. రాగానే, తలుపులు వేసి— దగ్గరకు తీసుకుంటాడనుకున్న రవిచంద్ర— తన సంగతే మర్చిపోయినట్లున్నాడు. తనను నిర్లక్ష్యం చేసినట్లే అనుకున్న సాహిత్యకు ఏడుపు ముంచుకువచ్చింది— పిచ్చిగా కేకలు వేయాలన్నంత ఆవేశం వచ్చింది. గిరుక్కున వెనక్కి తిరిగి—తలుపు లాగి గట్టిగా విసిరి కొట్టింది.

ఆ రాత్రి సాహిత్య అలకతీర్చి— తాపం తీర్చే టప్పటికి నడిరేయి దాటింది. ప్రక్కన అలసిపోయి— పడుకున్న సాహిత్యను చూస్తుంటే అతని కళ్లలో గర్వం— అధరాలలో సంతోషం— అప్రయత్నంగా లక్ష్మితో గడిపిన మొదటి రాత్రి గుర్తుకువచ్చింది.

సాహిత్యపై దుప్పటి సరిగ్గా కప్పి—తాగుతున్న సిగరెట్ యాష్‌ట్రేలో వేసి—బెడ్‌లైట్ వెలుతురుతో ఫోన్ దగ్గరకు వెళ్లి ఇంటి నంబర్ తిప్పాడు.

ఫోన్ రెండోరింగ్ పూర్తి కానేలేదు ''హలో!'' అని లక్ష్మి స్వరం వినిపించింది.

''ఇంకా నిద్ర పోలేదా !'' అన్నాడు రవిచంద్ర. ఇంట్లో ఎంతమంది వున్నా యజమానిలేని ఇంట్లో ఒంటరితనం కృంగదీస్తుంది.

''మీరు...''

''ఏదో జ్ఞాపకం వచ్చింది. నీకు చెప్పదామని''

''ఐ లవ్ యు'' అన్నాడు.

''ఐ టూ'' అని ''ఐ వాంట్ యు'' అని చెప్పబోయి ఆగింది.

ఇలాగే ఒక రాత్రి మద్రాస్ నుంచి ఫోన్ చేసాడు.

''ఐ లవ్ యు— ఐ వాంట్ యు'' అన్నాడు.

''రవీ—'' అంది.

''పిలిచావా'' అన్నాడు.

''అవును.''

''ఒంటరిగా వున్నావా ! తోడు కావాలా.''

''పైన ఆకాశంనిండా నక్షత్రాలు— దేదీప్యమానంగా— ఇంటినంతా వెన్నెల నింపిన చంద్రుడు తోడుగా వున్నారు...''

''మరి..''

''మీరు కావాలి.''

''అంటే !...''

రవిచంద్ర రసికుడు — తనకు అవసరమైతే ఎప్పుడైనా సరే, ఎక్కడైనా సరే తీర్చుకుంటాడు. సుముఖంగా లేకపోతే లాలించి బుజ్జగించి — ఉద్రేక పరచి తనవైపు తిరిగి, మెడచుట్టూ చేతులు వేసుకునేలా మైమరపించేస్తాడు. లక్ష్మి — నీవు నిర్మలంగా, అమాయకంగా ఏంజిల్ ఫేస్‌తో వుంటావా ? కాని సెక్సంతా నీ చూపుల్లోనే పలికిస్తావు. ఏవీ నీ అధరాలు — ఆ వంపులోనే వుంది.

జరిగిన కథ—12 : రవిచంద్ర 'రచన' వార మాస పత్రికలో మేనేజింగ్ ఎడిటర్‌గా పనిచేస్తుంటాడు. అతనికి పి.ఏ. గా చేరిన సాహిత్య తన అభిమాన రచయిత రవిచంద్రను ఎంతగానో ప్రేమిస్తుంటుంది. ఆమెకు ఎంత దూరంగా వుండాలనుకుంటున్నాడో అంతగా దగ్గరవుతుంటాడు రవిచంద్ర. ఎలాగైనా అతన్ని తనవాడిగా చేసుకోవాలని నిర్ణయించుకొంటుంది. జూలాజికల్ పార్క్‌లో రవిచంద్ర లీలలు చూసిన గిరిజ ఆ విషయం ఫోన్ ద్వారా లక్ష్మికి తెలియజేస్తుంది. ఇక ఇలా ఎంతోకాలం సాగదని, దాగదని తెలుసుకొన్న రవిచంద్ర, సాహిత్యలు కలకత్తా పోయి పెళ్లి చేసుకోవడానికి నిర్ణయించుకొంటారు. కాని ఇంట్లో పరిస్థితి అర్థం చేసుకొన్న రవిచంద్ర ఆ పని చేయలేకపోతాడు. ఫలితంగా సాహిత్య అతనిని ఛీదరించుకొంటుంది. చచ్చిపోవడానికి స్లీపింగ్ టాబ్లెట్స్ మింగిన సాహిత్యను పెళ్లి చేసుకొని బ్రతికిస్తాడు రవిచంద్ర.



అంటూ ప్రారంభించి — మెల్లమెల్లగా మెత్తమెత్తగా లీనమై ఓ కొంటెనవ్వు నవ్వుతాడు.

ఆ జ్ఞాపకాలు — అలలలుగా లేచి మానస సరోవరాన్ని అల్లకల్లోలం చేశాయి — భావోద్రేకానికి లోనై.

"రవీ —" అంది. ఆ గొంతులోని మత్తు గుర్తించి.

"నేను కావాలి అవునా."

"అవును — ఐ వాంట్ యు" అంది అంత దూరంలో వున్న రవిచంద్రను పూరిస్తూ.

నవల పూర్తిచేసి, నిద్రపోటానికి లైటు ఆర్పే సమయంలో — "లక్ష్మి ?" అన్న రవిచంద్ర పిలుపు విని వులిక్కిపడింది. భ్రాంతి కాదుకదా అనుకుంటూ వెళ్లి తలుపు తీసింది.

"నేను కావాలన్నావుగా ? వచ్చాను" అన్నట్లుగా చూస్తూ — నవ్వుతూ — వచ్చి చుట్టేశాడు.

"రవీ! ఎలావచ్చారు" ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ అంది.

"గాలిలో ఎగిరి వచ్చాను. నీవుకావాలి అని మత్తుగా పలికితే— ఏభర్త రాకుండ వుటాడు—"

ఆరోజు భర్త దగ్గర పొందిన సుఖానుభూతి తలంచుకుంటే ఇప్పటికి శరీరం పులకించి పోతుంది.

తనమేను పులకించి పోవడం గమనించి ఎప్పుడూ కలగని సిగ్గుతో మాటపైకి రాలేదు. ఎలాగో గుడ్‌బై చెప్పింది.

ఫోన్‌లో లోగొంతుతో మాట్లాడుతున్న రవిచంద్రను నిద్ర కళ్ళలో చూచింది సాహిత్య.

సత్యభామకున్న దంతా ఇచ్చినా తూగని కృష్ణుణ్ని రుక్మిణి ఓ తులసిదళంతో తూచి— తనవాడని లోకం అంతటా చాటించుకుంది.

రవిచంద్ర కూడా తనను అలాగే చూస్తున్నాడు. ఆరాట పడుతున్న హృదయం లయతప్పింది.

రవిచంద్ర నిద్ర లేచేటప్పటికి సాహిత్య— స్నానాదులు ముగించుకుని బాల్కనీలో కూర్చుని వచ్చిపోయే జనాన్ని చూస్తుంది.

ముఖం చిన్నబోయి వుంది.

"సత్యా!"

అటుచూచి పలకరింపుగా నవ్వింది.

టిఫిన్ చేస్తూ "వచ్చిన పని అయిపోయింది. ఏం చేద్దాం" అన్నాడు.

"మన హనీమూన్ ఇక్కడే కానిద్దామా" అన్నాడు. సాహిత్య కళ్లలోకి చూస్తూ సాహిత్యను సంతోషపెట్టాలని, సాహిత్య కళ్ళ ఆనందంతో నింపాలని వుంది.

ఆ చిన్న మాటకే ముఖం వెన్నెల కిరణం తాకిన కలువలా విచ్చుకుంది.

"ఇక్కడ ఏం చూద్దాం" అన్నాడు.

"ఇంత దగ్గర్లో వున్న అమరావతి చూడలేదు."

"హెడ్‌క్వార్టర్ యిక్కడే — ఇటు అమరావతి— దారిలో మంగళగిరి — ఇటు కొండపల్లి చూసి — నాగార్జునసాగర్‌కి వెళ్లి అటునుంచి హైదరాబాద్ చేరుకుందాం" అన్నాడు.

రవిచంద్ర ఏదో రాసుకుంటుండగా—సాహిత్య — కూనిరాగం తీస్తూ — అందమైన శరీరాన్ని — మరింత అందంగ అలంకరించుకుంది — పిక్‌నిక్‌కి కావలసిన సరంజామా — దిండ్లు — దుప్పట్లు — కార్పెట్ — ఫలహారాలు — ఫ్లాస్క్‌లో కాఫీ — కేన్‌బుట్టలో రెడీ చేసింది

"రెడీ బాస్" అంది వ్రాసుకుంటున్న రవిచంద్ర వెనక నిలుచుని

మెడను కావలించుకుని చెంపకు చెంప రాస్తూ కనుకొనుకుల్లోనుంచి చూస్తుంటే "సత్యా! ఐడియా! ఈ గదిలోనే పిక్‌నిక్ చేసుకుందామా!" అన్నాడు.


"తొందరగా వెళ్లిపోదాం. లేకుంటే మీ అభిమానులు వస్తారు.."


'అవునవును' అంటూ రవిచంద్ర రెడీ అయ్యాడు.

*   *   *

వసంతం వచ్చింది. చిట్టిపొట్టి మొక్కలుకూడా చిగిర్చి మొగ్గలు తొడిగాయి. ప్రహరీగేటు అల్లుకుని విరగకాసిన రాంబాణం పూలు— వచ్చిపోయేవారిమీద పన్నీరు జల్లినట్లు విరితావులను జల్లుతున్నాయి

పసుపు — పారాణి — సింధూరాలతో కళకళలాడుతూ— పేరంటానికి వచ్చిన ముత్తయిదువల్లా— ప్రాంగణం అంతా రకరకాల పూలతోవున్న మొక్కలు బారులుతీరి వున్నాయి.





వసంతం అప్పుడే వచ్చిందా అని అనుకుంది లక్ష్మి వరండాలో కూర్చుని బుల్లిబుల్లి గౌనులు— నాప్‌కిన్స్— తయారు చేసుకుంటూంది. గోడ ప్రక్కగావున్న ప్రొద్దు తిరుగుడు పూలు అన్నీ సూర్యునిచుట్టూతిరిగి చూస్తున్నాయి. నింగిలోవున్న సూర్యునికి నేలనవున్న వీటికి ఆ బంధం ఏమిటో ?

కడుపులో పాప ఆ ప్రక్కనుంచి ఈ ప్రక్కకు ఏదో అర్జంటు పని వున్నట్లు తిరిగింది. ఒక నిమిషం ఒక దగ్గర నిలకడగా వుండదు. టపటపమని కాళ్ళు ఒకటే విధంగా ఆడించడం. కడుపులోని కదలికలు బయటకు కనిపిస్తుంటాయి.

ధీరజ్‌ని మించి పోయినట్లుంది అంటూ కడుపుపై చెయ్యిపెట్టి— ఇదిగో ఇక్కడ అంటే ఎక్కడా! అని ధీరజ్ ఒకటె అల్లరి తండ్రి కొడుకులు— చిన్నపాపాయి కోసం ఎదురు చూస్తున్నారు. ధీరజ్‌వేసే ప్రశ్నలు— జవాబు చెప్పలేక ఇబ్బంది పడుతూ — చాటుగ నవ్వుకొంటుది.

తీపిగుర్తులు గుర్తు చేసుకుంటూ తనలో తాను సంబర పడుతూండగా— గిరిజదిగింది కారులో నుంచి. ఆ సమయంలో గిరిజ రావడం యిష్టంగానే వుంది లక్ష్మికి.

''మీ అన్నయ్యగారు వూర్లోలేరు. మా అన్నయ్యకూడా లేరని తెలిసింది...''

''వుంటే మాత్రం రాకూడదా! ఇది మీఇల్లే. పరాయి ఇల్లు అనుకోవద్దు గిరిజా'' లక్ష్మి ఆప్యాయంగ మాట్లాడేటప్పటికి గిరిజ కన్నులు చెమర్చాయి.

లక్ష్మి కడుపుతో వుంటేం నిండుగా— మళ్లీ తల్లి అవుతున్నందుకు గర్వంగా వున్నట్లు— ముఖంలో కాంతి— ఆనందంతో— పదే పదే చూడాలని పిస్తుంది.

తనకా అదృష్టం లేదు. తల్లి పిల్లల అనురాగం చూసినప్పుడు—గోధూళివేళ పశువులు అరుచుకుంటూ రావడం— దూడలు— మేక పిల్లలు— గంతులువేస్తూ— అమ్మలకోసం— పరుగెత్తటం చూస్తే— తన కడుపులో దేవినట్లు వుంటుంది. సిటీకి వచ్చాక ఏవో పనుల్లోపడి కొట్టుకుపోతున్నది. మళ్లీ లక్ష్మిని చూస్తే— తన బాధ మొదటికి వచ్చినట్లైంది.

గిరిజ దీర్ఘంగా నిట్టూర్చింది. లక్ష్మి జాలిగా గిరిజవైపు చూచింది. ''పదేళ్ల తర్వాత పిల్లలు

రాగాగ్ని

పుట్టినవాళ్ళు వున్నారు. మంచి డాక్టరును సంప్రదించక పోయావా! బొంబేలో మంచి గైనకాలజిస్టు వున్నారు. కడుపులోవుంది— ఆడో, మగో కూడా చెప్పతారు. మళ్లీమళ్లీ ఆడపిల్ల వద్దు అనుకున్న నా ఫ్రెండ్ అబార్ట్ చేయించుకున్నది...''

ఇద్దరాడవాళ్ల సంభాషణ పిల్లలమీద నుంచి— భర్తలమీదకు మళ్లింది.

''రవిచంద్ర అందమైన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు కదా ! కొత్త పెళ్లాం—మోజు ఎక్కువ వుండడం సహజమే కదా! రాత్రిళ్లు అక్కడే వుంటున్నాడా? అతని ప్రేమ, సెక్స్ అలాగే వుందా? ముందు ఎక్కడికైనా వెళ్లితే ఆ వు రా వు ర ం టూ ''లక్ష్మి ఆకలీ...'' అంటూ— వచ్చేవాడు. ఇప్పుడూ అలాగే వుంటున్నాడా !

ఆ... ఎందుకుంటుంది. ఒక దగ్గిర కడుపు నిండితే – మరో దగ్గర నంజుతాడేకాని – ఆ తొందర అదీ ఎందుకుంటుంది?'' ఇలాటి ఆలోచనల్లో వున్న

సంక్రాంతి శోభ

రంగురంగుల మేలి రంగవల్లికలతో
కనులకింపని గృహాంగణము లేదు—
నవధాన్యముల తావి చవులతో పులకించి
గణుతికెక్కని యట్టి గాదె లేదు—

క్రొత్త యల్లుండ్రను కొమరితల్ నట్టింట
కొలువు సేయని రైతు కొంపలేదు—
క్రొత్త గింజలు మెక్కి క్రొవ్వెక్కి యిల్లెక్కి
పొంచి కూయని కోడిపుంజు లేదు—

జోలె నిండని భిక్షువు కూలినాలి
చేతికందని శ్రామిక జీవిలేదు—
ఎల్ల జనములకును కన్నతల్లి యోచు
వచ్చె సంక్రాంతి ప్రతి యింటి వరకు నేడు

— శవగన వరసింహస్వామి

గిరిజకు వీళ్ల జీవితం ఎలా నడుస్తూందా? అని కుతూహలంగ వుంది.

ఉన్నవాళ్ల పిల్లలకి ఆకలి తక్కువ. ఇంట్లో వున్నాయి కదా! ఎప్పుడు వెళ్లినా తినవచ్చు అని అనుకుంటారు – లేనివాళ్లకి ఆకలి ఎక్కువ. ఏది వుండదో అదే కావాలనిపించడం మానవ నైజం

ఇప్పుడు లక్ష్మికి భర్త కావాలనిపిస్తే ? కోరిక కలిగితే – వుద్రేకం చల్లబరచుకుని వచ్చిన అతడు – కాళ్ళు ముడుచుకుని పడుకుంటాడు – అభిమానం గల ఏ స్త్రీ కక్కుర్తి పడదు కదా! అలా లక్ష్మికి ఎప్పుడైనా కోరిక కలిగిందా ? అబ్బా ఎన్ని ప్రశ్నలో సూదుల్లా గుచ్చుతుంటే – గిరిజ –

''వదినగారూ! అన్నయ్య మునుపటిలాగా మీ చుట్టూ తిరుగుతున్నారా... దాని మాట మీమధ్య వస్తుందా! మీ సెక్స్‌లైఫ్ ఎలావుంది'' అని అడి అడిగింది తెల్లని చేతుల్లోని బుల్లిచొక్కాను చూస్తూ...

లక్ష్మి ముఖం క్షణంలో వివర్ణమై పోయింది. గిరిజమీద కోపంకూడా వచ్చింది. ''భార్యా భర్తల మధ్య జరిగే విషయాలు మూడోవ్యక్తి దగ్గర చెప్పలేనంత సున్నితంగా వుంటాయి. భార్యా భర్తల సంబంధం— అనురాగం— సెక్స్— మాటల్లో చెప్పలేనిది— అదివారి వక్తిగతమైంది— పవిత్రమైనది. గనుకనే సెక్స్‌కు దైవత్వాన్ని ఆపాదించి లింగపూజ చేస్తున్నారు. పానవట్టమే స్త్రీ భాగము. పొద్దుట లేస్తూనే కళ్లకద్దుకునే మంగళ సూత్రాలు ఆ చిహ్నాలే.

సెక్స్ శరీరానికి సంభంధించినదికాదు. పూర్తిగా మానసికమైనదే. ఎంతసేపు సెక్స్ జరిగితే అంత ప్రేమవున్నట్టుకాదు కదా! తృప్తి - ఆనందం మానసికమైనదే. భర్త ప్రక్కన పడుకుంటేనే తృప్తి కలుగుతుంది కదా!''

ఇంకా గిరిజకు విడమర్చి చెప్పాలని వుందికాని— హృదయంలో ఆరాటంగా వుంది అలసటగ వుంది.

''అలా చెప్పకుని మనస్సును సరిపెట్టుకోక ఏం చేస్తుంది ఆడకూతురు— మొగుడు మరొకదానితో కులుకుతున్నాడు. పెళ్లాం ఇంటికి కాపలా కాస్తూ పిల్లలకి, అతనికి సేవచేస్తూ మిగిలిన జీవితం గడిపేస్తుంది. లక్ష్మిని చూస్తుంటే గుండె పిండేసినట్టుంది. పైకి అలా చెప్పిందేకాని, మగడు మరో దానితో కాపురం చేస్తున్నాడు— మరో ఆడదానితో సెక్స్ జరిపించి వస్తుంటే ఏ భార్యకు గుండె

కొత్త గొంతులు

టి.యల్. కాంతారావు

"నాది శ్రమైక జీవన సౌందర్యగీతం
మతానికి దోపిడీ పథానికి నేను పల్లవిని కాను
బొట్టు బొట్టుగా నా నెత్తుటిని
ఈ నేల విముక్తి కోసం విత్తనంగా చల్లుతాను
బందీనైనా బానిసను కాను
నన్ను కదిపినా ఖండించినా
మళ్ళీ మళ్ళీ అలలా పుట్టుకొస్తూనే ఉంటాను"
— చెరబండరాజు.


దిగంబర కవులు ఆరుగురిలో చెరబండరాజు కవిగానూ, వ్యక్తిగానూ ఒక ప్రత్యేక మార్గంలో ప్రయాణం చేసినవాడు. దిగంబర, విప్లవ కవితోద్యమాల్లో ఉద్యమాలే తానై జీవించిన చెరబండరాజు వచన గేయ కవిగా, జనం పాటల కర్తగా ఒక విశిష్ట స్థానాన్ని పొంది ఉన్నాడు. "దిగంబర శకంలో నుంచి విప్లవ కవితాయుగంలోకి ప్రవేశించిన వాళ్ళలో కొద్ది కాలంలోనే ఇంత ఎత్తుకు ఎదిగిన కవి లేడని ధైర్యంగా చెప్పగలను" అని చేకూరి రామారావుగారు నాలుగు సంవత్సరాల క్రితమే చెప్పారు.

ఒక కొత్త భావోద్యమం ప్రచురితమవుతున్న కాలంలో రెండు రకాల కవులు కనిపిస్తారు. ఒకరు తమ అస్తిత్వంతో సమాజానికి ఊపిరి పోస్తారు. మరొకరు ఉద్యమ ఊపిరితో తమ అస్తిత్వానికి మెరుగులు దిద్దుకుంటారు. చెరబండరాజు మొదటి రకం కవి. వ్యక్తి వాదంతో ఆరంభమైన దిగంబర కవితోద్యమం సమిష్టి వాదంతో సమసి పోవటం తెలుగు కవిత్వ పరిణామ క్రమాన్ని శ్రద్ధగా అధ్యయనం చేసిన వారందరికి తెలుసు. దిగంబర కవుల మూడు సంకలనాలూ సంపూర్ణంగా వచన కవితాఖండికలే. ఉన్న వ్యవస్థ మీద అసంతృప్తితో పాటు ఈ వ్యవస్థను దానికి అలంబనమైన గత సంస్కృతిని మొత్తంగా ధ్వసం చెయ్యాలని అప్పటి పరమాశయం. 'నన్నెక్కనివ్వండి బోను' అనే శీర్షిక గల కవితా ఖండికతో దిగంబర కవితా సంకలనం మొదటి భాగంలో పరిచయమవుతాడు చెరబండరాజు. ఈ శీర్షికకూ అనంతరకాలంలో అతని జీవితానికి విడదీయరాని సంబంధం కాకతాళీయం కాదని అతని జీవితమే ఋజువు చేసింది.

మనిషి మీద, అతని మంచితనం మీద, ప్రస్తుత వ్యవస్థలో రగులు కుంటున్న తపన మీద విశ్వాసం, మతం మీద, మతాధికారుల మీద, దోషికి, నిర్దోషికి ఒకే సూత్రాన్ని ప్రయోగించే చట్టాలమీద ఏవగింపు నన్నెక్కనివ్వండి బోనులో కనబడతాయి. ఈ వ్యవస్థ లోపభూయిష్టమైనదని, ఈ రాజకీయాలు, స్త్రీల వర్ణనలకే పరిమితమైన కవిత్వం, మనిషిని మనిషే వంచన చేసుకొనే విధానం, ఆశ్రయింపులు, కులాలు, అధికారదాహం, ఉన్మత్త క్రీడలు మొదలైన లక్షణాలతో కంపుకొడుతున్న ఈ వ్యవస్థ మొత్తం సమూలంగా దగ్ధం కావాలనేది ఆయన ఆశయం.

"ఈ మహా పాపంలో
మన మంతా భాగస్థులం
రాగల యుగాల కొరకు
అణువణువును చిదిమి చిదిమి
చైతన్యాగ్ని జ్వాలాముఖులమై
చితి పేర్చుకుందాం రండి"

అని తోటివారిని ఆహ్వానిస్తూ సాహిత్య, సామాజిక రణరంగంలోకి ప్రవేశించిన వాడు చెరబండరాజు. దిగంబర కవిత మూడవ సంకలనంలో కవిగా చెరబండరాజుకి ఈ సమాజం పట్ల గల అవగాహన మరో మెట్టు పైకి పెరిగింది. ఈ సమాజం కుష్టు పోవడానికి, భ్రష్టు పట్టడానికి అనేకమైన అవాంఛనీయమైన అసమాన సాంఘిక సంప్రదాయాలకూ ఆర్థికం మూల బీజమనేది



ఏనాడూ, ఏ ఒక్కడూ విస్మరించరాని విషయం. భారతదేశ ఆర్థిక వ్యవస్థ, దానితో పెనవేసుకున్న దారిద్ర్యం, అజ్ఞానం, లంచగొండి తనం, రాజకీయ దురహంకారం, నిర్లజ్జ ఈ లక్షణాలన్నిటిపై 'వందే మాతరం' గేయం పెద్ద సెటైర్.

అభ్యుదయ కవులు ఆదిలో ఆశించిన ఫలితాలు సమాజంలో వాస్తవరూపం దాల్చకపోగా పరిస్థితులు ఆనాటి కంటె మరింత భయంకరంగా రూపు దాల్చాయి. సంస్కరణ, సామరస్య వాదాలకు బూజు పట్టింది. మార్క్స్, లెనిన్, మావో ఆలోచనా విధానం, నక్సల్‌బరీ పోరాటం తెలుగు కవులకు కొత్త మార్గాన్ని నిర్దేశించటంలో విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. దిగంబర కవిగా పుట్టిన చెరబండరాజు విప్లవ కవిగా రూపాంతరం చెందాడు. మాత్రా ఛందస్సులు, వచన కవిత అభ్యుదయ కవితకు వాహికనైతే విప్లవ కవిత్వానికి ఎక్కువగా జనం పాట ఆదరణీయమైంది. చెరబండరాజు లక్ష్యార్థానికి పాటను చేపట్టాడు.

ఎవరికోసం కవిత్వం రాస్తున్నాడో వాళ్ళతో అతనికి ఉన్న సన్నిహిత సంబంధం అతని కవిత్వంలో జీవనాడిగా స్పందించింది. అతను సాగించిన కవితోద్యమానికీ, అతని జీవితానికి ఉన్న అభేదమే విప్లవ సాహిత్య చరిత్రలో అతన్ని మేరు శిఖరంగా, సజీవ మూర్తిగా నిలపగలిగింది. అతని త్యాగశక్తి, అకుంఠిత కార్యదీక్ష, సహజ కవితాధోరణి అతన్నీ,అతని రచనలనూ శాశ్వతం చేశాయి. చెరబండరాజుది వజ్ర సంకల్పం. మార్పుకోసం ఓర్పు, నేర్పు కాదు చివరకు ప్రాణాలను సైతం అర్పించిన త్యాగం చెరబండరాజుది. ప్రపంచ పురోగతి శ్రమజీవి నెత్తుటి బొట్టులోనే ఉందని గాఢంగా నమ్మినకవి. ఈ నేలను, ఈ గాలినీ, అనుక్షణం పీడింపబడుతున్న మనిషినీ నిరంతరం ప్రేమించి, ప్రేమించటం నేర్పినవాడు చెరబండరాజు. ఆలోచన అక్షరం, ఆచరణ కలసి ఏక రూపం దాల్చిన సహజ కవి.

"ఈ మట్టి నాకు
పట్టెడన్నం పెట్టి పాలు తాపింది
రాక్షస భూస్వామ్య రంపపు కోతల్నుండి
తనను విముక్తి చేసి
రుణం తీర్చుకుంటాను"

అని తానే జీవితం నుంచి విముక్తి పొందిన కవి చెరబండరాజు. ★

మండకుండ, వళ్ళు దహించక వుంటుంది? ఇంత అన్యాయం చేసినా, పరుషంగ ఒక్క మాటైనా అనలేని సాధ్వి— అంతగ ప్రేమిస్తున్న భార్యను ఎలా మరచగలిగాడు— మరో అందగాడు— గొప్పవాడు వచ్చి లక్ష్మిని ప్రేమిస్తే, లక్ష్మిని వీళ్ళని వదిలేసి వెళ్తుందా ! అలాటి నికరమైన ప్రేమ— మగవాడికి వుండదా ! చివరికి ఈ ప్రేమ మూర్తికి దొరికిన బహుమతి యిదా !

తనకైతే అందం లేదు. గయ్యాళిది— పిల్లలు లేరు— తన శ్రీకృష్ణ పరమాత్మ అలా చేస్తున్నాడు అని సరిపెట్టుకుంది. ఆడదానికే ఈ బంగారులక్ష్మిని కళ్ళకద్దుకోవాలనిపిస్తుందే!..."

వీరు మాటల్లో వుండగా సుపుత్రుడు ధీరజ్ వచ్చాడు. విజయవాడ కోడ్ నంబరు తిప్పి — రవిచంద్ర దిగిన హోటల్‌కి ఫోన్ చేసి "రవిచంద్ర గారు వున్నారా ! రూంకి కనెక్షన్ ఇవ్వండి" అని అడగడం విన్న లక్ష్మి — కొడుకు తెలివితేటలకు మురిసిపోయింది.

"ఆ నంబర్లు తిప్పటం ఇంతవరకు నాకూ రాదు వదినగారు !" అంటూ బుగ్గలు నొక్కుకుంది.

"లేరా ! అమరావతికి వెళ్ళారా ! ఎవ్వరూ... మిసెస్ రవిచంద్ర-మా అమ్మ ఇక్కడే వుంది" లక్ష్మి లేచి, గబగబా వెళ్ళి — ఫోన్ డిస్‌కనెక్ట్ చేసింది — కోపంగా చూచింది ధీరజ్ వైపు. అది గమనించిన చిన్నవాడు —

"అమ్మా—పెళ్ళయినవాళ్ళని మిసెస్ అంటారు కదా ! డాడీ మిసెస్‌తో అమరావతి వెళ్ళారంటుందేమిటి —"

"మిస్ అంటె మిసెస్ అని వినిపించి వుంటుంది. ఎవ్వరో పత్రికవాళ్ళతో వెళ్ళి వుంటారు..." చూపులు ప్రక్కకు తిప్పుకుని చెప్పింది లక్ష్మి.

"డాడీకి గర్ల్‌ఫ్రెండ్స్ ఎక్కువ - నీవెందుకు వూరుకుంటావు - నా కిష్టంలేదు" తల ఎగురవేసి చెప్తుంటే - గిరిజ పెద్దగా నవ్వింది.

(ఇంకా వుంది)

వ్యక్తిగతం



శ్రీమతి మేనకాగాంధీ కూడా ఆంధ్రలో కూడా తప్పటంలేదు శ్రీమతి ఇందిరాగాంధీకి! సంజయ్ విచార్ మంచ్ వారు తెలుగుదేశంతో పొత్తు కుదుర్చుకుని అయిదు స్థానాలలో కాంగ్రెసు (ఇందిర) కి పోటీ తీసుకు వస్తున్నారు...



ఎమ్. జి. ఆర్., శివాజీ, అమితాబ్, ఎన్. టి. ఆర్.లు తెరమీదనే కాకుండా బయట కూడా ప్రేక్షకులకి దర్శనం ఇస్తున్నారు. కాంగ్రెసు(ఇందిర) అభిమాని శ్రీ శివాజీగణేశన్ ఆ పార్టీ తరఫున నెల్లూరులో ప్రచారానికి పూనుకున్నారు.



ముందు నంబూద్రిపాద్, తర్వాత క్రుశ్చేవ్, ఇప్పుడు కాస్ట్రో – ప్రముఖ భారతీయ పారిశ్రామికవేత్త శ్రీ ఘనశ్యాందాస్ బిర్లాకి క్యూబా నాయకుడు శ్రీ ఫిడెల్ కాస్ట్రో తమ దేశం రావలిసిందని ఆహ్వానం పంపారు.

వారఫలం

21-1-1983 శుక్రవారం మొదలు
27-1-1983 గురు వారం వరకు

♈ మేషం: ఎటువంటి పరిస్థితులలో కూడా మీకు యిబ్బంది జరుగదు. ఉపకార గుణం గల మీకు ఏ విధంగా యిబ్బంది రాదు. నూతనంగా ఏదైన వ్యాపారం ప్రారంభింప దలిస్తే యిది సుగమ మైన వారం. స్త్రీలకు: కొందరు స్థిర చరాస్తులు పెంపు చేసికోవటం సభవం.

♉ వృషభం: దాయాదుల వలన యిబ్బంది కరము లయిన పరిస్థితులు ఏర్పడ మన్నవి గ్రహించి, ఓర్మితో సంచరించాలి. దూర ప్రాంతాలకు చాలమంది ప్రయాణించే అవకాశాలున్నాయి. స్త్రీలకు: ఇంతకు ముందు చేసి వదలిన ప్రయత్నాలు, ఫలవంత మయ్యే అవకాశం గలవారం. లలిత కళా ప్రావీణ్యం రాణించే అవకాశం గలవారం.

♊ మిధునం: విలువగల వస్తు వాహనాలు కొనుగోలు చేయ గలరు. కొందరకు రాజకీయంగా అనుకూలత సంభవం. కొందరకు ఉత్తర ప్రత్యుత్తరముల మూలంగా కొన్ని విషయాలు అమూల్యము లయినవి అందుకో గలరు. స్త్రీలకు: సుఖ శాంతులు, శుభ కార్య వ్యవహారములలో చొరవ ఏర్పడు తుంది.

♋ కర్కాటకం: ఒకానొక విషయం చాల కాలంగా ఎటూ తేలక నిలచినది, ఈవారం మీకు సర్వ విధాలా అనుకూలత చేకూర్ప గలదు. నూతన వ్యాపారంలో చొరవ ఏర్పడ నున్నది. కోర్టు వ్యవహారాలు ఏవైనా ఉంటే సులువుగా నెరవేర గలవు, అంటె మీకే అనుకూలం. స్త్రీలకు: ప్రత్యేకంగా, కళా రంగంలో మేలు జరుగుతుంది.

♌ సింహం: ప్రత్యే కంగా చెప్పదగిన విషయం. కొందర విషయంలో, కళా రంగంలో గాని, 'ఆకాశవాణి' లాంటి సంస్థలలో అవకాశాలు రాగలవు. కొందరు, రాజకీయంగా శ్రమించి వదలిన వ్యవహారం అనుకూలం కానున్నది. స్త్రీలకు: స్థిరాస్థి పెంపకానికో ఉద్యోగాభి వృద్ధికో, అనుకూలించే వారం.

♍ కన్య: మీకు రావలసిన బాకీలు గాని వ్యాపార రీత్యా అంద వలసిన పైకం గాని సమయానికి అంద మన్నవి. గృహారంభ కార్య కలాపా లందు చాల మంది నిమగ్నులు కానున్నారు. గృహ ప్రవేశాదులకు కొందరు యత్నిస్తారు. స్త్రీలకు: ఆశించిన విధంగా ధన సహాయం అందుతుంది. అకాల భోజనమో, విందు వినోదాలలో కొందరు పాల్గొనటమో జరుగుతుంది. ఉద్యోగంలో సామాన్య ఫలమే ఈవార ఫలం.

♎ తుల: ఇతరులకు సాయం గావించే విషయంలో ఎంతో జాగ్రత్త వహించాలి. ఇతరుల విషయంలో 'హామీ' ఉండటం ఏ విధంగా ఉచితం గాదు. మీ సాయం పొందువారు కూడా మిమ్ముల విమర్శింప మన్నారు. రాజకీయంగా స్వల్పంగా యిబ్బందులకు గురి కాగలరు, జాగ్రత్త. స్త్రీలకు: ధన సంపత్తి ఉద్యోగాభి వృద్ధి, సంతాన మూలకంగా ఆనంద లబ్ధి గలవారం.

♏ వృశ్చికం: అకాల భోజనం వృధా త్రిప్పటు, చేసిన పనిలో మేలు కనిపించక పోవటం, ఉద్యోగంలో యిబ్బందులు తటస్థించటం, దురాశా పరులు వెంట బడుట అనుభవానికి రాగల అంశాలు. స్త్రీలకు: లేనిపోని వ్యవహారాలలో జోక్యం కలుగ జేసికొనుట, చిక్కిన కళా రంగావ కాశాలు జారిపోవుట సంభవం.


♐ ధనుస్సు: శరీర సౌఖ్యం, అన్ని రీతుల ఆనందం, తృప్తి, మానశికంగా సంతృప్తి పొంద మన్నారు. ఉపకార గుణం గలవారు, బలవంతంగా నైనా, మిమ్ముల ఒప్పించి మేలు చేయ నున్నారు. 'కాలం కలిసి వచ్చింది' అనే తృప్తి కలుగుతుంది. స్త్రీలకు: ఉపయోగ కరము లైన పనులందు, ఉద్యోగ వృత్తు లందు శ్రద్ధ అధిక మవుతుంది.


♑ మకరం: వ్యాపార రంగంలో ఉన్నవారం, అనుకూల ప్రదమైన వారంగానే అనుభవనీయం. ఉద్రేకానికి లోనుగావలసిన పరిస్థితు లుంటాయి జాగ్రత్త! ఉద్యోగ వృత్తులందు క్రమాను కూలత ఈవారం సాధింప మన్నారు. స్త్రీలకు: శుభ కార్యా లోచనలు నిర్విఘ్నంగా కొనసాగ గలవు. ఆదాయం కూడా ఉన్నది.

♒ కుంభం: రావలసిన ధనం సమయానికి చేతికి అంది అవసరాలు తీర మన్నవి. కొందరకు దూర ప్రయాణ సూచన గలదు. కళా రంగంలో గాని, పత్రికా ప్రకటనలో గాని, రచనా వ్యాసంగంలో గాని మీ కృషి రాణింపు నకు రాగలదు. స్త్రీలకు: దైవకార్యాచరణం, కించిత్తు ఆదాయం సంభవం.

♓ మీనం: ఇటీవల కొన్ని వారాలుగా యత్నించినా సఫలం కానివి, కలిసి రానివి, ఈవారం సుఖ దాయకంగా అంది రాగలవు. రాజకీయంగా మేలు సంభవించే సన్నివేశాలు కొందర విషయంలో అనుభవానికి రాగలవు. స్త్రీలకు: బంధు సమాగమం, దూర ప్రాంతాలకు ప్రయాణం చెయ వలసి రావటం గమనించ గలరు.

-- విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి ★


మీ స్నానమునందు ఒక క్రొత్తదనము నిచ్చు
సబ్బు - ప్రేమ్
క్రొత్త
సుకుమారమైన మీ చర్మ సౌందర్యమునకు ప్రేమ్.
దీని పరిమళము స్వచ్ఛమైన నురగ మీ శరీరమును
ఆహ్లాదింపజేయును
మీ శరీరమునకు మృదుత్వమునిచ్చు సబ్బు-ప్రేమ్.
Imageads-M-1564
NEW
Prem
REFRESHING SOAP
PREM
జయలక్ష్మి
గుంటూరు వారి తయారీ
ప్రేమ్ - తాజాతనము నందించు సబ్బు.



ది లాస్ట్ డేట్

— టి.యస్.ఎ. కృష్ణమూర్తి

''సెంటిమెంటల్ ఫూల్'' అని తిట్టేవాడు శరత్; చైతన్య అయితే ''నీవో చాంధసపు వెధవ్విరా !''అని విసుక్కునేవాడు ''నాకు ఎడమకన్ను అదురుతోందిరా'' అని నేను అన్నప్పుడల్లా. మూఢా చారాల పట్లా, పాతనమ్మకాల పట్లా నాకూ అట్టే నమ్మకం లేదు కానీ అదేమిటో వామనేత్రం అదిరి నప్పుడెల్లా నాకేదో నష్టమో, కష్టమో కలగడం పరిపాటి అయిపోయింది నా జీవితంలో

మూడునాలుగు రోజులుగా ఎడమకన్ను తరచుగా అదురుతూనే వుంది ఏం మూడుతుందో ఏమో అని అనుకుంటూ సైకిలు చాల నెమ్మదిగా త్రొక్కుతూ, నడిచేప్పుడుకూడా చాల నెమ్మదిగా నడుస్తూ ఆఫీసులో పైవాళ్లవద్ద చీవాట్లు తినకుండా ఉండడానికి, తద్వారా హర్టు అవకుండా వుండడానికి వెయ్యి జాగ్రత్తలు తీసుకుంటూ, ఎడం చేయిని ఎక్కువ కదిలించకుండా, ఆ చేతికి ఎక్కువ శ్రమ ఇవ్వకుండా చూసుకుంటూ గడిపాను. (నిర్లక్ష్యంగా చేయి ఝాడించినా, బలంగా వేగంగా చేతిని కదిలించినా ఒక్కోపర్యాయం నా ఎడంచేతి భుజంలోని బంతిగిన్నెకీలు డిస్‌లొకేట్ అయి కొన్ని నిముషాల పాటు నన్ను నరకయాతనకు గురిచేసి తిరిగీ యథాస్థానానికి చేరుకుంటుంది. దాని తాలూకు నొప్పి నన్ను రెండుమూడు రోజులు వదలదు ఆపై.)

అయితే నేను భయపడిన ప్రమాదాలు ఏమీ జరగలేదు. కానీ నా గుండెలదిరిపోయేలా ఒక ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం వచ్చి పడింది. 'చైతన్య సీరియస్‌లీ ఇంజూర్‌డ్ ఇన్ ఎన్ ఆక్సిడెంట్. స్టార్ట్ — శరత్' అని వుంది అందులో.

మదనపల్లె నుండీ పలమనేరు రావడాన్కి లైట్నింగ్ సర్వీసు బస్‌లో అయితే ఒకటింపావు గంటా, ప్యాసింజరు బస్‌లో అయితే ఒకటీముప్పావు గంటా పడుతుంది. ఇంత తక్కువదూరం తను స్వయంగా రాకుండా ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం ఇచ్చాడంటే ఏదో పెద్ద ప్రమాదమే జరిగి వుండాలి చైతన్యకు

సూట్‌కేసులోంచీ ఒకజత బట్టలు తీసుకుని హ్యాండుబ్యాగులో ఉంచుకుని, ఉన్న డబ్బు అంతా తీసుకుని జేబులో పెట్టుకుని గదికి తాళంవేసి నేరుగా నేను పని చేసే కంపెనీ ఆఫీసుకు వెళ్లాను మేనేజరుకు టెలిగ్రాం చూపించి రెండు రోజులు పర్మిషన్ తీసుకుని గబగబా బస్టాండు కేసి నడిచాను.

*　　　*　　　*

'లైఫ్ ఈజ్ ఎ టేల్ టోల్డు బై ఎన్ ఇడియట్' అనుకుంటూ కల్లుపల్లికీ, పంజానికీ

కూర్చున్నాను

నదరు నంబరు రాతికి వెనుకగా నేనెక్కిన ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ తాలూకు బస్ పంచరు అయి ఆగిపోయింది. ప్రగతిపథంవైపు పురోగమిస్తున్న ఆ బస్సులో స్టెప్నీ అనబడే స్పేరు టయరు లేదు. (విడి చక్రం బండిలో ఉండి వుండినా దానిని మార్చడానికి కావాల్సిన జాకీ, జాకీరాడ్, వీల్ నట్ స్పానర్ మొదలగునవి బండిలో ఉండవన్నది వేరే విషయం.) ఎక్కడ పంచరు అయితే అక్కడే వాహనము ఆపివేయాలన్న సంస్థ నియమం మేరకు బస్సును ఆపివేసి డ్రయివరు పలమనేరు వెళ్తున్న ఓ బస్ ఎక్కేశాడు—పలమనేరు డిపోనుండీ టయరూ దాన్ని మార్చడాన్కి పరికరాలూ, వాటితోపాటు ఓ మనిషినీ తీసుకురావడాన్కి.

గోడకు కొట్టిన సున్నమైనా తిరిగి వచ్చునేమో కానీ సంస్థ టిక్కెట్ కొట్టడాన్కి కట్టిన డబ్బు సామాన్యంగా ప్రయాణీకులకు తిరిగిరాదు. .కనుక.. కండక్టరు రావాల్సిన సంస్థ బస్ కోసం ఎదురు చూస్తున్నాడు తన బస్‌లోని ప్రజలను అందులో కూరడాన్కి.

ఐదు నిముషాల తరువాత మదనపల్లె వెళ్లే ఒక ప్రయివేటు బస్సు వేగంగా వచ్చింది. కొండంత ఆశతో గబగబా లేచి నిలబడి ఆపాను దాన్ని. నేను

అనుకున్నాడేమో ఆ బస్సు డ్రయివరు... లైనులో ముందు స్టేజిలలో వున్న ప్రయాణికులను తన బస్ లోకి దోచుకోవడాన్కి దూసుకుపోయాడు ఆక్సిలేటర్ మీది కాలు తీయకుండా అదే మోపున బస్ ఆపకుండా.

"ఒరేయి చైతన్యా నీకు ఏం జరిగిందిరా ? ఎలా ఉన్నావురా?" అనుకుంటూ వుంటే కళ్లలో నీళ్లు తిరిగాయి. ఉసూరుమంటూ మైలురాతిమీద (చిన్న సవరణ... కిలోమీటరు రాతిమీద) కూర్చున్నాను మళ్లీ—

సదా నవ్వుతూ ఉండే చైతన్య రూపం కళ్ల ముందు మెదిలింది.

* * *

చైతన్య, శరత్, నేనూ ముగ్గురూ కూడా మదనపల్లెలో పుట్టి, అక్కడే పెరిగి, అక్కడే చదువుకున్న వాళ్లమైనా కాలేజి చదువు చివరి రోజుల వరకూ మా మధ్య ముఖపరిచయం తప్ప స్నేహం లేదు.

ఈ ప్రపంచంలో 'స్నేహం' అనేది చాలా విచిత్రమైనది. ఎప్పుడు. ఎలా, ఎక్కడ, ఎవరిమధ్య ఉద్భవిస్తుందో, ఎలా పెరుగుతుందో, ఎలా ముగుస్తుందో, ఎలా నడుస్తుందో ఎవరూ ఊహించలేరు.

పరీక్షల రోజులలో చాలామంది విద్యార్థులకు తమ గదులనుండీ, తమ ఇండ్లనుండీ అర్ధరాత్రప్పుడు అలా చల్లగాలికి నడచివచ్చి చిత్తూరు బస్టాండులోని హోటల్‌లో టీ త్రాగి వెళ్లటం అలవాటు. ఆ అలవాటు మా ముగ్గురకూ ఉండడంవల్ల ఫైనల్ ఇయర్ పరీక్షలు జరుగుతున్నప్పుడు రాత్రి పండ్రెండు ఒంటిగంటల మధ్య ప్రతిరోజూ యాదృచ్ఛికంగా హోటల్‌లో కలిసేవాళ్లం. అప్పుడు ప్రారంభమైంది మా మధ్య స్నేహం. అదీ విచిత్రమే... ఎందుకంటే చైతన్య కామర్సు స్టూడెంటు, శరత్ హార్టికల్చర్ స్టూడెంటు, నేను లిటరేచర్ స్టూడెంటుని. అయినా మేము మా ఆలోచనలని ఒకరికొకరు మార్చుకునే వాళ్లము. ఒకటి రెండు టీలు త్రాగడంలో, కబుర్లలో అరగంట, ముప్పావుగంట గడిచాక తేరుకుని గబగబా ఎవరింటికి వాళ్ళు సాగిపోయేవాళ్ళం.

పరీక్షలు అయిపోయాయి. ముగ్గురం బాగానే వ్రాశాము తరువాత తరచుగా కొత్తపేటలో లైబ్రరీ వద్ద కలిసే వాళ్ళం బి. టి. కాలేజీ గ్రవుండ్సుల్లో హాకీ ఆడేవాళ్ళం మా కాలేజి మిత్రులతో కలసి.

స్నేహం బాగా గట్టిపడింది మా మధ్య. ముగ్గురకూ ప్రకృతి సౌందర్యం అంటే ఇష్టమే! సాయంకాలం అయేసరికి సైకిళ్ళమీద తిరుపతి రోడ్డులో యర్రగండం మిట్టమీదికో, కదిరి రోడ్డులో అమ్మ చెరువు మిట్టమీదికో వెళ్ళి కూర్చుని ఇటూ అటూ కన్పించే అద్భుతమైన ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ తన్మయంగా గడిపేవాళ్ళం. ప్రతి ఆదివారమూ సైకిళ్ళమీద ఏదో ఒక ప్రదేశానికి వెళ్ళి సరదాగా గడిపి వచ్చేవాళ్ళం. కోళ్ళ బయలు వద్దనున్న వాటర్ ఫాల్సు, అవ్వకోట, వేంపల్లి మల్లయ్యకొండమీదనున్న శివాలయం, చౌడసముద్రం వద్దనున్న పురాతన సోంపాల్యెం దేవాళయం, పుంగనూరులోని నగరూ, ప్రసిద్ధ ఆలయాలూ, చౌడేపల్లి వద్దనున్న పంచలింగేశ్వరాలయం (ఈ లింగాలను స్వయంగా పంచపాండవులు ప్రతిష్ఠించారని ప్రతీతి), హార్సలీహిల్సు, గుర్రంకొండ.. ఇలా ఎన్నో ప్రదేశాలు సైకిళ్ళమీదే తిరిగేశాము.

అప్పుడప్పుడు బసినికొండ ఎక్కేసి గుడిదగ్గరున్న పెద్ద గుండు మీద కూర్చుని వింతసోయాగాలతో కన్పించే మా ఊరినీ, దాన్ని చుట్టుముట్టివున్న ప్రకృతి మాత దివ్యమంగళ సుందర రూపాన్ని చూస్తూ మైమరచి పోయేవాళ్ళం.

శరత్ వాళ్ళ మేనమామ వెంకటేశ్వర్లుగారి వద్ద ఒక పాత ట్రంపు మోటారు సైకిలు వుండేది ఆ రోజులలో. ఆయన ఊర్లో లేని సమయాలలో దాన్ని తీసుకుని వచ్చేసేవాడు శరత్. దానిమీద ముగ్గురం ఏదో ఒక క్రొత్త ప్రదేశానికి వెళ్ళి అలా, అలా తిరిగి వచ్చేవాళ్ళం సరదాగా. దాన్ని నడిపించడంలో అట్టే ప్రావీణ్యం శరత్‌కు లేకపోవడం వల్ల అప్పుడప్పుడు దాని మీదనుండి క్రిందపడి చిన్న చిన్న దెబ్బలు తగిలించుకునే వాళ్ళం. అది దార్లో ఎక్కడైనా చెడిపోయినా, పెట్రోలు అయిపోయి నిలచిపోయినా దాన్ని నెట్టుకుంటూ వచ్చేసే వాళ్ళం ఎన్ని మైళ్ళయినా, ఎంత రాత్రయినా... దార్లో చేన్లలోన వేరుశనక్కాయలూ, తడిపొలాలలోని చెరుకులూ తస్కరించి తింటూ.

చాల సరదాగా, హుషారుగా, వేగంగా గడచిపోయిన ఆ రోజులను తలచుకుంటే ఇప్పుడు అదంతా ఏదో ఒక కలలాగా అన్పిస్తుంది.

రిజల్సు వచ్చాయి. శరత్, చైతన్యలు ఇద్దరూ సెకండ్‌క్లాస్ తెచ్చుకున్నారు. నేను ఆర్డనరీగా ఒడ్డున పడ్డాను. మా ఊర్లోని బెసెంట్ దివ్యజ్ఞాన కళాశాలలో పి.జి. కోర్సులు లేవు. బయట ఊర్లకు వెళ్లి చదవగల ఆర్థిక స్థోమత, అనుకూల పరిస్థితులూ మా ముగ్గురికీ లేవు. ఉద్యోగాలు వస్తే ప్రయివేటుగా ఎందుకు చదువు సాగించకూడదు ? అనుకుంటూ వెయ్యి ఆశలతో లక్ష ఆశలతో ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టాము ఆశాజనకంగా కన్పించే అడ్వర్టైజ్‌మెంట్లు ఒకరికొకరు ఎక్స్ఛేంజి చేసుకునే వాళ్లం.

ఎన్నో ప్రయత్నాలు, ఎన్నో ఇంటర్వ్యూలు, ఎన్నో రిటన్ టెస్టులు...ఎన్నో. . ఎన్నో...గడచిపోయాయి.

నేను ఆశావాదిని. నేను ఎప్పుడో చదివిన ఒక కొటేషన్ "జీవితంలో సర్వస్వం కోలుపోయినా ఒక్కటి మాత్రం మిగిలే వుంటుంది... అదే భవిష్యత్తు!" నాకు ఎప్పుడూ మనసులో మెదులుతూనే ఉండేది. అందుకే ఎన్ని బాధలు, ఎన్ని మానసిక ఆవేదనలు వున్నా కలలలో, ఊహాలలో తేలిపోవడాన్కి ప్రయత్నిస్తూ కాలం గడపడం అలవాటు చేసుకున్నాను.


శరత్ నిరాశావాది. ఏ కాస్త బాధకీ తట్టుకోలేక తల్లడిల్లిపోయే రకం. అందుకే గాలి ఎటు వీస్తే అటు, ప్రవాహం ఎటుతోస్తే అటు కొట్టుకుపోవడం అలవాటు చేసుకునేశాడు

చైతన్య ఆప్టిమిస్టూ కాదు, పెసిమిస్టూ కాదు .మధ్యరకం. అయితే మా ఇద్దరికన్నా తను చాల తెలివైనవాడు. ప్రతి విషయంలోనూ మేము ఇద్దరం అతని సలహామీద ఆధార పడేవాళ్లం.

రోజులూ, వారాలూ, నెలలూ, సంవత్సరాలూ గడచిపోయాయి. గంటల తరబడి హాకీ ఆడి ఆ అలసటలో సర్వం మరచిపోగలగడం, మా ఊర్లో చూసిన సినిమాలనే సైకిళ్లమీద వెళ్లి పుంగనూరు, వాయల్పాడు లాంటి దగ్గర ఊళ్లలో మళ్లీ చూసి రాగల ఉత్సాహం, సైకిళ్లమీద యదేచ్ఛగా మైళ్ల తరబడి తిరిగి రాగల చాతుర్యం క్రమంగా తగ్గిపోసాగాయి మాలో. నిరాశా, నిస్పృహలచే ఓటమి ప్రారంభమైంది. ప్రకృతిని చూసి ఆనందించడంలో కూడా మాకు విషాదమే కన్పించసాగింది

జీవితం అంటే భయం, ఇన్‌ఫీరియారిటీ ఫీలింగ్, ఆనందంగా వున్నవాళ్లని చూస్తే ఒకరకమైన జలసీ మమ్మల్ని ఆక్రమించుకున్నాయి ఎక్కడ ఎప్పుడు కలిసినా జీవిత సమస్యలను చర్చించుకోవడంలోనే గడచిపోయేది కాలం. కాలం కదులుతూనే ఉంది నిరుద్యోగుల నిట్టూర్పులను మోసుకుంటూ

వెంకటేశ్వర్లుగారి అమ్మాయి స్మిత తనను



ఎంతో ప్రేమించే శరత్‌ను ప్రక్కకు నెట్టేసి గవర్నమెంటులో వెయ్యిరూపాయలు తెచ్చుకుంటున్న కిరీటిరావును పెళ్లి చేసుకునేసింది ఓ శుభ ముహూర్తాన. శరత్ ఎంత గాయపడేదీ అందరికీ తెలుసు! కానీ ఎవరు ఏం చేయగలరు?

తను జీవించినంత కాలమూ తన రక్తాన్ని చమటగా మార్చి రెండు ఎకరాల తడిపొలమూ, నాలుగు ఎకరాల పొడి పొలమూ మిగిల్చగలిగాడు శరత్ తండ్రి. తండ్రి మిగిల్చిన భూమిని తన ఉద్యోగంగా స్వీకరించాడు శరత్, వ్యవసాయం చేయించుకుంటూ. అష్టాంగ మార్గాన్ని ఫాలో అవుతూ కాలం గడిపేస్తున్నాడు శరత్.

చైతన్యకూ, నాకూ ఆ మాత్రం ఆధారాలూ లేవు.

నా విషయం, నాన్న కొచ్చే పెన్షన్‌తో మా సంసారం నడుస్తోంది. ఉన్న ఇల్లు ఉండనా, కూలిపోనా ? అన్నట్లుంది. సంవత్సరం క్రితం పలమనేరులో ఓ ప్రయివేటు కంపెనీలో నెలకు మూడువందల రూపాయలు జీతం వచ్చే ఓ గుమాస్తా ఉద్యోగం దొరికింది నాకు. గుమాస్తా ఉద్యోగం అని పేరే కానీ అక్కవుంట్స్ వ్రాయడం మొదలుకుని కూరగాయలూ, టీలూ, కాఫీలూ, మోయడం వరకూ చేయాల్సిందే చెప్పిన ప్రతి పనీ. అయినా 'బయట ఊరు, నేను ఏంచేస్తున్నదీ ఎవరు చూడవచ్చారు ?' అని నన్ను నేను ఊరడించుకుని 'రెండువందల రూపాయలు ఖర్చయిపోయినా వంద అయినా ఇంటికి పంపవచ్చు కదా ? ... ముసలి వాళ్లకు భారంగా ఉండడంకన్నా ఇది నయం కాదూ' అని ఆత్మను సంతృప్తి పరచుకుని కాలం గడిపేస్తున్నాను, భవిష్యత్తును గూర్చి కలలు కంటూ; ఊహాలలో అపర్ణతో రంగుల జీవితం గడుపుతూ.

చైతన్యకు, ఈ మాత్రం ఉద్యోగమూ దొరకలేదు. అతని తండ్రి ప్రయివేటు సంస్థలో పని చేసినవాడు కాబట్టి పెన్షన్ వగైరాలు ఏమీ రావు. తాను సంపాదించిన దాంతో ఇంతకాలం లాక్కువచ్చాడు. ఇప్పటికీ అక్కడక్కడ పద్దులు వ్రాస్తూ ఏదో తన చేతనైంత సంపాదిస్తూనే ఉన్నాడు ఆయన. చైతన్య తల్లి జబ్బు మనిషి. సదా మందులు తింటూ ఉండాల్సిందే. చైతన్య చెల్లి ఇంటర్ పాసయింది. టైపు తెలుసు, చిన్న ఉద్యోగం దొరికితే చేయాలని తనూ ప్రయత్నిస్తోంది. కానీ ఆమెకూ ఏమీ దొరకడం లేదు. చైతన్య ఎంత తటస్థజీవి అయినా వృద్ధులైపోయిన తల్లిదండ్రులనూ, పెళ్లికెదిగిన చెల్లినీ చూస్తూ తన అసమర్థతను తలచుకుని ఎంతో నలిగిపోతున్నాడని నాకు బాగా తెలుసు.

ఆ మధ్య నేను ఊరు వెళ్లినప్పుడు ముగ్గురూ కలిసి మాట్లాడుతోండగా అన్నాడు "మనకి గవర్నమెంటు ఉద్యోగాలు పొందే వయసు దాటిపోతోందిరా ... ఒక్కోరోజు గడుస్తూంటే ఒక్కో అడుగు పాతాళ లోకానికి దిగబడి పోతున్నట్లుగా ఉందిరా నాకు. ఆలోచించి ఆలోచించి తల బద్దలైపోతోంది. సెర్రిబల్ హెమరేజ్ వచ్చేస్తుందేమోనని భయంగా కూడా ఉంది ! 'నా వాళ్లకు నేను న్యాయం చేకూర్చగలనా ?' అనే దిగులు నన్ను తినేస్తూ వుందిరా !"

తన దగ్గర్నుండీ సలహాలూ, ధైర్యమూ పొందామే తప్ప తనకి ఏ నాడూ మేము ధైర్యం చెప్పాల్సిన అవసరం రాలేదు అంతదాకా. తనకేం చెప్పము ? ఎలా ధైర్యాన్నివ్వము ? ? ఏమని ? ?

*   *   *

బొయ్యిమని వాక్యం హారన్ వినిపించడంతో ఉలిక్కిపడి ఆలోచనలనుండీ బయటపడి లేచి నిలబడి వస్తున్న లారీని ఆపాను.

"కా జానా ?" అని అడిగాడు మహానిర్లక్ష్యంగా క్లీనరు.

"మదనపల్లి !" అన్నాను.

"అడే రూపాయి దేనా !" అన్నాడు.

'రెండున్నర రూపాయికాదు పాతిక రూపాయలైనా ఇస్తాను' అనుకుని తలవూపి లారీ ఎక్కేసి డ్రయివరు వెనకనున్న సీటుమీద కూర్చున్నాను.

చైతన్యకి ఎలా ఆక్సిడెంట్ అయిందో, ఏం జరిగిందోనని ఊహించడాన్కి రకరకాల ఆలోచనలతో మథనపడూ ముండ్లమీద కూర్చున్నట్లు కూర్చున్నాను లారీ కేబిన్‌లో.

నాలాగే ఏవో అర్జంటు పనులమీద వెళ్ళాల్సిన మరో నలుగురిని పుంగనూరులో ఎక్కించుకుని వేగంగా ప్రయాణం చేసిన లారీ మదనపల్లి చేరగానే యం. యల్. యల్. హాస్పటల్ వద్ద లారీ ఆపించి దిగేశాను.

*   *   *

చైతన్య పేరు కలిగిన పేషంటు ఎవరూ అడ్మిట్ అయివుండలేదని చెప్పాడు హాస్పటల్ రెసెప్షనిస్టు. కాని ఆక్సిడెంట్ల తాలూకు పేషంట్సుని గవర్నమెంటు హాస్పటల్‌కే తీసుకు వెళ్తారని అంత దాకా స్ఫురించలేదు నాకు. సీరియస్ అని టెల్రిగాంలో ఉంది కాబట్టి నేను ఇంకేమీ ఆలోచించకుండా గబగబా వెలుపలికివచ్చి హాస్పటల్ కాంపవుండ్ దాటి రిక్షా ఎక్కి గవర్నమెంటు హాస్పటల్‌కు వెళ్ళమన్నాను.

హాస్పటల్ గేటులోనే ఎదురయ్యాడు శరత్ బాగా నల్లబడిపోయిన ముఖంతో.

"ఆతృతగా రోడ్ క్రాస్ చెయ్యబోయి ఎలాగో లారీ క్రింద పడ్డాడురా మనవాడు. లారీ చక్రము కుడి తొడమీద నిలచిందటరా. తోడ బాగా దెబ్బతిని నలిగిపోయింది మోకాలిపైన. సియాటిక్ నర్వు దెబ్బతినిందట పైగా కిడ్నీ పంక్చరు అయిందటున్నారు... మోస్టిగా బతకడురా... బతికినా కాలు తీసివేయాల్సి వస్తుంది. ఇంతవరకూ తెలివి రాలేదు వాడికి. వెళ్ళిచూడు...." అన్నాడు శరత్ చిన్నపిల్లవాడిలా రెండు చేతులతో కన్నీరు తుడుచుకుంటూ.

కలో, నిజమో తెలియని పరిస్థితి ... షాక్ కాదు... అలాగని నేను నిల్రదొక్కుకున్నాననీ చెప్పలేను... ఒక్క నిముషం అలాగే నిలబడిపోయాను అచేతనంగా. ఆపై కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది. నిల్రదొక్కుకోలేక తూలిపోతూంటే శరత్ పట్టుకున్నాడు కంగారుగా... నన్ను.

*   *   *

డాక్టర్లు, నర్సులూ తాము చేయగలిగిందంతా చేస్తున్నారు. బ్లడ్, ఆక్సిజన్ పంపుతున్నారు వాడి శరీరంలోకి. ప్రతి పావుగంటకీ వాడి పరిస్థితి చెక్ చేస్తున్నారు. అయితే ప్రతి ఒక్కరికీ తెలుసు పక్షి ఎగిరిపోతుందని. నిలవదని తెలిసినా నిలపడాన్కి ప్రయత్నించే తపన, ఆతృత, ఆశ ఇవి చాలా చిత్రమైనవి.

ఆపరేషన్ అయిన తరువాత ఆపరేషను సక్సస్ అయింది లేనిదీ చెప్పలేదట డాక్టర్లు బహుశా వాళ్ళకే నిర్ధారణగా తెలిసి ఉండదు.

మంచం దగ్గర బొమ్మల్లాగా కూర్చుని వున్నారు చైతన్య తల్లీ, చెల్లీ. వాళ్ళ వెనుక నిలబడి వున్నారు మా అమ్మా, శరత్ వాళ్ళ అమ్మా. బయట వసారాలో ఎంతోమంది పరిచయస్థులూ, దూరపు బంధువులు నిలబడి వున్నారు. ఇవతలివైపు వున్న నడవాలో గోడకు ఆనుకుని నిలబడివున్న వృద్ధతండ్రి గారి కండ్లలో కన్నీటి పొరలు . వాటి వెనుకనుండి నిరాశా అగాధాల నధిగమించి ముందుకు రావడాన్కి వ్యర్థ ప్రయత్నం చేస్తున్న ఆశాకిరణాలు ఆయనకీ తెలుసు తన చైతన్య తనకిక దక్కడని. తెలిసీ ఏదో తెలియని వెర్రి ఆశ...మనిషి ఆశాజీవి.

ఆశ అనే గడ్డి పరకను పట్టుకుని నిరాశ అనే మహా సముద్రంలో మునిగిపోకుండా వుండడానికి ప్రయత్నించే వింత ప్రాణి మనిషి. ఆయనకు ధైర్యం ఇస్తున్నట్లుగా ఆయన వెనుకనే నిలబడి వున్నాడు మా నాన్న.

నాకు దుఃఖం ఆగడం లేదు వీళ్ళందరినీ చూస్తూ వుంటే. ఎందుకో మంచంలో వున్న చైతన్యను చూసినప్పటికన్నా, వీళ్లను చూస్తూ వుంటేనే దుఃఖం పొర్లి పొర్లి వస్తోంది. అందుకే అక్కడ వుండలేక నెమ్మదిగా హాస్పటల్‌లోంచి వెలుపలికి వచ్చాను.

నెమ్మదిగా నడచి ఫర్లాంగు దూరంలో ఉన్న కాలేజి గ్రవుండు చేరుకున్నాను. ప్రేక్షకుల మెట్ల మీద పై మెట్టుమీద కూర్చున్నాను. సూర్యుడు అస్తమించాడు.

హాకీ గ్రవుండు ఖాళీగా ఉంది. వెనుక కాస్త దూరంలో గిరిరావు హైస్కూలు గ్రవుండులో విద్యార్థులు ఫుట్‌బాల్ ఆడుతున్నారు. ఆ చివర్న బ్యాట్‌మింటన్ కోర్టుతో ఎవరో అమ్మాయిలు బ్యాట్‌మింటన్ ఆడుతున్నారు. చుట్టూ ఎటు చూసినా చెట్లు, ఆ వెనుక దూరంగా కొండలు కన్పిస్తున్నాయి. మదనపల్లెలోని ప్రత్యేకత అదే...ఎటు చూసినా ఊరిని చుట్టుముట్టే చెట్లూ, కొండల వరుసలూ! పైన ఆకాశంలో నివాసాలు చేరుకోవడాన్కి వెళ్తున్న పక్షులు... అంతా నాకు ఎందుకో ఎప్పుడూ లేనంత ప్రత్యేకత కన్పించి... ఓ రకమైన ఆవేదనను కలిగించాయి. మైదానం కుడి ప్రక్కనున్న ముసల్మానుల బరియల్ గ్రవుండులోని ఎరుపు, తెలుపు రంగుల సమాధులు వింతగా కన్పిస్తూ మానవుని అస్థిరతను చూపిస్తున్నట్లున్నాయి.

ఈ మైదానంలో ఎన్నో వందలసార్లు హాకీ ఆడాడు చైతన్య మాతో.. ఇంక ఆడగలడా ? నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి...వాడు బతికినా...ఈ మైదానంలో రెండు కాళ్ళూ పెట్టి నడువలేడు.

కాస్సేపయ్యాక అక్కడ్నుంచీ లేచి స్టేటు

బ్యాంకు రోడ్‌మీదుగా బెంగుళూరు బస్టాండుకు వచ్చి అక్కడ్నుండీ దక్షిపేటమీదుగా ఓల్డు చిత్తూరు బస్టాండుకేసి నడిచాను. నడుస్తూవుంటే 'ఈ రోడ్ల మీద ఎన్నోవేలసార్లు తిరిగి వుంటాడు చైతన్య చిన్నప్పటి నుండీ ఇక తిరగగలడా ? లేక ఋణం తీరిపోతోందా??' అని అన్పించి గుండెలో ముళ్ళు గుచ్చుకున్నట్లుగా బాధకలిగింది.

ఓల్డు చిత్తూరు బస్టాండులోని హోటల్ చేరుకున్నాను. దాదాపు హోటర్ అంతా ఖాళీగానే వుంది. ఓ కుర్చీలో కూర్చుని టీ తెమ్మన్నాను.

మా పరిచయం పెరిగింది ఈ హోటల్‌లోనే. కొన్ని వందలసార్లు ఈ హోటల్‌లో టీ త్రాగి వుంటాము. ఈ రేకుల హోటల్‌లో టీ త్రాగే మమ్మల్ని చూసి చాలమంది మిత్రులు నవ్వేవారు... కానీ వాళ్ళకేం తెలుసు ఈ హోటల్ విలువ ? ఇందులో మాకు లభించే తృప్తి !

'ఈ హోటల్‌లో చైతన్య మళ్ళీ టీ త్రాగుతాడా ?' ఈ ప్రశ్న నా గుండెలని కెలకడం మొదలు పెట్టింది. టీ కప్పు నా ముందుకు వచ్చింది

హోటల్ కౌంటర్‌లో ఉన్న వ్యక్తి పూర్తయిపోయిన రికార్డు తీసివేసి క్రొత్త రికార్డు పెట్టాడు రికార్డు ప్లేయర్‌లో. మేరానాం జోకర్‌లోని పాట ప్రారంభమైంది.

"జీనా యహా ! మర్‌నా యహా !! ఇసేకే సివా జానా కహా ??"

తన కథతో కే. ఎ. అబ్బాస్ ఏం చెప్పదలచుకున్నదీ నాకు కొద్దిగా తోచినట్లయింది. ఆ పాట పాడిన వ్యక్తీ, ఆ పాటకు సంగీతం సమకూర్చిన జంటకళాకారులలో ఒక వ్యక్తి ప్రస్తుతం ఈ లోకంలో లేరు. పాట మాత్రం ఉంది ... ఉండిపోతుంది !

తల వంచుకున్నాను... నా కళ్ళలోంచీ కన్నీటి చుక్కలు జారి టీ కప్పులో, సాసర్లో పడుతున్నాయి.

* * *

ఆక్సిడెంటును గూర్చి తెలియగానే శరత్ వాళ్ళ అమ్మా, మా అమ్మా. నాన్నా ఉదయం అనగా హాస్పటల్‌కు వచ్చేశారు. తిండి తిప్పల ధ్యాసలేకుండా చైతన్య తల్లి దండ్రులకూ, చెల్లికీ ధైర్యాన్ని ఇస్తూ వుండిపోయారు. రాత్రంతా కూడా ఇలాగే ఉండిపోతారు.

నాకు ఆశ్చర్యం వేసింది. ఈ ముసలివాళ్ళకు వున్న ఓపికా, గుండె నిబ్బరమూ, మనుషులమీద భ్రమా, ఎదుటివాళ్ళకు ధైర్యం చెప్పాలనే, ఓదార్చాలనే తహతహా, తాపత్రయమూ యువకులలో ఉండవు సామాన్యంగా.

మా ముగ్గురి ఇండ్లూ తాళాలు సరిగ్గా వేసి వున్నాయో లేవో చూసి రావడాన్కి శరత్ వెళ్ళాడు సైకిల్ మీద. నేను నడచి వెళ్ళి ఓ భోజనం హోటల్‌లోంచీ రెండు కారియర్లలో భోజనం తీసుకు వచ్చాను. అయినా ఒక్కరూ ఎంగిలిపడ్డ పాపాన పోలేదు. మృత్యువుతో పోరాడుతున్న చైతన్యని చూస్తూ కూర్చున్నాము అంతా.

* * *

రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో చైతన్య పరిస్థితి విషమించింది. శరత్ పరుగెత్తుకు వెళ్ళి హాస్పటల్ కాంపవుండ్‌లోనే క్వార్టర్సులో ఉన్న మెడికల్ సూపరెండెంటుని తీసుకు వచ్చాడు. ఆయన చైతన్యను పరీక్షించి, చాల నిముషాలు ఆలోచించి, ఓ ఇంజెక్షన్ తెప్పించి తనే స్వయంగా ఇంజక్షన్ చేసి మౌనంగా వెళ్ళిపోయాడు.

"కాస్సేపట్లో తెలివి రావచ్చు ... రాకపోవచ్చు . తెలివి వచ్చినా రాకపోయినా అరగంటకన్నా ఎక్కువ సేపు బ్రతకడు !" అన్నాడట వెంటవెళ్ళిన శరత్‌తో. శరత్ నాతో అన్నాడు. తక్కిన వారికి ఈ విషయం తెలియక పోయినా ప్రతి ఒక్కరి ముఖంలోనూ టెన్షన్ కొట్టొచ్చినట్లు కన్పిస్తూనే వుంది.

పది నిముషాలలో చైతన్యకి కొద్దిగా . చాల కొద్దిగా తెలివి వచ్చింది. అయితే వాడు మమ్మల్నెవర్నీ గుర్తించ లేక పోయాడు. బ్లడ్ వాడి శరీరంలోకి ఆగి ఆగి వెడుతోంది ... చివరికి వాడి పెదవులు కదిలాయి.

"లారీ డ్రయివరు తప్పేమీ లేదు ! నేనే త్వరగా రోడ్డు దాటపోతూ ... పడిపోయాను . డ్రయివరు తప్పేమీ లేదు...తప్పేమీ లేదు ."

ఇవే వాడి ఆఖరి మాటలు ఈ ప్రపంచంలో.

* * *

"దిస్ వరల్డ్ ఈజ్ ది లాండ్ ఆఫ్ డైయింగ్ అండ్ ది నెక్స్ట్ ఈజ్ ది లాండ్ ఆఫ్ లివింగ్" అన్నాడు టైరాన్ ఎడ్వర్డ్స్. ఆయన మాటలు నిజం అయివుంటే మృత్యు సంబంధమైన ఈ లోకంలో శాశ్వతంగా నిద్రపోయిన చైతన్య ఎక్కడో మరో లోకంలో కళ్ళు తెరచి వుండాలి ఈసరికి

మనకి ఎంత ప్రాణ సమానమైన వాళ్లయినా చనిపోయాక వాళ్లని ఎన్నో గంటలు మన వద్దనే ఉంచేసుకోలేము. అందునా ఆక్సిడెంటుకు గురయిన వాళ్ల శవాన్ని దగ్గర ఉంచుకోవడానికి అట్టే సేపు వీలవదు.

చైతన్య తల్లిదండ్రుల కడుపు కోతనీ, అతని చెల్లి దుఃఖాన్నీ చూస్తూ వుంటే కఠిన శిలలు కూడా కరిగి నీరయిపోతాయని అన్పిస్తోంది. శరత్ అందర్నీ చూస్తూ ఏడుస్తున్నాడు చిన్నపిల్లవాడిలా. ఏడుస్తూ అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాడు

చైతన్య శవం స్నానం చేయించడాన్కి వీలు లేని స్థితిలో ఉంది. వేడినీళ్లతో శవాన్ని తుడిచి, తెల్లటి కొత్త బట్టతో శవాన్ని చుట్టి . . పెళ్లి కానివాడు కాబట్టి ఓకే కొయ్యకు శవాన్ని కట్టి పూలతో అలంకరించి ఆఖరి యాత్రకు సిద్ధం చేశారు.

శరత్ ఒకవైపు, నేను ఒకవైపు భుజాలకు శవాన్ని ఎత్తుకుని బయల్దేరాము. వెనుక నుండీ ఏడ్పులతో, దుఃఖాలతో అందరూ కదలి వచ్చారు

మా ఊర్లో శవాల్ని బూడిద చెయ్యడాన్కి ఆధునిక యంత్ర పరికరాలు లేవు. అసలు ఆ ఎలక్ట్రిక్ పద్ధతే ఇప్పట్లో రాదు ఇక్కడికి. కొందరు తమ పద్ధతుల ప్రకారం శవాలని పాతిపెడ్తారు కొందరు తమ పద్ధతుల ప్రకారం కట్టెలతో శవాలని కాల్చివేస్తారు మా ప్రాంతంలో


చైతన్య శవాన్ని వాళ్ల పద్ధతి ప్రకారం పాతిపెట్టాము. శవం మన్నుతో కప్పబడి పోతున్నప్పుడు . నా చైతన్య మన్నులో మన్నయిపోతున్నప్పుడు ఎప్పుడో ఎక్కడో చదివిన ఓ వాక్యం గుర్తువచ్చింది నాకు.


"మనం మంచు ముద్దలతో బొమ్మలని చేస్తాం అవి కరిగిపోతూ వుంటే చూసి విలపిస్తాము."

* * *

బుద్బుద ప్రాయమైన మానవ జీవితాన్ని గూర్చి ఆలోచిస్తూ కూర్చుని వున్నాను. చైతన్య చనిపోయి అప్పుడే నాలుగురోజులు గడచిపోయాయి.

నెమ్మదిగా శరత్ వచ్చి నా ముందున్న





కుర్చీలో కూర్చున్నాడు. "ఏమయినా ఆలోచించావా ?" అని అడుగుతూ.

"చాలా ఆలోచించానురా...కానీ నా ఆలోచనలు ఒక కొలిక్కి రావడంలేదు !" అన్నాను నేను నీరసంగా.

"పోనీ నేను ఆలోచించి చెప్పనా ?"

"చెప్పు !" అన్నాను సరిగ్గా కూర్చుంటూ.

"తాత్కాలికమైన ఈ దుఃఖం కన్నా, వాళ్ల భవిష్యత్తును గూర్చి ఎక్కువ ఆలోచించాలిరా మనం. వాళ్ల వద్ద ధన, ధాన్యాలేమీ లేవు. వాళ్ళకున్న ఒక్క ఆశాకిరణమూ మాయం అయిపోయింది. గుండెలమీద కుంపటిలా ముసలి వాళ్ళకి అంజూ మిగిలివుంది..." అంటూ ఆగాడు వాడు.

"ఊఁ చెప్పు!" అన్నాను.

"నేను జాబ్ అవసరం లేకుండా ఇండిపెండెంటుగా బ్రతకడం నేర్చుకుంటున్నాను. నా జీవితానికి ఇక భయం లేదనే నా నమ్మకం! అందుకే నేను అంజూని వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నాను!"

నిరాశావాది శరత్...ఎంత ఆలోచించాడు ? ఎంత విశాల హృదయం వాడిది?? స్నేహానికి ఎంత ప్రాముఖ్యత ఇస్తున్నాడు వాడు?

వాడిని చూస్తుంటే మిత్రుడైనందుకు నాకు ఎంతో గర్వం కలిగింది. నా గుండెల్లోని బరువేదో దిగిపోయినట్లయింది.

అంజూ సమస్య ఇంత తేలికగా పరిష్కరింపబడిపోతే చైతన్య తల్లిదండ్రులు ఉన్నదాంతో కాలం వెళ్ళబుచ్చగలరు. మంచి చెడులు చూడడాన్కి మేము ఉండనే వుంటాము.

"మీ అమ్మగారు ఏమంటారు?"

"నిన్న అమ్మే సలహా ఇచ్చిందిరా నాకు... అంజూని చేసుకొమ్మని."

"అబ్బ ఎంత విశాలమైనవి ప్రపంచంలో కొందరి హృదయాలు? చదువు అంటే ఏమిటో తెలియని శరత్ అమ్మగారి హృదయంలో ఎంత మంచితనం, స్నేహభావాలు నిండివున్నాయి ?" అనుకున్నాను.

* * *

పెద్ద ఖర్మ పూర్తయిపోగానే బయల్దేరి వెళ్ళి పలమనేరు చేరుకున్నాను. గది తాళంతీసి లోపల ప్రవేశించగానే దుమ్ముపేరుకున్న నేలమీద పడివున్న కవరు కన్పించింది. నా శరీరంలోని రక్తం వడివడిగా ప్రవహించింది. కవరుమీది చేతివ్రాత చైతన్యది.

గబగబా కిటికీ తలుపులు తెరచి కుర్చీలో కూర్చుని కవరు చింపి అందులోని కాగితం వెలుపలికి తీశాను ఎక్సయిటెడ్‌గా.

ప్రియమైన రాజా!

రేపటితో నాకు ముప్పయి నాలుగు సంవత్సరాలు పూర్తయిపోతాయి. ఈ కాలపు సగటు మనుషుల జీవిత కాలము డెబ్బయి సంవత్సరాలు. అంటే నా వయసు దాదాపు సగం అయిపోయినట్టే. నేను నిస్సారంగా గడచిపోయిన నా సగజీవితాన్ని గూర్చి ఆలోచించడంలేదు. నా భవిష్యత్తు ఏమిటా అని.

నాకు ఏమివుంది? ఆస్తిలేదు, ఐశ్వర్యంలేదు... నాకున్నది నామీదే ఆశలు పెట్టుకున్న తల్లి

ది లాస్ట్ డేట్

దండ్రులూ, చెల్లీ! వాళ్ళకు నేనేలా న్యాయం చేకూర్చను? నేను కట్టుకున్న భవిష్యత్తు అనే కలల సౌధం కూలి పోవడాన్కి ఇంకా 24 గంటల వ్యవధి వుంది అంతే! ఎల్లుండిమండి నేను ఏ గవర్నమెంటు ఉద్యోగానికీ పనికిరాను, ఏ రిటన్ టెస్టు వ్రాయడానికీ పనికిరాను. నా ఆశలన్నీ రేపటితో బూడిద అయిపోతాయి.

ప్రయివేటులో ఏదయినా ఉద్యోగం దొరికినా నేను నిలద్రొక్కుకోగలనా ? నెవర్! ఆ అవస్థలు నాకు తెలియనివి కావు.

మనం వెనుకబడ్డ జాతిలోనో, తెగలోనో పుట్టి వుండినా ఇంకో ఐదు లేక పది సంవత్సరాలు అవకాశాలు వుండేవి కదా అని బాధపడ్తూ వుంటే నాకో విషయం స్ఫురించింది.

వికలాంగులకు కొన్ని సంవత్సరాల వరకూ వయో పరిమితి సడలించబడడమే కాక వారికి ప్రత్యేక కేటాయింపులుకూడా ఉంటాయి.

నా మానసిక పరిస్థితి, నా ఆవేశం అంతా నీకు వ్రాయదలచుకోలేదు. నీవు అర్థం చేసుకోగలవని నాకు తెలుసు. అందుకే నేను తీసుకున్న నిర్ణయం నీకు వ్రాసేస్తున్నాను.

రేపు నేను కంగారుగా రోడ్డు దాటడాన్ని ప్రయత్నిస్తున్న వాడిలా. గభాలున... ఏదయినా ఓ వాహనం క్రింద పడిపోయి నా కాలు ఒకదాన్ని ఆ వాహనానికి అర్పించదలచుకునేశాను. ప్రపంచ

దృష్టిలో ఇది ఒక ఆక్సిడెంట్ మాత్రమే! హాండీకాప్ సర్టిఫికెట్టుతో భవిష్యత్తును నిర్మించుకుని నావాళ్ళకు న్యాయం చేకూర్చాలన్నదే నా కోరిక.

ఒకవేళ నా ఈ ప్రయత్నంలో ఏదయినా అవకతవకలు జరిగి నా ప్రాణం పోవడం జరిగితే నా కుటుంబాన్ని నీవూ, శరత్ ఆదుకోవాలి.

ఇక్కడ ఇంకో విషయం చెప్పాలి నీకు. దాదాపు ఐదు సంవత్సరాల క్రితం అనుకుంటాను ... నా పరిచయస్థుడు ఒక ఇన్సూరెన్సు ఏజంటు బలవంతంగా నా చేత పదివేల రూపాయలకు డబుల్ ఆక్సిడెంటల్ బెనిఫిట్ స్కీములో ఇన్సూర్ చేయించాడు. అదృష్టవశాత్తు దాని తాలూకు ప్రీమియములు సక్రమంగా చెల్లించగలిగాను ఇంత వరకూ. ఈ విషయం మా వాళ్ళకెవరికీ తెలియదు. దాని తాలూకు రసీదులూ, భీమా సంస్థ ఇచ్చిన బాండూ ఉన్న ఫైల్ నా బట్టల పెట్లో అడుగున పడివుంది.

నేను ఈ లోకం నుండి నిష్క్రమించడమే జరిగితే నీవు, శరత్ ఆ ఫైలు తీసుకుని... నా చావు ఆక్సిడెంటే (ఈ ప్రపంచానికి) కాబట్టి ... యల్. ఐ. సీ. నుండి ఇరవయివేల రూపాయలు వసూలు చేసి ఆ డబ్బుతో నా చెల్లి పెళ్ళి, నా తల్లి తండ్రులకు కొంత ఆధారమూ కలిగించాలి. ఇది ఫ్రాడ్ అని నాకు తెలుసు ... కానీ ... కానీ ... నా వాళ్ళకోసం, నా భవిష్యత్తు కోసం నేను చేస్తున్న ఆఖరి ప్రయత్నం విఫలం అయిపోతే ... ఫ్రాడ్‌గా అయినా సరే భీమా సంస్థ అనే మహానదిలోంచి నేను కొద్దిగా ధనం అనే నీరు నా వాళ్ళకోసం పొందక తప్పదు.

అన్నీ సక్రమంగా జరిగి నేను హాండీకాప్‌గా ప్రపంచంలో నిలవాలని భగవంతుని ప్రార్థిస్తూ ఉత్తరం ముగిస్తున్నాను

నీవు చదవడం ముగించగానే ఈ ఉత్తరాన్ని కాల్చిపారవెయ్యాలని కోరుతున్నాను.

భగవంతుడు అన్యాయం చేయడని ఆశిస్తాను

నీ

ప్రియమిత్రుడు,

చైతన్య.

ఉత్తరం చదవడం ముగించిన తరువాత నేను దాదాపు ఓ గంటసేపు అలాగే కుర్చీలో కూర్చుండిపోయాను మ్రాన్పడిపోయి

'చైతన్యా ఎందుకిలా చేశావు ? ఎందుకిలా చేశావు ??' అనుకుంటూ, తల కొట్టుకుంటూ, జుత్తు పీక్కుంటూ విలపించాను ఆపై—

చివరికి నాకు కర్తవ్యం గుర్తుకు వచ్చింది.

కుర్చీలోంచి లేచి అగ్గిపెట్టె వెతికి తీసుకుని ఉత్తరం కాల్చిపారవేశాను చైతన్య కోర్కెలలో ఒకటి నెరవేరింది అనుకుని నవ్వుకున్నాను.

అతని ఇంకో కోరిక కూడా నెరవేరింది దాదాపుగా ఇదివరకే! అంజూ పెళ్లి .. రెండునెలల తరువాత శరత్‌తో జరిగిపోయేటట్లు ముహూర్తం కూడా నిశ్చయింప బడిపోయింది. అయినా ఆ డబ్బు పికప్ చేసుకుని చైతన్య తల్లిదండ్రులకు అందించాలి నేను.

తెచ్చిన హ్యాండ్‌బ్యాగు తెచ్చినట్లే అందుకుని గది తాళం వేసి బస్టాండుకు బయల్దేరాను. బహుశా మా కంపెనీ యజమానులు నాకు వెయ్యి చీవాట్లతో పెద్ద మెమో తయారు చేయువచ్చు బట్ ఐ డోంట్ కేర్ ...

బస్టాండుకు చేరుకునేసరికి వేలూరు నుండి వచ్చిన టి. కే. టి. బస్ సిద్ధంగా ఉంది. ఎక్కి ఖాళీగావున్న ఓ సీట్లో కూర్చున్నాను కాస్సేపట్లోనే బస్ బయల్దేరింది.

కిటికీ గుండా కన్పిస్తున్న దృశ్యాలను భావశూన్యంగా చూస్తూ వున్న నా మనసుకు హఠాత్తుగా ఒక విషయం తట్టింది. దాంతో ఉలిక్కిపడిన నేను భయంతో వణికిపోయాను.

భవిష్యత్తు మీద ఆశతో నేను వెట్టిచాకిరీ లాంటి ఉద్యోగం చేస్తూ గడిపేస్తున్నాను. ఈ ఉద్యోగంలో వుండి అందుకోలేనని తెలిసినా నేనింకా అపర్ణను ప్రేమిస్తూనే వున్నాను. మంచి ఉద్యోగం దొరుకుతుందనీ, అపర్ణను అందుకొగలననీ, నన్ను కన్నవాళ్లకూ న్యాయం చేకూర్చగలననీ నమ్ముతూనే బ్రతుకేస్తున్నాను బావిలో కప్పలా, పుట్టలో చెదపురుగులా.

కానీ ...

నేను చైతన్యకన్నా మూడు నెలలా, పద్నాలుగు రోజులు మాత్రమే చిన్నవాణ్ణి ... అంటే ఇంకో మూడు నెలలలోగా ... ... ? ★

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

కె. ఎస్. – గిద్దలూరు

ప్రేమ వివాహాలపై మీ అభిప్రాయం ఏమిటి?

★ ప్రేమనీ – వివాహపు బాధ్యతలనీ సమానంగా భరించగల్గినవాళ్ళే యిందుకు సిద్ధపడాలి.

ప్రేమ వివాహాలు శాశ్వతంగా వుండవని కొందరు వాదిస్తారు. మీ వాదన ఏమిటి ?

★ నేను వాదించను. వాదనలు వింటానంతే ! ఏ వివాహం శాశ్వతం కాదు— వినలేదా టిల్ డెత్ అస్ టు పార్ట్ దాకానే—స్నేహాలు కొనసాగేది. పెళ్లి ఒక రకం స్నేహమే అనుకొంటే— చచ్చేదాకా సాగించవచ్చు. లేదా— అంతే సంగతులు.

గణేశ్ – ఆదోని

ఆత్మ, అంతరాత్మల తేడా ఏమిటి ?

★ సాదాసీదాగా చెప్పాలంటే— ఆత్మ మనం పోయినా వుండేదనీ, అంతరాత్మ— మనం చేసే ప్రతి పనిని మన కోసం— బేరీజువేసి ప్రాణాలు తోడేదనీ చెప్పకోవచ్చు.

ఆడవారు కంట తడిపెడితే అశుభం అంటారు. ఎందుకు ?

★ దేశం చూస్తున్నారుగా ?! నిజం అని నమ్మండి.

మనిషికి డబ్బు రావడం వల్ల నిజంగా గర్వం వస్తుందా ?

★ అలా గర్వం వచ్చేవాడిదగ్గర డబ్బు చాలా కాలం నిలవదు. మీ పరిశీలనగా చూడండి—నిజమైన ఏ ధనవంతులూ గర్విష్టులు కారు. (నడిమంత్రపు సిరివాళ్లే విర్రవీగేది.)

ఎమ్. ఆర్. వి. – ధోన్

మనిషికి మనిషి చేసిన మరమనిషి (రాబిట్స్)కి తేడా ఏమిటి ?

★ అబ్బ – యిలాంటి అచ్చు తప్పులు మరమనిషి చెయ్యదు ! రాబోట్సే మనిషి చెప్పినట్టు వింటాయి. మనిషితో చిక్కు ఒక్కటే – తనకు తోచదు. ఎవరు చెప్పినా వినడు !

హెచ్. వి. హెచ్. – విజయవాడ

మన సంస్కృతిని నిలబెట్టేది బొట్టు లేకుండా, గాజులు లేకుండా ఒక గడియారం పెట్టుకుని చీరకు బదులు మగ దుస్తులతో మోకాలి వరకు వుండకుండా మెడదిగని కత్తిరింపు జుట్టుతో ప్రత్యక్షమయ్యే నేటిది నేటి బాలకన్య స్త్రీలే కదండీ? వీళ్లేనా ?

★ ఆఁ వీళ్లూ – వాళ్ల అన్నలూ తమ్ముళ్లూ తండ్రులూ మొగుళ్లూ కూడా హనుమా ! ... ఏమిటో యీ దేశపు సంస్కృతీ భారాన్నంతా ఒక్క ఆడదే మోస్తున్నట్టు ఏమిటయ్య ఉట్టి కిచకిచలు! మీరు ధరించే దుస్తులు, మీ మాటల తీరు, మీ ప్రవర్తన – వీటికీ సంస్కృతికీ ఏం సంబంధం లేనట్టేగా ?!

కళ్యాణి – బెండమూర్లంక

మా వూళ్లో పోస్టుమాన్ ఎవరి కొచ్చిన వుత్తరాలు వాళ్లకివ్వరండీ. ఇంట్లో ఎవరు కనిపిస్తే వారికిచ్చేస్తాడు.

★ కంప్లయింటు చేయకండి. ఆ పనీ మానేసే ప్రమాదం వుంది. మరీ అంత ప్రమాదకరమైనవి— ఇతరులచేతుల్లో పడకూడనివి—వుత్తరాలుంటాయా? ఆడపిల్లలకి !!

వి. ఎస్. బి. – హైదరాబాదు

ఇలా ఉచిత సలహాలు యిచ్చేకంటే ఎంచక్కా ఒక టుటోరియల్ కాలేజీ లాంటిది పెట్టి మగవాళ్లపై విరుచుకు పడడం మీ అంశంపై క్లాసులు తీసుకొని కోచింగు యిస్తే బాగుంటుందని నా అభిప్రాయం.

★ ఏడిసినట్టుంది బాబూ మీ బోడి అభిప్రాయం ! చేపకి యీత నేర్పడమా ? ఆడదై పుట్టాక 'సర్వయివల్' అదే వస్తుంది ! ఇక టుటోరియల్ కాలేజీ బుద్ధి మీ కెప్పటికి పోతుందో నాకర్థం కాదు – చదువు సంధ్యల్లో డల్లర్డ్స్ చదివే చోటు కదా అది ?! ఐక్యు తక్కువ అయితేనే – కోచింగు కావాలి.

కె. వి. డిబ్రియుగాన్ – అస్సాం

మానవుడు నిత్యజీవితంలో కోరుకునేది ఏమిటి ? ఆశించేది ఏమిటి ?

★ డబ్బు. అది తరిగిపోకుండా వుండాలని

వి. బి. హెచ్. ఆర్. – వెల్లూరు

'పిడివాదం' 'కుప్పతొట్టి' నీ వాటికి నువ్వు నా వాటికి నేను లాంటి తమిళ పదాలు తెలుగు సినిమాల్లో ఎలా చోటు చేసుకుంటున్నాయి. పాఠాలు పాట వాటికి విశిష్టార్థాలుండగా — పాఠశాలలు అన్న వాడుక పత్రికలెలా వేస్తున్నాయి ?

★ భాష సజీవం. కొత్తని పీల్చుకుంటూ విస్తరించడమే కాదు భావపూరితం కూడ అవుతూ వుంటుంది. యిక మన 'రాజుల' ధర్మమా అని 'తెలుగు' పదాన్ని నిషేధిస్తే — తెలుంగునాడు అనుకోమా ?! పోటీ లినోమిషను సౌకర్యార్థం — వచ్చాయి పాటశాలలు. పలితలకి అర్థం కావడం ముఖ్యం — భాష ఉద్దేశ్యం అదే కదా ?

జె ఎస్ ఆర్. – పొద్దుటూరు

కోర్టులో ప్రమాణం చేయిస్తారెందుకు ?

★ సంప్రదాయం !



'ముగ్గు పెట్టండమ్మ ముత్యాలముగ్గు ముంగిళ్లతోమన్న పీడల్లుతగ్గ'
(ఫొటో : సుధాకర్ యండవిల్లి)



గొబ్బిళ్లో గొబ్బిళ్లో
ఫొటో : బోసెపల్లి మురళి

పెద్ద కథ ప్రారంభం!

ఈ పెళ్ళి తనకు బొత్తిగా ఇష్టంలేదు. అలా అని "ఈ పెళ్ళి చేసుకోను"-అని తలిదండ్రులకు చెప్పే స్థితిలో లేడు మాధవ్. తను ప్రేమలో పడి మరో అమ్మాయిని ప్రేమించి ఈ పెళ్ళి ఒద్దు అనుకోటానికి అసలు తను ఎవ్వరినీ ప్రేమించలేదు.

విష్ణుహాల్లో పరాకుగ ఆఫీస్ నుండి బైటికొచ్చాడు. వెంటనే ఇంటి కెళ్ళాలనిపించలేదు. కాంటీన్‌లో కాఫీ త్రాగి ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్నాడు. కాస్త దూరం వెళ్ళేసరికి టైలర్ షాపులు వచ్చాయి.

పెద్దకథ

తొణికని స్వప్నం

కోమలాదేవి

క్రొత్త బట్టలతో నిలువుటద్దాలతో ఆ దుకాణాలు నిండుగా అందంగా కలకల లాడుతున్నాయి ఒక అద్దంలోని ప్రతిబింబం చూచి ఠక్కున ఆగిపోయాడు మాధవ్

ఆ ప్రతిబింబం ఐదడుగుల పదిన్నర అంగుళాల ఎత్తులో ఉంది. పసిమిఛాయలో ఉన్న రంగు ఎండకు కాస్త కమిలినట్లుగా ఉంది. వంకీలు తిరిగిన ఒత్తైన జుత్తు చెవులనుదాటి సగం మెడను కప్పుతూ వంపుతిరిగి వుంది. వంకలేని తిన్నని ముక్కు, అందంగా వంపుతిరిగిన సన్నటి చిక్కని కనుబొమలు, అధునాతన మీసంకట్టు, కళ్ళకు కూలింగ్ గ్లాస్ పెట్టుకున్న ఆ వ్యక్తి మేగజైన్స్‌లో మోడల్‌లా ఉన్నాడు. తన ప్రతిబింబాన్ని చూచు కుంటూ కొంతసేపు ఆనందించాడు. అలా నుంచుని చూచుకుంటే బావుండదని టై ముడి సర్దుకుని దాటిపోయాడు...గుండెల్లో మంట రాజుకుంటోంది.

ఆతడి మనసులో గుబులుగా ఉంది. తను ఎంత అందంగా ఉన్నాడు! "సినిమాలో జేరావంటే గొప్ప హీరోవి అయిపోతావురా" అని తన స్నేహితులు అనటం గుర్తుకు వచ్చింది. అంతే ఆతడిలో పట్టుదల హెచ్చింది. తను ఈ పెళ్ళికి ఒప్పుకోడు. "నేను చేసుకోను" అని ఖచ్చితంగా చెప్పేయాలి. తన మెడలు వంచి కట్టి పడేయలేరు. తను చూస్తూ చూస్తూ... ఆమెను పెళ్ళి చేసుకోలేడు. తన ఊహా సుందరిని ఓమారు గుర్తుకు తెచ్చుకున్నాడు. ఆమెను తన ప్రక్కను ంచో బె ట్టు కు ని తన్మయుడయ్యాడు. తన ముక్కుతో ఆమె ముక్కును పోల్చుకున్నాడు. సంపంగి మొగ్గలా ఉంది! ఆమె చిరుకోపం ప్రదర్శిస్తే ముచ్చటగా ఆ ముక్కును పట్టుకుని ఊపుతూ మెల్లగా తన దగ్గరకు లాక్కుని అరవిచ్చిన పెదిమలమీదికి ఆత్రంగావంగుతాడు. ఆమె కోపంతో వెనక్కి తీసుకుంటుంది – క్రోధం నటిస్తుంది. ఆ వాడి చూపులు తన హృదయాన్ని రంజిపజేస్తాయి. ఆమె పొడవైన జడను నా చేజిక్కించుకుని విసురుగా దగ్గరకు లాక్కుని ఆమె నడుము పిడికిట్లోచిక్కించు కున్నంత సులభంగా అందుకుంటాడు. ఆ విసురుకు ఆమె తనను హత్తుకుపోతుంది. కిలకిలనవ్వుతుంది. ఆ నవ్వును అందుకుంటాడు. ఆమె సుకుమారమైన కపోలాల్లో తన ప్రతిబింబం చూచుకుంటాడు. అబ్బ – ఎంత చక్కటి ఈడు జోడు–అని అందరు అనుకుంటారు. ఆ స్వాప్నిక జగత్తునుండి జారి క్రింద పడ్డట్లు ఎవరో హార్న్ పదేపదే మ్రోగించారు.

ప్రక్కకు తిరిగి చూచాడు – స్నేహితుడు రాజా మోటర్‌బైక్‌మీద ఉన్నాడు.

"ఎక్కురా ... అలా తిరిగి వద్దాం."

"ఏం? ఈరోజు మీ ఆవిడ పర్మిషన్ ఇచ్చిందా?" అన్నాడు ఎక్కికూర్చుంటూ.

"వాళ్ళ ఫ్రెండ్ కొడుకు పుట్టినరోజు రేపు. కేక్ చేయటానికి సహాయంగా వెళ్ళింది?"

"కనుక నీవు ఫ్రీగా ఉన్నావన్నమాట?" మాధవ్ అన్నాడు.

"ఈ ఫ్రీడం ఎలాంటిదంటే పెళ్ళయితేగాని దీని విలువ నీకు తెలీదు. అన్నట్లు నీ పెళ్ళి సెటిల్ అయినట్లేనా?"

"అని మా వాళ్ళనుకుంటున్నారు. కాని నేను ఒద్దు అనబోతున్నాను."

"వ్వాట్ ... పద ఎక్కడైన కూర్చుందాం."

నిర్మానుష్యమైన చోటికి వెళ్ళాలంటే మహా నగరాల్లో వీలుపడదు. అందుకని ఒక కూల్‌డ్రింక్ షాప్ దగ్గర ఆగారు. డ్రింక్ తీసుకుని ఒకచోట కూర్చున్నారు.

"ఏమిటి సంగతి. పిల్ల – డబ్బు – ఏది బాగ లేదు?" రాజు తాపీగా అడిగాడు.

"పిల్ల" అన్నాడు మాధవ్ పొడిపొడిగా.

"పిల్ల ...! అంటే అమ్మాయి ...! నీ కాబోయే భార్య ...! నో ... నో ... అసంభవం ... తమాషా చెయ్యకు. నిజం చెప్పు."

"నిజం ..."

"మరి డబ్బు?"

"మా కష్టాలు గట్టెక్కుతాయట... ఇదేం న్యాయం రాజా? నన్ను నుంచున్న పళంగా ఏడు బావుల లోతున్న నూతిలోకి త్రోసివేసి వాళ్లంతా గట్టెక్కుతారట... నేను సహించలేకపోతున్నానురా. ఏం చెయ్యాలో తోచదు."

"నీ దృష్టిలో మరో అమ్మాయి వుందా?" ఆత్రంగా అడిగాడు.

"లేదు... ప్రేమించటానికి టైం ఏదీ? స్టూడెంట్ డేస్‌లో ఎవరినైనా వెంటేసుకుని తిరగ టానికి డబ్బేదీ? కనీసం పిక్చర్‌కు తీసుకెళ్ళాలన్నా ధైర్యం చాలేది కాదు. నీకు తెలుసుగా అతి మామూలు గుడ్డలతో కాలేజి చదువు వెలగ బెట్టాను...డబ్బులేదని–నేనే ఈ ప్రేమాయణం.."

"అది సరేగాని– అమ్మాయి అంత బాగుండదా?"

"ఏం చెప్పను? నాకు నచ్చలేదు"

"నీ ప్రక్కన దిష్టిబొమ్మలా వుంటుందా?"

"ఉంటుంది."

"నో... నో... నీవు హాస్యానికి అంటున్నావు. మన నవలల్లో మన సినిమాల్లో ఐశ్వర్యవంతులబిడ్డ అత్యంత రూపవతిగా వుండాలే... ఒరేయ్– ఇది ఏప్రిల్ ఫస్ట్ కాదు..."

"నీవు నమ్మవు. అంతా నిజమే చెబు తున్నాన్రా"

"నేను వచ్చి చూచేదా?"

"ఒద్దు... మర్యాదగా వుండదు."

"ఫోటో ఉందా?"

"లేదు."

"ఇదే ఊరా?"

"ఆ."

నిన్ను చూస్తే జాలేస్తోంది. కాని నువ్వు తల వంచకూడదు. ఇది ఒక్కనాటి ముచ్చట కాదు... కళ్లు మూసుకుని... అబ్బ తాళి కట్టేశాను... ఇక

పరవాలేదు... అని అనుకునే పరిస్థితి కాదు. అనుక్షణం ఈ బంధం బలపడూ్త ఉంటుంది. నువ్వు ఒదిలించుకోవాలన్నా ఒదిలించుకోలేవు... నిజం చెప్పాలంటే డబ్బుకు అమ్ముడుబోయాక మన వ్యక్తిత్వపు విలువ ఏముంటుంది. అందులో వాళ్ళు బాగా ఉన్నవాళ్ళంటున్నావు. కనుక...ఒదిలించుకో... చేసుకోను అని చెప్పు. అది నిష్ఠూరం మేలు.''

''థాంక్సరా... నాకు ధైర్యంగా ఉంది. ఇప్పుడే వెళ్ళి చెబుతాను'' రాజా మాధవ్‌ను ఇంటి దగ్గర దింపి వెళ్ళిపోతూ ... ''గుడ్‌లక్'' అన్నాడు.

మాధవ్ తలుపు త్రోసుకుని లోపలికెళ్ళాడు. అంతా వంటగది బైటజేరి కాఫీ త్రాగుతున్నట్లున్నారు. మెల్లగా మంచంమీద కూర్చున్నాడు.

తల్లి అంటుంది... ''ఈ ఇంటిని రిపేర్ చేయించాలిట.''

''బాబోయ్... ఈ ఇంటిని రిపేర్ చేయించటానికయ్యే ఖర్చుతో మరో ఇల్లే వస్తుంది'' అంది కుసుమ—పెద్దచెల్లి.

''ఎవడికోసం చేయిస్తాడు ? తన ముద్దుల కూతురు వుండటానికి చేయిస్తాడు. ఆ చక్కనమ్మకు ఈ డొక్కు ఇల్లు పనికిరాదుగా. చక్కగా మోడర్న్‌గా చేయించనీ... హాయిగా వుందాం.'' తమ్ముడు కేశవ్ గలగల నవ్వుతూ అన్నాడు.

కట్నం డబ్బులోనే ఈ ఇంటి రిపేర్ డబ్బు కూడా వుందా ? లేక వేరుగా ఇస్తాడా ?'' చిన్నచెల్లి సుమలత అంది.

తండ్రి కంఠంలో ఏనాడు వినబడని గర్వం ధ్వనించింది.

''దానికి దీనికి పొత్తులేదు. దేనికదే... అన్నాను. మీ అమ్మాయికి అనుకూలంగా వైభోగంగా ఉండేట్లు చేయిస్తాను. కాని అదంతా మీరే చూసుకోవాలి అని ఖచ్చితంగా చెప్పాను. ఏం చేస్తాడు? సరేనండి... అన్నాడు.''

''సరేనండి బావగారూ... అలాగే ఇస్తాను'' కేశవ్ మిమిక్రీచేసి చెబుతుంటే అంతా ఘొల్లున నవ్వారు.

''అన్నట్లు కుసుమకు చూసిన సంబంధం ఏమైంది?'' తల్లి ఆత్రంగా అడిగింది భర్తను.

''కుసుమకు నచ్చలేదుట ... ఒద్దని రాసెయ్యాలి.''

మాధవ్ చకితుడయ్యాడు. టెలిఫోన్ ఆపరేటర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. చూడటానికి బాగానే ఉంటాడు. హైద్రాబాద్‌లో స్వంత ఇల్లు కూడా ఉంది. అందరిలోకి చిన్నవాడు. అందరికి పెళ్ళయిపోయింది. ఐదువేలు మాత్రం అడిగారు. దాదాపు ఒప్పుకున్నట్లే అనుకున్నారు. ఇప్పుడీవిధంగా అంటున్నారేమిటి ? ఒకవేళ తను తీసుకునే డబ్బు లోంచితీసి పెద్ద కట్నం ఇచ్చి పెద్ద ఉద్యోగస్తుణ్ణి తేవాలనుకుంటున్నారా? అంతే...

ఈ సంబంధమైనా స్థిరమైతే బావుండును— అని ఇంటిల్లిపాది కోరుకున్న రోజులు విస్మరించారా?

ఈ పెళ్ళికి తను అంగీకరించి వీళ్ళను ఉద్ధరిస్తున్నాడా ? లేకవారిని అత్యంత ఆశకు లోను చేస్తున్నాడా ?

''అమ్మా — పెళ్ళికి నాకు ఎరుపు రంగు పట్టుపరికిణి కొనాలి. దానికి మాచింగ్‌గా ఎర్రఅపాళ్ళు—



ముత్యాల నెక్లెస్ కావాలి'' సుమలత గారాలు పోతూ తల్లిని అడిగింది.

''సరేలే ... ఇప్పుడెందుకు. నీ పెళ్ళికి కొంటాను'' అందామె.

''అప్పుడు కూడ పరికిణీయే కట్టుకోనా ?'' అంది కిసుక్కున నవ్వి. అంతా గలగల నవ్వేశారు.

''వాళ్ళు అన్నయ్యకు కారిస్తారు—నువ్వు నాకు స్కూటర్ ఇవ్వుచాలు'' కేశవ్ తన కోర్కె వెలిబుచ్చాడు.

''అలాగే ... ఎనిమిదివేలేగా ?'' తండ్రి గోపాలరావు లెక్కలేనట్లు అంటూ ఉంటే మాధవ్ ఇంకా ఆశ్చర్యపోయాడు. ఔను—లేమిలో — ఒద్దు— లేదు — చాలదు — సర్దుకో అన్నమాటల మధ్య పెంచిన తండ్రి ఈ ఒక్కసారి హాయిగా ''అట్లాగే'' అనటంలో ఎంత ఆనందం ఉన్నదో ! పిల్లల కోర్కె తీర్చటానికి ఈ తండ్రి ఎంతగా శ్రమించాడు ? ఈనాడు దర్జాగా ప్రవర్తిస్తుంటే మాధవ్‌కు తన త్యాగంలోని గొప్పతనం అర్థమైంది. పెద్ద ఉద్యోగస్తుడు—పట్టుపరికిణి—నెక్లెస్—స్కూటర్... అసలు ఇలాంటి మాటలు ఆ గృహంలో నిషేధింపబడినట్లు వినబడేవికావు.

''నాన్నా నువ్వు చాల మంచివాడివి'' కేశవ్ పట్టరాని ఆనందంతో అన్నాడు.

''నా మంచితనం కాదురా. మాధవ్ మంచితనమే. మన అందరి కోసం ఈ పెళ్ళికి ఒప్పుకున్నాడు. అతడికన్నా మనం ఐదుగురం ఈ పెళ్ళి వలన లాభం పొందుతాము. మాధవ్‌ను ఇలాంటి సంబంధం తెచ్చి బంధించటం నా కిష్టంలేదు. కాని నేను చేతకానివాడినైపోయాను. మరో మార్గం లేదు'' తండ్రి మాటల్లోని ఆర్ద్రతకు అతడి హృదయం ద్రవించిపోయింది. అందరూ తనను తెగ

మెచ్చుకోవటంలేదేమి ... మిగతా అంతా ఊరకున్నారేం ?

"ఔను. నాకూ ఇష్టంలేదు. కాని ఏం చెయ్యలేని స్థితిలో ఉన్నాము. ఆ మందుల కంపెనీ వాళ్ళిచ్చే జీతాన్ని, మన స్థితిగతులను చూసి బోలెడు కట్నం ఇస్తామని మరొకరు రారు."

"అన్నయ్య అందాన్ని చూసి రావచ్చుగా ?" టీనేజర్ అనిపించుకుంది సుమలత.

అంతా నవ్వారు "అదంతా కలల్లో,పుస్తకాల్లో, సినిమాల్లో. నిజ జీవితంలో అందమైన డబ్బున్న అమ్మాయికి, డబ్బున్న అందమైన అబ్బాయి కావాలి" తండ్రి అన్నాడు.

"త్యాగం— త్యాగం— అంటున్నారు. బోలెడు డబ్బు. అనుభవించేది తొంభైశాతం అన్నయ్యేగా?" సుమలత మళ్ళీ చిన్న పిల్లలా ప్రశ్నించింది.

"ఇప్పుడు ఇవన్నీ నీ కెందుకమ్మా. ఇకపై ఈ ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా, ఆనందంగా హృదయం నిండుగా నవ్వినా దానివెనుక అన్నయ్య ఉన్నాడని జ్ఞాపకం పెట్టుకోవాలి."

మాధవ్ చటుక్కున లేచి అప్పుడే వచ్చినట్లు నటించాడు. తను "ఒద్దు— నాకీ పెళ్ళి ఇష్టం లేదు" అని గట్టిగా చెప్పాలనుకున్నాడు. కాని తను బంధితుడు... ఈ అనుబంధాలన్నీ తనను బంధించి వేశాయి. ఒక్క అడుగు తానుగా తాను వేయలేదు.

"అమ్మా" అని కేకేస్తూ మంచం మీద కూర్చున్నాడు.

"ఆ... వస్తున్నా" అందామె. అంతా ఇవతలి కొచ్చారు.

కాసేపటికి తల్లి కాఫీ తెచ్చింది.

"ఒద్దమ్మా...రాజు, నేను తీసుకున్నాం."

"కాఫీయేగా. ఫరవాలేదు తీసుకో." తల్లి ముఖంలోకి చూచి మెల్లగా గ్లాస్ అందుకున్నాడు. అతడి కళ్ళు ఒక్కక్షణం ఆమె మెడలో జిడ్డోడు తున్న పసుపుత్రాడుపై బడింది. దాని రంగు పసుపు అని ఎవ్వరూ అనరు.

కాఫీ రెండుసార్లు వెచ్చబెట్టినందుకు ఏమీ బాగులేదు. ఒకప్పుడు అదే అమృతంలా ఉండేది. మాట్లాడకుండా త్రాగుతున్నాడు. ఇంతలో తల్లి ఒక కవరు తెచ్చి అందించింది. అడ్రస్ టైప్‌చేసి వుంది. పెద్ద తెల్ల కవరు. చూడగానే ఏదో

తొణకని స్వప్నం

అఫీషియల్‌లా ఉంది. ఎవరికి వారు వారివారి పనుల మీద వెళ్ళిపోయారు. మాధవ్ ఆ ఉత్తరాన్ని తీశాడు. టైప్ చేసిన ఉత్తరం అది. క్రింద చూచాడు. సంతకంగాని, పేరుగాని లేదు. కాని అడ్రస్ చూడగానే అది ఎక్కడినుండి వచ్చిందో అర్థమైంది. కొంచెం ఎగ్జైట్ అయ్యాడు కూడా. తండ్రి రావటం చూచి ఉత్తరాన్ని కవర్లో పెట్టేశాడు.

"నీ కాబోయే మామగారు ఈ వారంలో వచ్చి కొంత డబ్బు తీసుకెళ్ళమని కబురు పంపారు మాధవ్. ఎప్పుడు వెళ్దాం ?"

"ఆదివారం" అన్నాడు పొడిపొడిగా. ఐదు రోజులుంది ఇంకా — ఆదివారం. సరే—అని ఆయన వెళ్ళిపోయాడు.

మాధవ్ ఉత్తరం బైటికి తీశాడు.

రోజ్ విల్లా.

మాధవ్‌గార్కి,

మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి. మీకు వీలైనప్పుడు బేసిసంఖ్య తేదీలలో ఏరోజైనా సాయంత్రం ఆరుగంటల తరువాత రావలసినదిగా కోరుతున్నాను.

ఇట్లు
మీ శ్రేయోభిలాషి.

ఆ శ్రేయోభిలాషి ఎవరో వెంటనే తెలిసిపోయింది. ఆమె — అమల — తనకు కాబోయే భార్య.

ఎక్కడ కలుసుకోవాలి ? ఏమీ రాయలేదే ... అని కాసేపు అటు ఇటు చూచాడు. ఏదైన సంకేత స్థలం ఉన్నదేమోనని. లేదు ... అంటే ఇంటికే వెళ్ళాలన్నమాట...ఏం మాట్లాడుతుంది ? మొదట అతడి హృదయం ఎదురు తిరిగింది. వెళ్ళకూడదనుకున్నాడు. కాని ఎందువల్లనో శ్రేయోభిలాషి అని చేత్తో రాసిన ఆ అక్షరాలు అతణ్ణి కదిలించి వేశాయి.

ఆ రోజు పదకొండు — వెళ్తే ఏం ? ముఖం కడుక్కుని గుడ్డలు మార్చుకుని బయలుదేరాడు. కాబోయే భార్యను కలుసుకోబోతున్న ఆనందం — ఆత్రానికన్నా "ఎందుకు పిల్చింది ?" "ఏం మాట్లాడాలి ?" అన్న ఉత్సుకత అధికంగా ఉంది.


గేట్ దగ్గర ఆటో ఆపి లోపలికెళ్ళాడు.

నౌకరు వెంటనే అతణ్ణి సాదరంగా లోపలికి తీసుకెళ్ళాడు. అమలకు చెప్పటానికి లోపలికి వెళ్ళాడు అమల గబగబ వచ్చింది.


అతడు అమలను చూచి చటుక్కున లేచి నుంచున్నాడు. అమల నమస్కరించింది. "రండి... నా గదిలోకి వెళ్దాం" ఈమె ఎటువంటి వ్యక్తి ? పరపురుషుడిని తన గదిలోకి తీసుకుని వెళ్తోంది !

వెనకాతల నుండి చూస్తే ఆమె అందంగానే ఉంది. ఒంపు సొంపులన్నీ ఉండవలసిన తీరులో ఉన్నాయి.

ఐదారు గదులు దాటివెళ్ళిన తరువాత ఒక విశాలమైన గదిలో ప్రవేశించారు. ఒత్తుగా మెత్తగా ఉన్న సింగిల్ సోఫాను చూపిస్తూ "కూర్చోండి" అంది. అతడు కూర్చున్న వెంటనే ఆమె వెళ్ళి పోయింది. మాధవ్ ఆశ్చర్యంతో ఆ గదిని పరిశీలనగా



1982 సంవత్సరానికి "ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్"వారి యువశాస్త్రవేత్త అవార్డు ప్రదానానికి ఎంపిక చేయబడిన డా. ఎ. ఎస్. బుద్ధుడు వీరికి ఈ అవార్డు భౌతికశాస్త్రంలో లభించింది. డా. బుద్ధుడు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్రం శాఖలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.





డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

ఎఫ్. బి. — అకివీడు

నా వయస్సు 17 సంవత్సరములు. నా శరీరము బరువు తగ్గుటకు, నాజూకుగా వుండుటకు నేను అవలంబించవలసిన పద్ధతులు ఏవి ? మూడు నెలల నుండి సాయంత్రం చపాతీలు తినుచున్నాను. అయినా శరీరం బరువు తగ్గలేదు.

★ క్రమ పద్ధతిలో శరీర వ్యాయామం చేయటం, ఆహారం నియమబద్ధంగా కావలసినంత మేరకు మాత్రమే తీసుకోవటం వల్ల శరీరం నాజూకుగా ఉంటుంది. చపాతీలు తిన్నందువల్ల మాత్రం శరీరం నాజూకు రాదు. మితమైన ఆహారం ఏదైనా ఒకటే.

కె వి.ఎస్.ఎస్.ఎం — యలమంచిలి

సెక్స్ వాంఛను అరికట్టే మందులు తెలియ పర్చండి ?

★ సెక్స్ వాంఛను అరికట్టడానికి ప్రత్యేకంగా మందులేవీ లేవు. ఆత్మబలమే ప్రధానం. శస్త్ర చికిత్స ద్వారా టెస్టిస్‌లను, ఓవరీలను తొలగిస్తే కొంతవరకూ ఈ వాంఛ తగ్గుతుంది.

జి. వి. ఆర్. — పాలకొల్లు

పెళ్ళి అయిన వెంటనే తండ్రి కావటం ఇష్టం లేదు. కొన్నాళ్ళు కుటుంబనియంత్రణ పాటిద్దామను కొంటున్నాను. అలా చేయాలంటే ఏ మాత్రలు వేసుకోవాలి, ఎలా వేసుకోవాలి ?

★ కుటుంబనియంత్రణకుగాను పురుషులు వాడటానికి మాత్రలు ఏవీ లేవు. పురుషులు వాడ తగింది ఒక్క నిరోధ్ మాత్రమే !

ఎం. ఎస్. — కడప

నా వయస్సు 16 సం॥లు. నాకు ఎక్కువగా మెడనెప్పి వస్తుంది. కాసేపు కూర్చొన్నా, బస్సుల్లో, రైల్లో ప్రయాణించినా ఈ నెప్పి వస్తోంది. నా తలక్రింద, అంటే ఎడమ చెవి పక్కన ఒక ఎముక ఉన్నది. అది చిన్నప్పటికంటే కాస్త పెద్దదయింది.

★ ఆ ఎముక "సెర్వైకల్ రిబ్" అయి ఉంటే, శస్త్రచికిత్స ద్వారా తీసివేసే అవకాశం ఉన్నది. అలాకాక వేరే ఎముక ఏదైనా పెరిగి ఉంటే దాని గురించి వైద్యులు ప్రత్యక్షంగా పరీక్షించిగాని ఏ నిర్ణయమూ తీసుకోలేరు.

టి. ఎస్. కె. — కదిరి

నా వయస్సు 13 సం॥లు. నా ముక్కులో రక్తం చాలా కాలం నుంచి పడుచున్నది. డాక్టర్‌కి చూపించి ఎన్ని మందులు వాడినా తగ్గటంలేదు.

★ మీరు నిపుణులైన ఇ. ఎన్. టి. వైద్యులకి చూపించండి. మ్యూకస్ మెంబ్రేన్‌లో రక్తనాళాలు గుబురుగా చేరి ఉండటంవల్ల కొన్ని సందర్భాలలో ఇలా జరిగే అవకాశం ఉంటుంది. కాటరైజేషన్ చేయటం ద్వారా నివారణ కలిగే అవకాశం ఉంటుంది

పి. ఎస్. — కరీంనగర్

మా అక్క రోజు కనీసం 30 సార్లయినా అద్దం ముందు నిలబడి ముఖం చూసుకొంటూ, రెండు వేళ్ళతో వెంట్రుకలను లాగుతుంది. ఇది ఒక రోగమేనా ?

★ రోగమని చెప్పటానికి ఆస్కారం లేదు ఇది ఒక విధమైన మానసిక బలహీనత. ఇటువంటి లక్షణం నిరంతరం ఏదో వ్యాపకం పెట్టుకోవటం వల్ల తగ్గిపోతుంది. దీనికి మందులు అనవసరం.

ఆర్. యు. పి. వి. — పెదనింద్రకొలను

నాకు కొంతకాలం నుండి నిద్రలో వీర్యం పోవుచున్నది. అలా పోకుండా ఉండటానికి ఏ మందులు వాడాలో తెలియజేయండి ?

★ యుక్తవయస్కులకి నిద్రలో వీర్యం పోవటం ఏమంత హానికరమైన విషయం కాదు రోగం కానేకాదు. ఒక విధంగా సహజమేనని చెప్ప వలసి ఉంది.

సెక్స్ ఆలోచనలు మానటం, కామోద్రేకాన్ని కలిగించే పుస్తకాలను చదవకపోవటం, సినిమాలు మొదలయినవి చూడకపోవటం వల్ల కొంతవరకు ఈ లక్షణాన్ని తగ్గించవచ్చును. ★

చూచాడు. ఆ గదికి ఒక వైపంతా పెద్దపెద్ద గాజు కిటికీలున్నాయి. ఆ కిటికీల్లోంచి గులాబితోట అందమంతా కానవస్తుంది. ఒక వైపు రాక్స్ నిండా పుస్తకాలు అమర్చి ఉన్నాయి. మరొక వైపు చూడగానే అతడి దృష్టి అక్కడే నిల్చిపోయింది. దీవాన్ మీద గిటార్ ఉంది. దాని ప్రక్కన పెద్ద చెక్క ఫ్రేమ్ ఉంది. ఆ ఫ్రేమ్‌కు కట్టిన త్రాళ్ళు,క్రింద ఉన్న ఊలు ఉండలు, ఇతర సరంజామా చూడగానే అదొక తివాచి అని తెల్సుకున్నాడు దగ్గరగా వెళ్ళి చూచాడు. నాలుగు బై ఐదు అడుగులున్న ఆ తివాచి ఒక్క అడుగు మాత్రం చేసి ఉంది. ఆమె మంచం ఆ గదిలో లేదు "లైట్ వేసుకోండి" అమల అనటంతో అతడు వెనక్కి తిరిగి చూడలేదు. తివాచి ఫ్రేమ్ ప్రక్కగా ఉన్న స్విచ్ నొక్కాడు. చూరు నుండి వ్రేలాడుతున్న లైట్లు వెలిగాయి.

"నా హాబీ" అందామె. "ఆ ప్రక్క గ్రాఫ్ పేపర్‌లో ఉన్న డిజైన్ దీని మీదికి రావాలి."

మాధవ్ ఆ డిజైన్ చూచాడు. అది ట్రెడిషనల్ డిజైన్. లతలు, పూవులు, మొగ్గలు ఉన్న డిజైన్ అది.

అతడు దాన్ని చూస్తూ అక్కడే ఉండి పోతాడేమో అని — "రండి...తీసుకోండి" అంది.

మాధవ్ వెనక్కి తిరిగి వచ్చి సోఫాలో కూర్చున్నాడు. పనిపిల్ల ట్రే అక్కడపెట్టి వెళ్ళి పోయింది.

చల్లటి పళ్ళరసం — వేయించిన జీడిపప్పు అతడికి దగ్గరగా ఉన్న టీపాయ్‌మీద తనే పెట్టింది. తనొక గ్లాస్ తీసుకుంది.

"ఈ రోజు మీరు వస్తారనుకోలేదు ...... భోజనానికి ఉంటారా ?"

"అమ్మ ఎదురుచూస్తూ వుంటుంది. వద్దు" అన్నాడు.

అమల మాట్లాడలేదు. అతడు సంభాషణ ప్రారంభించాలని ఎదురుచూస్తోంది. కాని మాధవ్ ఆ ప్రయత్నం చేయలేదు.

"నా ఉత్తరం అందిందనుకుంటాను ?"

"రాగానే అమ్మ ఇచ్చింది. ఎందుకు రమ్మని రాశారు ?"

"నిన్న మీ నాన్నగారొచ్చి చెప్పారు. ఈ పెళ్ళి మీకు అంగీకారమే అని... నిజంగా మీరు అంగీకరించారా ?" ఆమె అతడికేసి సీరియస్‌గా చూసింది

మాధవ్‌కు ఇబ్బందిగా వుంది. ఒక జీడిపప్పు నోట్లో వేసుకున్నాడు. తనకు సమయం కావాలి... ఎంత చక్కగా అడుగుతోంది! మీరు అంగీకరించారా? అని—


"చెప్పండి—మీ కిష్టమేనా ?"

"లేదు" అని కసిదీరా అరవాలనిపించింది. కాని ఎందువల్లనో ఆమె సమక్షంలో అతడు ఎంతో బలహీనుడైపోతున్నాడు. ఒక్క క్షణం ఆమెకేసి చూచాడు. చీర మామూలు వాయిల్‌చీర. ముఖం క్రిందనుండి ఆమె ఎంతో బావుంది— ఆ ముఖం... గ్లాసులోవున్న పానీయంకేసి చూచి ఒక సిప్ తీసుకున్నాడు. తన అందమైన విగ్రహం తన కళ్ళెదుట నిల్చింది. తనను చూస్తోంటే ఆమెకు ఎలావుందో! పిచ్చి ఎక్కటంలేదూ ? తన మీదబడి నేనెంత అదృష్టవంతురాల్ని అని కౌగలి చుకుంటే.. తను ఛీ.. అని దూరంగా వెళ్ళిపోవాలి ..

(ఇంకా ఉంది)

పరమేశ్వరి-పట్టుచీర

రావినూతల సువర్ణాకన్నన్



తాలూకాఫీసు గుమాస్తా సుబ్బారావు రెక్కలమీద అతని తల్లీ, తండ్రీ, ఇద్దరు తమ్ముళ్ళు, ముగ్గురు చెల్లెళ్ళు ఆధారపడి ఉన్నారు. మొన్ననే పెద్ద చెల్లెలి పెళ్ళి ఉన్నదీ, మన్నదీకాక కాస్త లోను తీసుకుని మరీ అయిందనిపించాడు.

రెండో చెల్లెలు, మూడో చెల్లెలు, "మేంకూడా పెళ్ళికి సిద్ధమే సుమా!" అని వార్నింగ్ ఇచ్చికూడా చాలా కాలం అయింది. ఈడేరిన ముగ్గురాడపిల్లలు ఇంట్లో ఉండరాదని తల్లి పోరడంతో ఎలాగో పెద్ద చెల్లెలికి ఆ మూడు ముళ్ళూ వేయించేశాడు.

మధ్యతరగతి కుటుంబాని కుండవల్సిన క్వాలిఫికేషన్స్ అన్నీ ఉన్నాయి సుబ్బారావుకి.

అంటే.. రిటైరయిన తండ్రికి చుట్టలు, ఉబ్బసంతో బాధపడే తల్లికి మందులు, తమ్ముళ్ళకి ఫీజులు, పుస్తకాలు, చెల్లెళ్ళకి రిబ్బన్లు, పౌడర్లు, ప్లస్ అందరికీ తిండీ, గుడ్డా ఇవన్నీ అతగాడి సంపాదనమీదే జరగాలన్నమాట!

అలాంటి సమయంలో ఓ కుచేలరావుగారి ఆఖరి సంతానమైన పరమేశ్వరితో అతని వివాహం జరిగి పోయింది. అంటే అతని సంపాదనతో బ్రతకడానికి మరో ప్రాణి వచ్చిందన్నమాట!

"నిండా మునిగినవాడికి చలేమిటి" అన్నట్టు వారి రెండు గదుల అద్దె కొంపలో వీధిమీద గది మధ్యగా ఓ తడిక పెట్టించి, ఆ తడికనిండా, సినిమా హాల్లో పనిచేసే స్నేహితుడిచ్చిన వాల్‌పోస్టర్లన్నీ నీట్‌గా అతికించి, అదే ఓ ఎ. సి. రూమ్‌గా భావించి ఆనందించేశాడు సుబ్బారావు.

పరమేశ్వరి నిరుపేద ఇంట పుట్టినా బంగారు బొమ్మలా ఉంటుంది. కష్టసుఖాలు తెలిసిన పిల్ల!

తండ్రి ముట్టజెప్పిన కట్నం డబ్బులో పెళ్ళి ఖర్చులు పోను కాస్తో, కూస్తో మిగిల్చి ఆడబడుచు కట్నం కోసం దాచిన మామగార్ని మనస్ఫూర్తిగా అభినందించింది.

బంగారం ధర ఆకాశాన్నంటే సంగతి తెలిసిన పరమేశ్వరి బంగారం గురించి కల్లోనైనా తలవలేదు.

కానీ... ఎప్పటికైనా ఓ పట్టుచీర కొని కట్టుకోవాలనే ఆశమాత్రం కొండలా పెరిగిపోతూంది. పసితనం నుంచీ ఆ కోరిక పురుగులా తొల్చేస్తున్నా గంపెడు సంతానంలో ఆఖరిదైన పరమేశ్వరి కోరిక కన్నెగా తీరనేలేదు.

పెళ్ళిలో సాధారణంగా ఎంత పేదవారైన ఒక పట్టుచీర (లాంటిది) పెట్టడం సాంప్రదాయంగా వస్తుందని తెలిసిన పరమేశ్వరి తనక్కాబోయే వరుని కోసం కన్నా, అతగాడు పెట్టబోయే పట్టుచీర కోసమే రంగు రంగుల కలలు కన్నది.

కానీ మొయ్యలేనన్ని బాధ్యతల్ని మోసే సుబ్బారావు పెళ్ళికి పెట్టే మూడు చీరల్లో ఒకటి పాలిష్టర్‌ది, మిగతా రెండు ఏవో వాయిల్ చీరలు తీసుకున్నాడు.

భవిష్యత్తులో తనకి పెట్టబోయే పట్టుచీర, అది కట్టుకుంటే ఇనుమడించే తన అందం, టెక్నికలర్‌లో ఊహిస్తున్న పరమేశ్వరి తనకి పెట్టిన చీరలు చూసుకుని, ఆకాశంలో విహరిస్తున్న స్వేచ్ఛా విహంగం వేటగాని బాణం దెబ్బ తగిలి ఒక్కసారి భూమ్మీది కొరిగిపోయినట్టు అయిపోయింది.

ఆమెకన్న టెక్నికలర్ కలలన్నీ కరిగిపోయి కనీసం బ్లాక్ అండ్ వైట్ కలలైనా కాకుండా, అరిగి గీతలూ తూట్లూ పడిపోయిన పాతఫిలింలా తయారై వికటాట్టహాసం చేశాయి.

తెలివిగల పరమేశ్వరి తన అనుభవాన్ని మనసు లోనే దాచుకుని, నిండుకుండలా పైకి తిరుగుతున్నా కోతి మనసు అప్పుడప్పుడు అల్లరి చేస్తూనే ఉంది.

దాదాపు మూడు సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోయాయి. ఆ కాలపరిమితిలో సుబ్బారావు మరో చెల్లెలు పెళ్ళి చేసి మరో నాలుగువేల రూపాయల అప్పుకు యజమాని అయ్యాడు.

ఈ మూడేళ్ళలో పరమేశ్వరికైతే కాన్పు రాలేదుగానీ పెద్దాడబడుచు మాత్రం ఏటా కాన్పుతో మూడు పురుళ్ళూ పుట్టింట్లో పోసుకుని ఆ ఆపరేషన్ కాస్తా కూడా అయిందనిపించుకుని మరీ వెళ్ళింది.

ఆ రోజు సుబ్బారావు ఆఫీసునుంచి రాగానే తల్లి ఓ పిడుగులాంటి శుభవార్త అందజేసింది. "మన చిన్నమ్మాయికి నెల తప్పిందిట !. వేవిళ్ళతో మరీ పుల్లలా అయిపోయిందట ! వెంటనే తీసికెళ్ళి ఓ నెల్లాళ్ళుంచుకోమంటూ మీ బావగారు రాశారు." అని !

సుబ్బారావు పక్కలో బాంబ్ పేలినట్టు ఉలిక్కి పడ్డాడు. నిస్సహాయంగా భార్యకేసి చూశాడు. ఆమె ముఖం కూడా పాలిపోయినా భర్తకి కళ్ళతోనే ధైర్యం చెప్పింది.

"ఏమిట్రా అలా బెల్లంకొట్టిన రాయిలా ఉండి పోయావ్ ? ఈ విషయం వింటే నీకు ఆనందంగా లేదూ ?" చిరాగ్గా అంది తల్లి.

"అహా ! అ ది కా ద మ్మా ! మొన్న పెద్దమ్మాయి పురిటికైన అప్పులే ఇంకా తీరలేదు ! ఇంక చిన్నమ్మాయి పెళ్ళికైన అప్పు వడ్డీతో కలిసి పాపంలా పెరిగిపోతూనే ఉంది" నసిగాడు సుబ్బారావు.

"బావుంది నాయనా ! నీకు అప్పులున్నాయని ఆడపిల్లకి కాన్పురాకుండా పోతుందా ? అవున్లే ! విన్నని ఏం లాభం ? అంతా మా ఖర్మ ! మీ నాన్నే నాలుగు రాళ్ళు సంపాయిస్తుంటే నువ్వామాట అనగలిగేవాడివా ? అందుకే అన్నారు—'అడ్డాలనాడు బిడ్డలుగానీ, గడ్డాలొచ్చాక బిడ్డలా ?' అని !" రాని కన్నీరు తుడుచుకుంటూ అంది తల్లి.

"అది కాదత్తయ్యా...!" ఏదో సర్దిచెప్ప బోయింది పరమేశ్వరి.

"అవునమ్మా ! ఈనాటికి నువ్వూ నాకు చెప్పొచ్చావ్ ! ఏదో శాస్త్రం చెప్పినట్టు గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించిందట ! అయినా ఇన్నాళ్ళయినా నీకు కడుపు పండలేదని, ఎదుటివారికి వస్తే ... ఇలా మాట్లాడకూడదు! ఎవరి అదృష్టం వారిది!" అంది అదోలా కోడలికేసి చూస్తూ.

అత్తగారి మాటలకి బిత్తరపోయింది పరమేశ్వరి నిస్సహాయంగా భర్తకేసి చూసింది. అతని ముఖానకూడా నెత్తురులేదు.

తమ కుటుంబం ఓ దారికొచ్చేవరకు సంతానం వద్దనుకుని జాగ్రత్తపడ్డ ఆ దంపతులకి పెద్దావిడ మాటలు శూలాల్లా గుచ్చుకున్నాయి

"లాభంలేదు ! తనకు మాలిన ధర్మం అనవసరం ! ఇంక వీళ్ళ పురుళ్ళు నేను పొయ్యలేను ! నోరుమూసుకుని ఇలాగే ఉంటే ... ఇప్పట్లో మన బాధ్యతలు తీరవు సరిగదా ... ఇంకా ఎక్కువౌతాయి! అందుకే ... మనం కూడా ఒకరిద్దరు పిల్లలు పుట్టగానే ఫుల్‌స్టాప్ పెట్టేద్దాం !" అన్నాడు సుబ్బారావు విసుగ్గా భార్యతో.

అయినా అతనికి ఏదీ తప్పలేదు ! కాలం ఎవరి కోసం ఆగదు ! అలా వడివడిగా పరుగులు తీస్తూనే ఉంది కానీ పరమేశ్వరి కోరిక మాత్రం కోరికగానే మిగిలిపోయింది.

ఇన్నేళ్ళయి కాపురం చేస్తున్నా, మొయ్యలేని బరువుమోస్తూ గానుగెద్దులా కుటుంబాన్ని లాక్కొస్తున్న భర్తకి తన కోరిక చెప్పడానికి ఆమెలోని విజ్ఞత ఒప్పుకోలేదు.

కానీ ఎవరు పట్టుచీర కట్టుకున్నా, బజార్లో పెద్ద పెద్ద షాపులముందు షోకేసుల్లోని బొమ్మలకి అందంగా కట్టిన పట్టుచీరలు చూసినా అలా చూస్తూ నిల్చుండిపోయేది.

ఒక రోజు సుబ్బారావు భార్యతో సహా ఓ ఫ్రెండింటికి పార్టీకెడుతూ భార్య కోరిక కని పెట్టేశాడు.

"పరం !... పట్టుచీరలంటే నీ కంత ఇష్టమా ?" అన్నాడు పేవ్‌మెంట్‌మీద ఆగిపోయి, షాపుబైట అమర్చిన ఓ పట్టుచీరకేసి చూస్తున్న భార్యతో—

"ఆఁ?...అఁ హఁ .." ఉలిక్కిపడింది కామేశ్వరి.

"అంత కంగారెందుకు ?... పట్టుచీరలంటే నీకు చాలా ఇష్టంకదూ?" ఆప్యాయంగా అన్నాడు నడుస్తూనే—

సంక్రాంతి లక్ష్మి

మనసులలో నీ కోసం ఆశల గాలిపటాలు
ఎగిరేవేళ ఇది
జరజర రావమ్మా ఓ సంక్రాంతి లక్ష్మి

రైతుల కలలన్నీ ధాన్యపు రాసులుగా
మారే కాలమిది
గబగబ రావమ్మా ఓ సంక్రాంతి లక్ష్మి

మమతల ముగ్గులు తీర్చిన ప్రతి లోగిలీ
పలికింది నీకు ఆహ్వానం
చెరచెర రావమ్మా ఓ సంక్రాంతి లక్ష్మి

శీతగాలికి వేస్తారులే నీకు భోగిమంటలు
వెరవక
వడివడిగా రావమ్మా ఓ సంక్రాంతి లక్ష్మి

ప్రతి ఇంటా బొమ్మల కొలువందున్నారు
దేవతలంతా
బిరబిర నీవూ రావమ్మా ఓ సంక్రాంతి లక్ష్మి

మా ఆశలకు ఊపిరిగా క్రొత్త క్రాంతిని
నీతో తెస్తూ
త్వర త్వరగా రావమ్మా ఓ సంక్రాంతి లక్ష్మి

— ఇసుకపల్లి సుజాత

"అవు ..నండీ ! . కానీ మీరు . కొనద్దు" తడబడిందామె.

పేలవంగా నవ్వాడు సుబ్బారావు.

"పిచ్చిదానా ! ఇప్పుడు నువ్వు కావాలంటే మాత్రం నేను కొనగలనా?" అతని కంఠంలో బాధ తొంగి చూసింది.

భర్త ముఖంలోకి చూసిన పరమేశ్వరి చాలా బాధపడింది. తన చపలచిత్తానికి కాస్త సిగ్గు పడింది కూడ !

"సరి ! సరి ! ముందు పదండి ! మనం ఇలా కష్టసుఖాలు చెప్పుకుంటూ వెళ్తే అవతల పార్టీ అయిపోతుంది " నవ్వుతూ మాటమార్చేసింది

ఆరోజే సుబ్బారావు కఠిన శపథం చేసు కున్నాడు. భార్యకెలాగైనా ఓ పట్టుచీర కొని పెట్టాలని ! ..

* * *

"పరం ! త్వరగా రావాలి !" అరుస్తూ హడావిడిగా వచ్చాడు సుబ్బారావు.

అతని ముఖం వెలిగిపోతూంది !

భర్త అరుపుకి కంగారుగా పరిగెత్తుకొచ్చింది పరమేశ్వరి "ఏమిటి ?" అంటూ

"ఓ గుడ్ న్యూస్ !. !" ఊరిస్తున్నట్టు అన్నాడు సుబ్బారావు

"ఏమిటండీ...!" ఆశ్చర్యంగా అంది పరమేశ్వరి.

"నీకో పట్టుచీర రాబోతోంది !"

"ఏమిటి ?" ఉలిక్కిపడింది పరమేశ్వరి.

"అదేనోయ్ ! . నీకో పట్టుచీర కొన బోతున్నాను !"

"నిజం ?... మ... రి... డబ్బు ?"

"ఉంది లేవోయ్ !" నవ్వేశాడు సుబ్బారావు.

"ఏరా అబ్బాయ్ ! మొన్న చిన్నమ్మాయి కొడుక్కి మురుగులు చేయిద్దామంటే దమ్మిడీ లేదన్నావ్ ?" అదోలా చూసింది తల్లి.

అదేం పట్టించుకోలేదు సుబ్బారావు. "ఏ రంగు కావాలి ?" ఉత్సాహంగా అన్నాడు

"పట్టుచీర ముదురురంగైతేనేబావుంటుంది!" అంది పరమేశ్వరి ఆనందంగా.

"కానీ ." ఆగిపోయాడు సుబ్బారావు.

"ఊఁ .. కానీ ...?" గుండె క్షణం ఆగింది పరమేశ్వరికి.

"అది ప్యూర్ సిల్క్‌కాదు ! కానీ . అచ్చం పట్టు చీరలానే ఉంటుంది బోలెడు జరీ ! మా ఆఫీసులో వాళ్ళు చాలా మంది తీసుకుంటున్నారు !"

"ఓస్ ! అదా . మరేం పరవాలేదు ! ఈ రోజుల్లో మంచి జరీ వున్న ప్యూర్ సిల్క్ చీరలు కొనాలంటే మాటలతో ఉందా ఏం ? ఇంతకీ ఖరీదెంత ?" అంది పరమేశ్వరి.

"మూడువందల యాభై !"

"కా ..నీ... అంత డబ్బు ?..."

"అదే చెప్పబోతున్నాను ! వాయిదాల పద్ధతి ! నెలకి ఇరవై రూపాయలిస్తే చాలు !"

"ఆఁ ? " పరమేశ్వరి మురిసిపోయింది.

తెల్లవార్లూ, చీర ఏ రంగులో ఉండాలో, బార్డర్ ఎలా ఉండాలో ఒకరొకరు సంప్రదించుకుని,

దీపావళి కథలపై వ్యాసరచన పోటీలో మొదటి బహుమతి రు. 250 లు పొందిన వ్యాసం

అంతరంగ మథనం - మనో విశ్లేషణ!

ఈ ఏటి దీపావళి కథల పోటీలో ఎన్నికైన కథలలో అగ్రగామి— 'నీ గుండె కార్చిన కన్నీళ్ళు, ఇందులో భర్త మరణానంతరం భార్య పడే మనోవేదన చక్కగా చిత్రీకరింపబడినది. కథచివరలో వసుంధరమ్మగారి అంతరంగ మథనమూ— మనో విశ్లేషణా గొప్పగా వుంది.

ఇక ద్వితీయ స్థానం పొందే 'మదర్పిత... తాంబూలాది' అన్న కథలో భరద్వాజ అనబడే జి. ఎస్. గారు మూర్తి, సుజాత దంపతుల యెడ పెళ్లిలో కనబర్చిన ప్రేమా; వాళ్ళు తన బంధువులు కారనీ, తన అధికారానికీ— హోదాకూ సరితూగరని తెలిసిన తర్వాత ప్రదర్శించిన కర్కశత్వమూ— నేటి సమాజపు పోకడకు చక్కని ప్రతిబింబం. పాత్రలను మలచిన తీరూ— కథా గమనమూ చాలా నేర్పుగా వున్నాయి.

'దూరం' అన్న కథలో నాగరికత పెరుగుతున్న కొలదీ మనుషుల అంతరంగాలు— ఎన్నివేల మైళ్ల దూరాలకు నెట్టివేయబడుతున్నవో, ఎన్ని అగాధాల గవతల దిక్కుతోచక నిల్చున్నవో తెలుసుకుంటాము. ఇది మూడో శ్రేణికి వెళ్తుంది.

నాలుగోవరుసలో నిలిచేది 'పిసరంత గుండె' నిరుద్యోగి శంకరం ఈతిబాధలూ— ఆతడు పాపపై పెంచుకున్న మమతలూ— జీవనసమరంలో గెలువలేక జీవితాన్ని విషాదాంతంగా మార్చుకున్న ఆతడి నిర్ణయమూ ఏమనిపిస్తుయంటే— 'పాపం పిరికివాడు ! శంకరం' అని

ఆ తర్వాత 'హసీనా' అట్టడుగువర్గాలవారిని 'డబ్బు' ఎలా శాసిస్తుందో, దాని ప్రభావం వారి జీవితాలపై ఎంతగా వుంటుందో ఎలుగెత్తి చాటుతుంది.

ఆఖరిది 'ఉప్పులేని కూడు'లోని లింగన్నపాత్ర- బాధ్యతలెరుగని తండ్రులకు చక్కని చురక అటువంటి వారిలో ఉన్నతాదర్శాలనూ, పశ్చాత్తాప హృదయాలనూ ఆశించే 'వెంకటే'శాల ప్రయత్నం— 'ఎండమావిలో నీళ్ళు త్రాగునట్లు.'

— వారెడ్డి వాగిరెడ్డి

ఆఖరికి నీలంరంగు చీరకి ఎర్రని బార్డరైతే బావుంటుందని నిర్ణయించుకున్నారు. ముసలావిడ గొణుగుకున్నా, అదేమీ పట్టించుకోకుండా నిద్రపట్టేన కాసేపూ . . కొనబోయే పట్టుచీర కట్టుకుని గిలకలా తిరిగేస్తున్నట్టు కలలు కనేసింది పరమేశ్వరి.

* * *

మర్నాడు ఇద్దరూ వెళ్ళి పట్టుచీర తెచ్చుకున్నారు. ఒక్క అత్తగారు తప్ప పరమేశ్వరి చీరని ఇరుగు పొరుగులంతా ఎంతో బాగుందని మెచ్చుకున్నారు

దాన్ని చూసుకుంటూ, వారి మాటలు వింటు పరమేశ్వరికి తాను ఇంద్ర పదవి అలంకరించినంత ఆనందం కలిగింది. ఓసారి అలా కట్టేసుకుని, నాలుగు కలరా ఉండలు తెప్పించుకుని జాగ్రత్తగా ఆ చీర మడతల్లో పెట్టి పెట్టె అడుగున అంతకన్నా భద్రంగా దాచింది, త్వరలో జరగబోయే ఆమె అక్క కూతురి పెళ్ళిలో అది కట్టుకుని, జరీ అంచులు కనిపించేలా పైటకొంగు దోపుకుని గర్వంగా తిరగాలని.

ఉరుములేని పిడుగులా సుబ్బారావు పెద్ద చెల్లెలు, పినమామగారి కొడుకు పెళ్ళి కోసం, దిగబడి హటాత్తుగా వదినగారి చీర చూసి కాస్సేపు ముఖం మాడ్చి వెంటనే తేరుకుని,

"వదినా ! నీ చీర చాలా బావుంది !... ఓసారి కట్టుకోవద్దూ ? మా మరిది పెళ్ళిలో ?" అంది.

పరమేశ్వరి తృళ్ళిపడింది.

కారణం ఆమె అక్క కూతురి పెళ్ళి కూడా ఆ వాగంలోనే.

దాన్దేముంది. కానీ... నేమా పెళ్ళి కెళ్ళాలి!" గునిసింది.

"మీ అక్క కూతురు పెళ్ళి పదిహేను గదా ! ఈ పెళ్ళి పదమూడేనాయె ! పదమూడు తాను కట్టుకుని... నీకు పంపితే, నువ్వు పదిహేనున కట్టుకుందువుగాని !" అంది అత్తగారు మార్గం సూచించినట్టు.

పరమేశ్వరి పట్టుచీర

"కానీ... నేను పన్నెండు ఉదయమే వెడుతున్నానుగా ?" మెల్లగా అంది పరమేశ్వరి.

"అయితేనే... సుబ్బులొచ్చేది పధ్నాలుగు కదా వాడితో పంపుతుందిలే !" తేలిగ్గా అంది అత్తగారు.

ఈసారేమనాలో తోచలేదు పరమేశ్వరికి. మురిసిపోతూ చీర తన పెట్టెలో సర్దేసుకుంది పెద్దమ్మాయి

* * *

పదిహేను రాత్రి ఏడు గంటలు దాటింది. పెళ్ళిల్లు ఎంతో సందడిగా ఉన్నా భర్త రాకకోసం ఆతృతగా ఎదురుచూస్తోంది పరమేశ్వరి.

సుబ్బారావు వచ్చాడు.

అతనిక్కూడా ఫలహారాలిచ్చి కుశలప్రశ్నలు వేశారు తోడల్లుడు, వదినగారు.

"ఏదమ్మా... నీ చీర ?... చూపించు ! తెగ మురిపించేశావ్ ?" నవ్వుతూ అంది పరమేశ్వరి చిన్నక్క.

"చీర తెచ్చావా ?" అన్న భార్యకేసి నవ్వుతూ చూసి సూట్‌కేస్‌లోంచి ఓ పేకెట్ తీసి భార్య కందించి తోడల్లుడితో కబుర్లలోపడ్డాడు సుబ్బారావు

మెల్లగా కవర్లో పెట్టిన చీర మడతని బైటికి తీసింది పరమేశ్వరి. అంతా ఆతృతగా చూస్తున్నారు.

చీరని పూర్తిగా చూసిన పరమేశ్వరి నోట ఓ చిన్న కేకలాంటిది వెలువడింది. తల తిరిగి మైకం వచ్చినట్టు కుప్పకూలిపోయింది.

చీర కాళ్ళముందు పడిపోయింది.

భార్య ప్రవర్తనకి బిత్తరపోయిన సుబ్బారావు కంగారుగా లేచి కిందపడ్డ చీరని చేతుల్లోకి తీసుకున్నాడు.

"అది తనుకొన్న చీరేనా?" అన్న అనుమానం అతని నోట మాటరానీలేదు.

లేత నీలం రంగు చీరంతా అంచునుండి దిగిన ఎర్రని మరకలతో, అంచంతా వెలిసిపోయి, ఏ రంగో తెలియనట్టుగా ఓ పెద్ద బామ్మగారి మడి బట్టలా ఉంది.

ఇంకా చెప్పాలంటే ఓ రంగు రంగుల అలుగ్గుడ్డలా ఉంది !

తెల్లబోయాడు సుబ్బారావు. తాను కొన్న అందమైన చీరకి ఈ రూపెలా వచ్చిందో బుర్ర పగలగొట్టుకున్నా అర్థంకాలేదతనికి.

అసలు జరిగిందిది !

ఆ పెద్దమ్మాయిగారు, పెళ్ళిలో ఎంచక్కా అది కట్టేసుకుని కులాసాగా పందిరంతా, తిరిగేసి, అలసిపోయి, "పసివాడు" అని వాళ్ళనుకునే ఆఖరి వాణ్ణి ఒళ్ళో పెట్టుకుని ఓ పెద్ద గ్లాసునిండా కాఫీ తెచ్చేసుకుని సేవిస్తూ కూర్చుంది.

ఆ కుమార రత్నం ఇది పట్టుచీరగదా అదైనా చూడక, ఒకటి, రెండు పన్లు చెయ్యడమేగాక తల్లి తాగుతున్న అర్ధశేరు కాఫీ ఒక్క విదిలింపుతో చీరమీద వంపేసి, వేడి కాఫీ వంటిమీదపడి చురుక్కుమనడంతో ఆరున్నొక్క శృతి ఆలపించాడు.

చీర పరిస్థితి గమనించిన పెద్దమ్మాయి ఓ క్షణం కొయ్యబారిపోయింది. వెంటనే తేరుకుని, కాస్సేపాలోచించి, ఓ చారెడు సర్ఫ్‌వేసి నానబెట్టి శుభ్రంగా ఉతికేసింది. దాంతో అన్ని రంగులూ ఏకమై అది ఒరిజినల్‌గా ఏ రంగో తెలియనంతగా మారిపోయి, ఎంచక్కా ఇంద్రధనుస్సులోని రంగుల్లా, మధ్య మధ్య మాడరన్ ఆర్ట్‌లా తమాషాగా తయారైంది.

ఆ చీరని ఓ పావలా ఇచ్చి ఇస్త్రీ చేయించి ఒకటికి రెండుసార్లు చూసి కవర్లోపెట్టి, మధ్యలో అన్నగారు విప్పకుండా పిన్నులుపెట్టి మరీ ఇచ్చింది పెద్దమ్మాయి.

ఆ ప్యాకెట్ భద్రంగా భార్య కందజేశాడు సుబ్బారావు.

పాపం ! పరమేశ్వరికి పట్టుచీరమీది మోజైనా తీరలేదు ! దానికైన అప్పయినా తీరలేదు. కానీ . . ఆ చీర మాత్రం కీర్తిశేషురాలైపోయింది ! సారీ ! కీర్తిశేషిగాపోయింది !


★

సరికొత్తను సంప్రదాయ స్మృతిలో



ఆప్కోవారి పోచంపల్లి సిల్కులు

నూలు కండెలకూ ఇచ్చెలకూ రంగులద్ది నేసే పద్ధతి దశాబ్దాల క్రితం చీరాల నుంచి పోచంపాడుకు వ్యాపించి, అక్కడే స్థిరపడింది. సిల్కు, నూలు పోగులకు రంగులద్ది, పడుగు పేకల్లో అద్భుతమైన డిజైన్లలో నేస్తున్నారు చిలకలు, హంసలు, ఏనుగులు, గళ్లు, పూలబొమ్మలు నేతపనివారి మగ్గాల్లో రూపు కడుతున్నాయి రకరకాల సరికొత్త వస్త్రభేదాల్ని సమ్మోహనంగా సృష్టిస్తున్నాయి ఇప్పుడు పోచంపల్లి సిల్కులు చిత్ర విచిత్ర నమూనాలకూ, నిగనిగలాడే నిర్దిష్ట వర్ణ సమ్మేళనకూ ప్రపంచమంతటా ప్రఖ్యాతి నార్జించాయి



చేనేతలను ప్రోత్సహించండి
ఆప్కో
చేనేతలు కొనండి

ఆప్కో చేనేతలు

kiron/apco/831

చింపాంజీ కోసం అయిదు లక్షల నిర్మాణ వ్యయం!

లాస్ ఏంజలిస్ నుంచి చింపాంజీ వచ్చింది. నాలుగడుగుల ఎత్తు, తొమ్మిదేళ్ల వయసు వున్న దానిపేరు 'లులూ'. మొదట అది అమెరికా నుంచి ఢిల్లీకి వచ్చి అక్కణ్ణుంచి ఆ మర్నాడు ఎయిర్ బస్‌లో మద్రాసు వచ్చింది



చింపాంజీకి ముద్దు పెడుతున్న దర్శకుడు రాఘవేంద్రరావు

'అడవిసింహాలు', తెలుగు, హిందీ షూటింగ్ కోసం నిర్మాతలు అర్జునరాజా, అశ్వనీదత్‌లు ఎంతో ఖర్చుపెట్టి యీ 'లులూ'ని ప్రత్యేకంగా తెప్పించారు. మానవాకృతి లేదుగాని అన్నీ మనిషి చేష్టలే కలిగిన యీ చింపాంజీకి మాటలు మాత్రం రావు. సుమారుగా కోతి ఆకారం కలిగిన దీని చేతులు, మూతి కూడా బాగా పొడవుగావున్నాయి.

'లులూ' మద్రాసు చేరుకోగానే మా యింటికి తీసుకొచ్చారు. తొమ్మిది ఏపిల్ పళ్ళు, ఐదు కేకులు, ఆరు కోక్ (కేంపాకోలా)లు తాగింది. ఆ తర్వాత ట్రిబుల్‌ఫైవ్ సిగరెట్ వెలిగించి, యాష్‌ని ట్రేలో వేసి, సిగరెట్ అయిపోతున్నపుడు నలిపి యాష్ ట్రేలో

చింపాంజీ (లులూ)



వేసింది." అన్నారు దర్శకుడు కె. రాఘవేంద్రరావు. "ఢిల్లీ నుంచి దాన్ని కార్గోలో వేసి తీసుకొచ్చారు. తనను మనుషుల మధ్య కూచోనివ్వకుండా కార్గోలో వేసి తీసుకొచ్చినందుకు కొంత అలక వహించినా, మద్రాస్ ఎయిర్‌పోర్ట్‌లో ఆఫీసర్స్, కస్టమ్స్ అధికారులు లులూతో కరచాలనం చేసి టీ యిచ్చి ఆదరంగా పలుకరించటంతో ఆ కోపాన్ని తగ్గించుకుంది."

సినిమా కబుర్లు

చింపాంజీ వచ్చిన రోజు మధ్యాహ్నం శారదా స్టూడియో అంతా జనసందోహంతో నిండిపోయింది. వీరంతా దాన్ని చూడడం కోసం వచ్చిన వారే! షూటింగ్ చేయడం కోసం పోలీసుల్ని పిలిపించి జనాన్ని అదుపులో పెట్టవలసిన పరిస్థితి ఏర్పడింది. సెట్లో రావుగోపాలరావు, సత్యనారాయణ, ప్రసాద్‌బాబు, జగ్గారావు, ఆనందమోహన్‌లు, వారితోపాటు బోనుల్లో పెట్టబడిన సింహాలు, పులులు వున్నాయి. 'లులూ' సెట్‌కి రాగానే దర్శకుణ్ణి చూసి ఏదో సంజ్ఞ చేసింది. రాఘవేంద్రరావు దగ్గరికి వచ్చి దానికి ముద్దుపెట్టారు.

"చింపాంజీ యీ చిత్రంలో రెండు వేషాలు వేస్తోంది. ఒకటి మగ చింపాంజీ. మరొకటి: ఆడ చింపాంజీ. మగ చింపాంజీ విలన్స్‌తో వుండి చెడు పనులు చేయడం, ఆడ చింపాంజీ హీరో హీరోయిన్స్‌తో


కలిసి మంచి పనులు చేయడం జరుగుతుంది. మగ దానికి సూట్, ఆడదానికి లంగా, వోణి — డ్రెసులు వుంటాయి." అన్నారు యీ చిత్రదర్శకుడు రాఘవేంద్రరావు.

నాలుగు వారాలపాటు 'అడవిసింహాలు' ద్విభాషా చిత్రంలో పాల్గొనడానికి వచ్చిన యీ చింపాంజీ (లులూ)కి ప్రతిఫలం (రెమ్యూనరేషన్) మూడున్నర లక్షల రూపాయలట! దానికి రాను పోను, భోజన వసతి సౌకర్యాలకి లక్షన్నర ఖర్చట! వెరసి ఐదులక్షలు. అంటే మన హీరోలకిస్తున్న రేటన్నమాట! ఇరవై ఏళ్ల క్రితం జెమినీవారి 'ఇన్సానియత్' చిత్రంకోసం ఒక చింపాంజీని తెచ్చారు. అదిప్పుడు వుందో లేదో గాని అపుడు దాని వయసు రెండేళ్ళు. ఎత్తు రెండు అడుగులు.

ఎవరికోసం చేయాలి?

దేవత శతదినోత్సవ వేడుకలు మద్రాసు తాజ్ కోరమాండల్‌లో జరిగాయి. 19 కేంద్రాల్లో విజయవంతంగా నడిచినందుకు యీ చిత్రంలో పని

రామానాయుడు



చేసిన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు, ప్రదర్శన శాలల అధిపతులకు, పంపిణీదార్లకు షీల్డ్‌ల ప్రదానం చేశారు నిర్మాత డి. రామానాయుడు. కొందరికి ప్రముఖ దర్శక నిర్మాత ఎల్. వి. ప్రసాద్ చేత, మరికొందరికి శోభన్‌బాబు, వాణిశ్రీల చేత, ఇంకొందరికి దర్శకుడు రాఘవేంద్రరావు, కోగంటి కేశవరావు (శాయికృష్ణ), హిందీ నటి బిందియా గోస్వామిల చేత యీ షీల్డుల్ని యిప్పించారు.

శతదినోత్సవ సభలకి ఆనవాయితీగా వుండే అధ్యక్షుడు, ముఖ్యఅతిథి, షీల్డుల ప్రదాత (ఒక్కరే) వుండే సాంప్రదాయానికి స్వస్తి చెప్పి ఒక కొత్త పంథాలో యీ ఫంక్షన్‌ని నడిపించారు, రామానాయుడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''ఈ చిత్రంలో నటించిన యిద్దరు దేవతలు యీ సభలో లేరు రాలేదు. ఎవరికోసమైతే యీ ఫంక్షన్ జరుపుతున్నామో, వారు యిది తమదిగా భావించి రానపుడు బాధకలుగుతున్నది. ఈ ఫంక్షన్ తేదీని ముందుగా తెలిపినా, వారు రావడం జరగలేదు. అలాంటపుడు యీ ఫంక్షన్స్‌ని ఎవరికోసం చేయాలి?'' అన్నారు. ఈ ఫంక్షన్‌కి 'దేవత'లే కాదు, ముగ్గురు నలుగురు సాంకేతిక నిపుణులు కూడా రాలేదు వీరందరినీ ఉద్దేశించే ఆయన అన్నది.

రామానాయుడుగారలా అనడంలో తప్పులేదు. కష్టపడి యీ చిత్ర విజయానికి కృషిచేసిన కళాకారులు, సాంకేతికనిపుణుల ప్రతిభా విశేషాలను పబ్లిక్‌కి వ్యక్తపరచడం కోసం — వారి సంతృప్తి కోసం యిటువంటి వేడుకల్ని ఏర్పాటు చేస్తున్నపుడు వారు రాకపోతే ఎంతైనా బాధ కలుగుతుంది మరి!



''రామానాయుడుగారు యీ చిత్రంలో దేవతలు రానందుకు కించిత్ బాధపడినా, నిన్న వారింటికి కొత్త దేవతలు వచ్చారు. కొత్త శోభను తెచ్చారు.'' అంటూ సభికుల హర్షధ్వానాల మధ్య నాటి కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రముఖ నేపథ్య గాయకుడు యస్. పి. బాలసుబ్రహ్మణ్యం చెప్పారు. కొత్త దేవతలు అంటే రామానాయుడుగారి కొడుకు, కోడలు. అంతకు ముందు రోజే వారి వివాహం జరిగింది. ఆ నవదంపతుల్ని కొత్త దేవతలుగా పోల్చి చెప్పారన్నమాట, బాలు!

ఆర్టిస్టుకి భాష అడ్డం రాదు

శ్రీదేవి యివాళ దక్షిణాదిన నంబర్ వన్ తారగా వెలుగొందుతున్నది తెలుగు చిత్రాల్లోనే కాదు; తమిళ చిత్రాల్లో కూడా ఆమె కంత డిమాండ్ వుంది. ఇపుడామెకు హిందీ మార్కెట్ కూడా ఉధృతంగా వచ్చింది. మూడేళ్ల క్రితం శ్రీదేవి తొలిసారిగా 'సోల్వాసావన్' (పదహారేళ్ల వయసు) హిందీ చిత్రంలో నటించింది. ఆ తర్వాత యిపుడు పద్మాలయావారి 'కిమ్మత్‌వాలా'లో నటిస్తోంది. ఈ చిత్రంలో నిర్మాణంలో వుండగానే జస్టిస్‌చౌదరి, జానీదోస్త్, రామానాయుడుగారి 'దేవత' హిందీ చిత్రాల్లో బుక్ అయింది. జస్టిస్ చౌదరి, జానీదోస్త్ చిత్రాల నిర్మాణం ప్రారంభం అయింది. 'దేవత' హిందీ మార్చి 10 నుంచి మద్రాసులో ప్రారంభం అవుతుంది. ఈ నాలుగు చిత్రాల్లోనూ జితేంద్ర నాయకుడు. కె. రాఘవేంద్రరావు దర్శకుడు.

పోతే, ఐదవ చిత్రం 'సద్మా' (షాక్)లో శ్రీదేవి సరసన కమలహాసన్ నాయకుడు. బాలుమహేంద్ర దర్శకుడు. జితేంద్ర 'సర్దార్ పాపారాయుడు' హక్కుల్ని కొని హిందీలో పునర్నిర్మిస్తున్నారు. అందులో నటించ వలసినదిగా శ్రీదేవిని అడుగుతున్నారాయన. మరో యిద్దరు ప్రముఖ బొంబాయి నిర్మాతలు కూడా ఆమెను తమ చిత్రాల్లో నటించవలసిందిగా కోరుతున్నారు.

''హిందీ భాష మీ ప్రాబ్లెమ్ కాదా? అని'' శ్రీదేవిని అడిగినపుడు''—''ఆర్టిస్టుకి భాష అడ్డం రాదు. చెయ్యగలిగే నేర్పు వుండాలేగానీ, ఏ భాష అయినా ఒకటే'' అన్నదామె టక్కున తడుముకోకుండా.

శ్రీదేవి మనసులాగే ఆమె ప్రవర్తన కూడా మంచిది. భేషజంలేని నటి. అందర్నీ ఆప్యాయంగా పలుకరిస్తూ కలసి మెలసి వుంటుంది. హిందీ చిత్రాల్లో కూడా తనకి చక్కని అవకాశాలు కల్పిస్తున్న దర్శకుడు శ్రీ కె. రాఘవేంద్రరావుకి ఆమె ఎపుడూ తన కృతజ్ఞతను ప్రకటిస్తూ వుంటుంది. హిందీ చిత్రాల్లో శ్రీదేవి బిజీ అయిపోతూ వుండడం — తెలుగు చిత్ర పరిశ్రమ ఒక చక్కని నటిని కోల్పోతున్నదనే బాధను కొందరు నిర్మాతలు వ్యక్తపరుస్తున్నారు. 'హిమ్మత్‌వాలా' సంక్రాంతికి ఉత్తర భారతమంతటా విడుదలవుతోంది. 1983 ప్రారంభం శ్రీదేవికి మహర్దశ ప్రారంభంగా పేర్కొనవచ్చును.

— మోహన్‌కుమార్

ఆ సంక్రాంతి...



— అరుణ

ఓ సంక్రాంతి పండుగ రోజున విజయవాడలో ఉన్నాను నేను. హోటల్ మనోరమలో నేను బసచేసి ఉన్న విషయం అప్పుడే ఎలా వ్యాపించిందోగాని, కాస్సేపటికి ఆ హోటల్ ముందు పెద్ద గుంపు పోగయింది ఆ హోటల్ మేనేజర్‌గారొచ్చి, ''అమ్మా. ఆ జనంముందొచ్చి మీరు కాస్సేపు నిలుచుంటే చాలు— తృప్తితో వెళ్ళిపోతారు. వాళ్ళను పోలీసులుకూడా అదుపులో పెట్టలేకపోతున్నారు. మీరొకసారి వచ్చి తీరాలి,'' అని కోరారు. నేను గది బయటకు అలా వచ్చానో— లేదో, ఓ యువకుడు రొప్పుతూ రోజుతూ వచ్చి, నా ముందు పడిపోయాడు. అతని మోచేతులవద్ద రక్తం స్రవిస్తోంది. ''చెల్లెమ్మా! చనిపోయిన నా చెల్లాయి అచ్చం నీలాగే వుండేది. నిన్ను చూడాలని లోపలికి వస్తూంటే, పోలీసులు ఒక్క తోపు తోశారు. కింద పడ్డాను. దెబ్బలు తగిలితే ఏం? నిన్ను కళ్ళారా చూడగలిగాను. నీలో నా చెల్లెల్ని చూడగలిగాను. నా కదే పదివేలు... వస్తా,'' అంటూ వెళ్ళిపోయాడు.

నేను దిగ్భ్రమతో అలాగే నిలుచుండిపోయాను కొంతసేపటి వరకు.

ఇప్పటికీ ఆ సంఘటన గుర్తుకొచ్చినప్పుడలా నా మనస్సు చివుక్కుమంటూంటుంది.

[జి. వి. జి.]

ఆనాజీవులు [జూనియర్ ఆర్టిస్టులు] _ జీవీజీ



'డబ్బు మంచినీళ్లలా

"చెడి చెన్నపట్నం చేరు – అన్నారు. ఈ చెన్నపట్నం చేరి రెండు విధాలా చెడ్డాను. దూరపు కొండలు నునుపు – అని ఇక్కడికి వచ్చాకే తెలిసింది. రేపు పొయ్యిమీదకు కుండ ఎలా ఎక్కుతుందో తెలియని పరిస్థితి," అంది రమణమ్మ. (వయసు 50)

మరి, అలాంటప్పుడు ఇక్కడే ఉండడం ఎందుకు ? ఈ విషయమే అడిగాను.

"ఏమిటో – మా ఆయనా, నేనూ ఇక్కడ ఇంత కాలంగా ఉంటూ, ఈ వృత్తికి అలవడి పోయాం. మా ఆయన ఇటీవలే పోయారు. ఇప్పుడు నేను వెళ్లాలనుకుంటే మాత్రం ఎక్కడికి వెళ్లగలను ? ఎలా పొట్ట పోసుకోగలను ? ఈ వయసులో నన్ను పోషించడానికి పిల్లాజెల్లా ఎవరూ లేరు. అందుకే – దొరికినప్పుడు వేషాలు వేస్తూ, ఇక్కడే ఉండిపోక తప్పలేదు," అందామె నిట్టూరుస్తూ.

ఏటా వంద చిత్రాలకు పైగా తయారవుతూ, ప్రధాన పాత్రధారులకు కొన్ని లక్షలు చెల్లిస్తూ, డబ్బు మంచినీళ్ళలా ఖర్చు పెట్టబడే ఈ సినిమా రంగంలో అట్టడుగు కళాకారుల ఆక్రందన ఇది.


రాజదర్బార్ సెట్‌ను ఎన్నో వేలు ఖర్చు చేసి నిర్మిస్తారు. అందులో భటులు, పరిచారికలు లాంటి వారు లేకపోతే, అసలు నిండుతనమే రాదు. ఈ నిండుతనం కలిగించే కళాకారులకు 1945 ముందు – కాల్‌షీట్‌కు పురుషులకు రూ 3, స్త్రీలకు రూ 5, ఒకటో రెండో డైలాగ్ ఉన్నవారికి అదనంగా మరో అయిదు రూపాయల చొప్పున ఇచ్చేవారు. అప్పుడు వాళ్ళను ఎక్స్ట్రాలనేవారు.

"ఆ రోజుల్లో వారికి కొందరు నిర్మాతల నుంచి సక్రమంగా పైకం అందేది కాదు. మధ్యవర్తిగా ఉండే మాలాంటి ఏజెంట్లు ఆ సినిమా కంపెనీల చుట్టూ కాళ్ళరిగేలా తిరిగి, చివరికి ఎక్కడో అప్పోసప్పో చేసి, వాళ్ళ పైకాలు చెల్లించే వారు," అన్నారు లింగం మీరయ్య. ఈయన ఈ చిత్ర పరిశ్రమలో 1937 నుంచి ఎక్స్ట్రా సప్లయ్యర్‌గా ఉంటూ 1960లో కన్నుమూసిన నటుడు లింగం సుబ్బారావు పుత్రుడు. "మా నాన్న అలా ఎంతో నష్టపోయారు. 1944లో సి. ఎస్. ఆర్. ఆంజనేయులు, గోపీచంద్, కస్తూరి శివరావుగార్లు ఎక్స్ట్రా కళాకారుల సంఘాన్ని నెలకొల్పమని ప్రోత్సహించారు. అయినా, అంతగా మేలు జరగలేదు. ఆ సంఘాన్ని పడగొట్టడానికి కొందరు నిర్మాతలు ప్రయత్నించారు కూడా. చివరికి 1959లో అందరూ కలిసి యూనియన్‌ను స్థాపించారు. దాంతో పరిస్థితి కాస్త మెరుగైంది. ఇప్పుడు కాల్‌షీట్‌కు – పురుషులకు, స్త్రీలకు రూ 30, పిల్లలకు రూ 10, ఆంగ్లో ఇండియన్‌లకు రూ 40, రౌడీ కేరెక్టర్లు వేసేవారికి – పోలీసు వేషాలు వేసేవారికి రూ 50 చొప్పున నిర్మాతల వద్దనుంచి ఎప్పటికప్పుడు వసూలు చేసి, మా కమిషన్ కొంత పోను – డబ్బు ముట్టజెప్ప గల్గుతున్నాం. కాని, ఆ రోజుల్లో బియ్యం రూపాయికి ఎనిమిది – పది సేర్లు ఇచ్చేవారు. ఇప్పుడు కిలో బియ్యం ఎన్ని రూపాయలో అందరికీ తెలుసు."

"ఇప్పుడు మమ్మల్ని పేరుకు మాత్రం జూనియర్ ఆర్టిస్టులని కాస్త గౌరవంగా పిలుస్తున్నారే గాని, మునుపటి ఆదరణ ఏదీ ? ఇన్ని సినిమాలు తయారవుతూన్నా – ఒక్కొక్కరికి నెలకు నాలుగైదు రోజులకన్నా ఎక్కువ పని దొరకడంలేదు. ఎంచేతంటే – ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఆశ చూపించినప్పట్నుంచీ షూటింగ్‌లు ఎక్కువగా ఎక్కడో ఔట్‌డోర్‌లలో జరుగుతున్నాయి. భారీ నిర్మాతలు ఒకరిద్దరు తప్ప ఇతరులు మమ్మల్ని అంత దూరం తీసుకెళ్లడంలేదు. అక్కడే స్థానికుల చేత వేషాలు వేయించేస్తున్నారు," అన్నారు

'షూటింగ్‌లు ఎక్కువగా ఎక్కడో ఔట్‌డోర్‌లలో జరుగుతున్నాయి'







విశ్వేశ్వరయ్య. ఈయన కాస్త కూస్త సంస్కృతం కూడా చదువుకున్నారట. "ఘనాపాఠీల వంశానికి చెందినవాడ్ని. అసలు సినిమాలకు కథలు రాయాలని మద్రాసుకు వచ్చాను. నా కథలు పనికిరావన్నారు కొందరు నిర్మాతలు. ఇంటికి తిరిగి వెళ్లలేక ఇక్కడే చిన్న నటుడ్నయిపోయాను. నాకిప్పుడు పని ఉన్న రోజున సంతోషిస్తాను. లేని రోజున కూడా సంతోషిస్తాను. వేదాంత ధోరణి అలవరచుకోక తప్పలేదు."

రుక్మిణి అనే ముప్ఫై ఏళ్ళ మహిళ నవ్వుతూ అంది : "మా సవతితల్లి నా కిష్టంలేని పెళ్ళి చేయబోతే చెప్పాచేయకుండా ఓ అర్ధరాత్రి చటుక్కున కలకత్తా మెయిల్ ఎక్కి చక్కా ఇక్కడికి వచ్చేశాను. కొన్ని సినిమాలలో నర్సు వేషం కూడా వేశాను. అంచేత, అందరూ నన్ను 'నర్సమ్మా' అనికూడా పిలుస్తూంటారు. ఇక్కడ అదృష్టదేవత ఎవర్ని ఎలా ఎప్పుడు వరిస్తుందో చెప్పలేము. 'వేంకటేశ్వర మహాత్మ్యం' సినిమాలో పద్మావతీదేవి పక్కన ఋషికన్యగా నాతోపాటు వేసిన ఓ అమ్మాయి, ఆ తర్వాత పెద్ద స్టార్ అయి, అదే కంపెనీ నిర్మించిన తదుపరి చిత్రాలలో హీరోయిన్ వేషం వేసింది. నేను మాత్రం ఇలాగే ఉండిపోయాను."

"మీరు నమ్ముతారో – లేదో, నేను ముఖానికి రంగు పూసుకొని నేటికి ఇరవై రోజులైంది 1951 నుంచి మద్రాసులో ఉంటున్నాను. అంతకు ముందు మా ఊళ్ళో నాటకాలాడేవాడ్ని. ఇంటర్ చదివాను. నేను కొంత పెట్టుబడి పెడితే, నాచేత హీరో వేషం వేయిస్తానన్నాడు ఓ దగాకోరు. ఉన్న పొలమూ, పుట్రా అమ్మి, ఇక్కడికి చేరుకున్నాను. తెచ్చుకున్న డబ్బంతా అయిపోయింది. ఏ ముఖం పెట్టుకొని మా ఊరికి తిరిగి వెళ్లగలను ? వెళ్లినా ఏం చేసేది ? చివరికి చిన్న వేషాలైనా దొరికితే చాలని ఇక్కడే ఉండిపోయాను. జూనియర్ ఆర్టిస్ట్ అనే ముద్ర పడిపోయింది. మాలో 'ఏ' గ్రేడ్ 'బి' గ్రేడ్ అనే రెండు క్లాసులున్నాయి. గుడ్డిలో మెల్లగా నన్ను 'ఏ' గ్రేడ్ ఆర్టిస్ట్‌గా ఒక ప్రమోషన్‌లాంటిది ఇచ్చారు. నాకు భార్య, అయిదుగురు పిల్లలున్నారు. నా పిల్లలైనా సుఖంగా బతకాలని కష్టపడి అందరికీ చదువు చెప్పిస్తున్నాను. ఇప్పుడు ముసలివాడ్నయి పోయానా... రచ్చబండ దగ్గర పంచాయతీ జరిపే ఏ పెద్దమనుషుల గుంపులోకో నన్ను పిలుస్తూంటారు. ప్రతిరోజూ సాయంత్రం ఇలా జూనియర్ ఆర్టిస్ట్ సప్లయ్యర్ ఎవరైనా ఎప్పుడొచ్చి పిలుస్తారా– అని మా గుడిసె ముందు ఈ నులకమంచం వేసుకొని, ఎదురుచూస్తూ కూర్చుంటాను," అన్నారు పర్వతాలరావు

మద్రాసులో ఇప్పుడు కొన్ని వందలకు పైగా జూనియర్ ఆర్టిస్టులున్నారు – వీళ్ళందరికీ ప్రతి రోజూ వేషాలెక్కడ దొరుకుతాయి ? రేపు ఏదైనా వేషం దొరుకుతుందేమోననే ఆశతోనే అందరూ జీవితం గడుపుతున్నారు. ★

'అదృష్టదేవత ఎవర్ని ఎలా ఎప్పుడు వరిస్తుందో చెప్పలేము'





'బెజవాడ బెబ్బులి'లో రాధిక, కృష్ణ



గీతా ఆర్ట్స్ పిక్చర్స్ చిత్రంలో కవిత

సినిమా విశేషాలు

-జి. వి. జి.

ఎ. ఎన్. ఆర్., పి. చంద్రశేఖరరెడ్డి కాంబినేషన్‌లో తొలి చిత్రం

''నాగేశ్వరరావు నటించిన ఎన్నో చిత్రాలకు నేను జగపతి వగైరా సంస్థలలో అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేశాను. ఇంత కాలానికి వారు నటించే చిత్రాన్ని నేను డైరెక్ట్ చేయడం కొత్త సంవత్సరంలో నాకు శుభప్రదమైన విషయంగా భావిస్తున్నాను,'' అన్నారు డైరెక్టర్ పి. చంద్రశేఖరరెడ్డి. వీరి కలయికలో 1983 లో సెట్స్‌కు వెళ్లే చిత్రాన్ని కృష్ణ క్రియేషన్స్ అనే నూతన సంస్థ నిర్మిస్తుంది.

"రాకాసిలోయ"

''ఇంకా ఇద్దరు హీరోయిన్‌లు, 6.2 అడుగుల ఎత్తుగల ఒక హీరో కోసం వెతుకుతున్నాం,'' అన్నారు జె. విఠల్‌కుమార్. ఈయన శ్రీ అమరేశ్వరి ఫిలిమ్స్ పతాకంలో నిర్మించే పై చిత్రానికి డిసెంబర్ 18 న తొలి గీతం ధ్వనిముద్రితమైంది. నరేష్, రాజేష్, అరుణ, పూర్ణిమ, దీప, భానుచందర్ ఇంతవరకు ఎన్నికయ్యారు. పరుచూరి సోదరులు మాటలు, సి. నారాయణరెడ్డి గీతాలు రాశారు. సత్యం సంగీత దర్శకుడు. వి. విద్యాసాగర్ రెడ్డి దర్శకుడు.

దాసరి నారాయణరావు


శ్రీమతి అక్కినేని అన్నపూర్ణ సమర్పించు

అన్నపూర్ణా స్టూడియోస్

యువరాజు

నిర్మాతలు: వెంకట్ అక్కినేని, నాగార్జున అక్కినేని

సంగీతం: చక్రవర్తి కెమెరా: వి.యస్.ఆర్.స్వామి కళ: భాస్కరరాజు కూర్పు: కృష్ణంరాజు



సినిమా

భారత్ ఆర్ట్ ప్రొడక్షన్స్ ద్వితీయ చిత్రం

"గోపురంగళ్ సాయ్‌వదిల్లై – తమిళ హిట్ చిత్రాన్ని తెలుగులో నిర్మిస్తున్నాం," అన్నారు నిర్మాత చింతపల్లి ప్రసాద్. వీరి తొలి చిత్రం "మనిషికో చరిత్ర" త్వరలో విడుదల కానుంది. ద్వితీయ చిత్రానికి కూడా తాతినేని ప్రసాద్ దర్శకుడు. ఫిబ్రవరిలో షూటింగ్ ప్రారంభమవుతుందని నిర్మాణ సారధి ఎస్. గోపాల్‌రెడ్డి తెలిపారు.

'నీళ్లు...నీళ్లు'లో సరిత



ఎ.ఎస్.ఆర్. జంధ్యాల కాంబినేషన్లలో జ్యోతి ఆర్ట్ క్రియేషన్స్ చిత్రం

"నాగేశ్వరరావుగారిది 'మూగమనసులు' చిత్రంలో ఆయన మహాద్భుతంగా పోషించిన పాత్ర లాంటిది," అన్నారు జంధ్యాల. ఈయన రచన, దర్శకత్వంలో భీమవరపు బుచ్చిరెడ్డి నిర్మించే మూడవ చిత్రంలో జయప్రద, గుమ్మడి, నాగేష్, రమణమూర్తి ఆదిగాగల వారుంటారు. అన్నపూర్ణ స్టూడియోలో ఫిబ్రవరి 14నుండి21వరకు, మార్చి 13 నుండి 21 వరకు, గోదావరీ తీరంలో ఏప్రిల్ 1 నుండి 20 వరకు షూటింగ్ పూర్తయి పోతుంది. చక్రవర్తి సంగీతం, గోపాలరెడ్డి ఛాయ, భాస్కరరాజు శిల్పం, పృథ్వీ ప్రొడక్షన్, జి. జి. కృష్ణారావు కూర్పుతో బి. అంజిరెడ్డి నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు.



ఈ సంక్రాంతి...

- సుహాసిని



నా కాలేజ్ మేట్ సుజాత స్వభావం, నా స్వభావం దాదాపు ఒకేలా ఉంటాయి. స్నేహితురాండ్రతో కలిసి సినిమాలకో, బీచ్‌కో వెళ్లే అలవాటు లేదామెకు. అసలు ఎవరితోనూ ఎక్కువ చనువుగా ఉండదు. ఆమెకు ఆప్తులెవరైనా వుంటే— అది నేనొక్కతే. ఒకసారి సంక్రాంతికి వాళ్ళింటికి పిలిచింది. ఆమె పెట్టిన రకరకాల ముగ్గులు చూసి ముగ్ధురాలనయ్యాను. తానే స్వయంగా చక్కెర పొంగలి వండింది... ఎంత రుచిగా ఉందో! నేను సినిమా రంగంలో ప్రవేశించాక ఒక్కసారి మాత్రమే ఆమెను ఓ పెళ్ళిలో కలుసుకోగలిగాను. 'ఖు లా సా గా వున్నావా ?' అని కుశల ప్రశ్నలు వేసిందేగాని, 'నువ్వెన్ని సినిమాలలో వేస్తున్నావు ? నీ సినిమా అనుభవాలు ఏమిటి?' లాంటి ప్రశ్నలతో నన్ను విసిగించలేదు. ఈ సంక్రాంతికి ఎలాగైనా వీలు చేసుకొని— ఆమె ఇంట్లో గడపాలని ఉంది.

[జి. వి. జి.]

సినిమా

"పల్లెటూరి మొనగాడు" లో రాజా — రాణీ

నూతిలోపడ్డ ఓ కుర్రాడ్ని రాజా (చిరంజీవి) రక్షించి, హాస్పిటల్‌కు తీసుకొచ్చాడు. ఆ కుర్రాడి చేత నీళ్ళు కక్కించి, ఇంజెక్షన్ ఇచ్చింది డాక్టర్ శాంతి (రాధిక). ఆ కుర్రాడు కోలుకున్నాడు. తడిసి ముద్దయిపోయిన రాజా వంక చూస్తూ, "రాజా, ఇంత జ్వరంలోనూ నూతిలో దూకావా ? నువ్వా బిడ్డను రక్షించడానికి అంత సాహసం చేశావు కదా ? దురదృష్టవశాత్తు నీకేదైనా ప్రమాదం జరిగితే ?" అంది.

"చూడు, డాక్టరమ్మా ! నేనొక అనాధను. నేను బతికితే ఆనందించేవారు, చస్తే ఏడ్చేవాళ్ళు ఎవ్వరూ లేరు నాకు. కాని, ఆ పసివాడు బతకడం వలన ఆ తల్లి ఎంతో ఆనంద పడుతుంది. అవునా-కాదా ?" అన్నాడు రాజా.

"మానవసేవే మాధవసేవ అనే పరమార్థంతో డాక్టర్ చదువులు చదువుతున్నారు ఎంతో మంది. కాని, డాక్టరై, తర్వాత ఆ పరమార్థం మరచిపోయి, వృత్తినే వ్యాపారంగా మార్చేస్తున్నారు చాలా మంది డాక్టర్లు. కాని, ఏ చదువూ లేకుండా మనుషులకు సేవ చెయ్యాలనే నీ తపన చూస్తుంటే— నువ్వెంతో గొప్పవాడివి అనిపిస్తుంది."





"హీరోయిను హీరో గుండెలమీద ముగ్గేస్తుంది, అదీ సీను !
మరి లవ్‌సీన్లు కొత్తగా వుండాలన్నారు కదా !"

"ఊరుకో, డాక్టరమ్మా! మరీ పెద్ద పెద్ద మాటలు చెప్పేస్తున్నావు. నాకేం అర్థం కావటం లేదు."

"అది సరే, రాజా ! చిన్నప్పుడు నన్ను ఎంతో అభిమానంగానూ, ప్రేమగానూ 'రాణీ రాణీ' అని పిలిచేవాడివి. ఇప్పుడా పిలుపు మానేసి డాక్టరమ్మా అంటావేం ?"

"చిన్నప్పుడు చందమామను జాబిల్లి రావే అని పిలుస్తాం. అది వస్తుందని, మన చేతికందు తుందని అనుకుంటాం. ఇప్పుడది అర్థంలేని ఆశ అని మనకు తెలుసు కదా, డాక్టరమ్మా !"

"చాలా మాటలు నేర్చావ్. నిజంగా మనసుండి ఇష్టముంటే — చందమామనే కాదు; ఇంద్రధనస్సు కూడా అందుకోవచ్చు. కాదంటావా ?"

"నిజమే అనుకో, డాక్టరమ్మా !"

"అదిగో మళ్ళీ డాక్టరమ్మా అంటున్నావ్. నువ్వలా పిలిచే మాటయితే, హాస్పిటల్ దగ్గరకి రావొద్దు. నన్ను చూడొద్దు."

"అమ్మమ్మ... శిక్షగా మీరు లక్ష సూదిమందు లేసినా భరిస్తాను గాని — రావొద్దు, నన్ను చూడొద్దు — అంటే మాత్రం నావల్లకాదు, డాక్టరమ్మా !... నా వల్లకాదు, రాణీ !"

"వినబడలేదు... మళ్ళీ అను."

"నా వల్లకాదు, రాణీ !" కాస్త బిగ్గరగా అన్నాడు రాజా.

ఇద్దరూ కిలకిలా నవ్వుకున్నారు.

ఎస్. ఎ. చంద్రశేఖర్ దర్శకత్వంలో దామి శెట్టి నళినీనిరంజనరావు సమర్పించే రాజలక్ష్మి ఆర్ట్స్ మూవీస్ "పల్లెటూరి మొనగాడు" చిత్రానికి మిద్దె రామారావు నిర్మాత,

ఆంధ్రసచిత్రవారపత్రిక

1982 ఫిలిం బాలట్ పత్రం

1. ఉత్తమ చిత్రం

....

2. ఉత్తమ నటుడు

....

3. ఉత్తమ నటి

....

4. ఉత్తమ దర్శకుడు

....

5. ఉత్తమ సంగీత దర్శకుడు

....

6. ఉత్తమ సహాయ నటుడు

....

7. ఉత్తమ సహాయ నటి

....

8. ఉత్తమ హాస్యనటుడు

....

9. ఉత్తమ హాస్యనటి.

....

ముగింపు తేదీ
5 - 2 - '83


సినిమా

"బాలవాక్కు – బ్రహ్మవాక్కు"

"మా సందేశాత్మక చిత్రంలో రేపటి పౌరులైన నేటి బాలల ద్వారా పొదుపరితనం, జాతీయ సమైక్యత, సాంఘిక పునర్వ్యవస్థీకరణ, మద్యపాన నిషేధాన్ని ప్రబోధిస్తున్నాము," అన్నారు డైరెక్టర్ ఆర్. జి. గోపి. బి. సి. సుబ్బారాయుడు సమర్పణలో ఆర్. శివరామిరెడ్డి నిర్మించే షిర్డీసాయి ఫిలిమ్స్ వారి పై చిత్రం షూటింగ్ డిసెంబర్ 9న భాగ్యనగర్ స్టూడియోలో మొదలైంది. మురళీమోహన్, శారద, ఆశాదేవి, వంశీకృష్ణ, జయకృష్ణ, జయరంజని, సి. హెచ్. ప్రభాకరరావు, బేబీసీత, బేబీఅఖిల పాత్రధారులు. ఎస్. ఆర్. నంది మాటలు, సి. నారాయణరెడ్డి గీతాలు రాశారు. కె. వి. మహాదేవన్ సంగీతం, టి. వి. ముత్తు ఛాయలో ఎ. జె. రామసుబ్బయ్య ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. దర్శకుడే కథకుడు, సంకలనకర్త. జనవరి 7 వరకు తొలి షెడ్యూల్ జరుగుతుందనీ, జనవరి 16 నుంచి ఇంతవరకు జరిగే మలిషెడ్యూల్‌తో షూటింగ్ పూర్తవుతుందనీ ప్రొడక్షన్ కంట్రోలర్ దండే లక్ష్మణదాసు తెలిపారు.

శోభన్‌బాబుతో రామినీడు మరో చిత్రం

"ఫిబ్రవరి–మార్చికల్లా షూటింగ్ పూర్తయిపోతుంది," అన్నారు గుత్తా రామినీడు. ఈయన దర్శకత్వంలో "ప్రతీకారం" అనంతరం శ్రీనాథ్ మూవీస్ నిర్మించే చిత్రంలో కూడా శోభన్‌బాబు హీరో. ★



1982లో విడుదలైన తెలుగు చిత్రాలు

	చిత్రం	దర్శకుడు	సంగీత దర్శకుడు
1	జయసుధ	కె. వి నందనరావు	రమేష్‌నాయుడు
2.	అనురాగ దేవత	తాతినేని రామారావు	చక్రవర్తి
3	రాగదీపం	దాసరి నారాయణరావు	చక్రవర్తి
4.	బంగారు భూమి	పి. చంద్రశేఖరరెడ్డి	జె. వి. రాఘవులు
5.	మధుర స్వప్నం	కె రాఘవేంద్రరావు	సత్యం
6	ఏమండోయ్ శ్రీమతిగారు	రేలంగి నరసింహారావు	కృష్ణ, చక్ర
7	సుబ్బారావుకికోపం వచ్చింది	ధవళ సత్యం	సత్యం
8	అందగాడు	టి ఎస్ బాబు	ఇళయరాజా
9.	ఏదిధర్మం,ఏదిన్యాయం	బాపు	కె.వి. మహదేవన్
10	భలే కాపురం	ఎన్ గోపాలకృష్ణ	కె.వి. మహాదేవన్
11	వంశ గౌరవం	ఎన్. రవీంద్రరెడ్డి	చక్రవర్తి
12	మరో మలుపు	వేజెళ్ళ సత్యనారాయణ	జి.కె. వెంకటేష్
13	బంగారు కొడుకు	కె. ఎస్. ఆర్. దాస్	చక్రవర్తి
14.	తల్లీ కొడుకుల అనుబంధం	కె. ఎస్. ఆర్. దాస్	సత్యం
15	గృహప్రవేశం	బి భాస్కరరావు	సత్యం
16	ఇద్దరు కొడుకులు	కట్టా సుబ్బారావు	చక్రవర్తి
17	కలియుగ రాముడు	కె బాపయ్య	కె.వి. మహాదేవన్
18.	ధర్మవడ్డీ	కె బి తిలక్.	పెండ్యాల
19	నిప్పుతో చెలగాటం	కొమ్మినేని	సత్యం
20.	కృష్ణార్జునులు	దాసరి నారాయణరావు	సత్యం
21	బంగారు కానుక	వి మధుసూదనరావు	సత్యం
22	డాక్టర్–సినీయాక్టర్	విజయనిర్మల	చక్రవర్తి
23	విప్లవ శంఖం	బీరం మస్తాన్‌రావు	చక్రవర్తి
24	మల్లెపందిరి	జంధ్యాల	రమేష్‌నాయుడు
25	ప్రేమమూర్తులు	ఎ. కోదండరామిరెడ్డి	చక్రవర్తి
26.	ఇంట్లో రామయ్య – వీధిలో కృష్ణయ్య	కోడి రామకృష్ణ	జె.వి. రాఘవులు
27.	రాధా మై డార్లింగ్	బి. భాస్కర్	బి. శంకర్
28	నాలుగు స్తంభాలాట	జంధ్యాల	రాజన్–నాగేంద్ర
29.	కలహాల కాపురం	కె. వాసు	జె.వి. రాఘవులు
30	జస్టిస్ చౌదరి	కె. రాఘవేంద్రరావు	చక్రవర్తి
31.	శ్రీ లక్ష్మి నిలయం	టి. కృష్ణ	ఎస్.రాజేశ్వరరావు, సాలూరి బాబు
32.	శుభలేఖ	కె. విశ్వనాథ్	కె.వి. మహదేవన్
33	రాధమ్మ మొగుడు	సి. ఎస్. రావు	సాలూరి బాబు
34.	కోరుకున్న మొగుడు	కట్టా సుబ్బారావు	సత్యం
35	పెళ్ళిళ్ళ పేరయ్య	కొమ్మినేని	జె.వి. రాఘవులు
36.	నివురు గప్పిన నిప్పు	కె. బాపయ్య	చక్రవర్తి
37.	మహాప్రస్థానం	కె.హేమాంబరధరరావు	చక్రవర్తి
38.	చందమామ	రేలంగి నరసింహారావు	సత్యం
39.	గోపాలకృష్ణుడు	ఎ కోదండరామిరెడ్డి	చక్రవర్తి
40.	ప్రతిజ్ఞ	బోయిన సుబ్బారావు	సత్యం
41.	బొబ్బిలి పులి	దాసరి నారాయణరావు	జె.వి. రాఘవులు
42.	ఇది పెళ్ళంటారా ?	విజయభాస్కర్	చక్రవర్తి
43.	డాక్టర్ మాలతి	ఎ.మధుసూదనరావు	లక్ష్మీకిరణ్
44.	ప్రతీకారం	గుత్తా రామినీడు	చక్రవర్తి
45.	పెళ్ళీడు పిల్లలు	బాపు	ఎం.ఎస్.విశ్వనాథం
46	స్వయంవరం	దాసరి నారాయణరావు	సత్యం
47.	ప్రేమనక్షత్రం	పి సాంబశివరావు	ఎం.ఎస్ విశ్వనాథం
48.	చలాకీ చెల్లెమ్మ	జానకిరాం	రమేష్‌నాయుడు
49.	వయ్యారి భామలు - వగలమారి భర్తలు	కట్టా సుబ్బారావు	రాజన్–నాగేంద్ర
50.	ఈ చరిత్ర ఏ సిరాతో?	వేజెళ్ళ సత్యనారాయణ	శివాజీరాజా
51.	గోల్కొండ అబ్బులు	దాసరి నారాయణరావు	కె వి మహాదేవన్
52	జగన్నాథ రథచక్రాలు	వి మధుసూదనరావు	చక్రవర్తి
53.	కయ్యాల అమ్మాయి – కలవారి అబ్బాయి	చిత్తూరి వెంకటగణేశ్	కృష్ణ–చక్ర
54.	పగబట్టిన సింహం	పి. చంద్రశేఖరరెడ్డి	సత్యం
55.	ఎంత ఘాటు ప్రేమయో	పి. సాంబశివరావు	సత్యం
56.	దేవత	కె. రాఘవేంద్రరావు	చక్రవర్తి
57.	జగ్గు	పి. చంద్రశేఖరరెడ్డి	చక్రవర్తి
58.	కృష్ణావతారం	బాపు	కె.వి. మహాదేవన్
59.	మేఘ సందేశం	దాసరి నారాయణరావు	రమేష్‌నాయుడు
60.	పట్నంవచ్చినపతివ్రతలు	మౌళి	సత్యం
61.	టింగురంగడు	తాతినేని ప్రసాద్	చక్రవర్తి
62.	మంత్రాలయ శ్రీ రాఘవేంద్ర వైభవం	ఎం.ఆర్.నాగ్	'వీణ' చిట్టిబాబు
63.	ఏకలవ్య	విజయారెడ్డి	కె.వి. మహాదేవన్
64.	పూల పల్లకీ	సి. ఉమామహేశ్వరరావు	ఇళయరాజా
65.	బిల్లా – రంగా	కె. ఎస్. ఆర్. దాస్	సత్యం
66.	షంషేర్ శంకర్	కె. ఎస్. ఆర్. దాస్	సత్యం
67.	యమకింకరుడు	రాజభరత్	చంద్రశేఖర్
68.	తెలుగునాడు	లక్ష్మీదీపక్	బి. శంకర్
69.	నా దేశం	కె. బాపయ్య	చక్రవర్తి
70.	వందేమాతరం	బండి కృష్ణారావు	గుణసింగ్
71.	ఇల్లాలి కోరికలు	జి. రామమోహనరావు	చక్రవర్తి
72.	తరంగిణి	కోడి రామకృష్ణ	జె.వి. రాఘవులు
73.	మొండిఘటం	రాజాచంద్ర	సత్యం
74.	ప్రేమ సంకెళ్ళు	విజయనిర్మల	రమేష్‌నాయుడు
75.	కొత్తనీరు	కె. ఎస్. ప్రకాశరావు	రమేష్‌నాయుడు
76.	ఇల్లంతా సందడి	రేలంగి నరసింహారావు	కృష్ణ–చక్ర
77.	కదలివచ్చినకనకదుర్గ	కె. ఎస్. రెడ్డి	సత్యం
78.	మంచు పల్లకీ	వంశీ	రాజన్–నాగేంద్ర
79.	సవాల్	బోయిన సుబ్బారావు	సత్యం
80.	బంధాలు అనుబంధాలు	భార్గవ	కె.వి. మహాదేవన్
81.	ఓ ఆడది–ఓ మగాడు	దాసరి నారాయణరావు	ఎం ఎస్.విశ్వనాథం
82.	భక్తధ్రువమార్కండేయ	భానుమతీ రామకృష్ణ	ఎస్ రాజేశ్వరరావు
83.	కలవారి సంసారం	కె. ఎస్. రామిరెడ్డి	కె వి మహాదేవన్
84.	అనంతరాగాలు	వి. ప్రభాకర్	శివాజీరాజా
85.	ప్రళయ రుద్రుడు	ఎ. కోదండరామిరెడ్డి	చక్రవర్తి
86.	ఈనాడు	పి. సాంబశివరావు	జె.వి. రాఘవులు
87.	త్రిశూలం	కె రాఘవేంద్రరావు	కె.వి. మహాదేవన్
88.	యువరాజు	దాసరి నారాయణరావు	చక్రవర్తి

[సేకరణ : జి. వి. జి.]

సీరియల్

జీవన్మృతులు

ఇంగ్లీషు మూలం: బ్రామ్ స్టోకర్

స్వేచ్ఛానువాదం: కొలను వెంకట దుర్గాప్రసాద్



(గత సంచిక తరువాయి)

మీనా హార్కర్ లూసీవెస్టెన్‌రాకు రాసిన ఉత్తరం :

బుడాపెస్ట్, ఆగస్టు 24 :

నా ప్రియమైన లూసీ,

మనం విట్‌బి స్టేషన్‌లో విడిపోయిన తర్వాత జరిగిన విషయాలన్నీ వినటానికి నువ్వు చాలా ఆత్రంగా వుంటావని నాకు తెలుసు. 'హల్'కు క్షేమంగా చేరాను. అక్కడ్నించి 'హాంబర్గ్'కు వెళ్లే బోటు ఎక్కాను. తర్వాత రైలెక్కి ఇక్కడికొచ్చాను. ప్రయాణంలో చెప్పకోదగ్గ విశేషాలు ఏమీలేవు. నా మనసంతా జోనాధన్‌తో నిండివుంది. వీలయినంత వరకు విశ్రాంతి తీసుకొని, జోనాధన్‌ను కలిసిన తర్వాత అతనికి సేవ చెయ్యాలనుకుని, బాగా నిద్ర పోయాను. ఇక్కడికొచ్చాక... ఏం చెప్పమంటావ్ లూసీ, పాలిపోయి, చిక్కిపోయిన మనిషిని చూసాను. అతని కళ్లల్లో పూర్వపు కాంతిగానీ, అతనిలోని ఠీవి గానీ లేకుండాపోయినయి. అతను మానసికంగా బాగా చితికిపోయాడు. ఈమధ్య కాలంలో అతనికేం జరిగిందో, ఏమాత్రం అతనికి గుర్తులేకుండా పోయింది. అట్లా అని నన్ను నమ్మమంటాడు. దానిగురించి ఏమీ అడగవద్దంటాడు. అతనికి మానసికంగా చాలా పెద్ద దెబ్బ తగిలింది. ఏం జరిగిందో మళ్ళీ గుర్తుకు తెచ్చుకుంటే, అతని బుర్ర పాడయిపోతుందేమోకూడా. సిస్టర్ అగథా చాలా మంచి మనిషి నర్సుగా సేవ చెయ్యడానికే పుట్టిన మనిషి. అతనికి మతి స్థిమితం లేనప్పుడు ఏవో భయంకరమైన విషయాలు కలవరించేవాడని చెప్పింది. ఆ విషయాలు ఏమిటో చెప్పమని ఆమెను అడిగాను. అప్పుడు ఆమె గుండెలమీద చెయ్యి వేసుకుని దేవుడ్ని తలుచుకుంది. విషయాలు చెప్పనంది. జబ్బుపడ్డవారి కలవరింతలు దేవుని రహస్యాలు, అవి నర్సులు విధినిర్వహణలో విన్నాకూడా, వాటిని బయటకు చెప్పకూడదట. ఆమె చాలా మంచి హృదయం గల మనిషి. మరునాడు నేను మథనపడుతున్నప్పుడు నన్ను చూసింది ఆవిడే మళ్లా ఆ విషయాన్ని కదిపింది. అతని కలవరింతలు మాత్రం చెప్పలేనని అంది. తర్వాత ఆమె ఇట్లా అంది. "ఇది మాత్రం చెప్పగలను. అతను కావాలని ఏ తప్పూ చేయలేదు. అతని భార్యగా నువ్వూ అంత బాధపడాల్సిన విషయం ఏదీ జరగలేదు. అతను నిన్నుగానీ, నీకిచ్చిన మాటలుగానీ మర్చిపోలేదు. అతను భయపడింది కొన్ని దారుణ విషయాల గురించి." జోనాధన్ మరో అమ్మాయి ప్రేమలో పడి అట్లా అయ్యాడేమో ! దానికి నేను చాలా అసూయ చెందుతానేమోనని పాపం ఈవిడ అనుకున్నట్లుంది. జోనాధన్ విషయంలో నేను అసూయ చెందడమా ? కానీ లూసీ, అతని కష్టదశకు మరే అమ్మాయీ కారణం కాదని తెలిసినప్పుడు, నా శరీరం పులకింతకు లోనయింది. నేను ఇప్పుడు అతని ప్రక్కనే కూర్చున్నాను. అతని నిద్రపోతున్న మొహం నాకు కనపడుతోంది. అతను నిద్రలేస్తున్నాడు ...

నిద్ర లేచినప్పుడు, అతని కోటు కోసం అడిగాడు. దాని జేబులోంచి ఏదో కావాలట. సిస్టర్ అగథాని అడిగాను. ఆమె అతని వస్తువులన్నీ తీసుకొచ్చి యిచ్చింది. వాటిల్లో అతని నోట్‌బుక్ కూడా వుంది. అది చూడాలనిపించి, అతన్ని అడగబోయాను – ఎందుకంటే, అది చదివితే, అతను పడ్డ బాధలకు కారణం తెలుసుకోవచ్చు. అతను నా కళ్ళు చూసి, నా మనసు కనిపెట్టేవుంటాడు. 'ఓ క్షణం ఒంటరిగా వుండదల్చుకున్నాను, నువ్వు కిటికీ దగ్గరికి వెళ్ళి నిలబడు అన్నాడు. నేను వెళ్లాను తర్వాత అతను మళ్ళీ పిలిచారు. నా చేతికి ఆ నోట్ బుక్ ఇచ్చి గంభీర వదనంతో పలికాడు "విల్ హెల్ మినా" – అతని పిలుపులో ఎంతో ఆత్రం కనిపించింది. తనని పెళ్లిచేసుకొమ్మని అతను నన్ను అడిగిన తర్వాత, అతను అట్లా ఎప్పుడూ పిలవలేదు. భార్యాభర్తల మధ్య 'నమ్మకం' అనే దానిమీద నా ఆలోచనలు నీకు తెలుసు – ఎటువంటి రహస్యము వుండకూడదు, ఏమీ దాయకూడదు . నాకు మానసికంగా చాలా పెద్దదెబ్బ తగిలింది అసలేం జరిగిందో మననం చేసుకుందామంటే, బుర్ర తిరిగిపోతోంది అసలు ఆ విషయాలు నిజంగా జరిగాయా, పిచ్చివాడి కలలేనా, తెలియడంలేదు. నాకు మెదడు జ్వరం వచ్చిందని నీకు తెలుసు. అది పిచ్చి రావడానికే. అసలు రహస్యం ఇక్కడే వుంది, కానీ అది తెలుసుకోవడం నా కిష్టంలేదు." మన పెళ్లితో మళ్లీ నా జీవితం మొదలుపెట్టదల్చుకున్నాను" అన్నారు. డియర్ లూసీ, లాంఛనాలు అన్నీ అయ్యాక మేం పెళ్లి చేసుకోడానికి నిర్ణయించుకున్నాం "విల్ హెల్ మినా, నా అజ్ఞానాన్ని పంచుకోవడం నీ కిష్టమేనా ? ఇదిగో, పుస్తకం ఇక్కడుంది తీసుకుని నీ దగ్గరవుంచు చదవాలనుకుంటే చదువు కానీ తర్వాత దాని గురించి నాకు చెప్పకు, ఎప్పుడైనా నేను నిద్రలో వుండిగాని, మేల్కొనిగాని, మతి స్థిమితంగా వుండిగానీ, లేనప్పుడుగాని, ఎంతో బాధ్యతతో నేను ఆ ప్రసక్తి తీసుకొనివస్తే తప్ప" అని భారంగా వెనక్కి వాలాడు. నోట్‌బుక్ అతని దిండు క్రిందపెట్టేసి అతన్ని ముద్దు పెట్టుకున్నాను. ఇవాళ మధ్యాహ్నమే మా పెళ్ళికి ఏర్పాట్లు చేయించమని సిస్టర్ అగథాకు చెప్పాను. ఆమె జవాబు కోసం వేచి వున్నాను.

ఇంగ్లీషు మిషన్ చర్చి తాలూకు పురోహితుడు కోసం కబురు పంపినట్లు ఆమె వచ్చి చెప్పింది ఇంకో గంటలో మేం పెళ్లి చేసుకుంటాం.

లూసీ, నేను ఎదురుచూసిన వేళ వచ్చింది, వెళ్లింది. నేను గంభీరంగా వున్నా నా మనసు సంతోషంగా వుంది. జోనాధన్ గంట తర్వాత నిద్ర లేచాడు. పెళ్లి ఏర్పాట్లు సిద్ధంగా వున్నాయి. అతను మంచంమీద కూర్చున్నాడు, దిండ్లు వత్తుగా

జరిగిన కథ – 10 : మిస్ మీనాముర్రే, మిస్ లూసీవెస్ట్ ఒకరికొకరు తమ తమ విషయాలను ఉత్తరాల ద్వారా తెలియపర్చుకొంటారు. పి. మోరిస్‌కు ఆర్థర్ హోల్మ్‌వుడ్ క్విన్సీ తన ధగ్గర వళ్ళు జలదరించే కబుర్లు వున్నాయని, తనకోసం ఎదురుచూడమని టెలిగ్రాం ఇస్తాడు. మిస్ మీనా తన డైరీలో, జోనాధన్ దగ్గరనుంచి ఎటువంటి సమాచారం అందకపోవడంతో దిగులుచెందుతున్నట్లు రాసుకొంటుంది. 'ది డైలీ టెలిగ్రాఫ్' పత్రిక నుండి కత్తిరించి, మీనాముర్రే డైరీలో అంటించిన ముక్కలలోని సారాంశం వివరిస్తున్నారు. తుఫాను తాకిడికి ఒడ్డుకు కొట్టికొచ్చిన ఓడలోని శవం జేబులో వున్న కాగితంలోని విషయాలనుబట్టి, అతను పుస్తకంలో రాసినదాన్నిబట్టి కొంత సమాచారం బయట పడుతుంది. ఆ ఓడలో మొత్తం తొమ్మిదిమంది ప్రయాణం చేస్తుంటారు కెప్టెన్‌తోసహా. దారిలో ఒక్కొక్కళ్లు మాయమవుతూ వుంటారు. చివరికి కెప్టెన్, మరో ముగ్గురు మిగుల్తారు. అందరితోపాటు చివరకు అతనుకూడా చనిపోతాడు. కానీ ఇదంతా ఎవరు చేశారో, లేక కెప్టెనే చంపేసి తాను ఆత్మహత్య చేసుకొన్నాడో తెలియదు. మీనా లూసీని జాగ్రత్తగా కాపాడుతుంటుంది. జోనాధన్ హార్కర్ సెయింట్ జోసెఫ్, సెయింట్ మేరీ హాస్పటల్‌లో కోలుకుంటున్నాడని సిస్టర్ అగథా ఉత్తరం ద్వారా తెలుసుకొన్న మీనా మనసు కొంతవరకు కుదుట పడుతుంది.

వేసుకుని. పురోహితుడు చెప్పినదానికి 'అట్లాగే చేస్తాను' అన్నమాట, తొణకకుండా చాలా గంభీరంగా చెప్పాడు. నాకు మాత్రం సరిగా గొంతు పెగల్లేదు సంతోషంలో. సిస్టర్స్ వాళ్ళు మమ్మల్ని బాగా చూసారు. వాళ్ళని ఎప్పుడూ మరచిపోలేను. నా పెళ్లి బహుమతి ఏమిటో చెప్పాలి నీకు. పురోహితుడు, సిస్టర్స్, వెళ్ళిపోగానే, నేనూ నా భర్తా మిగిలాం. ఓ లూసీ, మొట్టమొదటిసారిగా వ్రాస్తున్నాను. 'నాభర్త' అనే మాటలు. అతని దిండు క్రింద వుంచిన 'నోట్ బుక్'ను తీసుకుని దానికి తెల్లటి కాగితం చుట్టి, నా మెడకున్న లేత నీలంరంగు రిబ్బనులో కొంత ముక్క తీసి దానికి కట్టి ముడివేసాను. లక్కకరిగించి 'సీలు' వేసాను. ఆ సీలుమీద నా పెళ్లి ఉంగరంతో ముద్రించాను. దాన్ని ముద్దుపెట్టుకుని నా భర్తకు చూపించాను. దాన్ని విప్పకుండా అలాగే వుంచుతానని చెప్పాను, ఎప్పుడూ దాన్ని తెరిచి చూడనని చెప్పాను— అతనికోసంగానీ, ఇక తప్పదు అనుకున్న పరిస్థితుల్లో గానీ, అవసరమయితే తప్ప. అప్పుడు అతను నా చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. ఓ లూసీ, అతని భార్య చెయ్యి అతను మొదటిసారి పట్టుకున్నాడు. ఈ విశాల ప్రపంచంలో తనకు ప్రియమైంది అదే నన్నాడు. ఆ చేయూతకోసం అవసరమయితే, గతం లాంటి కష్టాలనైనా భరిస్తానన్నాడు. గతంలో జరిగిన విషయాలు తను నాకు కొన్ని చెప్పానని అనుకుంటున్నాడు. ఎప్పుడు ఏ విషయం జరిగిందో చెప్పలేక పోతున్నాడు. విషయాలు కలగాపులగంచేసి చెప్తాడు. సంవత్సరాన్ని నెల, నెలని సంవత్సరం అంటాడు.

ఇక అతనికేం చెప్పను? నాలాంటి అదృష్టవంతురాలు ఈ ప్రపంచంలో ఎవరూ వుండరని చెప్పాను. నన్నూ, నా మనసునూ తప్ప ఇవ్వడానికి నా దగ్గర ఏమీలేదని చెప్పాను. సత్తువలేని చేతుల్తో నన్ను దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు. అప్పుడు మాది పవిత్ర బంధం అనిపించింది...

లూసీ డియర్, ఇదంతా నీకెందుకు రాస్తున్నానో తెలుసా ? ఇవన్నీ నాకు మధురమైన విషయాలని మాత్రమే కాదు, నువ్వు కూడా నాకెంతో ప్రియమైనదానివి కాబట్టి. స్కూలు గది విడిచిపెట్టి, నిజమైన ప్రపంచంలోకి అడుగు పెట్టిన వేళ, నీకు నేను స్నేహితురాలనవడం నాకు చాలా గొప్పతనంగా వుంది. నాకు నిన్నిప్పుడు చూడాలనివుంది. ఒకరి భార్యగా, సంతోషంతో, తృప్తితో నిండిన నా కళ్లతో చూడాలనివుంది. నీకూ పెళ్ళయితే, నువుకూడా ఇట్లాగే సంతోషంలో మునిగిపోతావు. నువ్వు కోరుకున్న విధంగా నీ జీవితంలో జరగాలని నేను భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను. నీకు ఎటువంటి బాధా కలగకూడదు. నాలాగే నీ జీవితం కూడా సుఖమయం కావాలి. గుడ్‌బై డియర్. ఈ ఉత్తరాన్ని ఇప్పుడే పోస్టు చేస్తాను. బహుశా, త్వరలో మళ్ళీ రాస్తాను. జోనాథన్ నిద్రలేస్తున్నాడు. అందుకని రాయడం ఆపేస్తున్నాను. ముందు నా భర్తకు ఏంకావాలో చూడాలి.

ఎప్పుడూ నిన్ను ప్రేమించే,
మీనా హార్‌కర్.


లూసీవెస్‌టెన్‌రా మీనాహార్‌కర్‌కు రాసిన ఉత్తరం :


విట్‌బి, ఆగస్టు, 30

నా ప్రియమైన మీనా,

సాగరాలంత ప్రేమతో లక్షలకొద్దీ ముద్దులు త్వరలో నువు నీ భర్తతో కాపురం పెడతావని ఆశిస్తాను. మీరు త్వరగా వచ్చి మాతోపాటు ఇక్కడ వుండాలని కోరుకుంటున్నాను. ఇక్కడి గాలివల్ల జోనాథన్ త్వరగా కోలుకోగలడు. ఇక్కడ గాలి నాకు బాగా పనిచేసింది. ఇప్పుడు బాగా ఆకలి వేస్తోంది. తిండిపోతునయ్యాను. ఉత్సాహంగా వుంటున్నాను. కంటినిండా నిద్రపోతున్నాను. నేను నిద్రలో నడవడం మానేసాను. నీకు సంతోషంగా వుంది కదూ ! ఒక వారం రోజులుగా రాత్రిపూట మధ్యలో లేవకుండా, కదలకుండా పడుకుంటున్నాను. నేను లావెక్కిపోతున్నానని ఆర్థర్ అంటున్నాడు. అన్నట్టు చెప్పటం మరచాను, ఆర్థర్ ఇక్కడే వున్నాడు. కాసేపు నడిచి, కాసేపు కారులో షికారు వెళుతున్నాం. గుర్రపు స్వారీలు, బోటు షికార్లు కూడా. టెన్నిస్ ఆడ్డం, చేపలు పట్టడం... అతన్ని అమితంగా ప్రేమిస్తున్నాను. నన్ను గాఢంగా ప్రేమిస్తున్నానని చెప్తాడు, కానీ నాకు మాత్రం సందేహంగా వుంది. అతను మొదట ఏమన్నాడంటే, ఇప్పుడు ప్రేమిస్తున్నంతగా, మొదట నన్ను ప్రేమించలేదట. అయినా







ఏవిటో పిచ్చిసందేహం. అదిగో, అతను పిలుస్తున్నాడు నన్ను, కాబట్టి ప్రస్తుతానికి విశేషాలు ఏవీ లేవు.

నీ ప్రియమైన
లూసీ.

తాజా కలం : మా అమ్మ నిన్ను అడిగానని చెప్ప మంది. కొంచెం కులాసాగా కనిపిస్తోంది.

మరో తాజా కలం : సెప్టెంబర్ 28న మేం పెళ్లి చేసుకోబోతున్నాం.

డాక్టర్ సేవార్డు డైరీ :

ఆగస్టు 20 : రెన్‌ఫీల్డు విషయంలో కుతూహలం పెరుగుతోంది. ఇప్పుడతను మౌనంగానే వుంటున్నాడు, గొడవ చెయ్యకుండా. అతనికి పిచ్చి ముదిరిన వారంరోజుల వరకు ఎడతెరిపిలేని దౌర్జన్యం ప్రదర్శించాడు. ఒకరోజు రాత్రి, వెన్నెల వెలుగులో మౌనంగా వుండిపోయాడు. "ఇప్పుడు నేను వేచి వుంటాను ఇప్పుడు నేను వేచి వుంటాను" అంటూ గొణుక్కోవడం చేసాడు. పనివాడు ఈ విషయం నాకు చెప్పగానే, నేను క్రిందికి పరుగెత్తాను అతన్ని చూడడానికి. అతనింకా వేయిస్ట్ కోటుమీదే గదిలో వున్నాడు. అతని మొహంలో దాగుడుమూతల చూపులు కనిపించలేదు. అతని కళ్ళు వేడుకుంటున్నట్టుగా, బాగా చెప్పాలంటే, నువ్వే నాకు దిక్కు... అన్నట్టుగా — వున్నాయి. అతని పరిస్థితి నాకు తృప్తినిచ్చింది. ఇక అతన్ని వదిలేయవచ్చు అని మా పనివాళ్లతో చెప్పాను. అట్లా చేయడానికి వాళ్ళు సందేహించారు. కానీ, తర్వాత అయిష్టంగానే అతన్ని వదిలిపెట్టారు. తమాషా అయిన విషయం ఏమిటంటే, అతను నా దగ్గరికొచ్చి చెవిలో, "నిన్ను నేనేదో చేస్తానని వీళ్ల భయం. నేను నిన్ను ఏదో చెయ్యడమా! వెధవలు!" అన్నాడు వాళ్లవంక దొంగ చూపులు చూస్తూ. వాళ్లతోపాటు నన్ను కలేయకుండా, అతను నన్ను ప్రత్యేకంగా చూడడం నాకు కాస్త తెరిపి అనిపించింది. అయినా అతని ఆలోచన ఏమిటో తెలుసుకోవడం కష్టం. నన్ను తనతోపాటు సమానంగా చూసుకుంటున్నాడా, లేక నేను క్షేమంగా వుండడంవల్ల అతనేదైనా బ్రహ్మాండమైన లాభం పొందబోతున్నాడా? ఈ విషయం తర్వాత తేల్చుకోవాలి. ఈ రాత్రికి అతను

జీవన్ మృతులు

మాట్లాడడు. అతనికి పిల్లి పిల్ల నిచ్చినా, బలిసిన పిల్లినిచ్చినా కదిలేట్టులేదు. "ఇప్పుడు నా కేమీ అక్కర్లేదు. ఇప్పుడు నేను చాలా ఆలోచించు కోవాలి. నేను వేచివుంటాను, నేను వేచివుంటాను" అంటాడు.

అతన్ని వదిలేసి వెళ్లాను. తెల్లవారుజాము వరకు గొడవ లేకుండా వున్నాడని పనివాడు చెప్పాడు. తర్వాత మాత్రం ఏదో యిబ్బందిగా కదలడం మొదలెట్టి, విపరీతమైన గొడవ చేశాడట. తర్వాత మూర్ఛలో కొట్టుకుని, స్పృహలేకుండా పడి పోయాడట.

...ఇట్లా మూడు రాత్రులు అలాగే జరిగింది. పగలంతా గొడవ చెయ్యడం, రాత్రి వెన్నెలవేళ దగ్గర్నుంచి, సూర్యోదయం వరకూ మౌనంగా వుండిపోవడం. దీనికి కారణం తెలిసినట్టు అనిపించింది. ఏదో ప్రభావం అతనిమీద పనిచేసి వెళ్లి పోయింది. గొప్ప ఆలోచన వచ్చింది. ఇవాళ మేము ఈ పిచ్చివాళ్లమీద ఓ తెలివైన నాటకం ఆడాలి.

మునుపు ఒకసారి తనంతటతానే పారిపొయ్యాడు. ఎవరి సహాయం లేకుండా ఇవాళ రాత్రి అతను పారిపోవడానికి మేమే సహాయం చేస్తాం. అతనికి అట్లా అవకాశం ఇస్తాం. తర్వాత అవసరమయితే అతన్ని వెంబడించడానికి మా మనుషులు వున్నారు.

ఆగస్టు 23 : "ఎప్పుడూ అనుకోనిదే జరుగుతుంది!" డిస్‌రేలీ జీవితం గురించి ఎంత బాగా తెలుసుకున్నాడు! పక్షి పంజరం తెరిచి వుంచినట్టు తెలుసుకుని, రెన్‌ఫీల్డు పారిపోకుండా కూర్చున్నాడు. మా ఏర్పాట్లన్నీ వృథా అయ్యాయి. ఒక్క విషయం మాత్రం బుజువయింది, అదేవిటంటే, అతను సౌమ్యంగా కొద్దిసేపు వుండగలుగుతున్నాడు. ముందు ముందు అతన్ని రోజుకు కొన్ని గంటలు కట్టడిలో పెట్టకుండా వుంచగల మనుకుంటున్నాం. మా పనివాడికి చెప్పాను, రెన్‌ఫీల్డు కాస్త నెమ్మదిగా కనిపించినప్పుడు, తీసుకెళ్లి గదిలోవుంచమని చెప్పాను, ఇంకో గంటకు తెల్లవారుతుందనేవరకు కనీసం భౌతికంగానైనా అతను కాస్త స్వేచ్ఛగా వుండగలుగుతాడు, మానసికంగా లేకపోయినప్పటికి. ఏవిటో వినవస్తోంది. మళ్లీ అనుకోని విషయం! నన్ను పిలుస్తున్నారు. అతను మళ్లీ పారిపోయాడట.

తర్వాత : రాత్రివూట మరో సాహసయాత్ర రెన్‌ఫీల్డు అప్పటిదాకా కాచుకుని వుండి, పనివాడు ఇతన్ని చూడడానికి గదిలోకి ప్రవేశిస్తుండగా, అతన్ని తోసుకుని క్రింది దారి గుండా పారి పోయాడు. అతని వెంట పడమని మా పనివాళ్లకు చెప్పాను. అతను మళ్ళీ మైదానంగుండా పరుగెత్తి పాత చర్చి దగ్గర కెళ్లాడు. అతను దాని తలుపుకు అతుక్కుని కనిపించాడు. నన్ను చూడగానే కోపంతో మండిపోయాడు. మా పనివాళ్ళు అతన్ని వెంటనే పట్టుకోపోయినట్టయితే, నన్ను చంపడానికి ప్రయత్నించేవాడే. అతన్ని పట్టుకుని తీసుకుని వస్తుండగా, ఒక వింత జరిగింది. అతను రెట్టింపు శక్తితో పట్టు తప్పించుకోడానికి ప్రయత్నించాడు గానీ, వెంటనే మళ్ళీ తగ్గిపోయాడు. చుట్టూ పరీక్షగా చూసాను కానీ, ఏమీ కనిపించలేదు వెంటనే అతని కళ్ళను పరీక్షించడం మొదలెట్టాను. నాకేమీ కనిపించలేదుగానీ, అతని కళ్ళు మాత్రం వెన్నెల ఆకాశంలోకి చూస్తున్నాయి. ఒక పెద్ద గబ్బిలం

విదేశాల్లో హనీమూన్

హనీమూన్ కోసం విదేశాలకు వెళ్ళే జంటల సంఖ్య ఎక్కువైంది. గత సంవత్సరంకంటే ఈ సంవత్సరం నాలుగు నుండి ఐదు శాతం ఎక్కువగా ఉండవచ్చునని జపాను విమానాశ్రయ అధికారులు తెలియ చేశారు. సెప్టెంబరు మధ్య కాలం నుండి హనీమూన్ యాత్రలు ప్రారంభమవుతాయి. అక్టోబరు 2, అక్టోబరు 31 తారీఖులు చాలా అదృష్టకరమైన రోజులుగా భావిస్తారు. ఆ రోజుల్లోనే ఎక్కువవివాహాలు జరుగుతుంటాయి. ఎక్కువమంది జంటలు హనీమూన్ కోసం హొనలూలును ఎన్ను కుంటారు. స్పెయిన్, యూరపు దేశాలు, అమెరికాలోని మరికొన్ని రాష్ట్రాలు కూడా హనీమూన్ జంటలను ఆకర్షిస్తున్నాయి.

పడమర వైపు ఎగురుకుంటూ వెళ్ళడం మాత్రం కనిపించింది. గబ్బిలాలు అక్కడక్కడే తిరుగుతూ ఎగురుతుంటాయి సాధారణంగా కానీ ఈ గబ్బిలం మాత్రం ఏదో పని వున్నట్టుగా తిన్నగా వెళ్ళిపోయింది. రెన్‌ఫీల్డు గొడవ చెయ్యకుండా బాగా తగ్గిపోయాడు అప్పుడు అతను ఇలా అన్నాడు. ''మీరు నన్ను కట్టిపడేయక్కర్లేదు. నేను మామూలుగా వెళతాను.'' ఎటువంటి గొడవా లేకుండా ఇంటికి తిరిగివచ్చాం అతను నెమ్మదిగా అయిపోవడానికి ఏదో విశేషం వుందనుకుంటున్నాను. ఇది మరువలేని రాత్రి .

లూసి వెస్‌టెన్‌రా డైరీ!

హిల్లింగ్‌హామ్, ఆగస్టు 24 మీనా చేస్తున్నట్టు నేను కూడా విషయాలు రాసిపెట్టుకోవాలి. మేమిద్దరం కలిసినప్పుడు, చాలా ఎక్కువసేపు మాట్లాడుకోవచ్చు. ఇద్దరం ఎప్పుడు కలుస్తామో ఏమో! నా మనసేమీ బాగాలేదు, ఆమె వుంటే బాగుండేది విట్‌బిలో జరిగినట్టుగా, రాత్రి మళ్ళీ కలలు వస్తున్నాయి గాలి మార్పువల్ల అయివుండాలి. లేదా, మళ్ళీ ఇంటికి రావడంవల్లనైనా అయివుండాలి. అంతా చీకటిగానూ, భయంకరంగానూ వుంది. అదేమిటో జ్ఞాపకం లేదు కానీ నాలో ఏదో తెలియని భయం, నీరసం, కలిగాయి. ఆర్థర్ భోజనానికి వచ్చినపుడు నన్ను చూసి కలత చెందాడు. నేను సంతోషంగా కనిపించలేకపోయాను. ఈ రోజు రాత్రి అమ్మ గదిలో పడుకుంటే! అమ్మని అడగాలి.

ఆగస్టు 25 మరొక చెడ్డ రాత్రి. నా ఆలోచన అమ్మకి ఇష్టమున్నట్టు తోచలేదు ఆమెకు ఒంట్లో బాగోలేదు. నేను ఆమెవల్ల ఇబ్బంది పడతానేమోనని భయపడుతోంది. మెలకువగా వుండటానికి ప్రయత్నించి, కాసేపు వున్నాను. కానీ, పన్నెండు గంటలు కొట్టినపుడు మెలకువొచ్చింది. బహుశా నిద్రపోయివుంటాను కిటికీ దగ్గర, టపటపమని చప్పుడయింది కానీ, దాన్ని పట్టించుకోలేదు. మళ్ళీ బాగా నిద్రపట్టేసినట్టుంది పీడకలలు ఎక్కువయ్యాయి. అవేమిటో జ్ఞాపకమున్నాయి అనుకుంటా. ఈ రోజు లేచేటప్పటికి విపరీతమైన నీరసంగా వున్నాను మొహం పాలిపోయింది. గొంతు దగ్గర నెప్పిగా వుంది. వూపిరితిత్తుల దగ్గర ఏదో బాధ, సరిగా గాలి పీల్చలేకుండా వున్నాను. ఆర్థర్ వచ్చేటప్పటికి కాస్త కులాసాగా కనిపించడానికి ప్రయత్నిస్తాను లేకపోతే నన్ను చూడటానికి చాలా బాధపడతాడు.

ఆర్థర్ హోల్మ్‌వుడ్ డాక్టర్ సెవార్డుకు రాసిన ఉత్తరం

ఆల్‌బెమార్లీ హోటల్, ఆగస్టు 31 :

నా ప్రియమైన జాక్,

నా కొక సహాయం చెయ్యాలి. లూసీకి జబ్బుగా వుంది. ఆమె జబ్బు ఇదీ అని చెప్పడానికి లేదు. ఏదో భయానికి లోనయినట్టు కనిపిస్తోంది. రోజు రోజుకు క్షీణిస్తోంది అట్లా అయిపోతున్నందుకు ఏదైనా కారణం వుందా అని ఆమెను అడిగాను. ఆమె తల్లిని అడగటానికి ధైర్యం చాలడంలేదు. ఆమె అనారోగ్య దృష్ట్యా. మిసెస్ వెస్‌టెన్‌రా (లూసీ తల్లి) తను ఎక్కువకాలం బ్రతకనని చెప్పింది. ఆమెకు గుండెజబ్బు. లూసీకి ఈ విషయం తెలియదు. ఆమె బుర్రలో ఏదో తిరుగాడుతోందని నా నమ్మకం. ఆమె గురించి ఆలోచించినప్పుడు నా మనసు కుదురుగా వుండటంలేదు. ఆమెను చూస్తుంటే, దిగులుగా వుంటోంది. నువ్వు వచ్చి ఆమెను చూడాల్సిందిగా అడుగుతానని చెప్పాను. మొదట ఆమె వెనకాడింది — ఎందుకో నాకు తెలుసులే, చివరకు ఒప్పుకుంది. ఇది నీకు చాలా బాధతో కూడిన పని అని నాకు తెలుసు. కానీ మిత్రమా, ఇది ఆమెకోసం, నేను నిన్ను అడగటానికి వెనకాడటంలేదు. అట్లాగే నువ్వూ వెనకాడకూడదు. రేపు మధ్యాహ్నం రెండు గంటలకు ఇక్కడకు (హెల్లింగ్‌టన్) రావాలి. ఎందుకంటే, లూసీ తల్లికి ఎటువంటి అనుమానం రాకూడదు. భోజనాల తర్వాత లూసీ నీతో ఒంటరిగా వుండే అవకాశం తీసుకుంటుంది. నేను టీ తాగడం కోసం అన్నట్టు వస్తాను. మనిద్దరం కలిసి వెళ్లిపోదాం. ఆమెను నువ్వు చూసిన తర్వాత, నీ సలహా తీసుకోవాలని ఆరాటపడుతున్నాను. రాకుండా వుండొద్దు.

'ఆర్థర్'

ఆర్థర్ హోల్మ్‌వుడ్ డాక్టర్ సెవార్డుకు పంపిన టెలిగ్రాం

సెప్టెంబర్ 1 : మా నాన్నను చూడడానికి రమ్మని కబురు వచ్చింది. ఆయన పరిస్థితి బాగా లేదు. నేను ఉత్తరం వ్రాస్తున్నాను. ఇవాళ రాత్రికే నాకు ఉత్తరం వ్రాసి 'రింగ్'కు పోస్టు చెయ్యి అవసరమయితే టెలిగ్రాం ఇవ్వు.

డాక్టర్ సెవార్డు ఆర్థర్ హోల్మ్‌వుడ్‌కు రాసిన ఉత్తరం

సెప్టెంబర్, 2

నా ప్రియమిత్రమా,

లూసీ ఆరోగ్యం గురించి నీకు వెంటనే రాయాలనే ఆత్రుతకొద్దీ రాస్తున్నాను. నా ఉద్దేశంలో ఆమెకు ఆరోగ్యలోపం లేదు. జబ్బుకూడా ఏమీ కనిపించలేదు. కానీ, ఆమె కనిపిస్తున్న తీరు ఏ మాత్రం సంతృప్తికరంగా లేదు పూర్వం నేను ఆమెను చూసినప్పుడు కనిపించిన దానికి, ఇప్పటికీ ఎంతో తేడా వుంది. కానీ, ఆమెను పరీక్షగా చూసే అవకాశం దొరకలేదని మాత్రం నువు గుర్తించుకోవాలి. ఎందుకంటే, మనమధ్య స్నేహం ఈ విషయంలో కాస్త ఇబ్బంది పడుతున్నది. వృత్తిపరంగానైనా కూడా నాకు సంప్రదాయం అడ్డు వస్తున్నది. అసలేం జరిగిందో చెప్తాను, దాన్నిబట్టి నువ్వు అంచనా వేసుకుందువుగాని.

నేను చూసినప్పుడు లూసీ చాలా ఉత్సాహంగా కనపడింది. ఆమె తల్లి అప్పుడు దగ్గరే వుంది. కొన్ని క్షణాల తర్వాత నేను పసిగట్టాను, కేవలం తల్లి కంగారుపడకుండా వుండడంకోసం ఆమె అట్లా

దీపావళి కథలపై వ్యాసరచన పోటీలో రెండవ బహుమతి రు. 150 లు పొందిన వ్యాసం

అందమైన మలుపుతో సమకాలీన సమాజానికి చురక!

సాహిత్యానికి పరమార్థం 'సామాజిక స్పృహతో కూడిన ఆత్మచేతన' అని అనుకుంటే ఎన్నికైన ఆరుకథల్లో మొదటనిలిచేది 'నీగుండె కార్చిన కన్నీళ్ళు' అనే కథ. నిజానికి ఎత్తుగడలోనే కథ అర్థమై పోయింది. శిల్పదృష్ట్యా కథ దెబ్బతింది. అయితే రచయిత కథనడపిన తీరు బాగుంది. భావం బాగుంది. ఒక పిచ్చుకను సామాన్యుడికి ప్రతీకగా నిలిపి, ప్రతినిధినిచేసి ప్రేమానురాగాలనేవి జాతివర్గ విచక్షణా దూరాలనే సత్యాన్ని రచయిత ప్రతిపాదిస్తూ ఉత్తమ సాహిత్య లక్షణమైన వ్యంగ్యాన్ని చక్కగా పోషించారు. బాధ అనుభవిస్తున్న ఎదుటివాడిని చూచినపుడు అహంభావికి కలిగే అవహేళనా భావం, అదేబాధ తన అనుభవానికి వచ్చినపుడు కాని ఆత్మ విమర్శకు, సత్యాన్వేషణకు దారితీయదు. అందులో ప్రేమ— విరహం యిలాంటి విషయాల్లో మరీనూ. మంచి కథావస్తువును స్వీకరించారు రచయిత.

తరువాతనిలిచే కథ 'మదర్పిత తాంబూలాది.' చివరివరకు సరదాగా చక్కని నడకతో సాగిన కథ. అందమైన మలుపుతో సమకాలిక సమాజానికి ఒక చురక తగిలించి ముగుస్తుంది. శైలి, శిల్పం వీటినే దృష్టిలో పెట్టుకుంటే ప్రథమ స్థానంలో నిలబడే కథయిది.

ఆ తరువాత 'ఉప్పులేనికూడు' ప్రస్తుత సమాజపు మకిలికి అద్దంపడుతోంది. అయితే అందులోని 'వెంకటేసు' వంటి ప్రాతాలు చాలా అరుదు. కథా విషయంలోకూడా క్రొత్తదనం కనిపించక పోవడం మూలాన చదివాక పెద్దగా ఆలోచనల్లో నిలవదు.

'దూరం'లో ఒక గాంభీర్యత ఉంది. వస్తువులో వైవిధ్యం ఉంది. ఆకలి తీర్చుకోవడం కోసం అనుసరించే మార్గాల్లో, వాటిమధ్య ఎంతెంత దూరం అయినా ఉండొచ్చు. ఎన్నిరకాల దూరాలైనా ఉండొచ్చు కాని అది తీరే సమయంలో ఏదూరమూ కనిపించదు. అయితే యిది ఒక భావచిత్రణ మాత్రమేకాని మంచికథ అనిపించదు.

'హసీనా'లో విషయం, శైలి రెండూ పేలవంగానే ఉన్నాయి. రచయిత ఏదో చెప్పబోయి మరేదో చెప్పారా! అనిపిస్తుంది. స్పష్టత లోపించింది.

ఇక 'పిసరంతగుండె' నిరాశా వాదానికి పరాకాష్ఠ. ఒక చేతకాని తనం, తన ఓటమికి మరో చోట కారణాలు వెతుక్కోవడం, వ్యర్థమైన అహంభావం, పిరికితనం కనిపిస్తున్నాయి. శైలి ఫరవాలేదు కాని ఈ రకం కథలవలన వ్యక్తికిగాని, సమాజానికి గాని ఏవిధంగానూ మేలుకలుగదని నా అభిప్రాయం. రచన ఉపదేశాత్మకంగా ఉండాలిగాని, నిస్పృహ నింపేదిగా ఉండకూడదు.

మొత్తంమీద యీసారి ఎన్నికైన ఆరు కథలూ ఒక్కొటి— ఒక్కో దృక్పథానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. నిర్ణేతలు ఏదో ఒక భావానికో, పద్ధతికో, లేక సిద్ధాంతానికో బద్ధులు కాలేదని; పక్షపాత రహితంగా వర్తించారని స్పష్టమౌతోంది.

— చింతలపూడి వెంకటేశ్వర్లు

నటిస్తోందని. ఆమెక్కూడా ఆ విషయం తెలుసునని నా సందేహం. ఒకవేళ తెలియకపోయినా, మంచిదే. మేం భోజనం ముగించాం. అప్పటివరకు అందరం సంతోషంగా కనిపించడానికి చాలాప్రయాస పడ్డాం కానీ, తర్వాత కాస్త నిజంగా కులాసాగా ప్రవర్తించాం. ఆమె తల్లి విశ్రాంతి తీసుకోడానికి వెళ్లింది. లూసీ నేను ఒంటరిగా మిగిలాం. ఆమె గదిలోకి వెళ్లాం. ఆ గదిలోకి వెళ్లేవరకు ఆమె ఉత్సాహంగానే కనిపిస్తూ వుంది, బహుశా పనివాళ్ళు వస్తూపోతూ వుండటం వల్లఅనుకుంటా. తలుపులు వేసిన వెంటనే, ఆమె మొహంలో మార్పు వచ్చేసింది. నటన అయి పోయింది. గట్టిగా నిట్టూర్చుతూ కుర్చీలో కూలబడింది. చేత్తో కళ్ళు మూసుకుంది. ఆమెను పరీక్షించడానికి అది మంచి అవకాశంగా తీసుకున్నాను

"నా గురించి చెప్పుకోవాలంటే ఎంత అసహ్యంగా వుందో చెప్పలేను" అంది నెమ్మదిగా. డాక్టర్ని నమ్మకంలోకి తీసుకోవడం చాలా మంచిదని చెప్పాను. పైగా నువ్వు ఆమె గురించి ఎంతో ఆందోళన పడుతున్నావని కూడా చెప్పాను. ఆమెకు అర్థమయింది. 'మీరు ఏం చెయ్యదల్చుకున్నారో ఆర్థర్‌కి అన్నీ చెప్పండి. నా మీద నాకు శ్రద్ధలేదు. ఇదంతా అతనికోసం' అంది. ఇప్పుడు నాకు స్వేచ్ఛ వచ్చింది.


ఆమెలో రక్తం చాలా తక్కువగా వుందని చూడగానే గ్రహించాను. కానీ రక్తలేమి. జబ్బుకు సంబంధించిన లక్షణాలు కనిపించలేదు. అనుకోకుండా ఆమె రక్తాన్ని కూడా పరీక్షించే అవకాశం కలిగింది.

జీవన్ వృతులు

ఆమె కిటికీ తలుపు తెరవబోయింది. గట్టిగా వుండి అది రాలేదు. ఆ ప్రయత్నంలో కిటికీ అద్దం పగిలి, దాని తాలూకు ముక్క ఆమె చేతికి కొద్దిగా కోసుకుంది. ఇది చాలా చిన్న విషయమే అయినా, నాకు మంచి అవకాశం అయింది. ఆమె రక్తపు బొట్లు పరీక్షించాను. రక్తంలో అసాధారణం ఏమీ కనిపించలేదు. పైగా మంచి ఆరోగ్య లక్షణాలు కనిపించాయి. శారీరకంగా ఆమె ఆరోగ్యం సంతృప్తికరంగానే వుంది. ఆందోళనకు తావులేదు. కానీ ఏదో ఒక కారణం కనిపించాలి కదా. ఆ కారణం మానసికమైనదనే నిర్ణయానికొచ్చాను. అప్పుడప్పుడూ వూపిరి తీసుకోవడం చాలా కష్టంగా వుంటోందని చెప్పింది. నిద్రలో బద్ధకంగా వుంటోందనీ, పీడకలలు వస్తున్నాయని చెప్పింది. కలలు ఎలాంటివో ఆమెకు గుర్తులేవు. చిన్నప్పుడు నిద్రలో నడిచే అలవాటు వుండేదని, విట్‌బీలో వున్నప్పుడు మళ్ళీ ఆ జబ్బు తిరగబెట్టిందని చెప్పింది. ఒకసారి రాత్రిపూట నిద్రలో నడుచుకుంటూ ఈస్ట్‌క్లిఫ్‌కు వెళితే మిస్ మీనా చూసి తీసుకొచ్చిందని చెప్పింది. అట్లా మళ్ళీ ఎప్పుడూ జరగలేదట. నాకు ఒక సందేహం వుంది. వెంటనే ఒక మంచి ఆలోచన వచ్చింది. ఆంస్టర్‌డామ్‌లో నా పాతమిత్రుడు, గురువూ అయిన ప్రొఫెసర్ వాన్‌హెల్సింగ్ వున్నాడు. అతనికి రాసాను. ప్రపంచంలోవుండే ఇటువంటి అంతుబట్టని జబ్బుల గురించి అతనికి బాగా తెలుసు. అతనికి రమ్మని రాసాను. అన్ని విషయాలు నీ ద్వారా జరగాలని చెప్పావు గాబట్టి, నీకూ మిస్ లూసీకి వున్న సంబంధం గురించి అతనికి చెప్పాను. ఇదంతా నువు కోరినట్టే చేస్తున్నాను, మిత్రమా! ఆమె గురించి ఏమైనా నాకు చేతనయింది చేయడానికి సంతోషంగా కూడా వుంటుంది. వ్యక్తిగత కారణం వల్ల వాన్ హెల్సింగ్ నాకోసం ఏమైనా చేస్తాడని నాకు తెలుసు. అతను చెప్పినట్టు మనం చెయ్యాలి. అతనికి పక్షపాతవైఖరి లేదు. అతను మాట్లాడే విషయం ఇతర్లకన్నా బాగా తెలిసే మాట్లాడతాడు. అతను తత్వవేత్త, వేదాంతి. ఆ విషయంలో అందరికన్నా మిన్న. అతనిది చాలా నిర్మలమైన మనసు అని నేను నమ్ముతాను. ఇతర్లు కాదనలేని నిర్దుష్టమైన భావాలు వున్న మనిషి. ఎంతో సహనం గలవాడు. అతనిది దయకు లోటులేని నిజమైన హృదయం. ఈ గుణాలతో అతను ప్రజలకు సేవ చేస్తున్నాడు. అతని ఆలోచన, ఆచరణ ఒక్కటే. ఇవన్నీ ఎందుకు రాస్తున్నానంటే, అతని మీద నాకెంత నమ్మకముందో తెలియజేయడానికే. అతన్ని వెంటనే రమ్మని రాసాను. మిస్ లూసీని రేపు మళ్లా చూస్తాను. ఆమె నన్ను బయట కలుసుకుంటుంది. ఇంటి దగ్గర కలిస్తే, వాళ్లమ్మ 'ఏమిటీ, మళ్ళీ వచ్చాడు' అని కంగారుపడొచ్చు.

ఎప్పుడూ నీ
జాన్ సెవార్డు.

(ఇంకా వుంది)



జీవన సంధ్యాసమయంలో...

శ్రీమధురాజ్

ఊరింకా నిద్రపోలేదు.

కనుచీకటి పడ్డ తరువాత గుడిసెల్లో నుండి లేచిన పొగలు చీకటిమాటున ఆగిపోయి అప్పటికి చాలసేపయ్యింది. ఊరవతల టూరింగు సినిమా టెంటులో అరిగిపోయిన రికార్డు గరగరలాడుతూ పాటలు పాడుతోంది. చీకట్లో వీధులకడ్డంగా పరుగెడుతున్న బురదపందుల్ని చూసి ఊరకుక్కలు వూరికే 'గీ' మని గోలపెడుతున్నాయి. వాడలోని వీధిలైట్లు వాడలోని వ్యక్తుల జీవితాల్లా 'వెలగమా మానమా' అన్నట్లు— యిక్కడోటి అక్కడోటి చీటిని చూసి దడుసుకున్నట్లు మిణుకు మిణుకు మంటున్నాయి.

అది హరిజనవాడలో అన్నాలవేళ.

సూర్యుడి కంటే ముందేలేచి — అతడితోపాటు వురికి వురికి — రక్తాన్ని చెమటలుగా గ్రక్కి, అతను గూటికి చేరుకున్నాకే గుడిసెలకు చేరుకున్న కూలీ జనం — మండీ మండని పొయ్యిమీద — ఉడికీ వుడకనిది యింత వండుక — వడ్డించుక తినే వేళ.

సన్నాసి పక్కీరయ్య అడుక్కు తెచ్చుకున్న కూడు ఎప్పుడు తిన్నాడో ఏమో — అప్పుడే తత్వాలు పాడుతున్నాడు 'రాములోరి' గుడి దగ్గర. ఆ వాతావరణానికి పక్కీరయ్య గొంతుశోక సంగీతంలా వుంది.

రాములోరి గుడికి కాస్తంత అటుప్రక్కన మున్న నాలుగు నిట్టాళ్ల ఈతాకుల కొట్టము నారాయణదే. ఇప్పుడైతే వయసు పైబడి, కాలికి పక్షవాతమొచ్చి అలా రెక్కలిరిగిన పక్షిలా వున్నాడే కాని — మొన్న మొన్నటిదాకా తన రెక్కల్ని ముక్కలు చేసుకొని, తన కండల్ను పిండి చేసుకొని — ఒంటి నిట్టాడి కొట్టాన్ని నాలుగు నిట్టాళ్లకు పెంచాడు. చేరెడు నేలను రెండెకరాలు చేశాడు. ఇద్దరి బిడ్డల్ని అత్తారింటికంపాడు. మరో యిద్దరు కొడుకుల్ని కలో గంజో త్రాగి పెంచి పెద్దచేసి ప్రయోజకుల్ని చేశాడు. ఇదంతా నారాయణ ఒక్కడే తన రెక్కల కష్టంతోనే సాధించాడూ అంటే — అంతకంటే అబద్దం మరోటుండదు. కట్టుకున్న యిల్లాలు నాగమ్మ లేకుంటే నారాయణ— నాలుగు నిట్టాళ్లూ, రెండెకరాలు కాదు కదా — ఉన్న ఒంటి నిట్టాడి చేరెడు నేల ఏనాడో పోగొట్టుకొని ఉండేవాడు.

నారాయణా,నాగమ్మ సూర్యునితో పోటీపడ్డారు.

ఆలుమగలూ వర్షంతోనూ తలపడ్డారు.

ఆ పెళ్లాం, మగడూ చలితోనూ పంతం పడ్డారు.

కాలానికైతే ఎంతవురికినా ఆయాసం లేదేమో కాని — మనుషులెన్నాళ్లు కాలంతో పోటీపడగలరు ?

ఇప్పుడు అరవైపదులు నిండిన నారాయణకు— పరుగెత్తటానికి కాదుకదా — నడవటానిక్కూడా ఓ కాలు సరిగాలేదు. దాన్ని పక్షవాతం మింగేసింది. ఇక ఐదున్నరపదులు నిండిన నాగమ్మకు — కొండల్ని పిండి కొట్టటానిక్కాదు కదా— కనీస శ్రమకు తట్టుకోటానికి తగిన శక్తికూడా లేదు. శక్తిని వయసు మింగేసింది.

అదిగో నారాయణ ఇల్లు...

* * *

ఆ యిల్లు యిప్పుడు నారాయణది కాదు నిజానికి. కుడివైపున్న రెండు నిట్టాళ్ల కొట్టం పెద్దకొడుకు నాగసుబ్బడిది. మరి ఎడమవైపుది చిన్నకొడుకు రామలింగడిది.

నారాయణ యింట్లోనుండి బయటకొచ్చాడు నెమ్మదిగా కర్రసాయంతో. ఆకాశంకేసి తలెత్తి చూశాడు. చుక్కలు నిండిన ఆకాశం తన్ను వెక్కిరించినట్లయి తలదించుకున్నాడు. ఇంట్లోని బుడ్డి దీపం గుడ్డి వెలుగు తడిక సందుల్లోంచి బయటికి పడుతూంది. ఆ చీకటి వెలుగులు కట్లపాముల్లా వున్నాయి.

నారాయణ గుండెల్లో బాధ సుళ్లు తిరుగుతోంది. దుఃఖంతో శరీరం సన్నగా వణుకుతోంది. కళ్లు వర్షించటానికి సిద్ధంగావున్న మేఘాల్లా వున్నాయి. అయినా తనేం తప్పు చేశాడు? తనేం పాపం చేశాడు ? ? మాటల ఈటెలతో తన గుండెల్ని ఎందుకిలా తూట్లు తూట్లుగా పొడుస్తున్నారు. నారాయణ కళ్లు తుడుచుకున్నాడు. ఏడుపు బయటకు రాకుండా పెదవి బిగబెట్టుకున్నాడు.

అప్పటికి సరిగ్గా అరగంట క్రితం ఆ యింట్లో దృశ్యం యిలా వుంది —

'అమ్మో— అమ్మో— గూట్లో యెట్టిన కుండెడు సద్దికూడు ఈ ముసలాడే మెక్కేసినట్టున్నాడు — కుండలో మెతుకూలేదు — అది కదుపా సెరువా నాయనో ! యింటి దగ్గరున్న ఈ పంటి ముండకయినా యింత పెట్టిండో— లేకుంటే అంతా తన కడుపుకే పాముకున్నాడో—' కోడలు కోటమ్మ యింట్లో కాలుపెడుతూనే యిల్లంటుకున్నట్లుగా గోలపెట్టింది. బయట అరుగుమీద కూర్చుని బీడి కాల్చుకుంటున్న నారాయణ గుండెల్లో ఈ మాటలు తూట్లు పొడిచాయి ఒక్క క్షణం శరీరం కోపంతో కుత కుత లాడింది. కాని— మరుక్షణమే తానేమిటో గుర్తుకు వచ్చి, మనసు మూగగా మూల్గింది.

'ఒసేయ్! వూరకే ముసలాన్నెందుకు ఆడిపోసుకుంటావే—' కొడుకు నాగసుబ్బడు తండ్రిని కాపాడాలనుకుంటున్నాడు పెళ్ళాం నోటినుండి.

'ఇగో— మీ నాయనంటే నీకంత యిదుంటే వున్న ఆ ఒక్కెకరాన్ని అమ్ముకోని కుండెడు కుండెడు కూడొండి పెట్టు— నేను న్నా పిల్లలు సెర్లో దూకి సత్తాము—' చేతులు సాపి మెటికలు విరిచింది కసిగా.

ముసలి నారాయణ యిక బయట నిలువలేక యింట్లో కొచ్చాడు. కోడలు కోటమ్మ త్రాచు పాములా బుసలుకొడుతోంది. కొడుకు నాగసుబ్బడు మన్ను తిన్న పాములా మౌనంగా వున్నాడు. పిల్లలు బిక్కు బిక్కున చూస్తున్నారు తాతను, తల్లిని.

'వొరే నాగసుబ్బా! మద్దినాల నాలుగు ముద్దల్తిని బయటరుగుమీద తొంగున్నాను. మన సంటిది, బుడ్డోడు వాకిట్ల ఆడుకుంటునే వున్నరు. యెప్పుడొచ్చి సచ్చిందో యేటో క్రిరికుక్క గూట్లో కుండలోని కూడు పొట్టనెట్టుక సక్కావోయింది— కాదటే సంటీ...' నారాయణ ఐదారేళ్ళ సంటిదాని సాక్ష్యం కోసం ఆతురతతో చూశాడు. సంటిది ఔననలేదు— కాదనలేదు.

కోటమ్మ గయ్‌మని లేచింది రేచుకుక్కలా.

'ఆ సంటిదాన్నెందుకు అబద్ధాలు సెప్పిత్తావు — యియ్యాల క్రిరికుక్క తినిందంటున్నావు... నిన్న తెల్ల పిల్లి బొక్కిందంటివి — యిగరేపు— 'వొరే కొడుకో! ఆ కుండలో నీ పెల్లం ముండ నాలుగంటే నాలుగు ముద్దల కూడెట్టి నన్నాకటితో సంపుతుందిరో'' అంటవు — యింకెన్నాళ్ళుందో మాకీ ముదనష్టపు ముసలిపీడ—'' రక్కున మళ్ళీ మెటికలు విరిచింది.

నారాయణ గుండె ఒక్క క్షణమాగిపోయింది ఆ మాటతో.

ముసలి మనసు మూగబాధతో మూలిగింది. కళ్ల నీళ్ళతో దీనంగా కొడుకువైపు చూశాడు. ఇదంతా తనకేమీ పట్టనట్టుగా తాపీగా బీడి కాల్చుకుంటున్నాడు నాగసుబ్బడు.

నారాయణ తినే నాలుగు మెతుకులకూ ప్రతి రోజూ ఈ యుద్ధం తప్పదు. కొడుకూ, కోడలూ చేసే ఈ అవమానాలకు, పదే పదే అనే సూటి మాటలకూ మనసు నలిగిన ముసలి నారాయణ— 'ఛీ... ఛీ. . యీ కూడు తినకుంటేనేం ...' అని ముసుగేసుకపడుకుంటాడు. కానీ — ఎంతసేపు పడుకుంటాడు ?

ఆకలి ... ఆకలి ... నీరసం ... ఆకలి.

చచ్చేదాకా తినాలి తప్పదు. ఎన్ని అవమానాలున్నా దిగమింగుక తినాలి ఎన్నెన్ని ఈసడింపులున్నా దిగతుడుచుక తినాలి. తప్పదుగాక తప్పదు. అందుకే నారాయణ తింటున్నాడు కోడలు, కొడుకుల తిట్లు, శాపనార్థాలు దీవెనలుగా భావించుకుని.

కోటమ్మ యింకా గొణుక్కుంటునే వుంది వంటచేస్తూ. కోడిమీద, కుక్కమీద పెట్టి నారాయణను తిడుతూనేవుంది. అవన్నీ తనకేనని తెలిసినా నారాయణ గుమ్మనుంటాడు. పేదవాడి కోపం పెదమెత నారాయణకు బాగా తెలుసు.

క్రరసాయంతో నారాయణ బయటరుగుమీదకు వచ్చాడు.

జీవన సంధ్యాసమయంలో...

సరిగ్గా అప్పుడు ఎడమప్రక్క — చిన్నకొడుకు రామలింగడి యింట్లో ...

* * *

చీకటి పడీపడకుండానే రామలింగం యింట్లో కడుగుపెట్టాడు. వస్తూనే నిప్పులు చెరుగుతూ ముసలి తల్లి నాగమ్మమీద విరుచుకపడ్డాడు. గొంతు చించుకుంటూ శివమెత్తినవాడిలా కేకలేస్తున్నాడు.

'ఏమేవ్! నీకు బుద్దుందా లేదా — కడుపుకేం తింటావేనువ్. పొద్దుటాల నువ్వు పన్లోకెల్లేటప్పుడు మాయమ్మనుగూడ పిల్చుకెళ్ళమని పెద్దరెడ్డి సెప్పిండు కదే — మరేం పొయ్యేకాలం నీకు మాయమ్మ నింటికాడ వొగ్గేసి వొక్కత్తివి పన్లోకి పోయొచ్చినవ్. అటువోయి సూడు పెద్దరెడ్డి యింతెత్తున యెగురుతున్నడు.'

'నన్నడుగుతావేం — అగో ఆడమంచంలో మారానీలాగ తొంగుంది సూడు మీయమ్మనడుగు... పెల్లాలమీద కయితే వొంటి కాల్మీదవస్తరు ... నీ నోరక్కడ సూయించు ...' పెళ్ళాం రామలింగన్ని ఝూడించింది.

'వొరే రామలింగం! జొరమింకా తగ్గలేదురా— లేస్తే నీర్సంతో కళ్లు తిరుగుతున్నయి. అందుకే నీ పెల్లం పన్లోకి రమ్మన్నా రాలేక తొంగున్నా —' నూతిలో నుండి మాట్లాడినట్టుగా నాగమ్మ జవాబిచ్చింది. జ్వరంతో ఒళ్లింకా కాలిపోతూనేవుంది ఓ మందా? మాకా?

ఇంకా పనికి పోలేదేనని కొడుకు, కోడలు పోరుతునేవుంటే!

'అవతల నాలుగేసి రూపాయల కూలీల్దొరుకుతుంటే, జొరమని ముసుగేసుక మూలన పడుకుంటే గంజినీళ్ళెట్టా వస్తయి— మనమేం మారాజులమా? రేపు నోరెత్తకుండా పన్లోకిపో —'

'కుసింత తగ్గిందంటే పోనట్రా సిన్నోడా —' ఆ ముసలి తల్లి కంఠంలో ఆప్యాయత, మార్దవం, ప్రేమ. కన్నకొడుకిలా కసరుతున్నందుకు మాటలకందని బాధ.

తల్లి మాటకు రామలింగం భగ్గుమన్నాడు.

'ఇగోనేవ్! ఈ యింట్లో పనికిపోకుండా మారానిలా మంచాలెక్కి పడుకుంటే గంజినీళ్ళు కూడ పొయ్యన్నాడు — అట్లాగే ఆకల్తో చావాల్సిందే — ఏమేవ్! నీకే సెపుతున్నా — వినపడిందా?—' గొంతెత్తి కేకలేస్తూ రామలింగం విసురుగా బయటకి వెళ్ళాడు.

ముసలి నాగమ్మ గుండె భగ్గున మండింది, కోపంతో మనసు కుతకుత వుడికింది. కొడుకు చెప్పిన హెచ్చరికలు పెళ్లానికి కాదు — తనకని తెలుసుకోలేనంతటి మూర్ఖురాలు కాదు — అనుభవాలతో పండిన ముసలి నాగమ్మ.

కొడుకు ... కన్నకొడుకు

అష్టకష్టాలుపడి కనిపెంచిన కడుపుపంట ... జ్వరమొచ్చిన కన్నతల్లికి మందు మాకులిప్పించకున్నా— పట్టెడు మెతుకులు పెట్టలేని కొడుకు —

ముసలితల్లి గుండెల్లో మాటల ఈటలతో తూట్లుపొడుస్తున్న కన్నకొడుకు —

ఆపుకుందామన్నా ఆగనికన్నీళ్ళు ముడతలువడ ఆ చెంపల్ని తడిపాయి పదే పదే .... .

* * *

హరిజనవాడ నిద్రలోకి జారుకుంటోంది

ఉండివుండి వూరకుక్కలు వూరికే చీకట్లోకి చూసి వికృతంగా మొరుగుతున్నాయి ఊరవతల సినిమాటెంటు మైకు పాటలు పాడటంలేదు సినిమా మొదలయ్యిందన్నమాట పిచ్చిసన్యాసి పక్కీరయ్య తత్వాలు పాడి పాడి — యిప్పుడూరికే చీకట్లోకి చూస్తున్నాడు పిచ్చిగా

పెద్దోడి కొట్టంముందు అరుగుమీద ముసలి తండ్రి నారాయణ

చిన్నోడి కొట్టంముందు అరుగుమీద ముసలి తల్లి నాగమ్మ.

నారాయణ మీద పెద్ద కోడలు యెగిరెగిరి పడుతున్నపుడు నాగమ్మ మౌనంగా కన్నీళ్లతో వింటునే వుంది. నాగమ్మమీద చిన్న కొడుకు గొంతు చించుకుంటున్నపుడు నారాయణ గుబులుగుబులుగా వింటునే వున్నాడు.

ఇండ్లలో కొడుకులు, కోడళ్లు వెచ్చగా పడుకున్నారు.

ఎముకల్ని కొరుక్కుతినే చలికి ముసలి దేహాల్ని ఆహారంగా వదేశారు, కడుపు చించుక పుట్టినవారు

నారాయణ మెల్లగా నాగమ్మ అరుగు దగ్గరకు వచ్చాడు. ప్రక్కలో కూర్చుని నాగమ్మ వీపు నిమిరాడు మెల్లగా.

ఆ స్పర్శలో ఆప్యాయత.

ఆ స్పర్శలో నిస్సహాయత.

కవులు వర్ణించలేని, భావుకులు ఊహించలేని, రచయితలు చిత్రించలేని ఎన్నెన్ని భావనలో ఆ స్పర్శలో.

నాగమ్మ మనసు పులకించింది. ఒక్క క్షణం నీరసం ఎగిరిపోయినట్లయింది. పాతికేళ్ళ వెనక్కు పరుగెత్తింది మనసు. ఎన్నెన్ని బాధల్ను, కష్టాల్ను మరపింప చేసిందీ ఆ చేతి స్పర్శ.

ఉబుకుతున్న నారాయణ కన్నీటిని కొనగోట తుడిచింది నాగమ్మ. మాటా పలుకు లేకుండా ఒకర్నొకరు మౌనంగా ఓదార్చుకున్నారు ఆ ముసలి దంపతులు.

ఎవ్వరూ తమ తమ కష్టాలు, అవమానాలు, కన్నీళ్లు కలబోసుకోలేదు.

ఎవ్వరూ తమ తమ కథలూ, గాథలూ తవ్వుకోలేదు.

'ఏమేవ్! నా మనసంతా అదోలాగుంది కూసింత ఆ పంతులోరింటికాడికెల్లొత్తాను ఇగో నా పాత కంబడి... యిది కూడా నిండా కప్పుక తొంగో యెచ్చగుంటాది... పొద్దుటాలకు జొరం తగ్గుతది కూడా -'

నారాయణ క్రరసాయంతో ఆంథోని పంతులింటికేసి నడిచాడు. ఆంథోని గత పాతికేళ్ళుగా ఎలిమెంటరీ స్కూలు పంతులుగా ఆ వాడ స్కూల్లో పనిచేసి, అక్కడే రిటైరయ్యాడు.

'ఏం నారాయణా! రారా — యింకా నిద్ర పట్టలా—' ఆంథోని మంచం మీద కూర్చుని బైబిలు చదువుతూ ఆహ్వానించాడు.

'ముసలోన్ని నా కంత తొందరగా నిద్దర పట్టు

ద్దంటారా పంతులోరు' నారాయణ అరుగుమీద కూర్చున్నాడు.

'ఏంటి సంగతులు ?' బైబిలు మూస్తూ అడిగాడు ఆంథోని.

'సావెప్పుడొత్తుందా అని అంతా యెదురు సూత్తుండారు — అంతకంటె కొత్త సంగతే ఈ ముసలోడికుంటది పంతులూ —' ఈ మాట లంటున్నపుడు నారాయణ కంఠం బొంగురుపోయింది

'అదేంటి నారాయణా ! అలాగంటవు. నేను మాత్రం ముసలోడినికానా ?'

'మీకేటి పంతులూ — అదురుట్టవంతులు ఉన్న ముగ్గురు కొడుకులూ రాజాల్లాగా వుద్దోగాల్లో వున్నారు. అళ్లు మీమీద పేమతో రారమ్మంటూ రోజూ జాబులు రాత్తుండారు. మీరేమో యెందుకో పోకుండా యిక్కన్నే వుంటున్నరు. ఇదిగో నా మాటిని మీరిద్దరూ ఈ ముసలిపాయంలో కొడుకుల్దగ్గరికెళ్లండి.'

ఆంథోని నారాయణ సలహాకు బదులివ్వకుండా— నిర్జీవంగా నవ్వాడు.

ఆ చీకట్లో ఒక్కక్షణం నిశ్శబ్దం.

'ఇది నువ్వు రోజూ చెప్పేసంగతేకాని—నాగమ్మకు జ్వరమెలాగుంది.'

'ఆ సంగజ్జెప్పటానికే ఈడకొచ్చినా. తెల్లారి మీరు దాని మందులకో రెండ్రూపాయలివ్వాల—మళ్లీ యిచ్చేత్తా.'

'అదేం ? రామలింగడు మాత్రలు తీసుక రాలేదా ?'

పంతులుగారి మాటకు నారాయణ పకీపకీ నవ్వాడు.

'మందులా మసనకాడా ? తెల్లారి పన్లోకి పోకుండా జొరమని తొంగుంటే గంజికూడా పోయనని తెగేసి సెప్పిండు మా లింగంగాడు. మరి మీరేటో మాయలోకంలో వుండారు.'

ఆంథోని మరి మాట్లాడలేదు. నారాయణే ఏవో చెపుతున్నాడు.

సరిగ్గా అప్పుడు — చిన్నోడి యింటి ముందు అరుగుమీద జ్వరంతో, చలితో వణుకుతూ పడుకున్న నాగమ్మ మనసు పదిహేనేళ్ల వెనక్కు వెళ్లింది.

* * *

రెండు నిట్టాళ్ల కొట్టంలో, కుక్కిమంచంలో పడుకొని, కొట్టం చూరువంక చూస్తున్నాడు రామలింగడు.

పదిహేనేళ్ల రామలింగడు అరవైఏళ్ల ముసలివానిలాగున్నాడు. అస్థిపంజరానికి చర్మం తొడిగినట్లుగావున్నాడు. చూపుల్లో శూన్యం తప్ప జీవంలేదు. పలుకరిస్తే నూతిలోనుండి మాట్లాడినట్లుగా జవాబు. అతికష్టంమీద తప్ప మంచంలో లేచికూర్చోలేదు.

నీరసం ... బలహీనత.

ఖణేల్ ... ఖణేల్ ... ఖణేల్ ...

దగ్గుతో ఎండిన రొమ్ములు యెగిసెగిసిపడుతున్నాయి. ఊపిరి పీల్చుకోవటం కూడ కష్టంగా వుంది. చిన్నగా మొదలయిన దగ్గు, జ్వరం క్రమంగా క్షయగా మారి రామలింగాన్ని పూర్తిగా కబళించటానికి సిద్ధంగా వుంది.

మృత్యువు వాకిట్లో నిరీక్షిస్తోంది విసుగ్గా.

నాగమ్మ కొడుకువంక కన్నార్పకుండా చూస్తోంది.

ఆడుతూ పాడుతూ పనీపాట వేయాల్సిన చేతికందిన కొడుకు — ఇలా మృత్యుముఖంలో రోజులు లెక్కబెడుతూ —

కన్నతల్లి కళ్లు శ్రావణ మేఘాలయ్యాయి.

కన్నతల్లి గుండెలు భయంతో గుబ గుబ మంటున్నాయి.

ప్రపంచంలోని ఏ శక్తినైనా కొడుకు బాధను తనకు బదలాయిస్తే ఆనందంగా స్వీకరించగలదామె.

ఆ కన్నతల్లి హృదయం ఈ అక్షరాలకు అందగలదా ? !

నారాయణ వచ్చాడు. కొడుకుకోసం అణువణువులో తహతహ.

'ఎలాగుంది పిలగానికి —'

'అట్టానే వుంది—' నాగమ్మ కళ్లు వర్షించటానికి సిద్ధంగా వున్నాయి.

'వూర్లో ఆచారిగోరి వైజ్జం కుదిరినట్లుగ లేదు—పట్నంలో పెద్ద డాకటరుకు సూయిస్తే...!' ఆశ. అందని ఆశ. అందుకోవాలని ఆశ. కన్న కడుపును దక్కించుకోవాలని ఆశ.

పట్నం — డాక్టరు — వైద్యం.

డబ్బు — డబ్బు — డబ్బు.

నారాయణ నాగమ్మ ఒకర్నొకరు మౌనంగా చూసుకున్నారు. ఆ చూపులు ఏం మాట్లాడుకున్నాయో — నారాయణకేం అర్థమయ్యిందో - వెంటనే లేచివెళ్లాడు

రామలింగాన్ని ప్రొద్దున్నే పట్నం తీసికెళ్ళారు

సరిగ్గా మూడు నెలలకు రామలింగడు మామూలు మనిషయ్యాడు.

నాగమ్మకళ్లు ఆనందంతో మెరిశాయి.

నారాయణ మనసు సంతోషంతో గెంతింది

కానీ—

రామలింగని ఆరోగ్యం ఖరీదు చెల్లించటానికి-

నారాయణ వరుసగా పదేళ్లు పెద్దరెడ్డి యింట్లో పాలేరుగా వున్నాడు రెక్కలు ముక్కలు చేసుకున్నాడు.

నాగమ్మ నడుమెత్తకుండా వీధి వీధి తిరిగి పశువుల పేడ పోగుచేసింది.

పెద్దరెడ్డి యింట్లో, పొలంలో రక్తాన్ని చెమటలుగా చిందించింది

మరి యిప్పుడా ముసలి తల్లికి జ్వరమొస్తే. . వాస్తే ... ? ? ! !

... ... ఎంతగా ముణగదీసుకొని పడుకున్నా డిసెంబరు చలి ఎముకల్ని కొరికేస్తునే వుంది.

నాగమ్మ మూటగట్టి అరుగుమీద పడేసిన మనిషిలా వుంది. మెల్లగా ఈదురుగాలి మొదలయ్యింది. ఇహ పడుకోవటం సాధ్యంకాక, లేచి కూర్చుని ఆర్పిదాచుకున్న బీడీముక్కను ముట్టించాడు నారాయణ. పొగ గుండెల్ని తగిలేలా పీల్చేసరికి శరీరం కొంచెం వేడెక్కింది.

తెల్లవారు ఝాము కోడి కూసింది.


ఇంట్లో కొడుకు, కోడలు నిద్రలేచినట్లున్నారు— ఏదో గుసగుసగా మాట్లాడుకుంటున్నారు.


'కిస్‌మసు పండుగ యింగా యెన్నాల్లుందే—' కోడలు గొంతు.

'యేందే పండక్కు మా తొందరదుతున్నావు లాగుంది—' కొడుకు.

'ఆఁ! గార్లుబూర్లు కడుపుకు తిందామని. నీ తెలివి తెల్లారినట్టే వుంది — ఈ పండక్కే కాదూ మీ ముసలోడు సిన్నకొడుకింటికి, ముసల్దిమవింటికి మారేది—'

'అవునేవ్ మర్సిన. ఇగ ముసలోడికి తిండి దండగ తప్పుతదంటావ్'— కన్నకొడుకు.





'అవిటోడు కలోగంజో తాగి గమ్మునుండక రుసులు కోరుతుంటడు. పైగా నలుగురంత తనొక్కడే తింటడు.. యాడాడి నూకలు యాడి తిండికే సాలటంలా—'

'ఆ ముసల్దే మేలు కూలికెల్లి నాల్గురూపా యలన్నా తెస్తది'—

వినిపించకుండా గుసగుసలు. కోడలు యేం చెప్పిందో ఏమో కొడుకు పకపక నవ్వుతున్నాడు. ఆ నిశ్శబ్ద వాతావరణంలో ఆ నవ్వు దయ్యం పగల బడి నవ్వినట్లుగా వుంది. అంత చలిలోనూ కొడుకు కోడళ్ల మాటలు నారాయణకు చెమటలు తెప్పించాయి.

తన్ను తానే 'ఛీ' అనుకున్నాడు.

'సామీ నన్నెందుకింకా బతికించినవ్. నన్నన సంపుకపోక' ఏడుస్తూ ఆకాశంకేసి దండం పెట్టు కున్నాడు.

బీడీ విసిరేసి కళ్లు మూసుకున్నాడు. చెవుల్లో ఆ మాటలు. నవ్వులే గింగిరుమంటున్నాయి.

అవును నిరుడు సరిగ్గా క్రిస్టమస్ పండుగ రోజే పంపకాలు జరిగాయి.

ఆ రోజు ...

* * *

రచ్చబండమీద పెద్దరెడ్డి, రమణయ్య, ముత్యాలశెట్టిగారలు గంభీరంగా కూర్చున్నారు — న్యాయాధికారుల దర్జాతో. ఆ వూళ్లో వారేం చెబితే అదే న్యాయమూ, చట్టమూ. రచ్చబండ క్రింద పెద్దకొడుకు నాగసుబ్బడు, చిన్నకొడుకు రామలింగడూ చెరో ప్రక్కకూ కూచున్నారు — చూపులతో చురచుర చూసుకుంటూ. నారాయణ, నాగమ్మ క్రింద నేలమీద కూచున్నారు — కళ్లనుండి దుముకటానికి సిద్ధంగావున్న కన్నీళ్లను ఆపుకుంటూ. ఊరికే వెర్రిగా కొడుకులిద్దర్నీ చూస్తున్నారు.

నారాయణ రెండు చేతులూ ఒకదానితో ఒకటి పోటీపడ్డాయి

నాగమ్మ రెండు కళ్ళూ ఒకదానితో ఒకటి కలబడ్డాయి

పరిష్కారం ? వేర్పాటు -- పంపకం
నాలుగు నిట్టాళ్ల కొట్టం చెరిసగమయ్యింది
రెండెకరాల మెట్టచేనూ చెరో ఎకరమయ్యింది
ఉన్న రెండు బర్రెలు చెరొకటయ్యాయి

ఆస్తులు పంచుకున్నారు అప్పులూ పంచుకున్నారు ఇహ మిగిలింది- ఆ ఆస్తులకూ, అప్పులకూ అవి పంచుకుంటున్న కొడుకుల అస్తిత్వాలకు కారణభూతులయిన ముసలి తల్లిదండ్రులు

'ఏరా సుబ్బడూ ! నువ్వ పెద్దోడివి—మీ అమ్మ మీ నాన్నను నీ దగ్గరుంచుకో — లోకంలో అది పద్ధతి కూడా' పెద్దిరెడ్డి చెప్పాడు.

'రెడ్డిగోరూ ! మీరు గట్లంటె నే సచ్చిపోతా. ముసలాల్లనిద్దర్నీ ఒక్కల్లే సాకటం మా బీదముండా కొడులకి కానిపని. చెరొకర్ని యిప్పించండ్రి.'

నారాయణకు యిందాకటి బర్రెల పంపకం గుర్తొచ్చింది కళ్లు తుడుచుకున్నాడు.

'మరట్లాగయితే నాను ముసల్దాన్ని తీసు కుంటా—' చిన్నకొడుకు రామలింగడన్నాడు. నాగమ్మ దీనంగా నారాయణకేసి చూసింది. నాగమ్మను చూపులతోనే ఓదార్చాడు.

జీవన సంధ్యాసమయంలో...

నాగసుబ్బడు చిన్నోడి మాటకు షాక్ తిన్నాడు. తన నోటిముందటి కబళం తన్నుకుపోతున్న గద్దవంక చూసినట్లు ఓ చూపు చిన్నోడివైపు చూసి అంతలోనే సర్దుకున్నాడు.

'అద్గాదు రెడ్డిగోరూ ! మా ముసలాడికి సిన్నాడంటే శానాశానా యిట్టం. అందుకే ముసలాన్ని సిన్నాడికిచ్చి —'

'నేనొల్ల —' పెద్దోడిమాట కడ్డుతగులుతూ చిన్నోడు ఖరాఖండిగా చెప్పేశాడు

'నాకు ముసల్దే —'
'నాకు ముసల్దే —'
'నాకు ముసలాడక్కర్లా —'
'నాకు ముసలాడక్కర్లా —'

ఇక దుఃఖమాపుకోలేక నారాయణ బిగ్గరగా ఏడ్పు ప్రారంభించాడు. నాగమ్మా యేడుస్తోంది నోటికి పైటకొంగడ్డం పెట్టుకొని. కదల్లేని తన కాలువంక చూసుకుంటూ నారాయణ ఏడుస్తున్నాడు తను అవిటోడు — పనిచేసే కాలు చెయ్యి లేకుండా— కేవలం తినే నోరూ, కడుపూ వున్నోడు.

ఆ సంసారాన్ని ఆ స్థితికి తెచ్చిన నారాయణ యిప్పుడెవ్వరికీ అక్కర్లేని 'అవిటోడు'.

'ఇగో ఈ ముసలోడు మీ యిద్దర్కీ అక్కర్లేక పోతే — కుసింత యిసమిచ్చి సంపెయ్యండిరా — దీన్నీ నన్ను యిద్దర్నీ పీకపిసికి సంపెయ్యండ్రి —' నారాయణ హృదయం భగ్గున మండింది.

'నారాయణా ! నువ్వూరుకో' పెద్దరెడ్డి చెపుతున్నాడు 'ఒరేయ్ ! ఇద్దరూ వద్దువద్దంటే ఆ ముసలోడెక్కడికి పోతాడు ? ముసలోడక్కర లేనపుడు వాడు సంపాదించింది మీకెందుకురా .'

కొడుకులు ముఖాలు చూసుకున్నారు

'అందుకనే నేనో పద్ధతి చెపుతా వినండి .. మళ్లీ వచ్చే మీ పండుగ దాకా ముసలాడు పెద్దోడి దగ్గరా, ముసల్ది చిన్నోడి దగ్గర వుంటారు. పండుగ నుండి ముసలాల్లను మార్చుకోండి — ఎలాగుంది ఈ ఏర్పాటు ?'

రమణయ్య ముత్యాలశెట్టి బాగుందన్నారు

'న్యాయం' వెంటనే అమలు జరిగింది.

అదిగో మళ్లీ క్రిస్మస్ రాబోతోంది. . .

కోడి మళ్లీ కూసింది

నారాయణ బీడి ముట్టించుకున్నాడు. ఊళ్లోని దేవాలయంలో సుప్రభాతం వినపడుతోంది. వాడ మెల్లగా మేల్కొంటూంది.

నారాయణ మనసులో ఏవో కొత్త ఆలోచనలు కలుగుతున్నాయి దారపు పోగు కన్నా బలహీన మయిన మమతల బంధాలు తెగిపోతున్నాయి. నిర్లిప్తత... ఏదో వైరాగ్యం...

రాములోరి గుడిదగ్గర పిచ్చి సన్యాసి పక్కీరయ్య పాడుతున్నాడు.

యెవరు కొడు కెవరు కోడ
లెవరికెవరు గురుడా!!
కాలుసేతులుంటేనూ
మింగ మెతుకు గురుడా !!
రెక్కలిరిగి కూలబడితె
గంజి కరువు గురుడా !!

ఆ పాట నారాయణ గుండెల్లోకి సూటిగా దూసుకుపోతోంది. అవును. పిచ్చివాడెంత నిజం చెపు తున్నాడు ?

పాట ఆగిపోయింది. తెల్లారింతర్వాత తెలిసింది ఆ పాట శాశ్వతంగా ఆగిపోయిందని అందరూ పిచ్చి వాడనుకుంటున్న పక్కీరయ్య నిజానికి పిచ్చివాడు కాదు. ఆ నిజం నారాయణలాంటి వృద్ధులకు తప్ప యితరులకు తెలీదు మరి! పెళ్లాం చనిపోయి మనసు చలించిన పక్కీరయ్యకు, కొడుకుల కోడళ్ల ఆలనా పాలనా చూసి మతి చలించింది.

మనసు విరిచి, మతి చెడగొట్టి యింట్లో నుండి తన్ని తగలేశారు తనుకన్నవారు !

ఎందుకో మరి పక్కీరయ్య చావు నారాయణ కొత్త ఆలోచనలకు కావలసినంత బలమిచ్చింది. తన మనసులోనిమాట నాగమ్మకు చెప్పాడు మొదట ఆమె భయపడి వద్దన్నా— నారాయణ చెప్పే చేదు నిజాలకు— రాబోయే పరిణామాలకు బదులు చెప్ప టానికి తన దగ్గర జవాబు లేక మౌనం దాల్చింది

ప్రొద్దుటే నారాయణ కొడుకుల్ని, కోడళ్లను, చుట్టు ప్రక్కల వాళ్లను పిలిచాడు. అందరూ ఆశ్చర్యంతో వచ్చారు. అందోని పంతులుగారూ వచ్చారు.

'పంతులూ ! మడిసికి ఈ ముసలితనంకంటె మరోనరకం లేదు. రేపటి పండక్కి నానూ, ముసల్ది అటూయిటూ మారాలగందా . కానీ మేంమారం—'

జనం ఆశ్చర్యంగా వింటున్నారు.

'ఎందుకంటే మేమియ్యాలే పట్నమెల్లి పోతన్నం. మా బతుకులు మేం బతకలేకపోము అన్నిటికీ ఆ దేముడున్నాడు' నారాయణ కంఠం మమతానుబంధాలకు అతీతంగా వుంది.

ముసలివాళ్ల నిర్ణయం కొడుకులు, కోడళ్లకు సంతోషంగా వుంది. కానీ జనం కోసం పెద్ద కొడుకు మాటాడబోయాడు.

'పంతులూ ! అన్ని నోర్మూసుకోమను. ఇన్నాళ్లూ యింతయిదిగా సూసిందిసాలు . పదయే పోదాం.''

నాగమ్మ, నారాయణ చిన్న గుడ్డమూటతో కదిలారు. సంటిది, బుడ్డోడు ఒక్కసారిగా కాళ్లు కావలించుకున్నారు. చిన్నపిల్లల్ని చూసి ఆ పండు హృదయాలు వెంటనే చెమ్మగిల్లాయి. మమకారం కాళ్లను కదలకుండా చేసింది.

'తాతో నీతో నేనొస్తా ' సంటిది ఏడుస్తోంది.

'నీ ఈవు సీరుస్తా ... యింటాయేముండా — ' పెద్దకోడలు కూతుర్ని లాగింది.

రెక్కలు విరిగిన పక్షులు ముందుకు కదిలాయి. పంతులుగారు కన్నీళ్లతో అటే చూస్తున్నారు.

కన్నవాళ్ల నిరాదరణ కంటే భయంకరమయిన నరకం ప్రపంచంలో మరొకటుండదు కదా !

నారాయణ చేస్తున్న 'పని' తప్పని గట్టిగా వారించటానికి పంతులుగారి దగ్గర మాటలులేవు మరి ! అందుకే మౌనం వహించాడు. పైగా 'యిట్టివి' ఆ వాడకు కొత్తవి కూడా కాదు.

నారాయణ, నాగమ్మ కనుమరుగయ్యారు.

వాడలో జనం పక్కీరయ్య చావు గురించి,

దీపావళి కథలపై వ్యాసరచన పోటీలో మూడవ బహుమతి రూ. 100 లు పొందిన వ్యాసం

నైతికంగా పతనమైన వ్యవస్థ స్వరూపం!

ఏ కథకైనా సామాజిక స్పృహ అనేది చాలా అవసరం అలాంటి సామాజిక స్పృహ కలిగిన రచనలు అందరి మన్ననలందుకుంటాయనటానికి నిదర్శనం "ఉప్పులేని కూడు" కథ బహుమతి పొందిన కథలలో ఎన్నిక కావటం ఆ బహుమతి పొందిన కథలలో "ఉప్పులేని కూడు" కథకు అగ్ర తాంబూలమివ్వవచ్చునని నా అభిప్రాయం ఎందుకంటే మనం మన సామాజిక వ్యవస్థని కొన్ని నైతిక సిద్ధాంతాలపై ఆధారపడి నిర్మించుకున్నాం అలాంటి వ్యవస్థలో నైతిక విలువలు పతనమౌతున్న తీరు, వాటి ప్రాముఖ్యాన్ని వెంకటేశు పాత్రద్వారా కొడుకు నైతిక పతనానికి కించిత్తు కూడ బాధ పడని లింగన్నలాంటి వారికి రచయిత తన సహజ శైలిలో కనువిప్పు కలిగేలా చెప్పారు ఆఖరిలో నైతికంగా పతనమైన వ్యవస్థయొక్క స్వరూపాన్ని "ఉప్పులేని కూడు"తో పోల్చి చూపారు

ఇకపోతే బహుమతి పొందిన కథలలో రెండవ దానిగా "దూరం" కథను ఎన్నుకోవడమైనది. కారణం మన నిత్య జీవితంలో ప్రతి నిత్యం అనేక రూపాలలో దర్శనమిస్తున్న ఈ దూరాన్ని రచయిత చాలా సున్నితంగా, వివిధ కోణాల్లో కళ్లకుకట్టినట్లు చూపగలిగారు 'దూరాన్ని కాలంతో కూడా కొలవవచ్చును' అన్న మాటలను యిందుకు ఉదాహరణగా తీసుకోవచ్చు 'రీడరు'గారు తన ముఖాన్ని భిక్షగాడి మొహంలో చూసుకోవడం ద్వారా, మనిషికి, మనిషికి గల మధ్య దూరం ఎలాంటిదైనా 'ఆకలి'కి మాత్రం అలాంటి దూరం లేదని చెప్పగలిగారు.

సుజాత, మూర్తి లాంటి కపటం లేని సున్నిత మనస్కుల గురించి, భరద్వాజ లాంటి అధికార అహం గల వ్యక్తుల గురించి చెప్పటానికి తన శాయశక్తులా కృషి చేసి, సఫలీకృతులైనారు కాబట్టి మూడవ కథగా "మదర్పిత. తాంబూలాది" కథను ఎన్నుకోవడమైనది

'నాకు డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళటానికి డబ్బెంటే యిదెందుకు చేస్తాను!' అని 'హసీనా' చేత అనిపించటం ద్వారా ప్రజలలో పాతుకుపోయిన కొన్ని మూఢ నమ్మకాలకు ఆర్థిక లోపం కూడా ఒక కారణమని చెప్పగలిగారు అదే కారణాన్ని బాలలు కూలీలుగా మారటానికి కూడా చూపించారు. కావున "హసీనా" కథకు నాల్గవ బహుమతిని యివ్వవచ్చును.

లక్షలాది నిరుద్యోగుల్లో ఒకడై, చావు – బ్రతుకుల మధ్య ఊగిసలాడిన "పిసరంత గుండె" కల శంకరం కథను ఐదవదిగాను, "నీ గుండె కార్చిన కన్నీళ్ళు" కథను ఆరవదిగాను ఎన్నుకోవచ్చును

— తుమ్మల మోహనరావు

ముసలాళ్ల ప్రయాణం గురించి, వారం తిరక్కుండానే మరిచిపోయ్యారు.

మరిచిపోనిది ఆంథోని పంతులుగారు మాత్రమే!

* * *

రైల్వే స్టేషన్ .

సందడిగా, కోలాహలంగా వుంది

ఆంథోని పంతులుగారు, వారిభార్య బరువెక్కిన హృదయంలో, మూగబోయిన మనసులో రైలు దిగారు. తలవంచుకుని గేటు దాటారు.

'అయ్యా! ధరమం బాబూ ... అమ్మా! ధరమం తల్లీ ...'

'అవిటివాన్ని బాబూ . దానం సెయ్యండయ్యా ...'

ఎక్కడో విన్నగొంతు – బాగా పరిచయమున్న గొంతు. తల వెనక్కితిప్పి చూశారు పంతులుగారు.

నారాయణ !!

పంతులుగారికి కాళ్ల క్రిందనేల కంపించినట్లయింది.

గడ్డం పెరిగి, తలమాసి, చిరుగులు కట్టుకొని, దీనంగా, జాలిగా అడుక్కుంటున్నాడు నారాయణ. ఆ దృశ్యంతో పంతులుగారి గుండెలు బరువెక్కాయి.

'నారాయణా !'

ఆ పిలుపుకు వులిక్కిపడి నారాయణ తలెత్తాడు. ఎదురుగా పంతులుగారు !

అప్రయత్నంగా నారాయణ కళ్ల వర్షించాయి. గొంతు బొంగురు పోయింది. కానీ – అదంతా ఒక నిమిషం. నారాయణ తమాయించుకొని గుండె దిటవు పరుచుకున్నాడు.

ఇప్పుడు నారాయణ 'నా' అనేవారు లేని కుంటి భిక్షగాడు.

నారాయణ ముఖంమీద గడ్డం చాటున నవ్వు మెరిసింది.

'బావున్నారా పంతులూ...'

'ఆ. ' ఆంథోనికి ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో తెలియటం లేదు.

'యాడనుంచొస్తున్నరు .. కొడుకుల్దగ్గర్నుంచా... మీకేటి పంతులూ అదురుట్టవంతులు... ముసలిపోయాన గుండెల దాచుకునే కొడుకులు ...'

సంవత్సర కాలంలో కొడుకుల, కోడళ్ల ఆదరణ, ఆప్యాయత పంతులుగారి మనసులో 'ముల్లులా' గుచ్చుకుంది.

ఈ లోకంలో రక్తసంబంధాలు లేవు – ఆర్థిక సంబంధాలు తప్ప !

నారాయణ పొగడ్తలకు జవాబుగా ఆంథోని జీవంలేని నవ్వు నవ్వాడు.

'నాగమ్మ యెక్కడికెళ్లింది' – భయం భయంగా ప్రశ్నించాడు.

నారాయణ కన్నీళ్లతో చెయ్యి పైకి చూపించాడు.

పంతులుగారి మనసు దేవినట్లయింది.

'మరి ఒక్కడివి యిక్కడెందుకు బాధలు పడతావు – మనవూరు వెడదాంరా –'

'నాకేటి పంతులూ ... ఆయిగున్నా ...' చిరునవ్వు నవ్వాడు.

ఆ చిరునవ్వు వెనుక దాగివున్న కన్నీళ్లను అర్థం చేసుకోలేనివాడు కాదు పంతులు. నారాయణ ఏదో అడగాలనుకుంటూ, అడగటం లేదన్న సంగతి పంతులుగారు గ్రహించారు.

'నీ కొడుకులు బాగున్నారు– పెద్దోడు అరెకరం పొలం కొన్నాడు– అన్నట్లు చిన్నోడికి ఈ మధ్య కొడుకు పుట్టాడు–'

తనను కాదన్న కొడుకుల యోగక్షేమాలు వింటున్న నారాయణ మనసులో సంబరం.

'ఇగో పంతులూ ! ఈ అయిదు రూపాయలెట్టి, మా సంటిదానికి, బుడ్డోడికి లడ్డుండలు కొనుక్కెళ్లు–' నారాయణ కళ్లముందు పిల్లలు మెదిలారు,

వెలుగు తగ్గిన ఆ కళ్లల్లో మమతల కన్నీటితెర కదిలింది.

పంతులు వద్దంటున్నా నలిగిన ఐదురూపాయల నోటును గుప్పిటలో మూశాడు నారాయణ. ఎంతగా ఆపుకుందామనుకున్నా ఆంథోని పంతులుకు కన్నీరు ఆగలేదు.

పండిన ఆ మనసుకు తెలుసు మరో పండు మనసులోని మమతల వ్యథ !

పంతులు, వారి భార్య రిక్షా యెక్కారు.

పంతులు నారాయణకు డబ్బిద్దామనుకున్నాడు గాని– తత్త్వం తెలిసి ఆ ప్రయత్నం చెయ్యలేదు.

రిక్షా కదిలింది. తిరిగి స్టేషనువైపుచూశాడు.

నారాయణ అందరి ముందు చేయి చాస్తూ దీనంగా అడుక్కుంటున్నాడు. ఆ చెయ్యి–

హలంపట్టి పొలందున్ని బంగారం పండించిన చెయ్యి !

మట్టిని త్రవ్వి మాణిక్యాల్ని వెలికి తీసినచెయ్యి!

నాలుగు మెతుకుల్లో రెండు మెతుకుల్ని అన్నార్తుల కందించిన చెయ్యి !

ఆ క్షణంలో ఎందుకో తన కొడుకులు మనసులో మెదిలారు పంతులుగారికి.

ప్రభుత్వం వారిచ్చే పింఛనూ, నాలుగు ట్యూషన్లు చెప్పుకునే ఓపికా లేకపోతే... పోతే... తనూ...తన భార్య...ఈ జీవనసంధ్యాసమయంలో... ఆపైన ఊహించలేక కళ్లు మూసుకున్నాడు.

ఆ కళ్లనిండా కన్నీళ్లు.

ఆ కన్నీళ్లచాటున కనుమరుగవుతున్న నారాయణ రూపం...

ఇంకా అలాటలాటి ఎన్నో రూపాలు...

గతుకుల రోడ్డులో పాత రిక్షా మెల్లగా పోతోంది. ★

నీలాకాశం

సీరియల్ — శ్యామల

“మిస్ ఇందిరా, ఇంకా అవలేదా ? వీళ్ళ ఎదురు చూస్తున్నారు'' పిలిచాడు సుధాకర్.

లెటర్ తీసుకొని అతని వద్దకు వెళ్ళింది. అతను తీసుకొని చదివి “నా దస్తూరి అర్థం కాదేమోనని మిమ్మల్ని టైప్ చేయమన్నాను. మీ టైపింగ్ కూడా ఎవరికీ అర్థమయేటట్లు లేదే ?'' అని నవ్వి, పెన్ తీసుకొని తప్పులు దిద్ది ఇచ్చాడు.

ఇందిరకు చిన్నతనం అనిపించింది. మాట్లాడకుండా మరొకసారి టైప్‌చేసి యిచ్చింది. అతను ఒక కేస్ గురించి రాసిన నోట్స్ యిచ్చి “ఇవి కూడా టైప్‌చేసి ఉంచగలరా ? అంకుల్ రాగానే చదువుకోవటానికి వీలుగా ఉంటుంది'' అన్నాడు. ఇందిర తీసుకొని తన రూమ్‌లోకి వెళ్ళింది.

పద్మ వచ్చి సుధాకర్‌తో “అమ్మ నిన్ను భోజనానికి పిలుచుకొని రమ్మన్నది'' అంది.

“పన్నెండు దాటిందే టైము'' అని లేచాడు సుధాకర్. హాల్లోకి వచ్చి “రంగయ్యా, నేను భోజనానికి వెళ్ళివస్తాను. నీ సంగతి ఏ౦టి ?'' అని అడిగాడు.

“మీరు తిరిగి వచ్చాక నేను వెళ్తాను లెండి. హరి మీకోసం వంట చేశాడేమో !'' అన్నాడు రంగయ్య.

“పద్మ వాళ్ళింటికి రమ్మంటోంది. వెళ్ళానని హరికి చెప్పు'' అన్నాడు సుధాకర్.

పద్మ వచ్చింది అక్కడికి — “ఇందిరకు ఏదో టైప్ చేయమని ఇచ్చావట ! భోజనం చేసి తర్వాత వాటిని టైప్ చేయకూడదా ?''

“ఎందుకు చేయకూడదు ? మిస్ ఇందిరా, ముందు లంచ్ తీసుకొని వద్దాం, రండి !'' పిలిచాడు.

అతనితో కలిసి భోజనం చేయటం ఇష్టం లేదు ఇందరకి. అతనంటే జంకుగా ఉంటుంది తనకు, ఫ్రీగా అనిపించదు. అందుకని “నేను తర్వాత

(గత సంచిక తరువాయి)

వస్తాను'' అని మరొకసారి చెప్పి వాళ్ళను పంపించి వేసింది.

పద్మను, సుధాకర్‌ను చూస్తూనే వరలక్ష్మిగారు “ఇందిర ఏది ? ప్రొద్దుట్నుంచీ ఆ పిల్లకు తిండి లేదు'' అన్నది.

“అదేమిటి, ఉదయం టిఫిన్ తినకుండా వెళ్ళిందా ?'' అంది పద్మ.

“టైమయిపోయిందని హడావిడి పడి కాఫీ మాత్రం త్రాగి వెళ్ళింది. ఇప్పుడు మీతో రాలేదేం?''

“నేను ఇప్పుడే వెళ్ళి పిలుచుకు వస్తాను'' చటుక్కున సుధాకర్ లేచి వెళ్ళాడు.

ఇందిర టైప్ రైటర్ ముందు కూర్చుని ఉంది. టైప్ చేయటంలేదు. కుర్చీలో నీరసంగా వెనక్కి వాలి కళ్ళు మూసుకొని ఉన్నది.

దగ్గరకు వెళ్ళి మృదువుగా పిలిచాడు “ఇందిరా!''

కళ్ళు తెరిచి చూసింది.

“ప్రొద్దుటనించి ఏమీ తినకపోతే నీరసంగా ఉండదూ ? లేచిరా, భోజనం చేద్దువుగాని.''

లేచి నిలబడింది ఇందిర “మీ భోజనం అప్పుడే అయిపోయిందా ?''

“లేదు, మనమంతా కలిసి తిందాం. రావాలి మరి.''

అలాగే నిలబడింది ఇందిర. “నాతో కలిసి తినటానికి ఏదయినా అభ్యంతరం ఉంటే చెప్పు. నేను ఆగిపోతాను.''

“అదేం లేదు'' నసిగింది.

“చూడు ఇందిరా ! నాకు కొద్దిగా కోపం ఎక్కువ — అది తప్పే — ఒప్పుకుంటున్నాను. కాని చ్రరున వచ్చిన నా కోపం అంత త్వరగామా దిగిపోతుంది. మనం కలిసి పని చేయాలన్నా, స్నేహంగా ఉండాలన్నా, నీవు ఈ విషయం గుర్తుపెట్టుకోవాలి. నాకు కోపం వచ్చినప్పుడల్లా, నీవు మనసులో బాధపడుతుంటే ఎలా ? ధైర్యంగా చెప్పాలి 'నేను అన్నం తినలేదు, నీ టైపింగ్ తర్వాత చేస్తాను' అని — అంతేకాని, నేను ఏదో అన్నానని నీవు కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ, నీరసంగా ఉన్నా తిండి తినక—ఇలా అయితే చాలా కష్టం ! ఏమంటావు ?''

ఇందిర ఏమీ అనలేదు. అతను ఆప్యాయంగా మాట్లాడుతుంటే మనసంతా తేలికగా, హాయిగా అయింది.

ఇద్దరూ భోజనాలకు వెళ్ళారు. ఉష ఏవేవో కబుర్లు చెప్పసాగింది. చెరువులో జాలరివాళ్ళు తెప్పలలో వెళ్ళటం, వలలు విసరటం అన్నీ చూసిందిట ఆ ఉదయం. ఉత్సాహంగా వివరిస్తుంటే శ్రద్ధగా వింటూ, మధ్య మధ్యలో ప్రశ్నలు అడుగుతూ ఆ పిల్లను సంతోష పెట్టాడు సుధాకర్.

ఆ సాయంత్రం క్లినిక్‌పని సాఫీగా సాగిపోయింది. డాక్టర్ జాక్సన్, కంపౌండర్ ఇద్దరూ లేరని పద్మ కూడా సాయానికి వచ్చింది. పేషంట్స్ అందరూ వెళ్ళిపోయాక ముగ్గురూ సుధాకర్ గదిలో విశ్రాంతిగా కూర్చున్నారు. హరి టీ తెచ్చి యిచ్చాడు. సరదాగా కబుర్లు చెప్తున్న పద్మ సడెన్‌గా అడిగింది “ఇందిరా, నీ వెందుకో ఈపూట చాలా నిశ్శబ్దంగా ఉన్నావు?''

“ఏమీలేదు. మీరు కబుర్లు చెప్తుంటే వింటున్నాను, అంతే !'' అంది ఇందిర నవ్వి.

“ఈ చుట్టుప్రక్కల చూడవలసిన విశేషాలన్నీ ఆవిడకు చూపించావా పద్మా ?'' అడిగాడు సుధాకర్.

“లేదు సుధాకర్... నా సమస్యలతోనే వేడెక్కిపోయిన మనస్సుకి పిక్నిక్స్ తిరుగుదామనే సరదా పోయింది...'' విషాదంగా ధ్వనించింది పద్మ స్వరం.

“నీవు, ప్రసాద్ ధైర్యం చేయాలి పద్మా ! ఆవిడ బ్లడ్‌ప్రెషర్ గురించి మీరంతా భయపడుతున్నారని మీ అత్తయ్యకు తెలుసు. అది అదునుగా తీసుకుంటున్నారు ఆవిడ అని నా అనుమానం.''

“అదునో, సాకో— ఆవిడ బి. పి. హెచ్చుగా ఉన్నమాట నిజమేకదా ! ధైర్యం చేయటం ఎలా సుధాకర్? నిజంగానే నా జాతక ప్రభావం వలన బావకు ఏదో అవుతుందని ఆవిడలో గట్టి నమ్మకం పడిపోయింది. కాదని ఎలా నచ్చజెప్పటం ? ప్చ్... ప్రసాద్‌కి ఫ్రాక్చర్ అవటం, కుక్క కరవటం— జరగకపోతె నాకు సమస్యలే ఉండేవి కావు !''

“సుందరి నాకు విలువ యిచ్చి ఉంటే, యిచ్చిన మాట నిలబెట్టుకొని ఉంటే, నాకు ఈ మానసిక వేదన ఉండేది కాదు కదా ! జీవితంలో మనం అనుకున్నట్లే ఏవీ జరగవు పద్మా ! సమస్యలు లేని

జరిగిన కథ — 12 సినిమా చూసి స్కూటర్‌మీద వస్తూ యాక్సిడెంట్‌లో మరణిస్తారు ఇందిర తల్లిదండ్రులు. తన తమ్ముళ్ళ, చెల్లి భవిష్యత్తు తీర్చిదిద్దడానికి ఉద్యోగంలో చేరాలనుకుంటుంది ఇందిర. డాక్టర్ జాక్సన్‌తో ఇందిరకు పరిచయం కల్గుతుంది. తన దగ్గర టైపిస్ట్‌గా జేరమని జాక్సన్ ఇందిరను ఆహ్వానిస్తాడు. పరీక్షలవగానే చెల్లిని తీసుకురమ్మని తమ్ముళ్లకి చెప్పి తను ముందుగా వస్తుంది ఇందిర. పట్నంలో పెరిగిన ఇందిరకు ఆ పల్లెటూరి వాతావరణం, అక్కడి మనుష్యుల మనస్తత్వాలు నచ్చుతాయి. ఉషని తీసుక వచ్చి దించి వెళతాడు సురేష్. పల్లెటూర్లలోని మనుషుల మనస్తత్వాలు ఎలా వుంటాయో, మూఢనమ్మకాలు వాళ్లలో ఏ విధంగా పాతుకుపోయాయో తెలియజేయటానికి డాక్టర్ అరుణకు, ఇందిరకు గతంలో జరిగిన ఓ సంఘటన వివరిస్తాడు డా॥ జాక్సన్. ఇందిరకు పద్మ తన కథను వివరిస్తుంటుంది. బావ ప్రసాద్‌తో తన పెళ్లి ఇంకా రెండురోజులుందనగా అతని కాలికి ఫ్రాక్చరయి హాస్పటల్‌లో జేరతాడు. పద్మ నష్టజాతకురాలని, ఆమె మూలంగానే తన కొడుక్కి ఈ విధంగా జరుగుతోందన్న మూఢనమ్మకంతో వారిద్దరి పెళ్లి జరగకుండా చేస్తుంది ప్రసాద్ తల్లి.

బతుకే లేదు. మనిషిగా పుట్టాక సమస్యలను ఎదుర్కొనక తప్పదు ... గుండెలలో మంటలూ తప్పవు .. మనను మించిన విధి మనను ఆడిస్తూ ఉంటుంది. దాన్ని ఎవరమూ కంట్రోలు చేయలేం... కాని మూర్ఖత్వంతో, సంకుచిత భావాలతో, మనను ఆడిస్తూఉంటుందే ఈ మనస్సు అనేది — దానిని కొంత వరకయినా కంట్రోల్ చేయటం చేతకావాలి మనకు... మీ అత్తయ్యకూ నింపాదిగా ఆలోచిస్తే తడుతుంది — నీకు, ప్రసాద్ ఆక్సిడెంట్స్‌కీ సంబంధం లేదని. కాని ఆవిడ తన మనస్సుని ఓ మూఢ నమ్మకంతో మూసి వేసుకున్నారు ...'' సుధాకర్ ఏదేదో చెప్తున్నాడు. పద్మ శ్రద్ధగా వింటున్నది.

'మధు ఎందుకు తన మనసుని నా వైపు నించి మరల్చి మూసివేసుకున్నాడు ?' అనుకుంది ఇందిర. 'తమ్ముళ్ళను వాళ్ళదారిన వదిలేసి అతన్ని పెళ్ళి చేసుకుంటే తనకు ఎంత బాధ మిగిలేదో అర్థం చేసుకోలేకపోయాడా ? అసలు ఇప్పుడు తన గురించి ఎప్పుడయినా ఆలోచిస్తాడా ?' ఆలోచనల్లో ఉన్న ఇందిరను సుధాకర్ విస్మయంగా చూశాడు. 'ఈ అమ్మాయి మనసులో తమకెవరికీ తెలియని ఏదో ముల్లు సదా గుచ్చుకుంటూ ఉంటుంది' అనిపించే సరికి ఎందుకో జాలి ముంచుకు వచ్చింది.

*　　*　　*

మర్నాడు ఉదయమే క్లినిక్‌కి వెళ్ళింది ఇందిర. పేషంట్స్ రావటం, సుధాకర్ పరీక్షించి మందులు ఇవ్వటం, ఇందిర అసిస్టెంట్ చేయటం— పనులన్నీ చకచకా అయిపోతున్నాయి. ఎవరో వచ్చి సుధాకర్‌ని పిలిచారు, ముసలి తండ్రికి బాగా జ్వరంగా ఉన్నదని, వచ్చి చూడమని. పేషంట్స్‌ని పంపించాక సుధాకర్ వెళ్ళాడు వెళ్ళే ముందు ఇందిరని పిలిచి నేను వచ్చే వరకు క్లినిక్‌ని కనిపెట్టుకొని ఉండమని చెప్పి వెళ్ళాడు.

ఇందిర హాల్లోనే కూర్చొని న్యూస్ పేపర్ చూడసాగింది. చటుక్కున ఏదో గందరగోళం వినరావటంతో లేచి నిలుచుంది నాలుగేళ్ళ పిల్ల గట్టిగా ఏడుస్తున్నది. ఆ పిల్లను ఎత్తుకున్న యువతి ఎంత సముదాయిస్తున్నా వినటం లేదు. వెంట నలుగురయిదుగురు ఉన్నారు.అంతా కంగారుగా పరిగెత్తుతూ లోపలికి వచ్చారు, ''డాక్టరుబాబూ!'' అని అరుచుకుంటూ.

''చిన్న డాక్టరు బాబు ఇప్పుడే వస్తారు'' అని చెప్పి ఇందిర ఆ పాపను చూసింది. కుడిచేయి బాగా కమిలిపోయి ఉన్నది.

''వేడి నూనె మూకుడులో చెయ్యి పెట్టేసిందమ్మా ! ఏం చేయటం ? నా పిల్ల చెయ్యి ఉంటుందా ? ఊరుకోమ్మా !'' తల్లి కంగారుగా మాట్లాడుతోంది, పిల్లను ఓదారుస్తోంది.

పిల్ల గట్టిగా ఏడుస్తోంది. ఇందిరకు కంగారుగా భయంగా అనిపించింది. ఏం చేయాలో తోచలేదు.

అంతలో సుధాకర్ వచ్చాడు. అతని చూస్తూనే ''పిల్ల చెయ్యి కాల్చుకుంది బాబూ ! వేడి నూనెలో పెట్టేసింది. మంటకు తట్టుకోలేకపోతోంది ! డాక్టరు బాబూ ! మందు వెయ్యి బాబూ !'' అని అందరూ హడావిడిగా చెప్పారు.

సుధాకర్‌లో కంగారు, భయం ఏమీ కనబడ లేదు ఇందిరకి. మామూలుగా అన్నాడు, ''పాపకు ఏమీ కాలేదు. నేను చూస్తానుగా ! ఆ బల్లమీద పడుకోబెట్టండి'' బల్లమీద పడుకోబెట్టగానే మరింత గట్టిగా ఏడవసాగింది పాప.

''ఎందుకు పాపా, ఏడుపు ? మంటగా ఉందా? ఏం భయంలేదు. నేను నెప్పిఅంతా తీసేస్తానుగా... అసలు నూనెమూకుడుజోలికి ఎందుకు వెళ్ళావమ్మా? ఇదిగో, నీవు ఏడిస్తే మందు పని చెయ్యదు మరి. అంతే ... గుడ్ గర్ల్ ... చూడు అయిపోయింది'' మృదువుగా మాట్లాడుతూ ఆయింట్‌మెంట్ రాసి, పౌడరు జల్లి, బ్యాండేజీ కట్టాడు.

''ఏదీ, ఒక్కసారి బోర్లాపడుకోమ్మా .. మళ్ళీ పుండు పట్టకుండా ఒక ఇంజెక్షన్ ఇస్తాను. అదిగో, ఇంజెక్షన్ అనగానే మళ్ళీ ఏడుస్తున్నావా ? చీమ కుట్టినట్లు కూడా ఉండదు ... ''



అతను ఆ చిన్నపిల్లతో మాట్లాడుతూ ట్రీట్ చేస్తున్న తీరుకి ముగ్ధురాలయింది ఇందిర. ఎంత మృదువుగా, ఆప్యాయంగా మరిపించి, మురిస్తున్నాడు ! ఇతను 'పీడియాట్రిక్స్' చదివి, పిల్లల వైద్యుడు అయి ఉంటే బాగుండేది ...

పాపకు యింటికి వెళ్ళే సమయానికి, ఈ డాక్టరు నాకు మంచి స్నేహితుడు అని నమ్మకం ఏర్పడిపోయింది.

వాళ్ళు వెళ్ళాక కుర్చీలో అలసటగా కూర్చున్నాడు సుధాకర్. వెంటనే మరి కొందరు వచ్చారు. ''డాక్టరు బాబుగారూ ! త్వరగా రండి ! పిల్లవాడిని ఎద్దు కుమ్మింది ! తెలివి తప్పి పడిపోయాడు !''

చటుక్కున బల్లమీద నించి మెడికల్ కిట్ అందుకొని వాళ్ళ వెంట వెళ్ళిపోయాడు.

అరగంట దాటాక, తిరిగి వచ్చాడు సుధాకర్ గదిలోకి వెళ్ళి కుర్చీలో వెనక్కివాలి కూర్చొని కళ్ళు మూసుకున్నాడు.

ఇందిర నెమ్మదిగా వెళ్ళి అడిగింది — ''ఆ పిల్లవాడు ఎలా ఉన్నాడు ?''

''బాగానే ఉన్నాడు. ప్రమాదం ఏమీ లేదు'' కళ్ళు మూసుకొనే చెప్పాడు.

ఇందిర పైకి వెళ్ళి హరిని అడిగి వేడి కాఫీ తీసుకువచ్చింది.

అతని దగ్గరకి వెళ్ళి నిలబడి ''కాఫీ తీసుకోండి. అలసటగా కనిపిస్తున్నారు'' అంది.

కళ్ళు తెరిచి ఆశ్చర్యంగా చూశాడు అతను. తర్వాత చిన్నగా నవ్వి కాఫీ గ్లాసు అందుకుంటూ ''థ్యాంక్యూ, ఇందిరా ! నా అలసట గుర్తించి ఇలా ఎవరూ ఎప్పుడూ తెచ్చి ఇవ్వలేదు'' అన్నాడు.



నీలాకాశం

ఇందిర నవ్వి ఊరుకుంది.

"మరి నీకో కాఫీ ?" అడిగాడు

"ఇంకా నాకు కాఫీ టైము కాలేదు" అంది.

"నాకు మాత్రం టైమయిందేమిటి ?" అంటూ సగం కాఫీ మరొక కప్పులో పోసియిచ్చాడు.

"నాది ఒంటరి జీవితం ఇందిరా! అందుకే ననుకుంటా, చిన్న చిన్న ఆప్యాయతలకు కూడా కదిలిపోతూంటాను" అన్నాడు. అతని స్వరం భారంగా ఉన్నది.

"హాయిగా పెళ్ళి చేసుకోండి, ఒంటరితనం మాయమవుతుంది" వాతావరణం తేలికచేయా లన్నట్లు నవ్వుతూ అంది.

"ప్రేమ, పెళ్ళి— వీటిల్లో నాకు నమ్మకం లేదు ఇందిరా! మనం ప్రేమ అనుకునేది ఒట్టి ఆకర్షణ మాత్రమే. పెళ్ళి అనేది స్త్రీ పురుషుల వీలు కొరకు ఏర్పరచుకొన్న ఒక బంధం— అంతే!"

"బహుశా పురుషుడికి ప్రేమ, పెళ్ళి అనే మాటలకు అర్థం అంతవరకే పరిమితం కావచ్చును కాని ఆడపిల్లలు అలా కాదు! ప్రేమించటమంటే, పెళ్ళి చేసుకోవటమంటే, మనసారా ఒక వ్యక్తికి తనను తాను అర్పణ చేసుకోవటం."

సుధాకర్ నవ్వాడు. "అవన్నీ పుస్తకాలలో మాటలు! స్త్రీ దృష్టిలో ప్రేమకు అర్థం ఏమిటో నేను చెప్పనా? ఓ అబ్బాయితో తియ్యగా మాట్లాడి అతన్ని తన వెంట తిరిగేటట్లు చేసుకోవటం! అందుకే ఎక్కువ డబ్బు సంపాదించే వాడికి పెళ్ళిళ్ళ మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ!"

"ఎంత అన్యాయంగా మాట్లాడుతున్నారు?" రోషంగా అన్నది ఇందిర "మీకు స్త్రీల మనస్తత్వాలు తెలియక ఇలా అంటున్నారు. నా సొంత అనుభవం ఏమిటో చెప్పనా? పురుషుడికి స్వార్థపరత్వం ఎక్కువ... నేను, ఒక వ్యక్తి పెళ్ళి చేసుకోవాలనుకున్నాము కారణాంతరాల వలన రెండు సంవత్సరాలు ఆగమని అతనిని కోరాను అతను ఒప్పుకోలేదు, నాతో సంబంధం త్రెంచేసుకున్నాడు. దీనినేమంటారు?"

"రెండేళ్ళు వెయిట్ చేయను, ఇప్పుడే పెళ్ళి చేసుకుందాం అన్నాడంటే అది మీ పట్ల ప్రేమే కాదా? మీరే ఏవో కారణాలు అంటూ పెళ్ళి ఆపేశారు. కారణాలు అంటే ఇటువంటి విషయాలలో డబ్బుకి సంబంధించినవే అయి ఉంటాయి..."


"నేనేమీ డబ్బు మనిషిని కాదు, మీకు ఎందుకలా కనిపిస్తున్నానో కాని!"

"అలా రోషం తెచ్చుకోవద్దు. నేను జనరల్‌గా ఆడవాళ్ళ స్వభావం గురించి మాట్లాడాను. మీరు విభిన్నమైన వ్యక్తి కావచ్చు!"

అతను నిజంగానే అంటున్నాడో, హేళనగా అంటున్నాడో అర్థంకాక, అతని వైపు నిశితంగా చూసింది.

"ఏమిటలా చూస్తున్నావు, భస్మం చేసేటట్లు?" నవ్వుతూ అడిగాడు.

"ఏం లేదు, మీరు స్త్రీల పట్ల ఎందుకు ఇంత సినికల్‌గా ఉన్నారా అని ఆలోచిస్తున్నాను."




న్యూట్రముల్ శక్తి.
ఛాంపియన్లు ఎంచుకునేది యిది.
న్యూట్రముల్. సమృద్ధి అయిన అమూల్ పాలు, ఎంచిన
మాల్ట్, ఆరోగ్యాన్నిచ్చే విటమిన్లు, పుష్టినిచ్చే ప్రోటీన్లు,
అత్యవసరమైన ఖనిజాలు, ఉల్లాసాన్నిచ్చే చాక్లెట్...
యివన్నీ గూడా బోర్న్‌విటా, బూస్ట్, మాల్టోవా కన్నా
చాలా తక్కువ ధరలో. మరో విషయం గుర్తుంచుకోండి,
కేవలం న్యూట్రముల్‌కే ఐ ఎస్ ఐ నాణ్యతముద్ర వుంది.
Nutramul
AMUL'S NOURISHING DRINK
500g Net
IS : 1806
ISI
మరింత పొడుగ్గా,
బలంగా, పుష్టిగా అవడం ఎలా?
కనివిని ఎరుగని శక్తినిచ్చే పుస్తకపు కానుక!
To: Nutramul, P.O. Box 10148, Bombay 400 001. nn
ప్రియమైన న్యూట్రముల్,
దయయుంచి నాకు దారాసింగ్ గారి 'హైట్ ఇన్‌క్రీజ్
స్ట్రెంగ్త్ అండ్ ఫిట్‌నెస్' పుస్తకం పంపించండి. నేను
రు. 1-50 పోస్టేజి స్టాంపులూ, న్యూట్రముల్ 500 గ్రా.
డబ్బా కొన్న క్యాష్ మెమోనీ జతపరుస్తూన్నాను. సరుకు
సరుకు వున్నంతవరకే యీ కానుక అని నాకు తెలుసు.
పేరు ______________ (పెద్ద అక్షరాలలో)
అడ్రసు ______________
మార్కెట్ చేయువారు:
గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్
మార్కెటింగ్ ఫెడరేషన్ లి.
ఆనంద్ 388 001.




సంక్రాంతి బొమ్మలకొలువు
(ఫొటో : బోనేపల్లి మురళి)

సంక్రాంతి ముగ్గులు




ఆర్. సత్యవతి



ఎస్. రాజేశ్వరి

చుక్కలు :
6 = 6



ఎస్. ఎల్. పద్మ

నీలాకాశం

"అనుభవం నేర్పిన పాఠాలు —" పొడిగా అన్నాడు.

"ఇతను నిజంగానే ప్రత్యేకమైన వ్యక్తి - పిల్లలంటే అమితమైన ఆప్యాయత, స్త్రీలంటే మాత్రం అదో రకం అయిష్టత... రోగుల వద్ద ఎనలేని సహనం, ఇతర విషయాలలో మాత్రం చటుక్కున వచ్చేస్తుంది కోపం... డాక్టర్ జాక్సన్ పెంపకంలో అలవడిన ఫిలాసఫీలో ఆసక్తి, కాని ఎప్పుడూ ఒంటరి తనం ఫీలయ్యే మనస్తత్వం .. తనను ఒక్కోసారి 'మీరు' అంటాడు. ఒక్కోసారి 'నీవు' అంటాడు. మొదటిసారి తాము కలుసుకున్న పరిస్థితులు ఇతనికి ఇంకా గుర్తున్నాయా ? ఆలోచిస్తూ అతనివైపు చూసింది. అతనూ ఏవో ఆలోచనల్లో ఉన్నాడు.

ఉష వచ్చింది "ఇంకా మీరు భోజనాలకి రాలేదేమిటి? అంటే పిలుచుకు రమ్మని పంపించారు."

అతని ధోరణి అంతలోనే మారిపోయింది. ఉత్సాహంగా లేచి, ఉషతో కబుర్లు మొదలుపెట్టాడు, "నీవు భోజనం చేశావా, ఇంకా లేదా ?" అంటూ

భోజనాలు చేస్తుంటే, పోస్ట్‌మాన్ లెటర్స్ తీసుకువచ్చాడు. రమేష్ రాసిన ఉత్తరం ఉన్నది వాటిల్లో — శనివారం రాత్రికి పల్లెకు వస్తున్నట్లు

"శనివారం అంటే రేపే!" ఉత్సాహంగా అంది ఉష.

"రాత్రి రైలుకి వస్తున్నాడా మీ బ్రదర్ ? నేను స్టేషన్‌కి వెళ్ళి స్కూటర్‌పైన ఇక్కడికి తీసుకువస్తాను" అన్నాడు సుధాకర్ ఇందిరతో.

"థాంక్యూ !" అన్నది ఇందిర. "మా రమేష్‌కి డాక్టరు కావాలని కోరిక. డాక్టర్లంటే వాడికి ఎంతో ఇష్టం. మీతో స్నేహం కలుపు కుంటాడు, చూస్తూ ఉండండి."


సుధాకర్ నవ్వాడు.

ఆ రాత్రి డాక్టర్ జాక్సన్ తిరిగి వచ్చారు. సుధాకర్ తన యింటికి వెళ్ళిపోయాడు మర్నాడు సాయంత్రం మామూలు టైముకి అతను క్లినిక్‌కి రాలేదు. ఇందిర అతని కోసం అప్రయత్నంగానే ఎదురుచూడసాగింది. 'ఇదేమిటి, రెండురోజులు సన్నిహితంగా కలిసి పని చేసినందుకేనా అతని కోసం ఇంతగా ఎదురుచూస్తున్నాను ?' అని తనను చూసి తనే ఆశ్చర్యపడింది. చివరికి డాక్టర్ జాక్సన్‌ని అడిగింది "డాక్టర్ సుధాకర్ ఈ రోజు ఇంకా రాలేదేమిటి ?" అని.

"ఈ సాయంత్రం రానని చెప్పాడమ్మా! రెండు రోజులుగా ఇక్కడే వున్నాడుకదా, హాస్పిటల్ వర్క్ చూసుకోవలసినది ఉన్నదిట—" అన్నారు ఆయన.

ఆ రాత్రి భోజనాలయినా వాకిట్లో మంచాలు వేసుకొని కూర్చున్నారు అందరూ. ఇందిర రమేష్ కోసం మాటిమాటికి గేటువైపే చూస్తున్నది. ఉష ఎక్కడ ఏ శబ్దం వినబడినా బయటకు పరిగెత్తుతున్నది. వాళ్ళ ఆత్రుతకు నవ్వు కుంటున్నారు మాస్టారు, వరలక్ష్మిగారు, పద్మ.

(ఇంకా వుంది)



ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

ఆప్తవాక్యం – అనాప్తవాక్యం

ఆప్తులు మనకు పరిచితులు కావచ్చును. అపరిచితులు కావచ్చును. ఇతరుల మేలు కోసం చెప్పే ఏ మాట అయినా ఆప్తవాక్యమే అవుతుంది. దేశనాయకులు, త్యాగశీలురు, ప్రతిభావంతులైన ఉత్తములు చెప్పే మాట అందరికీ శిరోధార్యమైనది. కొందరు కుటిల బుద్ధులు మంచిగా మాటలాడుతున్నట్లు నటిస్తూ అహితాన్నే బోధిస్తారు. అట్టివారు అనాప్తులు. వారి మాట అనర్థానికి దారి తీస్తుంది. వారు ఏదయినా బోధిస్తే ఈ చెవితో విని, ఆ చెవి నుండి విడిచి పెట్టాలి. ఆ విధంగానే ఇతరుల మీద చెప్పే కొండేలను కూడా ఎంత మాత్రమూ వినకూడదు. అట్టి అనాప్తులు, మనలను ఎవరో నిష్కారణంగా నిందిస్తున్నారని చెప్పినప్పుడు – ఆ మాటను పట్టించుకుంటే అవతలి వ్యక్తిపై మనకు అనవసరంగా కోపం రావచ్చు. అతనిపై ద్వేషం కలగవచ్చు. యధార్థం మనకు తెలియదు. ఆ మాటలను లెక్కచెయ్యకపోతే మనం అనవసరంగా మనస్సులో బాధపడనక్కర్లేదు. అట్టివారిని దూరంగా ఉంచడం కూడా ఎంతో అవసరం.

తమకు మేలు తెలిపే ఆప్తవాక్యాన్ని ఎవరైనా చెప్పితే, కొందరు ఈ చెవితో విని ఆ చెవి నుంచి విడిచిపెట్టేవేస్తారు. అది అలక్ష్యభావాన్నే వ్యక్తం చేస్తుంది.

కొందరు ఆప్తవాక్యాన్ని వింటారు విని చాలా సంతోషిస్తారు. చెప్పినవారిని అభినందిస్తారు. అంతతోసరి దానిని ఆచరణలో పెట్టేవారు మాత్రం చాలా తక్కువ. ఆచరణలో పెట్టాలనే సంకల్పం ఉన్నా, అభినివేశం లేనందువల్ల ఆచరణలో పెట్టడం అసాధ్యమవుతూ ఉంటుంది. ఆసక్తివున్నప్పుడే ఏదయినా ఆచరించడం సాధ్యమవుతుంది.

కొందరు మంచిని బోధిస్తారు. వారు బోధిస్తారే గాని వారి ప్రవర్తన – వారు చెప్పిన దానికి విరుద్ధంగా ఉంటుంది. ఇట్టి వారిపట్ల శ్రోతలకు గౌరవం ఉండదు. అందువల్ల వారు చెప్పినదానికి విలువ అంతకంటెనూ ఉండదు. చెప్పేవారు చేసి చూపించాలి. "మేమెలాగున్నా మీకేమి? మేము చెప్పినట్లు చెయ్యండి" అనే భావన బోధించేవారికి ఉండకూడదు. తమ ఉపదేశం ప్రకారం అందరూ నడుచుకోవాలనే సదుద్దేశం ఉన్నప్పుడు ఇతరులు వేలు చూపి తమ తప్పలను వినేటట్లు ప్రవర్తించడం సరియైన పద్ధతి కాదు. అట్టివారు ఆప్తులుగా గౌరవం పొందరు. వారిమాటకు గౌరవం ఉండదు ★

ఇద్దరిలోను ఆరాటం... తహతహ...

"ఇప్పుడు ప్రారంభిస్తే ఎప్పుడు ముగుస్తుందో ? సాయంత్రం ఆఫీసు అయేక చెప్తాను.. ఇంతకీ మీరెందుకు ఆమె గురించి తెలుసుకోగోరుతున్నారో నేను తెలుసుకోవచ్చా ?" సందేహ నివృత్తికోసం అన్నాడు సుందరమూర్తి.

శివకుమార్ మౌనంగా, చిరునవ్వు నవ్వాడు.

రాజేశ్వరి ఆలోచిస్తోంది... "తన గురించి ఆయన ద్వారా తెలుసుకోవాలను కొంటున్నాడన్నమాట అతను..." అనుకొంది.

*   *   *

సాయంత్రం అయిదున్నరయింది. సుందరమూర్తి, శివకుమార్ హోటల్ అశోక్‌లో ప్రవేశించారు.

ఆఫీసరు హోదాలో కాకుండా, వ్యక్తిగత హోదాలోనే అతను సుందరమూర్తిని హోటలుకు ఆహ్వానించాడు.

కాఫీ, కార్యక్రమం ముగిసింది.

సుందరమూర్తి చెప్పటం ప్రారభించాడు.

రాజేశ్వరి తండ్రి సుదర్శన శర్మ రిటైరు స్కూలు టీచరు ... ఆయనకి ఒక్కడే కొడుకు... నలుగురు కూతుళ్ళు ... పెద్ద కూతురికి, కొడుక్కి వివాహాలు అయ్యాయి.. రెండో కూతురు ఉద్యోగం చేస్తోంది... ఆరు నెలల క్రిందటే పెళ్ళికూడా అయింది. కారణం ఏమిటో మరి ఆమె భర్త యింత వరకూ కాపురం పెట్టలేదు... భార్యా భర్తల మధ్య పన్నెండు వందల మైళ్ళ దూరం... ఆ దూరానికి కారణం, లోకులు రక రకాలుగా చెప్తారు...

పోతే రాజేశ్వరి ... మూడవది. నాలుగో అమ్మాయి ఇంటర్ చదువుతోంది...

శర్మగారు పాతకాలపు మనిషి ... చాదస్తుడు... కాలాన్ని బట్టి మార్చుకునే స్వభావం ఆయనలో లేదు. అక్కడే భార్యా భర్తలకు యుద్ధం ! కారణంగా రాజేశ్వరికి, ఆమె చెల్లెలుకు వివాహాలు సమస్య అయి కూర్చుంది.

రాజేశ్వరి అక్కకు ఉద్యోగం మానేసి, భర్తతో కాపురానికెళ్ళాలని వుంటుంది... భర్త ఆమె ఉద్యోగం మానరాదంటాడు... పైగా సంసారం చేయకపోతే ఏం ? పెళ్ళయిందిగా అంటాడు... ఏమిటో, అదోరకం మనిషి...

తొలగిన మబ్బులు

(14 వ పేజీ తరువాయి)

లోకులు వూరుకోరుగా ?

కొడుకు పెళ్ళి అవగానే, భార్య పమిట నీడన నిద్రిస్తున్నాడు... అతనికి ఇంటి వ్యవహారాలు పట్టవు... శర్మకు రెండో కూతురు కాపురం పెద్ద సమస్య అయితే, రాజేశ్వరికి కలిగిన 'మచ్చ' మరొకటి.

సుందరమూర్తి కొంచెం ఆగాడు.

"ఆగిపోయారేం ? ఏం జరిగింది ఆ తర్వాత !" కుతూహలంగా అడిగాడు శివ కుమార్.

రాజేశ్వరికి కొన్ని పెళ్ళిసంబంధాలొచ్చాయి. కాని ఏదీ కార్యరూపం దాల్చలేదు. అందుకు కారణం...

వాళ్ళూరి ప్రెసిడెంటు కొడుకు సుబ్బారావుకి రాజేశ్వరిపై కోరిక ! ఆమె అందానికి పిచ్చెక్కిపోయాడు... ఓ రోజు ఆమెను దారి కాచి బలాత్కారం చేయబోయాడు...

ఇద్దరిమధ్య పెనుగులాట . సంఘర్షణ... ఎవరో కూలీలు అడ్డుపడి ఆమెను యింటి దగ్గర దిగబెట్టారు...

కోరిక చావని సుబ్బారావు వూళ్ళో ఆమె శీలం గురించి వదంతులు సృష్టించాడు... ప్రజలు నమ్మక చస్తారా !

అన్నీ సవ్యంగా వుంటేనే ఆడ పిల్లల పెళ్ళిళ్ళు అంతంత మాత్రం ! అందులో ఓ 'మచ్చ' అనేసరికి ఇంతే సంగతులు...

రాజేశ్వరి యీ సమాజానికి, మనుషులకి ఎదురు తిరిగి తన భవిష్యత్తు నిర్ణయించుకోవాలనుకొంది. అంతే, తన క్లాస్‌మేట్‌ని దేవుడి సమక్షంలో పెళ్లాడింది ఆమె... ఇద్దరి కులాలు ఒకటే అయినా, గోత్రాలు, శాఖల్లో పట్టింపులొచ్చాయి తల్లి తండ్రులకు.

ఇద్దరూ గోత్రం, శాఖల పట్టింపులతో తల్లిదండ్రులను కాదని, స్వేచ్ఛా ప్రపంచం లోకి అడుగు పెట్టారు...


ఈ వివాహం సుదర్శనశర్మని క్రుంగ దీసింది.

రాజేశ్వరి భర్తతో ఢిల్లీ వెళ్ళిపోయింది...

సుబ్బారావు అన్నగారు ఢిల్లీలో ఉద్యోగం చేస్తుంటే, ఆ నగరాన్ని చూసేందుకు వెళ్ళి యాధృచ్ఛికంగా ఒకరోజు రాజేశ్వరిని, ఆమె భర్తని చూసాడతను...

సుబ్బారావుకు అతనితో హైస్కూలు చదువువరకు పరిచయం వుండటంతో, రాజేశ్వరి ఇంటికి తరచు స్నేహ ధర్మంగా రాకపోకలు సాగించాడు...

కోరిక పుట్టనే కూడదు... పుట్టిన తరువాత ఎలాగైనా తీర్చుకోవాలని మగవాడు



గ మ ని క

వ్యక్తుల పేర మీ రచనలు పంపితే వాటి పరిశీలనలో ఆలస్యం జరిగే ప్రమాదాలెక్కువ కనుక మీ రచనలన్నీ కూడా శీర్షిక పేరు కవరు పైన లేదా కార్డుపైన ఉదహరిస్తూ, సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ—520 003 అన్న చిరునామాకి పంపండి.

సం.

తొలగిన మబ్బులు

తాపత్రయ పడ్డాడు... అతని కోరిక తీరేలా కనబడటం లేదు...

తన ప్రచారం బహుశ అతని చెవిన పడ లేదేమో? తనే ఉదహరిస్తే!

ఆ భార్యా భర్తలమధ్య అనుమానాలకు దారి ఏర్పడింది... అగ్నికి ఆజ్యం తోడయింది.. కొండంతలుగా వింటున్న విషయాలు యిద్దరి మధ్యా దూరాన్ని పెంచసాగాయి.

ఎనిమిది నెలల దాంపత్య జీవనానికి గ్రహణం పట్టింది... రాజేశ్వరిని పుట్టింట్లో దిగవిడిచాడు భర్త...

భర్త విడిచి పెట్టిన ఆడదానికి ఈ సమాజం ఎంతటి గౌరవం,రక్షణ యిస్తుందో అందరికీ తెలిసిందే!

సుందరమూర్తి వాచీకేసి చూసాడు.

"మీ కేమయినా పనివుందా?" అడిగాడు శివకుమార్ లేదన్నట్లు తలూపాడు ఆయన.

"నాలుగేళ్ళ క్రితం రాజేశ్వరికి ఉద్యోగం చూపెట్టాడు దేవుడు. ఆ విధంగా ఆమె జీవితానికి ఓ దారి ఏర్పడింది... చాలా మంచి అమ్మాయి... ఎవరితోటి మాట్లాడదు... ఎవరైనా కల్పించుకొని మాట్లాడినా, ఏదో విధంగా వారిని తొలగించుకొనేందుకు ప్రయత్నిస్తుంది..."

"అటువంటి మంచి అమ్మాయి అయితే స్నేహితుడి మాటలకు విలువనిచ్చి వదిలి పెడతాడంటారా ఆమె భర్త?" ప్రశ్నించాడు శివకుమార్

"అదే నాకూ అర్థం కావటంలేదు.... చదువు, సంస్కారం వున్నవాడు, బాధ్యతగల ఉద్యోగం చేస్తుంటే అలా ఎందుకు చేసాడం టారు?" ఎదురుప్రశ్న వేశాడాయన.

"ఇంతకీ ఆమె భర్త జాడ తెలిసిందా, ఎక్కడున్నాడు?"

'ఎక్కడుంటాడు? ఈ విశాలదేశ లో ఓ మగవాడికి చోటే దొరకదా? ఆడదాని కయితే రైలుపట్టాలు, ఉరితాళ్ళు, ఎండ్రిన్ సీసాలు, హౌస్పెన్ సాగర్లూ ఉన్నాయిగా!" ఆమె భర్త చేసిన పనికి సుందరమూర్తి ఆవేశం ఎక్కువయింది.

"వస్తాను సార్!... ఇంతకీ రాజేశ్వరి గురించి అడగటంలో కారణం చెప్పగలరా?" సుందరమూర్తి అడిగాడు.

"కారణం అంటూ ఏమీలేదు... ఇప్పటికే

ఆ ఫైలుమీద చాలా గ్రంథం నడిచింది కదా! పై వాళ్ళనుంచి ఆ ఉద్యోగి కేసు ఎందుకు పరిష్కరించలేదు అని అడిగారనుకోండి... మనస్థితి కూడా భద్రంగా చూసుకోవాలి కదా! అదృష్టం బాగోపోతే, నా చేతుల మీదుగా అటువంటి మంచి అమ్మాయికి ఎటువంటి హాని అయినా కలిగితే .. అందుకని ముందుగా తెలుసుకుంటే మంచిదన్న అభిప్రాయంతో అడిగాను...'' శివకుమార్ చెప్పాడు.

ఇద్దరూ బయటకి నడిచారు.

* * *

మర్నాడు పదకొండు గంటలకు, ఫోను క్రెడిల్ మీదపెట్టి, శివకుమార్ రాజేశ్వరి కోసం కబురు చేసాడు.

''కూర్చోండి... ఆ ఫైలు గురించి తెలుసుకోవాలని పిలిపించాను... ఇంతకీ ఆ ఫైలు ఎలా పోయింది ?''

అతని ఎదురుగా రాజేశ్వరి ఇబ్బందిగా కూర్చుంది.... టూకిగా, ఆ ఫైలు గురించి ఉత్తర ప్రత్యుత్తరాలు, అంతా సూక్ష్మంగా చెప్పింది.

అంతలో ప్యూను రెండు కాఫీలు తెచ్చి ఇద్దరి మధ్యా పెట్టి వెళ్ళిపోయాడు.

అయిదు నిముషాల తరువాత పై అధికారి ప్యూను వచ్చి, ఓ కవరు యిచ్చివెళ్ళిపోయాడు.

శివకుమార్ చదివి ఆందోళన చెందాడు.

రాజేశ్వరి చెప్తుంటే, అతను ఆమెకేసే చూస్తున్నాడు... ఆమె గుండెలు చేసే చప్పుడు అతనికి వినబడుతోంది... ఊపిరికి గుండెలు వేగంగా 'డిస్కో' డాన్సు చేస్తున్నట్టుగా వున్నాయి ..

శివకుమార్ కవర్లోని ఉత్తరం తీసి రాజేశ్వరికి చూపించాడు ... అది పోయిన ఫైలు గురించి, పై అధికారి రాసింది.

అది చదువుతుండగానే, ఆమె స్పృహ కోల్పోయింది. శివకుమార్‌కు అర్థంకాలేదు... అనవసరంగా చూపించానేమో అనుకొన్నాడు. వెంటనే సుందరమూర్తిని పిలిచి, డిస్పెన్సరీ డాక్టరును పిలిపించాడు...

అయిదు నిముషాల్లో డాక్టరు వచ్చి, ఆమెను పరీక్షించి, కంగారు ఏమీ లేదన్నీ కేవలం షాక్‌వల్ల అలా జరిగిందని చెప్పి ఇంజక్షను యిచ్చాడు.

విశ్రాంతి కోసం రాజేశ్వరిని ''లేడీస్ రెస్ట్ రూమ్''కు తరలించారు. ఆఫీసు ఆవరణలోనే ఉద్యోగినుల సౌకర్యార్థం ఆ ఏర్పాటు వుంది.

శివకుమార్ మనసంతా కలవరంగా వుంది .... మనసు పరిపరి విధాల ఆలోచనలతో నిండిపోయింది .... వెధవ ఫైలు ఎంత పని చేసింది ? ఆ ఉద్యోగికి తన జేబులోంచి డబ్బు యిచ్చేసి 'ఊరుకోమని' చెప్తే బాగుంటుందేమో ? — అనుకొన్నాడు, అంతకన్నా మరేదారి కనబడక పోవటంతో.

సుందరమూర్తి మళ్ళీ వచ్చాడు.

''ఆమె ఎక్కడ వుంటోంది? ఈ వూళ్ళో తెలిసిన వాళ్ళుగాని, బంధువులుగాని ఎవరైనా వున్నారా ? సాయంత్రం ఆఫీసు అయేక రెస్టు రూములో వుండేందుకు వీలుపడదేమో, ఏంచేయాలి ?'' అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు కుమార్.

''నేను కూడ అదే ఆలోచిస్తున్నాను.''

''ఓ పని చేయకూడదూ....స్టాఫ్‌కారులో మీ ఇంటికి తీసుకువెళ్ళండి ... రెండురోజులుండి వెడుతుంది'' అన్నాడు శివకుమార్. ఆఫీసరు ధోరణి బోధపడటంలేదు. ఇద్దరి మధ్యా కొన్ని క్షణాల నిశ్శబ్దం.

''మీరే అలా చేస్తే బాగుంటుందేమో!'' బెదురుగా చెప్పాడు సుందరమూర్తి.

శివకుమార్ ఆలోచనలో పడ్డాడు.

అతను తన ఇంటి తాళం యిచ్చి, నర్సు సాయంతో రాజేశ్వరిని తన యింట్లో దిగవిడిచి, సాయంత్రం తను వచ్చేవరకూ వుండమని సుందరమూర్తితో చెప్పాడు.

రాజేశ్వరిని నర్సు సాయంతో సూపర్నెంటు శివకుమార్ ఇంటికి తీసుకువెళ్ళాడు.

సుందరమూర్తి ఈ విచిత్ర పరిస్థితిపై ఆలోచిస్తూనే వున్నాడు.

* * *

శివకుమార్ సాయంత్రం ఇంటికెళ్ళాక, సుందరమూర్తి రాజేశ్వరి బాధ్యతను అతనికి అప్పగించి వెళ్ళిపోయాడు.

డాక్టరు ఇచ్చిన ఇంజక్షను వల్ల ఆమె యింకా లేవలేదు ... బహుశా, 'మత్తు' ఇంజక్షను ఇచ్చాడేమో ?


సుందరమూర్తి ఆమెను శివకుమార్ పడుకునే 'యు–ఫోం' మంచం పైనే పడుకోబెట్టాడు— మరో మంచం లేకపోవటంతో !

సీలింగు ఫ్యాను గాలికి పమిట ఛాతీమీద నుంచి తప్పుకొంది. జాకెట్ లోపలి 'బ్రా' నుంచి గుండెలు ఆహ్వానం పలుకుతున్నట్టున్నాయి... చీర కుచ్చెళ్ళుకూడా నిలవలేక పోతున్నాయి...

హార్లిక్సు కలిపి తీసుకువచ్చిన తరువాత ఆమెనుసమీపించగానే ఆ దృశ్యం శివకుమార్‌లో ఉద్రేకం ఆవేశాన్ని పెంచాయి. కాని వివేకం వాటిని జయించింది.

రాజేశ్వరి ముఖంలో ప్రశాంతత, నిర్మలత్వం ప్రతిబింబిస్తున్నాయి.

శివకుమార్ ఆమెను లేపాడు, హార్లిక్సు తాగేందుకు... కొద్ది నిముషాల తరువాత రాజేశ్వరి లేచింది, కప్పు అతని చేతినుంచి అందుకొంది.



తొలగిన మబ్బులు

"...మిమ్మల్ని అనవసరంగా బాధపెట్టానేమో ?" శివకుమార్ అన్నాడు.

"...ఛ..ఛ... అదేం లేదు మీ ధర్మాన్ని నిర్వర్తించేరు... నా దురదృష్టం ..." రాజేశ్వరి చెప్పింది.

ఆ రాత్రి ఆమె ప్రశాంతంగా నిద్రపోయింది, శివకుమార్ ఆదరణలో...

* * *

మర్నాడు ఆఫీసుకెళ్ళగానే రాజేశ్వరి ప్రావిడెంటు ఫండుకు సంబంధించిన "సెల్" సెక్షనుకు వెళ్ళి. "ఆ ఫైలు ఇంకా ఎందుకు ఇవ్వలేదని" ప్రశ్నించింది, అక్కడి క్లార్కుని. అతను తత్తరపడ్డాడు...

"సారీ మేడం! నేనీ సీటుకు నాలుగు రోజుల క్రితమే వచ్చాను. ఒక ఫైలు వెతుకుంటే, ఈ ఫైలు బయటపడింది ... దీనికింకా 'జీవం' వుండటంతో పరిశీలించి, కేసు పరిష్కరించి, నిన్ననే సొమ్ము చెల్లించేందుకు ఏర్పాట్లు చేసి, పార్టీకి తెలియజేసాను. ఇదుగో మీ ఫైలు" అంటూ పోయిన ఫైలు తిరిగి ఇచ్చేసాడు.

పై విషయం రాత్రి నిద్రలో గుర్తుకొచ్చింది రాజేశ్వరికి అందుకే మర్నాడు ఆ 'సెల్' సెక్షనుకెళ్ళి ఫైలు గుర్తించి అడిగింది. సుందరమూర్తి 'పెర్సనోట్' ఆ సెక్షనుకు పంపించలేదు, అక్కడికి వెళ్ళే అవకాశం లేకపోవటంతో. రాజేశ్వరి ఆఫీసుకు రాని రోజున ఆ సూపర్నెంటు ఆ ఫైలు తీసుకెళ్ళాడు.

జరిగింది చెప్తూ, ఫైలు సుందరమూర్తికి ఇచ్చివేసింది. "రెడ్ బుక్"కు గ్రీన్ సిగ్నల్ లభించినంత సంతోషం ఆయనకు కలిగింది.

సుందరమూర్తి సలహాపైన, రాజేశ్వరి శివకుమార్‌తో చెప్పేందుకు వెళ్ళింది.

"అయితే సాయంత్రం మళ్లీ దేవీదర్శనం వుందన్నమాట!" నవ్వుతూ అన్నాడు శివకుమార్

"తప్పకుండా, దేవుడి కిన్నాళ్ళకైనా దయ కలిగింది" రాజేశ్వరి చెప్పింది.

సాయంత్రం శివకుమార్ ఇంటిలో—

"మన నాలుగేళ్ళ గృహిణ జీవితంలో ఏర్పడిన మబ్బులు, అపోహలు నేటితో తొలగిపోయాయి ... స్నేహితుడి మాటలు విని, నిన్ను దూరం చేసినందుకు నాకే శిక్ష విధించినా సరే!" విచారం కనబరిచాడు శివకుమార్.

"అవేంమాటలు! భార్య, భర్తని శిక్షించటమా ? అదుగో ... ఆ యూ — ఫోం మంచాన్ని అడగండి ... అది ఏంచెప్తే, అలా చేయండి ... చాలు" నవ్వుతూ చెప్పింది రాజేశ్వరి.

రాజేశ్వరి కోరిక అతనికి అర్థం అయింది.

సుందరమూర్తికి అంతా తెలుసు. సుదర్శనశర్మ, ఆయన స్నేహితులు, రాజేశ్వరి ఉద్యోగంలో చేరేక, పరోక్షంగా కూతురి యోగక్షేమాలు స్నేహితుడి ద్వారా తెలుసుకుంటూనే వున్నాడా కన్నతండ్రి ... ఇప్పుడు రాజేశ్వరి చెల్లెలు, ఆయన కోడలవబోతోంది.

శివకుమార్ సలహాపైన, రాజేశ్వరి ఉద్యోగానికి రాజీనామా ఇచ్చింది.

హైదరాబాద్ నోట్ బుక్

తిరుమల రామచంద్ర

పొట్టిశ్రీరాములు విగ్రహావిష్కరణ :


తెలుగు ప్రజల ప్రత్యేక రాష్ట్రం కోసం ఆత్మార్పణం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు —అని ముఖ్యమంత్రి శ్రీ విజయభాస్కరరెడ్డి డిసెంబరు 15న సచివాలయం ఎదుట శ్రీ పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి నప్పుడు జోహార్లర్పించారు. శ్రీ పొట్టిశ్రీరాములు 30వ వర్ధంతి సందర్భంగా నగరపాలక సంఘం, పొట్టి శ్రీరాములు స్మారక సమితి అధ్వర్యంలో ఈ విగ్రహ స్థాపన జరిగింది. శ్రీ పొట్టిశ్రీరాములు లక్ష్యశుద్ధి గల మహనీయుడు. ఒకసారి నిర్ణయం తీసుకున్నారా, తిరుగు వుండేది కాదు. ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ శ్రీ శ్రీరాములు అసువులు బాయడానికి పది నిమిషాల ముందు టెలిఫోన్ చేసినా, భారతప్రభుత్వం ఈ విషయమై అధికార ప్రకటన చేసే వరకు ప్రాయోపవేశం నుంచి విరమించనని చెప్పిన వజ్ర సంకల్పుడు ఆయన— అని ముఖ్యమంత్రి ప్రశంసించారు. శ్రీ పొట్టి శ్రీరాములు ప్రాయోపవేశం చేసిన చెన్నపురిలోని శ్రీ బులుసు సాంబమూర్తిగారి ఇంటిని తీసుకుని దాని నిర్వహణ వ్యయాన్నిభరించడానికి రాష్ట్రప్రభుత్వం సిద్ధంగా వుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. అధ్యక్షత వహించిన పురపాలక శాఖామంత్రి శ్రీ ఆర్.వేమన్న తమ ప్రసంగంలో శ్రీ పొట్టిశ్రీరాములు త్యాగం సువర్ణాక్షరాలతో లిఖింపదగిందని, నగరపాలక సంఘం అధ్వర్యంలో శ్రీ శ్రీరాములు విగ్రహం తయారయి నగరంలో ప్రతిష్ఠితం కావడం అత్యంత హర్షదాయకమయిన విషయమని, ఆయన అన్నారు. జనవరినెలలో నగరపాలక సంఘం స్వామీ రామానందతీర్థ విగ్రహాన్ని కూడా నగరంలో ప్రతిష్ఠిస్తుందని హోంశాఖామంత్రి శ్రీ కె. రోశయ్య అన్నారు. శ్రీయుతులు బి.కృష్ణ (ఎం. ఎల్. ఎ.), ఎం. సత్యనారాయణ (పొట్టి శ్రీరాములు స్మారక సమితి), కొత్తూరు సీతయ్య గుప్త ప్రసంగించారు. ప్రారంభంలో మునిసిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి శ్రీ పి. సి. పరేక్ స్వాగతం చెప్పారు. మునిసిపల్ నిర్వహణ శాఖ కార్యదర్శి శ్రీ ఆచంట చివరన వందన సమర్పణ చేశారు.


సురభి నాటక కళాసంఘం వార్షికోత్సవం :

సురభి నాటక కళా సంఘం 27వ వార్షికోత్సవం, సంఘ సంస్థాపకులు శ్రీ వనారస గోవిందరావు స్మారకోత్సవం డిసెంబరు 19, 20 తేదీలలో జరిగాయి. సంఘ కార్యదర్శి శ్రీ ఎస్. వి. శ్యామసుందర్ నివేదిక చదివి, పదకొండు సురభి కంపెనీలకు రంగస్థల సామగ్రిని ఖరీదు చేయడానికి 8 వేల రూపాయలు, సంఘానికి 12 వేలు ఆర్థిక సహాయం చేసినందుకు ప్రభుత్వానికి, ధన్యవాదాలర్పించారు. మరి నాలుగు సురభి నాటక సంఘాలు కొత్తవి పుట్టుకు వచ్చాయని ఆయన అన్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ పి. ఎస్. ఆర్. అప్పారావు వనారస గోవిందరావు చిత్రపటం ఆవిష్కరించారు. పిదప సంఘం ఐదుగురు ప్రముఖ నటీనటులు శ్రీయుతులు ఎ. పిచ్చయ్య, వేంకటేశ్వరరావు, శ్రీమతులు వి. పార్వతమ్మ, ఎస్.చంద్రమ్మ, వి. జానకీదేవి గార్లను సన్మానించింది. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. రాష్ట్ర నాటక అకాడెమీ కార్యదర్శి శ్రీ జి. కృష్ణంరాజు ప్రసంగిస్తూ, సురభి నాటకోద్యమాన్ని డాకుమెంటరీ చిత్రంగా తీయాలనే ప్రతిపాదన వుందన్నారు

గొప్ప సంగీత విద్వాంసుని మృతి :

90 సంవత్సరాలు గొప్ప సంగీత విద్వాంసుడు శ్రీ మంగళపల్లి పట్టాభిరామయ్య డిసెంబరు 2వ వారంలో విజయవాడలో కాలధర్మం చెందడంతో గొప్ప సంగీతచార్యుని రాష్ట్రం కోల్పోయిందని జంటనగరాల కర్నాటక సంగీత విద్వాంసులు విచారం ప్రకటించారు. శ్రీ పట్టాభిరామయ్య, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ ఆస్థాన సంగీత విద్వాంసుడు శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ తండ్రిగారు. శ్రీ పట్టాభిరామయ్యకు చిన్ననాటి నుంచే సంగీతంపై అభిరుచి వుండేది. ఆయన ఇంట్లో పెద్దల వల్ల కొంత సంగీతం నేర్చుకొన్న తర్వాత శ్రీ సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి వద్ద గాత్రం, జంత్రం నేర్చుకొని, వేణు వీణా వాదనంలోను, గాత్రంలోను నిష్ణాతులయ్యారు. పిదప ఆయన విజయవాడకు వెళ్లి గొప్ప వాగ్గేయకారుడు శ్రీ ప్రయాగ రంగదాసు కుమార్తె సూర్యకాంతమ్మను పెండ్లాడినారు. శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వద్ద కూడ ఆయన శిష్యరికం చేశారు. ఆయన సంగీతాచార్యులుగా గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. ఆయన శిష్యులలో నేడు ప్రముఖులుగా వున్నవారు శ్రీయుతులు మంగళంపల్లి బాలమురళీకృష్ణ, నూకల చినసత్యనారాయణ, వీణావిద్వాంసులు శ్రీ అక్కొజీరావు.





పింగాణీ కత్తెర్లు!

జపాను లోని తోరే ఇండస్ట్రీస్ వారు జిర్కోనియం రకం పింగాణిని తయారు చేశారు. వీటితో మరో కంపెనీ వారు కత్తెర్లను, చిన్నచిన్న క్షురంపాలను తయారుచేశారు. తమ ప్రయత్నాలన్నీ విజయవంతమైనట్లు కూడా వారు తెలియచేశారు. పింగాణీతో తయారు చేసిన కత్తెర్లు స్టీలు కత్తెర్ల కంటే పదునుగానూ, మెత్తగా ను ఉన్నట్లు కూడా వారు తెలియచేశారు. ఎక్కువ వేడికి తట్టుకోనడం, త్రుప్పు పట్టక పోవడం వీటి ప్రత్యేక లక్షణాలు. ఈ సంవత్సరాంతానికి వ్యాపార రీత్యా కత్తెర్లు, వైద్య సామాగ్రి తయారు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

హైదరాబాద్ నోట్ బుక్

వృద్ధనాయకుల ప్రచారం :

రాష్ట్ర విధానసభ ఎన్నికల పుణ్యమా అని పలువురు జాతీయ నాయకులను జంటనగరాల వారు దర్శించే అవకాశం కలిగింది. ప్రతిజాతీయ పక్ష ప్రముఖ నాయకులూ జంటనగరాల ఎన్నికల సభలలో ప్రసంగించారు. భారతీయ జనతా పార్టీ నాయకులు అటల్ బిహారీ వాజపేయూ, రామ్‌జెట్‌మలానీ, రాజమాత విజయరాజాసింధియా, జనతా పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్, మధు దండావతే, కాంగ్రెస్ (జె) నాయకుడు జగ్‌జీవన్‌రాం, లోక్‌దల్ నాయకుడు దేవీలాల్, సంజయ్ విచార మంచ్ నాయకులు మేనకాగాంధి, అక్బర్ అహమద్, ఇక పాలకపక్షమైన ఇందిరాకాంగ్రెస్ నాయకులు శ్రీమతి గాంధి, శ్రీ రాజీవ్‌గాంధి, మున్నగువారు పదేపదే వచ్చి తమ తమ పార్టీల అభ్యర్థులకే వోటు చేయాలని ప్రజానీకాన్ని కోరారు. డిసెంబరు అసరపక్షమంతా కాంగ్రెస్, తెలుగుదేశంతో సహా వివిధ రాజకీయ పక్షాల ప్రచారంతో జంటనగరాలు హోరెత్తిపోయాయి.

ఉపశ్రుతి :

"చూశారా, ఏదో మూలిక కనిపెట్టారట, ఈగలు, బొద్దింకలు తుడిచిపెట్టుకొనిపోవడానికి" అన్నాను ఒక వైద్య మిత్రునితో. స్వామీ, ఈ బ్రహ్మాండంలో అనంతకోటి జీవులు పుడుతుంటాయి. ఏదో కారణంతో చస్తుంటాయి. రాజకీయ మక్షికాలు, మశకాలు అందరి ఆయుస్సూ పోసుకొని ఉంటాయి. ఏమి జీవశాస్త్ర పరిణామమో! —అంటూ కళ్ళు తేలవేశారు.

వంటలు



క్యారట్ పూరీలు

కావలసిన వస్తువులు : – మైదాపిండి 200 గ్రా, క్యారట్లు 250 గ్రా, రవ్వ 400 గ్రా, చక్కెర 200 గ్రా, ఆవుపాలు పావులీటరు, నెయ్యి కొదిగా, తగినన్ని జీడిపప్పు, నూనె లేక డాల్డా.

తయారుచేయు విధము : – ముందుగా జీడిపప్పును నేతిలో వేయించి తీయాలి. బాణలిలో కొద్దిగా నెయ్యి వేసి రవ్వపోసి దోరగా వేయించి దించాలి. తర్వాత క్యారట్ను ముక్కలుగా తరిగి తగినన్ని నీరు పోసి బాగా మెత్తగా వుడికించి దించాలి. ఉడికిన క్యారట్లను బాగా నలిపి ముద్దగా చేయాలి. ఇపుడు ఒక పాత్రలో ఆవుపాలు తీసుకుని చక్కెరపోసి కలపాలి. దానిలో మైదాపిండి, జీడిపప్పు, క్యారట్ ముద్ద, రవ్వ పోసి బాగా కలిపి పూరీల పిండిలా చెయ్యాలి. దీనిని వుండలు చేసుకుని పూరీలు వత్తాలి. వీటిని మరగుతున్న నూనెలో కానీ డాల్డాలో కానీ వేసి వేయించి తీయాలి. ఇది రుచిగా వుండటమే కాక బలవర్ధక మైనది.

వేరుశెనగ కోఫ్తా

కావలసిన వస్తువులు : – పచ్చి వేరుశెనగ పప్పు 2 కప్పులు, ఉలిపాయలు 3, చిన్న కొబ్బరిచిప్ప 1, పచ్చిమిరపకాయలు 8, కొదిగా నిమ్మరసం, తగినంత వుప్పు, నూనె, ఆవాలు 1 టీ స్పూను, మినపప్పు 1 టీ స్పూను, కొత్తిమీర, కరివేపాకు, చిటికెడు ఇంగువ.

పిండి మిశ్రమానికి :– శెనగపిండి ఒకటిన్నర కప్పు, బియ్యంపిండి అరకప్పు, మిరప్పొడి ఒకటిన్నర టీస్పూను, కొద్దిగా వుప్పు, చిటికెడు-వంటసోడా.

తయారుచేయు విధము :– ముందురోజు రాత్రి వేరుశెనగపప్పును నీటిలో నానబెట్టాలి. మరునాడు నీరు వంచేసి రోట్లో వేసి, దానితోపాటు వుప్పు, పచ్చిమిరపకాయలు, ఇంగువచేర్చి గట్టిగా పిండి రుబ్బాలి కొబ్బరిని తురమాలి. వుల్లిపాయల్ని సన్నగా తరగాలి. ఇప్పుడు రుబ్బినముద్దకు వుల్లిపాయముక్కలు, కొబ్బరి తురుము, కరివేపాకు, కొత్తిమిర వేసి కలపాలి. తర్వాత కొద్దిగా నూనె వేడిచేసి ఆవాలు, మినపప్పువేసి చిటపటలాడాక దానిని కూడ రుబ్బిన ముద్దకు వేసి నిమ్మరసం వేసి బాగా కలపాలి ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న వుండలుగా చేసి పెట్టుకోవాలి.

ఇప్పుడు పిండి మిశమానికి చెప్పిన వస్తువులన్నీ ఒక పాత్రలోకి వేసి తగినంత నీరుపోసి బజ్జీల పిండిలా కలుపుకోవాలి. ఇందాక చేసిన వుండలను ఈ పిండిలో ముంచి మరుగుతున్న నూనెలో వేసి ఎర్రగా వేగాక తీసేయాలి. ఇవి వేడిమీద తింటే చాలా రుచిగా వుంటాయి.


– గార్ల సరస్వతి

టొమేటో సాస్

కావలసినవి : టొమేటోలు 3 కి. (పండినవి), వెల్లుల్లి – 1 రేకు, లవంగాలు – 6, యాలక్కాయలు - 4, మిరియాలు 6, జీలకర కొంచెం, దాల్చినచెక్క 3 పేళ్ళు, ఎరకారం 1 చెమ్చా [చిన్నది], చక్కెర 100 గ్రాములు, ఉప్పు 30 గ్రాములు, వినిగర్ – 150 మిల్లిగ్రాములు.

చేయు విధము : టొమేటోలు కడిగి తరుక్కోవాలి ముక్కలుగా. ఈ ముక్కలు ఉడకపెట్టి బట్టలో వేసి రసం తీసుకోవాలి. మసాలా సామాన్లు, వెల్లుల్లి కలిపి కాస్త బరకగా రుబ్బాలి. ఈ ముద్దని ఒక చిన్న తెల్లగుడ్డలో వేసి గట్టిగా ముడివేసి ఈ మూటని టొమేటో రసంలో వేసి పంచదారలో 3 వంతు కూడా వేసి రసం దగ్గరపడే వరకు ఉడకపెట్టి మూటను రసంలోంచి తీసి పిండి పిప్పిని పారవేయాలి ఈ రసంలో మిగతా పంచదార, ఉప్పు, వినిగర్ వేసి మరికొంత సేపు వుడకనివ్వాలి. [1 కేజీకి 1 గ్రాము చొప్పున] సోడియం బెన్‌జియేట్ వేసి బాగా కలిపి చల్లారాక సీసాలో పోసి పెట్టుకోవాలి. ఈ సాస్ అన్నిటిలో నంజుకోవాటానికి బాగుంటుంది.

—— యం పి. రాణి



అవీ ఇవీ అన్నీ

భద్రభారతి ఆవిష్కరణ

ఇటీవల హైదరాబాద్‌లో 'భద్రభారతి' గేయ సంపుటి ఆవిష్కరణ, కృతి సమర్పణ సభ నవ్యసాహితీ సమితి, నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో జరిగింది. రచయిత శ్రీ తల్లాప్రగడ భద్రిరాజు తమ గ్రంధాన్ని నవ్యనాటక సమితి అధ్యక్షుడు, రచయిత, శ్రీ వేమరాజు నరసింహారావునకు అంకితం చేశారు.

డా. దివాకర్ల వెంకటావధాని, డా. అరిపిరాల విశ్వం, శ్రీ పోతుకూచి సాంబశివరావు పుస్తక పరిచయాన్ని చేశారు. ప్రముఖ వైణిక విద్వాంసుడు శ్రీ పాలగుమ్మి విశ్వనాథం, హైదరాబాద్ సంగీత కళాశాల ప్రిన్సిపాలు శ్రీ నూతల చినసత్య నారాయణ గ్రంధంలోని గేయాలను చక్కగా పాడి వినిపించారు.

సభకు శ్రీ మాటూరి వేంకట సుబ్బారావు అధ్యక్షత వహించి గ్రంధాన్ని ఆవిష్కరించగా, శ్రీ అక్కిరాజు జనార్దనరావు వందన సమర్పణ చేశారు.

మదరాసులో కన్యాశుల్కం

మద్రాసు తెలుగు నాటక అకాడమీ వారి ఆధ్వర్యాన ఇటీవల కన్యాశుల్కం నాటకం విజయవంతంగా ప్రదర్శింపబడింది. శ్రీ టి.వి.కె. శాస్త్రి స్వాగతం పలికారు. శ్రీ రావికొండలరావు కార్యక్రమాన్ని వివరించారు. శ్రీ పి. వి. రమణయ్య అధ్యక్షత వహించారు. కీ. శే. గురుజాడ అప్పారావు గారి చిత్రపటం ముందు శ్రీ పి. వి. రమణ రాజా జ్యోతిని వెలిగించారు..

కుమారి పద్మావతి, కుమారి, శారదశ్రీ, 'దేశమును ప్రేమించు మన్నా' గేయాన్ని ఆలపించారు.

శ్రీయుతులు జె. వి. సోమయాజులు, జె. వి. రమణమూర్తి, జి. రామదాస్, జోగారావు, కాశీపతిరావు, శివరావు, శ్రీమతి రాజకుమారి, ఎస్. అప్పారావు గార్లకి స్వర్ణ పతకాలని బహూకరించారు.

శ్రీమతి బెజవాడ చంద్రకళ, అన్నపూర్ణ మున్నగ కళాకారులందరికీ అకాడమీ తరపున అధ్యక్షులు శ్రీ పి. వి. రమణయ్యరాజా దుశ్శాలువాలతో సత్కరించారు. 'తెలుగు నాటక అకాడమీ' వారు నిర్వహించే నాటక ప్రదర్శన లన్నింటిలో ఉత్తమ నాటకానికి సంవత్సరాంతంలో జయలక్ష్మి ట్రేడింగ్ కార్పొరేషన్ వారు రు. 5000/-లు, 'అభినందన రోలింగ్ షీల్డు' బహూకరించనున్నట్లు ప్రకటించారు.

ప్రదర్శనానంతరం శ్రీ జె. వి. రమణమూర్తి ప్రేక్షకులకు ధన్యవాదా లర్పించారు.

మూడు
రకములుగా
ఉపయోగపడుతుంది.

చంద్రిక

సబ్బు





జిడ్డు కారకుండ చర్మాన్ని
సౌందర్యవంతం చేస్తుంది.



జుట్టును శుభ్రపరచి
చుండ్రునుండి
పరిరక్షిస్తుంది.



చర్మాన్ని పొట్టు రాల కుండా
చేసి నల్ల మచ్చలు మరియు ఇతర
చర్మ వ్యాధుల నుండి కాపాడు
తుంది.

ఇతర ఏ సబ్బులందు లేని పై ఉపయోగాల
కల్గిన సాటిలేని సబ్బు – చంద్రిక !
వర్ణ సౌందర్యానికి, ఆరోగ్యదాయకమైన
కేశసంపదకొరకు అయుర్వేద శాస్త్ర ప్రమాణాల
ననుసరించి ఎక్కువమొత్తంలో కొబ్బరి నూనె
నుపయోగించి తయారు చేయబడిన
సబ్బు – చంద్రిక సబ్బు.

చంద్రిక

అన్ని ఋతువులలోను ఉపయోగించే సబ్బు
భారతదేశములో మరియు ప్రపంచవ్యాప్త
ముగా ప్రశస్తి గాంచినది.

అవీ ఇవీ అన్నీ

'అభిరుచి' అష్టావధానం

బెంగుళూరులోని 'అభిరుచి' ఆధ్వర్యంలో శ్రీ ఎం. నాగఫణి అవధాని ఇటీవల స్థానిక గోఖలే ఇన్‌స్టిట్యూట్‌లో అష్టావధానం జయప్రదంగ చేశారు.

శ్రీ వి. ఆర్. నరసింహారెడ్డి, కొర్లిమర్ల చంద్రశేఖర్, లంకా సూర్యప్రకాశరావు, యం. యస్. అనంతరామన్, వి. వేంకటేశ్వర్లు, తంగిరాల సీతారామరాజు, శ్రీమతి పాలగుమ్మి అన్నపూర్ణ, కుమారి బడ్డి చంద్రభాగాదేవి పృచ్ఛకులుగా వ్యవహరించారు.

అభిరుచి సంచాలకులు శ్రీ ఘట్టమరాజు స్వాగతం చెప్పారు. శ్రీమతి పి అన్నపూర్ణ అవధానిని, పృచ్ఛకులను పరిచయం చేశారు. శ్రీ వి. నారాయణరెడ్డి వందన సమర్పణ చేశారు.

శ్రీ పాలగుమ్మి విశ్వనాథం అవధానిని సత్కరించారు.

విజ్ఞప్తి

నేను "ఉత్తరాంధ్ర స్వాతంత్ర్య సమర యోధుల జీవిత చరిత్ర" అను పుస్తకం వ్రాయుచున్నాను. వీలును బట్టి యిప్పటికే చాలా విషయ సేకరణ చేయగలిగాను. చేయవలసింది ఇంకా ఉన్నది. అవకాశమున్న స్వాతంత్ర్య సమరయోధులు, తమ జీవిత చరిత్రను వ్రాసి ఈ క్రింది చిరునామాకు పంపించి నా ప్రయత్నం విజయవంతం చేయ ప్రార్థన. దీనిని తమ సహచరులకు కూడ చూపించ ప్రార్థన.

రామిచెట్టి వెంకటరావు, కలం పేరు రామిచెట్టి, శ్రీవాణీ నిలయం, ఇలిసిపురం వీధి, శ్రీకాకుళం — 532001. *



Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao Street Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna.


'ముందడుగు' లో

